

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వందేభారత్, గతిమాన్ 2
రైళ్ల వేగం తగ్గింపు
160 కి.మీ నుంచి 130 కి.మీ.కు కుదింపు
భద్రతా కారణాల దృష్ట్యా కీలక నిర్ణయం

జియో సేవలు మరింత ప్రియం
27% వరకు టారిఫ్‌ల పెంపు.. 3 నుంచి అమల్లోకి
జియో బాటలో మిగతా టెల్కోలు! 8

శుక్రవారం | 28-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 73 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: సప్తమి సా. 4.27 తదుపరి అష్టమి; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ. 10.11 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా. 7.14-8.44; దుర్ముహూర్తం: ఉ. 8.23-9.15, మ. 12.44-1.36; అమృతఘడియలు: తె. 4.17-5.47; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.47; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

దొంగ రాతల ద్వివేది!

'ఇసుక'లో పూర్తిగా కూరుకుపోయిన స్పెషల్ సీఎస్



అక్రమ తవ్వకాలపై కలెక్టర్లతో అబద్ధాలు

'అంతా ఓకే' అని ప్రొఫార్మా పంపించి మరీ ఆదేశాలు

డూడూ బసవన్నల్లా సంతకాలు చేసిన ఐఏఎస్‌లు

ఎన్జీటీ, హైకోర్టు, సుప్రీంకోర్టుకు అసత్య నివేదికలు

జగన్ సర్కారు హయాంలో ఇదీ కలెక్టర్ల తీరు

తనిఖీలు చేయకుండానే 'అక్రమాలు లేవని' సర్టిఫికెట్

ప్రొఫార్మాలో జిల్లా పేరు నింపి కింద సంతకం, స్టాంపు



ఏం మాయ చేశావు గోపాలా!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నాన్నగారు ఇంట్లో లేరు'.. ఇలా చెబితే ఓకే! 'నాన్నగారు ఇంట్లో లేరని చెప్పమన్నారండీ' అంటే అడ్డంగా దొరికిపోయినట్లే!

ఇసుక అక్రమ తవ్వకాల విషయంలో జగన్ సర్కారు అచ్చంగా ఇలాగే.. అడ్డంగా, నిలువుగా దొరికిపోయింది. 'ఇసుక అక్రమ తవ్వకాలు ఎక్కడా జరగడంలేదని చెప్పమన్నారండీ' అన్నట్లుగా జిల్లా కలెక్టర్లందరూ కూడబలుక్కుని ఒకే అబద్ధాన్ని చెప్పేశారు. కాదుకాదు... కలెక్టర్ల చేత జగన్ చెప్పించారు. అది కూడా ఒక్కసారి కాదు... మూడుసార్లు! జాతీయ హరిత ట్రిబ్యునల్, రాష్ట్ర హైకోర్టుతోపాటు సుప్రీంకోర్టుకూ ఇదే అబద్ధం చెప్పించారు. కలెక్టర్లంతా ఇలా 'ఒకే తాటి మీద నిలబడి ఒకే మాట' చెప్పడంతో ఎన్జీటీ బృందమే ఆశ్చర్యపోయింది. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ఈ ఏడాది ఫిబ్రవరి 22న బయటపెట్టింది. అయినా సరే... 'తగ్గేదేలే' అంటూ హైకోర్టుకు, ఆ తర్వాత సుప్రీం కోర్టుకూ ఇదే మాట చెప్పారు. అయితే... ఈ మూకుమ్మడి అబద్ధానికి అసలు కారణమేమిటో ఇప్పుడు బయటపడింది. ఇదంతా నాటి గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది నిర్వాకమని స్పష్టమైంది. జిల్లా స్థాయిలో



PROFORMA

Place:
Date:

CERTIFICATE

In pursuance of the orders dt:14.02.2024 of the Hon'ble High Court in WP (PIL) No: 53 of 2023, the undersigned has thoroughly verified the sand reaches within the District of (.....Name of the District...) and hereby certify that there is no illegal sand mining taking place in the District.

District Collector
(Signature with Stamp)

'మా జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు జరగలేదు' అంటూ కలెక్టర్లు నింపి పంపేందుకు ద్వివేది పంపిన ప్రొఫార్మా

మిగతా 12వ పేజీలో...



జగన్‌కు జనం గుణపాఠం

ప్రత్యర్థులపై కక్షగట్టి.. పాలనను విస్మరించారు: రేవంత్‌రెడ్డి

తెలుగుదేశం పార్టీని ఖతం చేయాలని ఆయన పగబట్టారు

చివరకు తన పార్టీనే ఖతం చేసుకున్నారు 11

మనం చేసిన పాపాలు ఏదోనాడు మనల్నే మింగేస్తాయి

జగన్ తుడిచిపెట్టుకుపోవడమే దీనికి నిదర్శనం

ఆయన అక్రమాలతో ఆంధ్రలో పరిశ్రమలు కుప్పకూలాయి

బాబు ఫోన్ చేస్తే జగన్ ఇంటి వద్ద నిర్మాణాలు కూల్చామనడం అబద్ధం

ఆయన అలాంటి చిల్లర పనులు చేయరు.. ఢిల్లీలో టీ-సీఎం ఉద్ఘాటన

చరిత్రలో రామోజీకి చిరస్థాయి

విశాఖ చిత్రనగరికి ఆయన పేరు

అమరావతిలో రామోజీ విజ్ఞాన కేంద్రం

రాజధానిలో ఒక రోడ్డుకు ఆయన పేరు

ఎన్టీఆర్, రామోజీని తెలుగు జాతి మరవదు

వారిద్దరికీ భారతరత్న సాధించడమే మన లక్ష్యం

విజయవాడ సంస్మరణ సభలో సీఎం చంద్రబాబు

అమరావతిలో విగ్రహం పెట్టాలి: డిప్యూటీ సీఎం పవన్


రాజధానికి 10 కోట్లు విరాళమిచ్చిన రామోజీ కుటుంబం

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఉత్తమ పాత్రికేయ విలువలను సమాజానికి అందించిన ఈనాడు గ్రూపు సంస్థల అధిపతి రామోజీరావు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎంచుకున్న

మిగతా 12వ పేజీలో...

"ఎన్టీఆర్‌ను, రామోజీరావును తెలుగు జాతి మరవబోదు. కృష్ణా జిల్లాలో జన్మించిన వారిద్దరికీ భారతరత్న సాధించడమే మనందరి కర్తవ్యం. నటులు, కళాకారులకు రామోజీరావు జీవితాన్ని ఇచ్చారు. ఆయన గౌరవార్థం విశాఖపట్నంలోని చిత్రనగరికి రామోజీ పేరు పెడతాం. రాజధానిగా అమరావతి పేరు ఆయనే సూచించారు. అమరావతిలో రామోజీ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తాం. రాజధానిలో ఒక రోడ్డుకు ఆయన పేరు పెడతాం"

\- చంద్రబాబు



విజయవాడలో నిర్వహించిన రామోజీరావు సంస్మరణ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



11

1న ఇంటి వద్దే పించన్ల పంపిణీ

65,18,496 మంది పింఛనుదారులకు రూ.4,399.89 కోట్లు

ఒక్కరోజులోనే పంపిణీకి ఏర్పాట్లు: సీఎస్

సీఎస్ నీరబ్ సర్వీస్ పొడిగింపు

6 నెలల పొడిగింపునకు కేంద్ర అనుమతి

నెల్లూరు జైలుకు పిన్నెల్లి

14 రోజుల రిమాండ్ విధింపు

కోర్టు వద్ద టీడీపీ యువ నేతపై మాజీ ఎమ్మెల్యే దాడి

12

టీటీడీలో విజిలెన్స్ ప్రకంపనలు

ఐదేళ్లుగా ఇష్టారాజ్య నిర్ణయాలపై ఫిర్యాదుల వెల్లువ

ఇంజనీరింగ్ పనులకు భారీగా నిధుల కేటాయింపు

దర్శనాల పేరిట వసూళ్లు... అడ్డగోలు నియామకాలు

అక్రమాలను గుర్తించేందుకు రంగంలోకి విజిలెన్స్

టీటీడీ పరిపాలనా భవనంలో, కొండపైనా తనిఖీలు

ఇంజనీరింగ్ విభాగాల్లో పలు రికార్డుల స్వాధీనం

కీలక అధికారులను ప్రశ్నించి, వివరాల సేకరణ

శ్రీవాణి ట్రస్టు విరాళాల వినియోగంపైనా ఆరా

తిరుపతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన పలు విభాగాల్లో రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ బృందాలు తనిఖీలు చేపట్టడం ప్రకంపనలు సృష్టిస్తోంది. టీటీడీకి సంబంధించి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా తీసుకున్న నిర్ణయాలపై కొత్త ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తిరుపతితో

మిగతా 11వ పేజీలో...

పేపర్ లీకేజీలపై కఠిన చర్యలు



పరీక్షలు నిజాయితీగా జరగాలి
నియామకాల్లో ఆటంకాలు ఉండొద్దు

ఉత్తర, దక్షిణ, తూర్పు భారతాల్లో బుల్లెట్ ట్రెయిన్ కారిడార్లపై అధ్యయనం

వచ్చే బడ్జెట్‌లో చరిత్రాత్మక నిర్ణయాలు.. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్!

ఎమర్జెన్సీ.. రాజ్యాంగంపై అతిపెద్ద దాడి: పార్లమెంట్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

సమస్యలను విస్మరించి ఎమర్జెన్సీ ప్రస్తావన ఎందుకు?.. ప్రస్తుతం మెగా-ఎమర్జెన్సీ

కేంద్రం స్క్రిప్టు... అబద్ధాల మయం!.. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్షాల విమర్శ

నీట్, ఇతర సమస్యలపై లోక్‌సభలో విపక్ష ఎంపీల నినాదాలు 2

స్పీకర్ 'ఎమర్జెన్సీ' ప్రస్తావన పూర్తిగా రాజకీయం: రాహుల్ గాంధీ

కేంద్రం స్క్రిప్టు.. అబద్ధాల మయం

రాష్ట్రపతి ముర్ము ప్రసంగంపై ప్రతిపక్షాల విమర్శ

- నీట్, ఇతర సమస్యలపై విపక్ష ఎంపీల నినాదాలు
- ఇంకా ఎమర్జెన్సీని ప్రస్తావించడంలో అర్థంలేదని నాయకుల ధ్వజం



న్యూఢిల్లీ, జూన్ 27: పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగం 'అబద్ధాల మయం', 'కేంద్రం ఇచ్చిన స్క్రిప్టు' అని ప్రతిపక్షాలు విమర్శించాయి. ప్రభుత్వం '1975 ఎమర్జెన్సీ'ని పదేపదే ప్రస్తావిస్తూ ప్రస్తుత సమస్యలను గాలికొదిలేస్తోందని మండిపడ్డాయి. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని, మోదీపాలనతో రాజ్యాంగంపై దాడి జరుగుతోందని దుయ్యబట్టాయి. రాష్ట్రపతి ప్రసంగిస్తున్న సమయంలో విపక్ష సభ్యులు మణిపూర్‌లో హింస, నీట్ ప్రశ్నపత్రం లీక్, కొత్త క్రిమినల్ చట్టాల వంటి అంశాలపై పలుమార్లు నినాదాలు చేశారు. ఈ ఎన్నికల్లో ప్రజలు మోదీని, 400కుపైగా సీట్ల నినాదాన్ని తిరస్కరించారని, బీజేపీని కనీస మెజారిటీకి దూరంగా ఉంచారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే 'ఎక్స్' వేదికగా విమర్శించారు. రాష్ట్రపతితో అబద్ధాలు చదివించి మెప్పు పొందేందుకు మోదీ విఫలయత్నం చేశారని వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ప్రసంగంలో నీట్, ధరల పెరుగుదల, నిరుద్యోగిత, మణిపూర్‌లో హింస, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులు, రైలు ప్రమాదాలు, బీజేపీపాలిత రాష్ట్రాల్లో దళితులు, ఆదివాసీలు, మైనారిటీలపై దాడుల వంటి వాటి ప్రస్తావన లేకపోవడాన్ని విమర్శించారు. 49ఏళ్ల తర్వాత కూడా ఎమర్జెన్సీ అంశాన్ని ప్రస్తావించడంలో అర్థంలేదని, ప్రస్తుత అంశాల గురించి ఒక్క మాటైనా లేదని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. ఎమర్జెన్సీ తర్వాత జరిగిన పలు ఎన్నికల్లో బీజేపీని ప్రజలు ఓడించారని కాంగ్రెస్ నేత తారిఖ్ అన్వర్ గుర్తుచేశారు. 'ప్రభుత్వం చెబుతున్నట్టు ప్రపంచంలో భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థే అయితే రైతులు ఎందుకు అభివృద్ధి చెందడం లేదు? యువతకు ఎందుకు ఉద్యోగాలులేవు? ధరల పెరుగుదలను ఎందుకు ఆపలేకపోతున్నారు?' అని సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన స్క్రిప్టును రాష్ట్రపతి చదివి వినిపించారని, అందుకే ప్రభుత్వం మైనారిటీలో ఉన్నా స్పష్టమైన మెజారిటీ ఉందని రాష్ట్రపతి పేర్కొన్నారని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని 'కొత్త సీసాలో పాత సారా'గా మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అభివర్ణించారు. మైనారిటీల గురించి, నీట్‌లో అక్రమాల గురించి ప్రస్తావన లేకపోవడాన్ని తప్పుపట్టారు. మోదీ ప్రభుత్వం ఎమర్జెన్సీ గురించి మాట్లాడుతోందని, కానీ ప్రస్తుతం 'మెగా-ఎమర్జెన్సీ' అమలవుతోందని సీపీఐ (మార్క్సిస్ట్-లెనినిస్ట్) ఎంపీ సుదామా ప్రసాద్ విమర్శించారు. కాగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆప్ ఎంపీలు రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించారు. పార్లమెంటు వెలుపల ఆందోళన నిర్వహించారు.

సంసద్ టీవీలో మోదీని 73 సార్లు, రాహుల్‌ను 6 సార్లు చూపారు

రాష్ట్రపతి ప్రసంగం కొనసాగిన 51నిమిషాల్లో సంసద్ టీవీలో ప్రధాని మోదీని 73సార్లు చూపిస్తే విపక్షనేత రాహుల్‌ను ఆరుసార్లే చూపారని కాంగ్రెస్‌నేత జైరాం రమేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. సంసద్ టీవీ ఉన్నది సభా కార్యక్రమాలను ప్రసారంచేయడానికని, 'కెమెరాజీవి' కోసం కాదన్నారు.

లోకం తీరు



పేపర్ లీకేజీలపై కఠిన చర్యలు

పరీక్షలు నిజాయితీగా జరగాలి.. నియామకాల్లోనూ ఆటంకాలు ఉండొద్దు

- పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి


పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించే పరీక్షలు నిజాయితీగా, పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. దేశంలోని యువత తమ ప్రతిభను ప్రదర్శించేందుకు సరైన అవకాశాలను కల్పించడం ప్రభుత్వం కనీస బాధ్యత అని, పోటీ పరీక్షలైనా, ప్రభుత్వ నియామకమైనా ఎలాంటి ఆటంకాలు జరగకుండా చూడాలని ఆమె పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నేపథ్యంలో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన కొన్ని పరీక్షల్లో పేపర్ లీకేజీలు జరిగాయని, వీటిని కేంద్రం తీవ్రంగా పరిగణిస్తోందని చెప్పారు. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే శిక్షించేందుకు కఠిన చట్టాలు ఉన్నాయని చెబుతూ పేపర్ లీకేజీ ఘటనల్లో నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. "గతంలోనూ వివిధ రాష్ట్రాల్లో పేపర్ లీకేజీలు జరిగిన సందర్భాలను మనం చూశాం. ఇటువంటి విషయాల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి, కఠిన చర్యలు చేపట్టడం ఎంతో ముఖ్యం" అని ఆమె వ్యాఖ్యానించారు. ఉత్తర, దక్షిణ, తూర్పు భారతాల్లో బులెట్ ట్రెయిన్ కారిడార్ల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై కేంద్ర ప్రభుత్వం త్వరలోనే అధ్యయనం చేస్తుందని చెప్పారు. ముంబై-అహ్మదాబాద్ మధ్య 'హై స్పీడ్ రైలు' కారిడార్ పనులూ వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. గురువారం పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి ముర్ము ప్రసంగించారు. సుపరిపాలన, సుస్థిరతపై నమ్మకంతోనే మరోసారి ఎన్డీయేకు ప్రజలు అవకాశమిచ్చారని పేర్కొన్నారు. 18వ లోక్‌సభ అనేక విధాలుగా చరిత్రాత్మకమైనదని, అమృత్ కాలంలో సభ ఏర్పాటైందని చెప్పారు. జమ్మూకశ్మీర్ గురించి శత్రువులు అంతర్జాతీయ వేదికలపై దుష్ప్రచారం చేస్తున్నారని, అయితే ఈసారి కశ్మీర్ లోయలో మార్పు కనిపించిందని, శత్రువులకు గట్టిగా బదులిస్తూ అక్కడి ప్రజలు పెద్దసంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారని చెప్పారు. వచ్చే సమావేశాల్లో బడ్జెట్ ఉంటుందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే ఉండబోతోందన్నారు. బడ్జెట్‌లో ఆర్థిక, సామాజిక నిర్ణయాలతోపాటు అనేక చరిత్రాత్మక చర్యలు కనిపిస్తాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించేలా నిర్ణయాలు ఉంటాయన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టామని, గత పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థికవ్యవస్థ పరిపుష్టమైందని పేర్కొన్నారు. ప్రపంచ వృద్ధిలో భారత్ వాటా 15 శాతంగా ఉన్నట్లు తెలిపారు. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని ఆమెతెలిపారు.

ఇప్పటికీ రాజ్యాంగంపై దాడులు

దేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత అనేకసార్లు దాడులు జరిగాయని, ఇప్పటికీ రాజ్యాంగంపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ముర్ము అన్నారు. 1975 జూన్ 25న ఎమర్జెన్సీ విధించడం రాజ్యాంగంపై ప్రత్యక్షంగా జరిగిన అతిపెద్ద దాడి అని, అదో చీకటి అధ్యాయమని తెలిపారు. ఆ చర్యతో దేశమంతా ఆగ్రహానికి లోనైందన్నారు. ఆ అత్యయిక స్థితి నాటి రోజుల్లో దేశ ప్రజలు ఎన్నో బాధలు అనుభవించారని తెలిపారు. కానీ అటువంటి రాజ్యాంగ విరుద్ధ శక్తులపై వ్యతిరేకంగా దేశం విజయం సాధించిందని చెప్పారు.

ప్రపంచమంతా డిజిటల్ ఇండియా వైపే చూస్తోంది

డిజిటల్ ఇండియా సాధనకు ప్రభుత్వం సంకల్పించిందని, బ్యాంకుల క్రెడిట్ బేస్ పెంచి వాటిని బలోపేతం చేశామని ముర్ము తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో జీఎస్టీ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వాణిజ్య, వ్యాపారాన్ని సులభతరం చేసిందని చెప్పారు. ఏప్రిల్‌లో తొలిసారిగా జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లు దాటాయని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రాలు ఆర్థికంగా బలోపేతం అయ్యాయని అన్నారు. ప్రస్తుతం.. ప్రపంచం మొత్తం డిజిటల్ ఇండియా వైపు చూస్తోందని చెప్పారు. అదేవిధంగా.. సైనికదళాల్లో స్థిరమైన సంస్కరణల కారణంగా బలగాలు స్వయం సమృద్ధి సాధించాయని తెలిపారు. రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయటం, సైనికులకు ఒకే ర్యాంకు ఒకే పింఛను అమలు చేసినట్టు వెల్లడించారు. రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగాయని అన్నారు. సీఏఏ కింద శరణార్థులకు ప్రభుత్వం పౌరసత్వం కల్పించిందని చెప్పారు.

ఆయుష్మాన్ భారత్.. గేమ్ చేంజర్

ఆరోగ్య రంగంలో దేశం అగ్రగామిగా ఉన్నదని, అత్యంత వేగంగా పురోగతి సాధిస్తున్నదని ముర్ము పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ అనేది గేమ్ చేంజర్ నిలుస్తుందని చెప్పారు. ఈ పథకం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. మహిళల ఆర్థిక పరిస్థితులు మెరుగయ్యాయని చెప్పారు. చిన్న, సన్నకారు రైతులు కోసం పీఎం సమ్మాన్ నిధి కింద ఇప్పటివరకు రూ.120లక్షల కోట్లు ఇచ్చామని గుర్తు చేశారు. గ్రామీణ సడక్ యోజన కింద గ్రామాల్లో రోడ్ల విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారత్ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోందని పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కరోనా మహమ్మారి కష్టకాలంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందని చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ పేదల గౌరవాన్ని పెంచిందన్నారు. దేశంలోని కోట్లాది మంది పేదలకు తొలిసారిగా మరుగుదొడ్లు నిర్మించినట్టు వెల్లడించారు. ఆయుష్మాన్ భారత్ యోజన కింద 55 కోట్ల మంది లబ్ధిదారులకు ఉచిత ఆరోగ్య సేవలను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. తద్వారా మహాత్మా గాంధీ ఆశయాలు నిజరూపం దాల్చాయని ఆమె తెలిపారు.

1 నుంచి కొత్త నేర చట్టాలు అమలు

జూలై 1వ తేదీ నుంచి కొత్త నేర చట్టాలు అమల్లోకి రానున్నాయని రాష్ట్రపతి తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి శిక్షా స్మృతులే నేటికీ అమల్లో ఉన్నాయని, వాటిని సంస్కరించడం గొప్ప విషయమని చెప్పారు. కొత్త న్యాయ చట్టాలతో ఒకరిని శిక్షించడం కంటే ఒకరికి న్యాయం చేయడానికే ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. కొత్త చట్టాలు న్యాయ ప్రక్రియను వేగవంతం చేస్తాయని పేర్కొన్నారు. సీఏఏ అనేది కూడా అతిపెద్ద నిర్ణయమని తెలిపారు.

'ఎమర్జెన్సీ' ప్రస్తావన ఎందుకు?

- అది పూర్తిగా రాజకీయం: రాహుల్
- ప్రతిపక్ష నేతగా ప్రకటించాక స్పీకర్ ఓం బిర్లాతో భేటీ



న్యూఢిల్లీ, జూన్ 27: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ గురువారమిక్కడ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. సభాపతిగా ఎన్నికయ్యాక ఆయన చేసిన ప్రసంగంలో 1975లో దేశంలో ఎమర్జెన్సీ విధించడాన్ని ప్రస్తావించడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇది పూర్తిగా రాజకీయ అంశమని.. ప్రస్తావించి ఉండాల్సింది కాదని వ్యాఖ్యానించారు. తనను సభలో ప్రతిపక్ష నేతగా ప్రకటించాక ఇండియా కూటమి నేతలతో కలిసి రాహుల్ స్పీకర్‌తో సమావేశమయ్యారు. దీనిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడారు. సభాపతిని రాహుల్ మర్యాదపూర్వకంగా కలిశారని చెప్పారు. ఎమర్జెన్సీతో పాటు పార్లమెంటు పనితీరు గురించి పలు అంశాలు చర్చించారన్నారు. కాగా.. ఎమర్జెన్సీ ప్రస్తావనపై కాంగ్రెస్ తరఫున అసంతృప్తి తెలియజేస్తూ వేణుగోపాల్ స్పీకర్‌కు విడిగా లేఖ కూడా రాశారు. బుధవారం కొత్తగా ఎన్నికైన స్పీకర్ సభలో ప్రసంగిస్తూ.. రాజకీయ ప్రస్తావన చేయడం అసాధారణమని.. అర్ధ శతాబ్దం కింద జరిగిన అంశాన్ని స్పృశించడం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని.. పార్లమెంటరీ సంప్రదాయాలను ఉల్లంఘించడంపై తమ పార్టీ ఆందోళన చెందుతోందని పేర్కొన్నారు.

తీరు మారని ఏపీపీఎస్సీ..!

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా ఏపీపీఎస్సీ తీరు మారలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో అర్ధరాత్రి ఫలితాలు ఇచ్చే సంస్కృతినే ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. తాజాగా డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించిన ప్రిలిమ్స్ ఫలితాలను గురువారం ప్రకటించింది. రాత్రి 8 గంటల సమయంలో ఫలితాలు విడుదల చేసినట్లు ప్రకటించినప్పటికీ కమిషన్ వెబ్‌సైట్‌లో మాత్రం పెట్టలేదు. దీనిపై ఏపీపీఎస్సీని సంప్రదించగా ముందు ప్రకటన జారీచేయాలని పైనుంచి ఆదేశాలు వచ్చాయని, ఫలితాలు తర్వాత పెడతారని బదులిచ్చారు. కాగా, 38 డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన ఈ ప్రిలిమ్స్‌లో 1:100 నిష్పత్తిలో 3,957 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. కాగా.. వైసీపీ ప్రభుత్వంలోనూ కీలకమైన గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలను అర్ధరాత్రి 2 గంటలకు విడుదల చేయడం వివాదాస్పదమైంది. ఇప్పటికీ అదే పంథాను కొనసాగించడంపై విమర్శలు పెరుగుతున్నాయి. చైర్మన్ గౌతమ్ సవాంగ్ తీరు వల్లే ఈ జాప్యం జరుగుతోందని కమిషన్ వర్గాలు అంటున్నాయి.

బదిలీల్లో సంఘాల నేతల జోక్యంపై విచారణ చేయాలి

- ఉపాధ్యాయ సంఘాల నుంచి డిమాండ్లు

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): టీచర్ల అక్రమ బదిలీల వ్యవహారంలో జోక్యం చేసుకున్న ఉపాధ్యాయ సంఘాల నేతలపై విచారణకు ఆదేశించి చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో భారీగా టీచర్ల అక్రమ బదిలీలు జరిగాయి. అందులో రెండు ఉపాధ్యాయ సంఘాల నేతలు పైరవీలు చేశారు. అందులో ఒకటి రాష్ట్రవ్యాప్తంగా కీలకంగా ఉండే పెద్ద సంఘం అయితే, మరొకటి అసలు సభ్యులు ఉన్నారా? లేరా? అన్నట్టు ఉండే చిన్న సంఘం. ఇందులో చిన్న సంఘం నేత తరచూ సీఎం కార్యాలయంలోనే ఉండేవారు. ఆయన ఒక్కరే దాదాపుగా 30కి పైగా అక్రమ బదిలీలు చేయించారు. ఈ రెండు సంఘాల నేతల వల్ల చాలా మంది టీచర్లకు అన్యాయం జరిగిందని ఉపాధ్యాయ వర్గాలు ఆరోపిస్తున్నాయి. వీరిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సచివాలయ ఉద్యోగులకు 'వారానికి 5 రోజులు' పొడిగింపు

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రాంత పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పనిదినాల వెసులుబాటును మరో ఏడాది పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 27 నుంచి ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని సాధారణ పరిపాలనశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. అమరావతి రాజధాని ప్రాంత పరిధిలో పని చేస్తున్న రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు, విభాగాధిపతులు, కార్పొరేషన్లు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఈ వెసులుబాటు కల్పించింది. దీనిపై సచివాలయ సంఘం మాజీ కార్యదర్శి రామకృష్ణ, నాపా ప్రసాద్, ఏపీ సచివాలయ సంఘ ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం ముఖ్య కార్యదర్శిగా పీయూష్

- పూనం, జవహర్ రెడ్డికి పోస్టింగ్‌లు.. నేడు బాధ్యతలు, రిటైర్మెంట్

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సర్వీసుల నుంచి వచ్చిన ఐఏఎస్ అధికారి పీయూష్‌కుమార్‌కు డబుల్ ధమాకా దక్కింది. ఆయన్ను ముఖ్యమంత్రి కార్యదర్శితో పాటు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ప్రస్తుతం ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న రావత్‌ను ప్రభుత్వం రిలీవ్ చేసింది. మరోవైపు మాజీ సీఎస్ జవహర్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్యకు ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఈడబ్ల్యూఎస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జవహర్‌రెడ్డిని నియమించింది. సాధారణ పరిపాలన శాఖలో జీఎంపీ అండ్ ఏఆర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పూనం మాలకొండయ్యకు పోస్టింగ్ లభించింది. ఈ నెలాఖరుతో వీరిద్దరూ రిటైర్ కానున్న నేపథ్యంలో ఒక్కరోజు ముందు పోస్టింగ్ దక్కింది. ఈ నెల 30 ఆదివారం, 29 శనివారం కావడంతో వీరిద్దరూ 28నే రిటైర్ కావాల్సి ఉంది. దీంతో ప్రభుత్వం వారికి 27న రాత్రి పోస్టింగ్‌లు ఇచ్చింది. ప్రస్తుతం సెలవులో ఉన్న జవహర్‌రెడ్డి శుక్రవారం ఉదయం జీఏడీలో రిపోర్టు చేయనున్నారు. శుక్రవారం సాయంత్రానికి ఈ ఇద్దరు అధికారులు రిటైర్ కానున్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఎస్‌పీఎంగా శ్రీనివాసరావు

నేషనల్ హెల్త్ మిషన్‌లో స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్‌గా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసరావును ఆరోగ్యశాఖ అధికారులు నియమించారు. మంత్రికి సమాచారం ఇవ్వకుండా ఈ పోస్టును భర్తీ చేశారు. వైద్య, ఆరోగ్యంపై అవగాహన లేని అధికారిని ఎస్‌పీఎంగా నియమించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

వందేభారత్, గతిమాన్ రైళ్ల వేగం తగ్గింపు

- 160 కి.మీ నుంచి 130 కి.మీ.కి కుదించిన రైల్వే బోర్డు
- భద్రతా కారణాల దృష్ట్యా కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, జూన్ 27: ఆటోమ్యాటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ అందుబాటులోకి వచ్చేవరకు సెమీ హైస్పీడ్ రైళ్లయిన వందేభారత్, గతిమాన్ ఎక్స్‌ప్రెస్‌ల వేగాన్ని గంటకు 160 కి.మీ నుంచి 130 కి.మీ.కి తగ్గించినట్టు భారతీయ రైల్వే వెల్లడించింది. ఈ మేరకు రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సిగ్నల్) నార్త్ సెంట్రల్ రైల్వే (ఎన్‌సీఆర్) జోన్ జనరల్ మేనేజర్‌కు లేఖ రాశారు. హజ్రత్ నిజాముద్దీన్, ఆగ్రా-ఢిల్లీ మార్గాల్లో వందేభారత్, గతిమాన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే గంటకు 160 కి.మీ. వేగంతో నడుస్తున్నాయి. 'ఆటోమ్యాటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థ పనిచేసేవరకు ఎన్‌సీఆర్ జోన్ పరిధిలో రైళ్లు గరిష్ఠంగా గంటకు 130 కి.మీలోపు వేగంతో నడవాలని నిర్ణయించాం. ఇంతకుముందు సూచించినట్టుగా ఈ జోన్ విభాగంలో ఐఆర్-ఏటీపీ కవచ్ పనులు వేగవంతం చేయాలి' అని ఆ లేఖలో సూచించారు. ఈ నెల 25 నుంచే స్పీడ్ లిమిట్ అమలులో ఉందని తెలిపారు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో కంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. రైల్వే బోర్డు ప్రకారం గతిమాన్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 12050/ 12049 ఢిల్లీ-ఝాన్సీ), వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 22470/22469 నిజాముద్దీన్-ఖజురహో), వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 20172/20171 ఢిల్లీ-రాణి కమలాపతి) రైళ్ల వేగం తగ్గింది. కాగా, ఢిల్లీ-ఆగ్రా రూట్ మినహా మిగిలిన అన్నిచోట్లా వందేభారత్ 130 కి.మీ. వేగంతోనే నడుస్తోంది.

నీట్ కేసులో సీబీఐ అరెస్టులు షురూ

పట్నాలో ఇద్దర్ని అదుపులోకి తీసుకున్న ప్రత్యేక దర్యాప్తు బృందం

- గుజరాత్‌లో ముగ్గురు విద్యార్థులను ప్రశ్నించిన సీబీఐ అధికారులు
- మార్కుల గణనలో వైరుధ్యాలపై ఎన్‌టీఏకి సుప్రీంకోర్టు నోటీసులు



ఢిల్లీలోని ఎన్‌టీఏ కార్యాలయం వద్ద విద్యార్థుల నిరసన

న్యూఢిల్లీ, జూన్ 27: నీట్ అక్రమాల కేసులో దర్యాప్తు ప్రారంభించిన సీబీఐ.. పట్నాలో మనీశ్‌కుమార్, అశుతోష్ కుమార్ అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి సంబంధించి అభ్యర్థులతో ఒప్పందం కుదుర్చుకున్నందుకు ఒకరిని.. పరీక్ష ముందురోజు, అంటే మే 4వ తేదీన రహస్యంగా బస చేయడానికి ఏర్పాట్లు చేసిన ఆరోపణలపై మరొకరిని సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుంది. అనంతరం వీరిని ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. వీరిలో అశుతోష్ కుమార్.. పట్నాలోని 'లెర్న్ బాయ్స్ హాస్టల్ అండ్ ప్లే స్కూల్'ని ప్రత్యేకంగా నీట్ అభ్యర్థుల బస కోసం అద్దెకు తీసుకున్నాడు. బిహార్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు ఆ స్కూల్‌లోనే.. కాల్చేసిన నీట్ ప్రశ్నపత్రం అవశేషాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక మనీశ్ కుమార్.. నీట్ ప్రశ్నపత్రాన్ని ముందే ఇస్తానంటూ అభ్యర్థులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అశుతోష్ అద్దెకు తీసుకున్న ప్లేస్కూల్‌కు అభ్యర్థులను తీసుకొచ్చి.. వారికి ప్రశ్నపత్రంతోపాటు, ఆన్సర్ కీని కూడా ఇచ్చాడు. మర్నాడు పరీక్షా కేంద్రాలకు వెళ్లేదాకా వారు అక్కడే ఉన్నారు. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న వీరిద్దరినీ ప్రశ్నించడానికి తమ కస్టడీకి ఇవ్వాల్సిందిగా కోర్టును సీబీఐ కోరనుంది. మరోవైపు.. నాలుగు రోజులుగా గుజరాత్‌లోని గోద్రాలో ఉన్న మరో ప్రత్యేక బృందం అక్కడ నీట్‌లో ఉత్తీర్ణత సాధించడం కోసం రూ.10 లక్షలు ఇచ్చినట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు అభ్యర్థులను, వారి తల్లిదండ్రులను గురువారం ప్రశ్నించింది. అలాగే.. నీట్ అవకతవకలకు కేంద్రబిందువుగా మారిన అక్కడి జే జలరామ్ స్కూల్ యజమాని దీక్షిత్ పటేల్‌నూ ప్రశ్నించింది.

మీరేమంటారు?

నీట్ మార్కుల కేటాయింపులో వైరుధ్యాలు, ఓఎంఆర్ షీట్లను విద్యార్థులకు ఇవ్వడంలో వైఫల్యాల గురించి పలు ఆరోపణలు చేస్తూ ఒక కోచింగ్ సెంటర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)కి సుప్రీంకోర్టు నోటీసు ఇచ్చింది. కోచింగ్ సెంటర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ అడ్వొకేట్ ఆర్ బసంత్.. ఈ లోపాల గురించి ధర్మాసనానికి నివేదించారు. అయితే.. ఈ పిటిషన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద దాఖలు చేయడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌ను కోచింగ్ సెంటర్ దాఖలు చేయడమేమిటని ప్రశ్నించింది. ఓఎంఆర్ షీట్లకు సంబంధించి ఫిర్యాదులకు కాలపరిమితి ఏమైనా ఉందా అని కోర్టు ప్రశ్నించగా.. దానిపై తాను ఎన్‌టీఏని అడిగి తెలుసుకోవాల్సి ఉందని, కాబట్టి ఈ పిటిషన్‌ను జూలై 8కి వాయిదా వేసి, ఆరోజు విచారించే మిగతా పిటిషన్లతో కలిపి విచారించాలని ఎన్‌టీఏ తరఫు న్యాయవాది అభ్యర్థించారు. ధర్మాసనం తదుపరి విచారణను జూలై 8కి వాయిదా వేసింది. అలాగే.. నీట్ ప్రశ్నపత్రంలో సిలబస్‌లో లేని ప్రశ్న ఇవ్వడం, మరో ప్రశ్నకు తప్పు ఆన్సర్‌ను సమాధానంగా గుర్తించడంపై ఢిల్లీ హైకోర్టులో ఒక విద్యార్థి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రెండు వారాల్లోగా స్పందన తెలపాలంటూ ఢిల్లీ హైకోర్టు కేంద్రానికి, ఎన్‌టీఏకి, నేషనల్ మెడికల్ కమిషన్‌కు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

జొరబడి.. నిరసన..

నీట్ అక్రమాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా, కాంగ్రెస్ విద్యార్థి విభాగాలకు చెందిన దాదాపు వందమంది సభ్యులు.. గురువారం ఢిల్లీలోని ఎన్‌టీఏ కార్యాలయంలోకి చొరబడి నిరసన తెలిపారు. మరోవైపు.. నీట్ అక్రమాలను, అగ్నివీర్ పథకాన్ని నిరసిస్తూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగారు. ప్లకార్డులు చేతబూని.. పెద్దపెట్టున నినాదాలతో నిరసన తెలిపారు.

ఆ 12 మంది విపక్ష ఎంపీలు.. దోషులే!

- సభా వ్యవహారాలకు అంతరాయం కలిగించారు
- రాజ్యసభ సభాహక్కుల సంఘం నిర్ధారణ

న్యూఢిల్లీ, జూన్ 27: గతంలో సభలో నిబంధనలను ఉల్లంఘించి సభా వ్యవహారాలకు అంతరాయం కలిగించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న 12 మంది విపక్ష ఎంపీలను రాజ్యసభ సభాహక్కుల సంఘం దోషులుగా నిర్ధారించింది. భవిష్యత్తులో ఇటువంటి ప్రవర్తన పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని వారిని హెచ్చరించింది. ఈ మేరకు రాజ్యసభకు గురువారం నివేదికను సమర్పించింది. 12 మంది ఎంపీల్లో సంజయ్‌సింగ్, శక్తిసింగ్ గోహిల్, సుశీల్‌కుమార్‌గుప్తా, సందీప్‌కుమార్ పాఠక్, నారన్‌భాయ్ రత్వా, ఎల్ హనుమంతయ్య, సయ్యద్ నజీర్ హుస్సేన్, కుమార్ ఖేత్కర్, ఫూలోదేవి నేతమ్, జెబి మేథర్ హిషమ్, రంజీత్ రంజన్, ఇమ్రాన్ ప్రతాప్‌గఢి ఉన్నారు. కాగా, వీరిలో ఖేత్కర్, రత్వా, హనుమంతయ్య ఇప్పటికే ఎంపీలుగా రిటైర్ అయినందున వారిపై ఎటువంటి చర్యలకు సిఫార్సు చేయలేదు. మిగిలిన ఎంపీలను మాత్రం ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించింది. ఆమ్‌ఆద్మీపార్టీ ఎంపీ సంజయ్‌సింగ్ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. అయితే, ఆయన ఇప్పటికే బేషరతు క్షమాపణ చెప్పటంతోపాటు రాజ్యసభ నుంచి సస్పెన్షన్‌కు గురైన నేపథ్యంలో మరింత శిక్ష అవసరం లేదని అభిప్రాయపడింది. సస్పెన్షన్‌ను తొలగించాలని సిఫార్సు చేసింది. ఈ మేరకు రాజ్యసభ ఛైర్మన్ జగ్దీప్ ధన్‌కడ్.. సంజయ్‌సింగ్‌పై గత ఏడాది జూలై 24వ తేదీ నుంచి కొనసాగుతున్న సస్పెన్షన్‌ను తొలగించారు. కాగా, రాజ్యసభ సభా వ్యవహారాల కమిటీ భేటీ గురించి 'తెలంగాణ టుడే'లో ప్రచురించిన ఓ వార్తకు సంబంధించి సభాహక్కుల సంఘం మరో నివేదికను సమర్పించింది. సదరు వార్త ప్రచురణ విషయంలో ఆ పత్రికకు ఇప్పటికే సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు పంపించారు. దీనిపై తెలంగాణ టుడే ఎడిటర్.. సదరు వార్తలో తప్పు దొర్లిందని, అది అనుకోకుండా జరిగిందని పేర్కొంటూ బేషరతు క్షమాపణ చెప్పిన నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని ఇక్కడితో ముగించాలని కమిటీ తీర్మానించింది.

సంస్కరణలు లేకుండా 'సంహిత'లా?

- కొత్త నేర చట్టాలపై 'సుప్రీం'లో పిల్

న్యూఢిల్లీ, జూన్ 27: కేంద్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన మూడు నేర న్యాయ చట్టాలను అమలు చేయకుండా స్టే ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో గురువారం ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలయింది. నూతన చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్ఏ)లను వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అయితే వీటిలో పలు లోపాలు ఉన్నందున అమలును నిలిపివేయాలని పిటిషనర్లు కోరారు. బ్రిటిష్ పాలనకు చిహ్నంగా పోలీసు వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోందని, తొలుత దానికి సంస్కరణలు చేయకుండా ఈ సంహితలను తీసుకురావడం సరికాదని ఈ పిటిషన్‌లో ప్రధానంగా ప్రస్తావించారు. అంజలి పటేల్, ఛాయా మిశ్రా అనే మహిళలు న్యాయవాదులు సంజీవ్ మల్హోత్రా, కున్వర్ సిద్ధార్థల ద్వారా ఈ పిల్‌ను దాఖలు చేశారు.

అరుంధతీరాయ్‌కు పెన్ అవార్డు

- అక్టోబరులో బ్రిటిష్ లైబ్రరీలో ప్రదానం



న్యూఢిల్లీ, జూన్ 27: ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్‌కు ప్రతిష్ఠాత్మకమైన బ్రిటన్ 'పెన్' అవార్డు లభించింది. సాహిత్య నోబెల్ విజేత హారాల్డ్ పింటర్ స్మృత్యార్థం 2009 నుంచి ఇస్తున్న ఈ అవార్డు 2024 సంవత్సరానికిగాను అరుంధతిని వరించింది. బ్రిటిష్ లైబ్రరీతో కలిసి 'పెన్' సంస్థ ఈ అవార్డును ఏటా ప్రదానం చేస్తోంది. బ్రిటిష్ లైబ్రరీలో జరిగే కార్యక్రమంలో ఈ ఏడాది అక్టోబరు 10న ఆమెకు అవార్డును ప్రదానం చేయనుంది. అనంతరం ఆమె హారాల్డ్ పింటర్ స్మారక ప్రసంగం చేస్తారు. 'శక్తిమంతమైన అరుంధతి గొంతుకను నొక్కివేయలేరు' అని అవార్డు ప్రకటన సందర్భంగా 'పెన్' నిర్వాహకులు వ్యాఖ్యానించారు. జమ్మూకశ్మీర్‌పై వేర్పాటువాద వ్యాఖ్యలు చేశారనే కారణంగా అరుంధతి ప్రస్తుతం 'ఉపా' (ఉగ్రవాద నిరోధక చట్టం) నేరాభియోగాలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. తనకు అవార్డు రావడంపై అరుంధతి స్పందించారు. ప్రపంచం తీసుకుంటున్న నిర్దయమైన మలుపుల గురించి రాస్తున్నప్పుడు పింటర్ సదా వెంటే ఉంటారని, ఆ విధంగా ఆయన లేని లోటును మనలో కొందరం తప్పక పూరించాల్సి ఉంటుందన్నారు. కాగా, కశ్మీర్‌పై వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో అరుంధతీరాయ్, ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌లపై మోపిన కేసులను వెనక్కి తీసుకోవాల్సిందిగా భారత ప్రభుత్వానికి అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ విజ్ఞప్తి చేసింది.

విజిలెన్స్‌కు అపరిమిత అధికారాలపై కౌంటర్ వేయండి

» ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు అపరిమిత అధికారాలు కట్టబెట్టాలంటూ ఆ శాఖ బిజీ రఘురామిరెడ్డి ప్రభుత్వానికి రాసిన లేఖపై కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. విచారణను జూలై 8కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి గురువారం ఆదేశాలిచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ బిజీ రఘురామిరెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వానికి ఓ లేఖ రాశారు. 'రాష్ట్రంలోని ఏ కార్యాలయాన్ని, సంస్థనైనా సందర్శించేందుకు, తనిఖీ చేసేందుకు, రికార్డులు జప్తు చేసేందుకు, వారెంట్ లేకుండా అరెస్టు చేసేందుకు వీలుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో పనిచేసే గెజిటెడ్ అధికారులను అధీకృత అధికారులుగా నియమించాలి. అపరిమిత అధికారాలు కల్పించాలి' అని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ లేఖను సవాల్ చేస్తూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లేఖకు అనుగుణంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి తీసుకున్న చర్యలను చట్ట, రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలని కోరారు. లేఖ ఆధారంగా చర్యలు చేపట్టకుండా సీఎం సహా సంబంధిత అధికారులు ఎలాంటి ఉత్తర్వులు, నోటీసులు, సర్క్యులర్లు, ఆర్డినెన్స్ జారీ చేయకుండా నిషేధం విధించాలని కోరారు. ఈ వ్యాజ్యం గురువారం మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది అఖిల్ చౌదరి వాదనలు వినిపిస్తూ.. 'ఈ వ్యవహారంపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. విధానపరమైన నిర్ణయం ఏమైనా తీసుకున్నారా? తీసుకోబోతున్నారా? ఏమి చేయబోతున్నారో స్పష్టతనిస్తూ కౌంటర్ వేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలి' అని కోరారు. ఈ వాదనలపై న్యాయమూర్తి అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఏఏ అంశాలపై కౌంటర్ వేయాలో ఎలా ఆదేశించగలమని ప్రశ్నించారు.

ఎట్టకేలకు చిక్కిన చిరుత



గిద్దలూరు టౌన్, జూన్ 27: ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం దేవనగరం సమీపంలో గుంతలో పడిన చిరుతపులిని ఎట్టకేలకు అధికారులు బంధించారు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో బోనులో చిక్కిన చిరుతను .అటవీ ప్రాంతంలో వదిలి పెట్టేందుకు తరలించారు.

చేయని పనులకూ బిల్లులు!

» మున్సిపల్ కార్పొరేషన్ల ఖజానా ఖాళీ
» రూ.14 వేల కోట్లకు పైగా చెల్లింపులు పెండింగ్
» కొన్నింట ఖాతాలో ఉన్న నిధుల కంటే ఖర్చే ఎక్కువ
» పట్టణాలను నిలువునా ముంచిన వైసీపీ సర్కార్
» కూటమి ప్రభుత్వంపై బకాయిల భారం
» నేడు మున్సిపల్ శాఖ మంత్రి సమీక్ష

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లలో పెండింగ్ బిల్లులు భారీగా పేరుకుపోయాయి. మొత్తం 851 బిల్లులకు సంబంధించి రూ.14831 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. ముఖ్యంగా కార్పొరేషన్లలో సాధారణ నిధుల కింద చేపట్టిన పనులు, పథకాలకు సంబంధించి రూ.10232 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇక రోడ్లు, డ్రైన్లు, భవనాలు, వీధిలైట్లు, తాగునీటి సరఫరాకు సంబంధించి రూ.246 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద రూ.2532 కోట్ల పనులు చేశారు. అయితే ఈ బిల్లులు చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.1730 కోట్లు విడుదల చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.523 కోట్లు మాత్రమే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి రూ.1206 కోట్లు ఇతర నవరత్నాలకు మళ్లించింది. దీంతో కాంట్రాక్టర్లకు బిల్లులు అందక ఎక్కడ పనులు అక్కడ అసంపూర్తిగా వదిలేశారు.

వైసీపీ సర్కారు పాపం.. కూటమి ప్రభుత్వానికి భారం

వైసీపీ సర్కార్ హయాంలో మున్సిపల్ కార్పొరేషన్లను ఇష్టారాజ్యంగా వాడేసుకోవడంతో కనీసం సౌకర్యాలకు సైతం నిధులు లేక నీరసించిపోతున్నాయి. సాధారణ నిధుల పద్దు కింద అడ్డగోలుగా పనులు మంజూరు చేయడం, పనులు చేయకపోయినా బిల్లులు పెట్టడం, అందుబాటులో ఉన్న నిధుల కంటే ఎక్కువగా పనులు మంజూరు చేయడంతో దొంగ బిల్లులు పేరుకుపోయి మొత్తం రూ.14 వేల కోట్లకు పైగా పెండింగ్ బిల్లులున్నట్లు అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. శుక్రవారం సచివాలయంలో మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ రాష్ట్రంలోని 17 మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించనున్నారు. పేరుకుపోయిన బకాయిలపై అధికారులిచ్చిన నివేదికలతో కొత్త ప్రభుత్వానికి మైండ్ బ్లాంక్ అవుతుందేమోనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ పనులన్నింటిపై తనిఖీలు నిర్వహించి పనుల నాణ్యతతోపాటు అసలు పనులు జరిగాయో లేదా? నిగ్గు తేల్చాల్సిన అవసరముంది!.

పీడీ ఖాతాల్లో నిధుల కంటే ఖర్చు ఎక్కువ

రాష్ట్రంలో 17 కార్పొరేషన్లు పలు పీడీ ఖాతాలు నిర్వహిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లు, వాటర్ చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, షాపు గదుల అద్దెలు, ఈఎండీలు తదితర ఇతర ఫీజులకు సంబంధించి 001 ఖాతా ద్వారా నిర్వహిస్తారు. ఈ నిధుల నుంచి రికవరీలతో పాటు పనులకు సంబంధించిన బిల్లులు చెల్లిస్తారు. మొత్తం 17 కార్పొరేషన్లకు సంబంధించి ఈ నెల 25 నాటికి పీడీ ఖాతాల్లో రూ.703 కోట్లు అందుబాటులో ఉంటే దానికి సంబంధించి వ్యయం రూ.295 కోట్లు కాగా మరో రూ.493 కోట్లు ఖాతాల్లో నిల్వ ఉన్నట్లు అధికారులు తేల్చారు. అయితే ఈ మొత్తం 17 కార్పొరేషన్లలో కాకినాడ, ఒంగోలు, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్లలో పీడీ ఖాతాల్లో ఉన్న నిధుల కంటే ఖర్చు ఎక్కువ చేశారు. కాకినాడ కార్పొరేషన్ పీడీ ఖాతాలో రూ.6.80 కోట్లు మాత్రమే ఉంటే రూ.72.35 కోట్లు ఖర్చు చూపించారు. అంటే అదంతా బకాయిలే. ఒంగోలు కార్పొరేషన్ పీడీ ఖాతాలో రూ.96 లక్షలు ఉంటే ఏకంగా రూ.18.86 కోట్ల వ్యయం చేయాల్సి ఉన్నట్లు పేర్కొన్నారు. చిత్తూరు కార్పొరేషన్ ఖాతాలో రూ.2.16 కోట్లు ఉంటే రూ.4.55 కోట్లు ఖర్చు చూపించారు. ఆస్తి పన్ను, స్టాంప్‌డ్యూటీపై సర్‌చార్జీల కింద మరో పీడీ ఖాతాలో 17 మున్సిపల్ కార్పొరేషన్ల ఖాతాల్లో రూ.540 కోట్లు నిధులుంటే మూడు నెలల జీతాలకు గాను రూ.223 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. అయితే జీవీఎంసీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్లు మాత్రం ఆస్తిపన్ను, స్టాంప్‌డ్యూటీ వసూళ్ల నుంచి వచ్చిన సర్‌చార్జీలను పీడీ ఖాతాలో జమచేయకుండా వేరే సేవింగ్ ఖాతాలో జమచేస్తున్నారు. ఏలూరు, మచిలీపట్నం, చిత్తూరు, తిరుపతి కార్పొరేషన్లు ఖాతాల్లో ఉన్న నిధుల కంటే ఎక్కువ ఖర్చు చేసినట్లు చూపించారు.

అవినీతిపైన దృష్టి సారించాలి

వాస్తవానికి మొత్తం కార్పొరేషన్లు వైసీపీ కైవసం చేసుకోవడంతో గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నే తలు ఇష్టారాజ్యంగా పట్టణాల్లో దోపిడీ చేశారు. పను లు చేయకుండానే బిల్లులు పెట్టడం, నిధులు లభ్యత లేకపోయినా పనులు మంజూరుచేయడం, నాణ్యత లేని పనులు చేపట్టారు. గత ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులివ్వకుండా పెండింగ్ పెట్టడంతో కూటమి ప్రభు త్వం ఈ బకాయిలను చెల్లించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. కొన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో పనులు కేవలం కాగితాలపైనే ఉన్నాయని, భౌతికంగా పనులు జరగకపోయినా బిల్లులు పెట్టి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ శుక్రవారం నిర్వహించనున్న సమీక్షలో అజెండా ప్రధానంగా మున్సిపల్ కార్పొరేషన్ల ఆదాయం పెంచేందుకు అవసరమైన చర్యలు, డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించాలని నిర్ణయించారు. అలాగే మొత్తం 17 కార్పొరేషన్లకు సంబంధించి జరిగిన పనులపై విజిలెన్స్ విచారణ నిర్వహిస్తే గానీ వాస్తవాలు వెలుగులోకి రావని పలువురు పేర్కొంటున్నారు.

ఏపీఎడ్‌సెట్ ఫలితాలు విడుదల

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీఎడ్‌సెట్-2024 ఫలితాలను గురువారం మధ్యాహ్నం ఏయూలోని ఎడ్‌సెట్ కార్యాలయంలో కన్వీనర్ ప్రొఫెసర్ టి.వెంకట కృష్ణ విడుదల చేశారు. ఐదు సబ్జెక్టుల్లో ప్రవేశాలకు ఈ నెల ఎనిమిదో తేదీన రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 10,805 మంది అభ్యర్థులు హాజరుకాగా 9,365 మంది (98.05 శాతం) అర్హత సాధించారు. కాకినాడ జిల్లాకు చెందిన కాకరపర్తి భావన ఫణి ప్రియ గణిత శాస్త్రంలో, అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన కాశీన వీరసాయి చంద్రిక భౌతికశాస్త్రంలో, విజయనగరం జిల్లాకు చెందిన ఇంజమూరి వెంకటసాయి మణికంఠ జీవశాస్త్రంలో, బాపట్ల జిల్లాకు చెందిన కొప్పుల శ్వేత సాంఘికశాస్త్రంలో, శ్రీకాకుళం జిల్లాకు చెందిన బొర్రా రమణి ఇంగ్లీష్ సబ్జెక్టులో టాప్ ర్యాంకర్లుగా నిలిచారు. ఫలితాలను ఏపీఎస్‌సీహెచ్‌ఈ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు.

ఏపీ పీజీ సెట్ ఫలితాలు విడుదల

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ పీజీసెట్-2024) ఫలితాలను ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు గురువారం సాయంత్రం విడుదల చేశారు. మొత్తం 34 సబ్జెక్టుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 10 నుంచి 13 తేదీల మధ్య 24 కేంద్రాల్లో ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించారు. ఈ ప్రవేశ పరీక్షకు 33,865 మంది దరఖాస్తు చేసుకోగా 29,908 మంది హాజరయ్యారు. 18,467 మంది (61.75 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పీజీ సెట్‌కు 11,359 మంది పురుషులు హాజరుకాగా 6,736 మంది (59.30 శాతం), 18,549 మంది మహిళలు హాజరుకాగా 11,731 మంది (63.24 శాతం) అర్హత సాధించారు. ఇక, వర్సిటీల వారీగా చూస్తే ఏయూ పరిధిలో 21,606 మందికి 13,108 మంది (60.67 శాతం), శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలో 7,775 మందికి 4,950 మంది (63.67 శాతం), ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో 204 మందికి 158 మంది (77.45 శాతం) అర్హత సాధించారు. ఇతర ప్రాంతాల నుంచి 323 మంది హాజరు కాగా 251 మంది (77.71 శాతం) అర్హత సాధించారు.

ఏపీ లా సెట్ 2024 ఫలితాలు విడుదల

పెదకాకాని, జూన్ 27: ఏపీ ఉన్నత విద్యామండలి పర్యవేక్షణలో ఈ నెల 9న జరిగిన ఏపీ లా సెట్, ఏపీ పీజీఎల్ సెట్-2024 ఫలితాలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వర్సిటీ వీసీ ఆచార్య రాజశేఖర్ గురువారం విడుదల చేశారు. ఏపీ లా సెట్ కన్వీనర్ ఆచార్య బి.సత్యనారాయణ ఫలితాల వివరాలను ప్రకటించారు. 19,224 అభ్యర్థులు పరీక్ష రాయగా వారిలో 17,117 మంది 89.04 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో రెండేళ్ల పీజీ కోర్స్‌లో 99.51 శాతం, మూడేళ్ల ఎల్.ఎల్.బి కోర్స్‌లో 89.74 శాతం, ఐదేళ్ల ఎల్.ఎల్.బి కోర్స్‌లో 80.06 శాతం ఉతీర్ణత సాధించారు.

విస్తారంగా వర్షాలు



పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం బాడవ వద్ద నీట మునిగిన చేలు

» సీమలో అధికం.. కోస్తాలో మోస్తరుగా..
» పుంజుకున్న ఖరీఫ్ సాగు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గురువారం ఉత్తరకోస్తాలో భారీ వర్షాలు కురిశాయి. దక్షిణకోస్తాలో తేలికపాటి జల్లులు పడ్డాయి. శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ, మన్యం, అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురవగా, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, నంద్యాల జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో 79.5, విజయనగరం జిల్లా గోవిందపురంలో 77.75 మిల్లీమీటర్ల గరిష్ఠ వర్షపాతం నమోదైంది. శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలో అనేక చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వర్షాలతో పాటు అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కాగా, ఈ నెలలో ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కన్నా 53.4% అధిక వర్షాలు కురిశాయి. రాయలసీమతో పాటు విజయనగరం, అనకాపల్లి, కాకినాడ, కృష్ణా జిల్లాల్లో సాధారణం కన్నా 50 నుంచి 150 శాతం ఎక్కువ వర్షం కురిసింది. విశాఖ కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సాధారణం కన్నా అధికంగా వానలు పడ్డాయి. మిగతా జిల్లాల్లో సాధారణ స్థాయిలో వర్షపాతం నమోదైందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ వర్షాలతో ఖరీఫ్ సాగు మరింత పుంజుకుంది. ఇప్పటికే 4 లక్షల ఎకరాల్లో మెట్ట పంటలు సాగులోకి వచ్చాయి. మాగాణి వరి సాగు కోసం రైతులు నారుమళ్లు పోస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో వర్షాలకు వరి నారుమడులు, నాట్లు వేసిన వరిచేలు నీట మునుగుతున్నాయి. మెట్ట ప్రాంతాల్లో కూరగాయల పంటలు కుళ్లుతున్నాయి. ఉత్తర కోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

వర్సిటీల్లో రాజీనామా బాట

అనంతపురం సెంట్రల్, జూన్ 27: అనంతపురం జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు తన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి గురువారం రాజీనామా లేఖను పంపారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ అయిన శ్రీనివాసరావును జనవరి 17న అప్పటి ప్రభుత్వం వీసీగా నియమించింది. జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య కూడా రాజీనామా చేసినట్టు వర్సిటీ వర్గాలు తెలిపాయి. అధికారికంగా ప్రకటించలేదు.

అందరికీ ఒకే చట్టం

» వైసీపీని ప్రత్యేకంగా చూడడానికి వీల్లేదు
» అధికారులు నిబంధనల ప్రకారమే ముందుకు
» హైకోర్టులో వాదనలు వినిపించిన ఏజీ
» ముగిసిన వాదనలు.. యథాతథస్థితి కొనసాగింపు
» అనుబంధ పిటిషన్లపై తీర్పు రిజర్వ్

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యాలయాల నిర్మాణాలకు వైసీపీ ఎలాంటి అనుమతులూ తీసుకోలేదని అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టులో వాదనలు వినిపించారు. వైసీపీ చట్టనిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించిందని తెలిపారు. సాధారణ ప్రజలకు వర్తించే చట్టమే రాజకీయ పార్టీలకూ వర్తిస్తుందని, చట్టనిబంధనలు ఉల్లంఘించి పార్టీ కార్యాలయాలు నిర్మించుకొనేందుకు రాజకీయ పార్టీలకు ప్రత్యేక వెసులుబాట్లు ఏవీ ఉండవన్నారు. రాజకీయ పార్టీ పేరుతో న్యాయస్థానం నుంచి రక్షణ పొందలేరని, కార్యాలయాల నిర్మాణాలకు అనుమతులు ఉంటే చూపాలన్నారు. అధికారులు తుది ఉత్తర్వులు జారీ చేసిన తరువాతే న్యాయస్థానాలు రిట్ పిటిషన్లు అనుమతిస్తాయని, ప్రస్తుత పిటిషన్ల విషయంలో ఇదే వైఖరిని అవలంబించాలని పేర్కొన్నారు. పిటిషనర్ రాజకీయ పార్టీ అనే కారణంతో ప్రత్యేకంగా చూడడానికి వీల్లేదన్నారు. అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయాల భవనాల విషయంలో అధికారులు చట్టనిబంధనలు అనుసరిస్తారని తెలిపారు. వైసీపీ కార్యాలయాల నిర్మాణాల అంశంపై గురువారం హైకోర్టులో ఇరుపక్షాలు వాదనలు వినిపించాయి. నిబంధనలు ఉల్లంఘించి చేసిన నిర్మాణాలపై వివరణ ఇవ్వాలని అధికారులు ప్రాథమిక ఉత్తర్వులు మాత్రమే ఇచ్చారని ఏజీ చెప్పారు. వాటికి పిటిషనర్లు వివరణలు సమర్పిస్తే అధికారులు పరిశీలించి తుది ఉత్తర్వులు జారీ చేస్తారని తెలిపారు. ఈ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే అప్పుడు పిటిషనర్లు కోర్టును ఆశ్రయించవచ్చునన్నారు. అలా కాకుండా నేరుగా కోర్టు నుంచి ఉత్తర్వులు పొందేందుకు పిటిషనర్లు ప్రయత్నిస్తున్నారని, ఈ వ్యాజ్యాలకు విచారణార్హత లేదన్నారు. భవనాలు కూల్చివేస్తే నష్టం జరుగుతుందని చెబుతూ, బాధితులుగా చిత్రీకరించుకుంటూ సానుకూల ఉత్తర్వులు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని కోర్టును కోరారు. గురువారం జరిగిన విచారణలో ఇరువైపుల వాదనలు ముగియడంతో అనుబంధ పిటిషన్లపై నిర్ణయం వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ప్రకటించారు. నిర్ణయం వెల్లడించేవరకు యథాతథస్థితి పాటించాలని ఆదేశించారు.

17 జిల్లాల అధ్యక్షుల పిటిషన్లు

అనుమతులు తీసుకోకుండా నిర్మించిన పార్టీ కార్యాలయాలను ఎందుకు కూల్చివేయకూడదో వివరణ ఇవ్వాలని కోరుతూ అధికారులు ఇచ్చిన ప్రొవిజనల్ నోటీసులను సవాల్ చేస్తూ వైసీపీ బుధవారం అత్యవసరంగా హైకోర్టును ఆశ్రయించింది. నోటీసులను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాలని కోరుతూ 17 జిల్లాల వైసీపీ అధ్యక్షులు వేర్వేరుగా పిటిషన్లు దాఖలుచేశారు. ఈ వ్యాజ్యాలు గురువారం మరోసారి విచారణకు వచ్చాయి. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి, మరికొందరు న్యాయవాదులు వాదనలు వినిపించారు. 'భూకేటాయింపు జరిగిన తరువాత ఏడాది లోపే కార్యాలయాల నిర్మాణం ప్రారంభించి, పూర్తి చేయాల్సి ఉంటుంది. బిల్డింగ్ ప్లాన్ ఆమోదం కోసం చేసిన దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. నిర్దిష్ట గడువులోగా దరఖాస్తుపై అధికారి నిర్ణయం తీసుకోకుంటే భవన నిర్మాణం చేయవచ్చని చట్టనిబంధనలు చెబుతున్నాయి. కొన్ని భవనాల విషయంలో నిర్మాణాలు కొనసాగించుకోవచ్చని అధికారులే మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణాలను ప్రారంభించాం. అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలను ఎందుకు కూల్చివేయకూడదో వివరణ ఇవ్వాలని అధికారులు నోటీసులు ఇచ్చారు. వాటిని కూల్చివేస్తారేమోనన్న పిటిషనర్ ఆందోళన సహేతుకమైనది. పిటిషనర్ల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని కమిషనర్ నిర్ణయం తీసుకోవాలి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని భవనాల విషయంలో యథాతథస్థితి పాటించేలా అధికారులను ఆదేశించండి' అని వాదించారు.

డీసీసీబీ, డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిలుగా జేసీలు

» ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జిగా అహ్మద్‌బాబు

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్(డీసీసీబీ)లు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)లకు ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లను పర్సన్ ఇన్‌చార్జిలుగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 13 డీసీసీబీలు, 13 డీసీఎంఎస్‌లకు గత ప్రభుత్వం నియమించిన ఏడుగురు సభ్యుల పాలకవర్గాలు రాజీనామా చేశాయి. ప్రస్తుత ప్రభుత్వం ఆరు నెలల కాల పరిమితితో జేసీలను అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించింది. ఆప్కాబ్ నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి మల్లెల ఝాన్సీరాణి రాజీనామా చేయడంతో ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జిగా రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ అహ్మద్‌బాబును తాజాగా నియమించింది.

శేఖర్‌బాబుకు మార్కెటింగ్ బాధ్యతలు

మార్క్‌ఫెడ్ ఎండీ గడ్డం శేఖర్‌బాబుకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెటింగ్ శాఖ పరిధిలోని రైతుబజార్ల ఇన్‌చార్జి సీఈవోగా కూడా ఆయనకే అదనపు బాధ్యతలు అప్పగించింది.

జల్‌శక్తి అభియాన్ అమల్లో డ్వాక్రా మహిళలను భాగస్వాములను చేయండి: రాజీవ్ గౌబ

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జల్‌శక్తి అభియాన్ అమల్లో స్వయం సహాయక బృందాల భాగస్వామ్యాన్ని విస్తరించడం ద్వారా నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో సాధించాలని కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించారు. భవిష్యత్తులో దేశం ఎదుర్కొబోయే నీటి సంక్షోభానికి పరిష్కారాన్ని కనుగొనే లక్ష్యంతో కన్వర్జెన్స్ మోడ్‌లో భూగర్భ జలాలను మెరుగుపర్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గురువారం అన్ని రాష్ట్రాల సీఎస్‌లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి జల్‌శక్తి అభియాన్ అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ ఏడాది జల్‌శక్తి అభియాన్ పథకాన్ని 'నారీ శక్తి సే జల్ శక్తి' థీమ్‌తో అమలు చేస్తున్నాం. డ్వాక్రా మహిళలకు నీటి వనరుల సంరక్షణ, నిల్వ, వాటి వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి. నీటి వనరులను అన్నింటినీ గుర్తించి జియో ట్యాగింగ్ చేసుకుని పరిరక్షించాలి. ఉపాధి, పీఎమ్ఎస్‌వై వాటర్ షెడ్స్, అటవీ, ఐసీడీఎస్, 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి" అని సూచించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నెతన్యాహూ కొత్త ఎత్తు

లెబనాన్‌లో ఉన్న తమ పౌరులను వెంటనే వెనక్కురావాల్సిందిగా జర్మనీ, నెదర్లాండ్స్ తాజాగా హెచ్చరికలు జారీ చేశాయి. ఇప్పటికే కెనడా సహా మరికొన్ని దేశాలు తమవారికి ఇదేతరహా సూచనలు చేసిన విషయం తెలిసిందే. అనేక పాశ్చాత్యదేశాల దౌత్యకార్యాలయాలు తమ పౌరులను ఏయే మార్గాల్లో లెబనాన్‌నుంచి తరలించవచ్చునో ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయట. ఇజ్రాయెలీలను ప్రశాంతంగా ఉంచే ఉద్దేశంలో బెంజమీన్ నెతన్యాహూ లేడు. గాజాని దుంపనాశనం చేసిన ఆయన ఇప్పుడు అక్కడ కాస్తంత తగ్గి, తన బలగాన్ని లెబనాన్ సరిహద్దులకు తరలించి, హిజ్బొల్లాతో పూర్తిస్థాయి యుద్ధం చేయాలని అనుకుంటున్నాడు. నెతన్యాహూకు పటిష్ఠమైన యుద్ధవ్యూహం ఉన్నదని, అది వరుసపెట్టి ఎవరో ఒకరితో యుద్ధాలు చేస్తూండటమేనన్న ఓ సరదా వ్యాఖ్య నూటికి నూరుపాళ్ళూ నిజం. నిరంతర యుద్ధంతోనే తనకు రాజకీయంగా మనుగడ సాధ్యపడుతుందని ఆయనకు తెలుసు.

ఇరాన్ ఎలాగూ ఊరుకోదు. హిజ్బొల్లాతో యుద్ధంలో లెబనాన్‌లోకి నెతన్యాహూ సైన్యాలు చొరబడేందుకు ప్రయత్నించినపక్షంలో ఇరాన్ ప్రవేశంతో ఆ యుద్ధం మరింత తీవ్రమవుతుంది, సరిహద్దులు దాటిపోతుంది. దీనికితోడు, హమాస్‌తో పోల్చితే హిజ్బొల్లా ఆయుధశక్తి, సంఖ్యాబలం మరింత అధికం. ఈ సంస్థ దగ్గర ఉన్న వివిధ రకరకాల క్షిపణులు, రాకెట్లు అధునాతనమైనవి. గాజా యుద్ధం ఆరంభమైనప్పటి నుంచి ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతాల్లో హిజ్బొల్లా జరుపుతున్న దాడులు తీవ్రంగా ఉన్నాయి. సరిహద్దు గ్రామాలు, పట్టణాలను ఇజ్రాయెలీలు వదిలిపోవాల్సివచ్చింది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు ఇజ్రాయెల్ తన బలగాలన్నింటినీ కూడగట్టి గట్టిగా యుద్ధం చేసిన పక్షంలో హిజ్బొల్లా తన ఆయుధశక్తినంతటినీ వాడుతుంది, మద్దతుగా ఇరాన్‌ను తెచ్చుకుంటుంది. 2006లో హిజ్బొల్లాతో యుద్ధంలో ఇజ్రాయెల్ పెద్దగా సాధించిందేమీ లేదు.

గాజాలో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన మరుక్షణంనుంచి ఇజ్రాయెల్‌మీద హిజ్బొల్లా దాడులు ఆగిపోతాయి. కానీ, హమాస్ అంతమే తన పంతమని అంటూ నెతన్యాహూ కాల్పుల విరమణను, శాంతి ప్రతిపాదనలను తిరస్కరిస్తున్నాడు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆమోదించిన ప్రతిపాదనను ఇటీవలే తిరగ్గొట్టిన ఆయన మరో పక్క కొత్త యుద్ధం గురించి మాట్లాడుతున్నాడు. హమాస్ అధీనంలో ఉన్న ఇజ్రాయెలీ బందీలను విడిపించే విషయంలో ఆయన శ్రద్ధ పెట్టడం లేదని సంబంధిత కుటుంబాలవారు ఆగ్రహిస్తున్నారు. ఎన్నటికీ ఆగని యుద్ధంతో విసిగిపోయిన వేలాదిమంది ఇజ్రాయెలీలు రోడ్లమీదకు వచ్చి నెతన్యాహూకు వ్యతిరేకంగా ప్రదర్శనలు, నిరసనలు నిర్వహిస్తున్నారు. ఆయన రాజీనామా చేయాలని, కొత్తగా ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తున్నారు. దేశంలో చాలా చోట్ల అల్లర్లు, విధ్వంసం జరిగినందువల్ల కాబోలు, కాల్పుల విరమణ విషయంలో ఆయన ఆ తరువాత కాస్తంత మెత్తబడినప్పటికీ, చాలా మెలికలు పెట్టారు. బందీల అప్పగింత పూర్తయ్యేవరకూ కాల్పుల విరమణ అమల్లో ఉంటుంది తప్ప అదేమీ శాశ్వతం కాదన్నట్టుగా ఆయన వ్యాఖ్యానించడంతో హమాస్ దానిని కొట్టిపారేస్తూ తన డిమాండ్లను పునరుద్ఘాటించింది.

యుద్ధం ఆగినపక్షంలో ఎన్నికలు జరిగి, తన కూటమి ప్రభుత్వం పడిపోతుంది, అవినీతి కేసులు వెంటాడతాయి కనుక ఆ పరిస్థితులు రాకుండా నెతన్యాహూ తెలివిగా హిజ్బొల్లాను రెచ్చగొడుతున్నట్టు ఉంది. అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎడతెగని గాజాయుద్ధం బైడెన్‌ను ఇరుకునపెడుతున్న తరుణంలో, నెతన్యాహూ కొత్త ఎత్తు ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందో చూడాలి. లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ బలగాలు చొరబడినపక్షంలో ఆ యుద్ధానికి నియమాలు, నిబంధనలు, హద్దులు, అదుపులు ఉండబోవని హిజ్బొల్లా నాయకుడు హసన్ నస్రుల్లా హెచ్చరించారు.

హమాస్‌తో ఇలా ఎంతకాలం యుద్ధం చేసినప్పటికీ, దానిని మహా అయితే తాత్కాలికంగా బలహీనపరచవచ్చునే కానీ, నాశనం చేయడం అసాధ్యమని ఐడీఎఫ్ నెతన్యాహూకు నివేదించినట్టుగా వార్తలు వచ్చాయి. హమాస్‌తో పోల్చితే అనేకరెట్లు శక్తిమంతమైన హిజ్బొల్లాతో యుద్ధానికి దిగి, అటు ఇరాన్‌ను, ఇటు అమెరికా తదితర దేశాలను నెతన్యాహూ ఉచ్చులోకి లాగే ఆలోచన చేస్తున్నారు. ఈ విషయంలో నెతన్యాహూ మెడలు వంచాల్సిన బాధ్యత అమెరికామీద ఉన్నది. ఇజ్రాయెల్-హిజ్బొల్లా యుద్ధాన్ని అమెరికా కోరుకోవడం లేదని, ఆ పరిస్థితి రాకుండా నిలువరించే ప్రయత్నాలు విశేషంగా జరుగుతున్నాయన్న వార్తలు నిజమైన పక్షంలో సంతోషించాల్సిందే.

సృష్టికి, విధ్వంసానికి ప్రతీక 'పోలవరం'!

ముఖ్యమంత్రి పదవి జగన్మోహన్ రెడ్డి చేపట్టాక 2019 జూన్ 3న జలవనరుల శాఖపై సమీక్ష జరిగినప్పుడు పోలవరం ప్రాజెక్టు పురోగతి వివరాలను అధికారులు ఆయనకు సమర్పించారు. టీడీపీ హయాంలో పోలవరం ప్రాజెక్టు మొత్తంగా 71.20 శాతం, హెడ్ వర్క్స్ 64.08 శాతం, కుడి కాలువ 91.49 శాతం, ఎడమ కాలువ 71.60 శాతం పూర్తయినట్లు నివేదిక ఇచ్చారు. ముంపు ప్రాంతానికి చెంది ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో నిర్వాసితులు 1,05,601 గాను 3,922 కుటుంబాలకు పునరావాసం కల్పించినట్లు, ఇందుకు 6,200.29 కోట్ల రూపాయలు వ్యయమైనట్లు, ఇంకా 27,025.45 కోట్లు అవసరమని ఆ నివేదికలో తెలిపారు. కాగా జగన్ పాలన ఆఖరు దశలో పోలవరం తొలి దశ పేరుతో కేంద్ర జలవనరుల శాఖకు 2023 డిసెంబర్ 5న సమర్పించిన నివేదికలో ప్రాజెక్టు పురోగతి గురించి ఇచ్చిన వివరణ ఇలా వుంది. ప్రాజెక్టు మొత్తం వర్క్స్ 73.82 శాతంగా ఉంది. టీడీపీ హయాంలో 71.20 శాతం పోగా, జగన్ హయాంలో కేవలం 2.62 శాతం మాత్రమే పురోగతి జరిగింది. అంటే ప్రాజెక్టు పురోగతి ఎంత దిగదుడుపుగా ఉందో తెలుస్తుంది. కాగా ప్రాజెక్టు హెడ్ వర్క్స్ జగన్ హయాంలో 69.79 శాతంగా పేర్కొన్నారు. ఇందులో టీడీపీ హయాంలోని 64.08 శాతం తీసివేస్తే జగన్ పాలనలో కేవలం 5.71 శాతం మాత్రమే పనులు జరిగాయి. కుడి, ఎడమ కాలువల పురోగతి, వాటి కనెక్టవిటీ కూడా అంతంత మాత్రమే. ఇక భూసేకరణ నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం కూడా ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా ఉంది.



తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు సందర్శించినప్పుడు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందో తెలియడం లేదని, పూర్తి కావడానికి నాలుగేళ్లు పడుతుందని ఇంజనీర్లు చెబుతున్నారని అన్నారు. పూర్తి స్థాయి నిర్మాణానికి ఇంకా లోతుగా పరిశీలిస్తే గాని చెప్పలేమన్నారు. దెబ్బ తిన్న డయాఫ్రం వాల్‌కు సమాంతరంగా మరొకటి నిర్మిస్తే 990 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని ఆయన చెప్పారు. మరి ఈ అదనపు నిధులు ఎవరు భరిస్తారు? ఈ నేరం ఎవరిది? దాదాపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మళ్లీ మొదటి కొచ్చినట్టే. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమికి ఇటీవల రాష్ట్ర ప్రజలు అధికారం కట్టబెట్టారు. ఆ లోపు పోలవరం ప్రాజెక్టు పూర్తి నిర్మాణం సాధ్యం కాదేమోననే నిర్వేదం ముఖ్యమంత్రిలో వ్యక్తమైంది.

అవశేష ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు 2020లో రివైజ్డ్ కాస్ట్ అంచనాల కమిటీ ఆమోదించిన 2017–18 నాటి షెడ్యూల్ రేట్లతో రెండవ డిపిఆర్‌కు కేంద్రం నుంచి ఆమోదం పొందటం అవసరం. ఇది జరిగితే తప్ప నిర్వాసితుల సమస్యకు పరిష్కారం లభించదు.

భారతదేశంలోనే కాదు, విదేశాల్లో నిర్మాణంలో వుండే పలు సాగునీటి ప్రాజెక్టులకు భిన్నంగా పోలవరం నిర్మాణం జరుగుతోంది. నదీగర్భంలో 150 మీటర్ల వరకు ఇసుక ఉన్నందున ప్రధానమైన డ్యాం స్పిల్ వే పక్కకు జరిపి 80 మీటర్ల లోతు నుంచి కాంక్రీట్ వేసి నిర్మిస్తున్నారు. నదీ గర్భంలో 1750 మీటర్ల పొడుగునా కింద భాగంలో 300 మీటర్ల వెడల్పుతో రాక్‌ఫిల్ డ్యాం... అంటే ఒక పెద్ద కొండ నిర్మాణం ప్రతిపాదించారు. దాని కింద కూడా నదీగర్భం నుండి సీపేజి లేకుండా చేసేందుకు డయాఫ్రం వాల్ నిర్మిస్తున్నారు. సాంకేతికంగా చెప్పాలంటే పోలవరం ప్రాజెక్టుకు డయాఫ్రం వాల్, స్పిల్ వే రెండూ గుండెకాయ లాంటివి. ఇప్పుడు కీలకమైన డయాఫ్రం వాల్ సంక్షోభంలో చిక్కుకుంది.

జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్టు పలు ఆటుపోట్లు ఎదుర్కొన్నది. స్పిల్ వేకు రక్షణగా నిర్మించిన గైడ్ బండ్ నిర్మాణ దశలోనే కూలిపోయింది. కీలకమైన డయాఫ్రం వాల్ దెబ్బతింది. ఇవన్నీ అటుంచితే కేవలం బ్యారేజీగా మిగిలిపోయే పెను ప్రమాదం ఎదురైంది. 45.72 మీటర్ల ఎత్తుకు స్పిల్ వే నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చినందున ఎవరూ ఏం చేయలేక పోయారు. కేసీఆర్, జగన్ మధ్య పోలవరం ఎత్తు అంశంపై చర్చలు జరగనిదే తెలంగాణ శాసనసభలో పోలవరం ఎత్తు తగ్గించేందుకు జగన్ అంగీకరించారని కేసీఆర్ అప్పట్లో ప్రకటన చేసేవారు కాదు. అగ్నికి వాయువు తోడైనట్లు కేంద్ర ప్రభుత్వం కూడా అప్పట్లో ఈ కుట్రలో భాగస్వామి అయింది. నీతీ ఆయోగ్ చైర్మన్ స్వయంగా తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చి జగన్‌తో చర్చలు జరిపారు. 45.72 మీటర్ల ఎత్తుకు స్పిల్ వే నిర్మాణం జరిగినందున ప్రాజెక్టు ఎత్తు తగ్గించే ప్రతిపాదన అటకెక్కింది.

ఇప్పుడు పోలవరం ప్రాజెక్టుకు చెందిన నాలుగు అంశాలు కీలకంగా తెర మీదకు వచ్చాయి. 1) ఎగువ కాఫర్ డ్యాం లీకేజీ అరికట్టడం 2) దెబ్బతిన్న డయాఫ్రం వాల్ స్థానంలో కొత్తది నిర్మించడం 3) పెను సవాలుగా వున్న భూసేకరణ నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించడం 4) కీలకమైన రెండవ డిపిఆర్‌కు కేంద్రం నుంచి ఆమోదం పొందటం. ఈ లోపు పెరిగిన వ్యయం ఎవరు భరిస్తారో తేలాల్సి ఉంది. ఎగువ కాఫర్ డ్యాం లీకేజీ అరికట్టడం, డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తిగా సాంకేతికపరమైన అంశాలు. ఇందుకు వ్యయం వందల కోట్లలో ఉండొచ్చు. కాని నిర్వాసితులకయ్యే వ్యయం భారీగా ఉంటున్నది. అవశేష ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు 2020లో రివైజ్డ్ కాస్ట్ అంచనాల కమిటీ ఆమోదించిన 2017–18 నాటి షెడ్యూల్ రేట్లతో రెండవ డిపిఆర్‌కు కేంద్రం నుంచి ఆమోదం పొందటంలో చంద్రబాబు చాణక్య ప్రతిభ వెల్లడి కానున్నది. ఇది జరిగితే తప్ప నిర్వాసితుల సమస్యకు పరిష్కారం లభించదు.

2019 ఫిబ్రవరిలో టీడీపీ హయాంలో కేంద్ర జలవనరుల శాఖకు చెందిన సాంకేతిక సలహా మండలి 2017–18 నాటి షెడ్యూల్ రేట్ల మేరకు మొత్తం ప్రాజెక్టు వ్యయం 55,548.87 కోట్లుగా, ఇందులో భూసేకరణ నష్టపరిహారం, పునరావాసం పద్దు కింద 33,168.23 కోట్లుగా అంచనా వేసింది. తిరిగి 2020లో రివైజ్డ్ కాస్ట్ అంచనాల కమిటీ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం 47,725.24 కోట్లుగా, అందులో భూసేకరణ నష్టపరిహారం, పునరావాసం కింద 28,172.21 కోట్లుగా నిర్ధారించింది. ఇప్పటివరకు ఈ విభాగంలో పదివేల కోట్లు కూడా ఖర్చు చేయలేదు. మిగిలిపోయిన భూసేకరణ నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం ఏ మేరకు పూర్తి చేస్తారో దాన్ని బట్టి ప్రాజెక్టు హెడ్ వర్క్స్ పనులు ముందుకు సాగుతాయి. పైగా ఈ పదేళ్లలో చాలా కుటుంబాల్లో మైనారిటీ తీరి, పెళ్లిళ్లు చేసుకొని వేరు కాపురాలు పెట్టినవారు ఎక్కువగా ఉన్నారు. వీరిని ప్రత్యేక కుటుంబాలుగా పరిగణించాలనే డిమాండ్ ఉంది. వీటికి తోడు జగన్మోహన్ రెడ్డి ఒక్కో కుటుంబానికి పది లక్షల నష్ట పరిహారం ఇస్తానని వాగ్దానం చేశారు. కొత్త ప్రభుత్వానికి ఇదో శిరోభారం. ఈ నేపథ్యంలో ఈపాటికే నిర్మాణం జరిగి దెబ్బతిన్న పనులు మరమ్మతులకు గాని లేదా కొత్తవి నిర్మాణం చేపట్టడం గాని చంద్రబాబుకు సవాలుగా ఉండబోతోంది. కొసమెరుపు ఏమంటే ఇప్పటికీ ప్రాజెక్టు అథారిటీ వెబ్‌సైట్‌లో 2013–14 నాటి షెడ్యూల్ రేట్లే కన్పిస్తున్నాయి.

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు

కలసి నడవడమంటే ఇది కాదు కదా!?

అపూర్వ, అసాధారణ ఇత్యాది విశేషణాలతో అభివర్ణించాల్సిన ప్రజా తీర్పు అది. సందేహం లేదు, దేశ పాలకుల దురహంకారాన్ని; శాసన నిర్మాణంలోను, శాసన పాలనలోను ప్రజాప్రతినిధుల అసమర్థత, అలక్ష్య ధోరణులను నిరసిస్తూ, సమస్త రాజకీయ నాయకులు ప్రజాస్వామిక విలువలను గౌరవిస్తూ, ప్రజలకు జవాబుదారీగా ఉండి తీరాలని నిర్దేశిస్తూ కోట్లాది ఓటర్లు ఉద్దేశించిందే 2024 లోక్‌సభ ఎన్నికల తీర్పు. ప్రజా సంకల్పాలు నెరవేరుతాయా? వాటి చరిత్ర నిరాశాజనకంగా ఉండవచ్చు లేదా ఆశావహంగా పరిణమించవచ్చు. దేశ రాజకీయ నాయకుల వ్యవహారశైలిపై ప్రజాతీర్పు ప్రభావం ఓటర్లు ఆశించిన దానికి పూర్తి విరుద్ధంగా ఉన్నట్టు 18వ లోక్‌సభ సమావేశాల ఆరంభంలోనే వెల్లడయింది. మోదీ ప్రభుత్వం 400 సీట్లకు పైగా గెలుచుకోవాలన్న తన లక్ష్యం నెరవేరిందన్న రీతిలో వ్యవహరిస్తోంది. ఇక కాంగ్రెస్ తాము కనీస మెజారిటీని మించి సీట్లను స్వాయత్తం చేసుకున్నట్టుగా ప్రవర్తిస్తోంది. వాస్తవ పరిస్థితుల పట్ల ఈ ప్రధాన పార్టీల ఉపేక్షాభావం పర్యవసానమే పాత వైరాల పునర్దర్శనం. దేశ శ్రేయస్సు దృష్ట్యా విభేదాలు, వివాదాలకు విరామం పాటించితీరాల్సిన తరుణంలో ప్రధాన రాజకీయ పక్షాలు పాత ప్రతికూలతలు, పట్టుదలలకు పోతున్నాయి. లోక్‌సభ స్పీకర్ ఎన్నికపై ఘర్షణే ఇందుకొక నిదర్శనం. అది పూర్తిగా నివారణ సాధ్యమైనదే. అయితే పాలక ప్రతిపక్షాల మధ్య రాజీ వైఖరి, ఏకాభిప్రాయాన్ని సాధించే ప్రయత్నం కొరవడడం వల్లనే స్పీకర్ పదవికి ఎన్నిక అనివార్యమయింది. పరస్పర సహనశీలత, సదవగాహన ఏమైనట్టు?

ఇదే కాదు, కలత పెడుతున్న ఇతర పరిణామాలూ ఎన్నో ఉన్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను దర్యాప్తు సంస్థలు ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన ఒక కేసులో కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణకు రానుండగా సీబీఐ ఆయన్ని అరెస్ట్ చేసింది. రచయిత్రి అరుంధతీరాయ్‌పై పద్నాలుగేళ్ల కేసు నొకదాన్ని తిరగదోడి ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద ఆమెను ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతినిచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో బుల్డోజర్లు ఇంకా గృహాలను కూల్చివేస్తూనే ఉన్నాయి. గోరక్షణ నిఘాకారులు మళ్లీ చెలరేగిపోతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెలారంభంలో ముగ్గురు పశు విక్రేతలను కిరాతకంగా హతమార్చారు.

ఓటర్ల తీర్పును ఘనతవహించిన మన దేశ పాలకులు నిర్లక్ష్యం చేయడం మనకు ఏమీ ఆశ్చర్యం కలిగించదు. రాజకీయ దుర్బలత్వాన్ని ఏ మాత్రం, కనీసం బహిరంగంగా వెల్లడించకుండా ఉండడమనేది నరేంద్ర మోదీ చాణక్య వ్యూహాలలో ఒక ప్రధాన అంతర్భాగం. గాంధీనగర్‌లోను, న్యూ ఢిల్లీలోను 23 సంవత్సరాల పాటు నిరంతరాయంగా అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ తన పాలనా బలహీనతలను, నిర్ణయాలలో పొరపాట్లను ఒక్కసారి కూడా అంగీకరించలేదు. లోక్‌సభలో తమ పార్టీ సంఖ్యా బలాన్ని గణనీయంగా తగ్గించివేసిన జూన్ 4 తీర్పు ఒక పరాజయమే అయినప్పటికీ ఆ వైఫల్య ప్రభావాన్ని మోదీ పూర్తిగా కప్పిపుచ్చుతున్నారు. పాలనా రంగంలోను, రాజకీయ పరిస్థితులలోను నిజంగా ఏమీ మారలేదన్న భావాన్ని భారత ప్రజలకు, విశాల ప్రపంచానికి స్ఫురింపచేస్తున్నారు! పాత కేబినెట్ మంత్రులే కొత్త కేబినెట్ మంత్రులుగా కొనసాగుతున్నారు. తగ్గిన మెజారిటీతో మూడోసారి అధికారంలోకి వచ్చి, సంకీర్ణ ప్రభుత్వానికి



ప్రధాని మోదీ ఇంకెంత మాత్రం దేశ రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేయలేరన్న వాస్తవాన్ని 2024 లోక్‌సభ ఎన్నికలు రుజువు చేశాయి. కొత్త శక్తిని సంతరించుకున్న ప్రతిపక్షం తన గొంతుకను ప్రభావదాయకంగా విన్పించగలదని, ప్రభుత్వానికి ఎజెండాను నిర్దేశించగలదని స్పష్టమయింది. దశాబ్దం పాటు తిరుగులేని అధికారాలను చెలాయించిన ప్రభుత్వాధినేత ఇప్పుడు ఏర్పడ్డ సరికొత్త పరిస్థితులు చాటుతున్న వాస్తవాలను నిర్లక్ష్యం చేయడం తగదు.

సారథ్యం వహిస్తున్నప్పటికీ ఎంతమాత్రం తగ్గేదే లేదని మోదీ తన హావభావాలు, ప్రవర్తనా రీతులతో స్పష్టంగా చాటుతున్నారు.

నీట్-యుజి, యుజిసి-నెట్ పరీక్షల వివాదాన్నే తీసుకోండి. బాధితులైన విద్యార్థులు వేల సంఖ్యలో వీధుల్లోకి వచ్చి హాహాకారాలు చేశారు. మరి మోదీ ఒక్క సానుభూతి మాట అయినా పలికారా? ఒక మౌనిలా ఉండిపోయారు! జరిగిన అవకతవకలకు ప్రభుత్వం తరపున విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ముందుకు తోశారు. ప్రధాన్ విద్యాశాఖను నిర్వహించడం ఇదే మొదటి సారి కాదు. మునుపటి మోదీ సర్కార్ లోనూ ఆయన విద్యామంత్రిగా ఉన్నారు. మరి నీట్ అక్రమాలు వెల్లడయిన ప్రస్తుత సందర్భంలో తనకు విద్యాశాఖ బాధ్యతలు కొత్తవి అని ఆయన ఎలా అనగలరు? పాపం, ప్రధాన్! గత ఏడు సంవత్సరాలలో జాతీయ, రాష్ట్ర స్థాయి వృత్తి విద్యా కోర్సుల ప్రవేశ పరీక్షలలో 70కి పైగా ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయి. ఆ అక్రమాలను అరికట్టేందుకు మోదీ ప్రభుత్వం చేసిందేమిటి? చిత్తశుద్ధితో చర్యలు చేపట్టలేదు కనుకనే ఈ ఏడాది ఆ అవినీతి మరింత తీవ్రంగా చోటు చేసుకున్నది. ప్రధాన్ మహాశయుడు నీట్ క్వశ్చన్ పేపర్ల లీక్‌ను తొలుత తిరస్కరించారు. అటువంటిదేమీ జరగలేదని ఖండితంగా చెప్పారు. ఆ తరువాత నిరసన తెలుపుతున్న విద్యార్థులను సైతం ఆయన తప్పు పట్టారు. ఈ లీకేజీ అనేది ఏదో చిన్నపాటి వైపరీత్యం మాత్రమేనని సర్దిచెప్పడానికి ప్రయత్నించారు. పాపం ప్రధాన్! ఒడిషాకు తొలి బీజేపీ ముఖ్యమంత్రి కావాలని ఆయన ప్రగాఢంగా కోరుకున్నారు. అయితే నీట్ ప్రవేశ పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజీ పాపాలను మోయవలసిన దుస్థితిలో పడ్డారు.

నీట్ విషయంలోనే మళ్లీ ప్రధానమంత్రి వద్దకు వద్దాం. ఆయన ఏటా ఒకసారి 'పరీక్షా పె చర్చ' నిర్వహిస్తుంటారు. పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమవాలన్న విషయమై అసేతు హిమాచలంలోని విద్యార్థులను ఉద్దేశించి ఆ కార్యక్రమంలో ప్రసంగిస్తుంటారు. ఈ వార్షిక కార్యక్రమం తనకు గర్వకారణమని ఆయన తరచు చెప్పుతుంటారు. ఒక సద్గురు మాదిరిగా ఆయన వ్యవహరిస్తారు. మరి అదే విద్యార్థులు తమ భవిష్యత్తు ఏమిటో తెలియక ఇప్పుడు కొట్టుమిట్టాడుతుంటే వారికి సహానుభూతిగా మోదీ ఒక మాట అయినా మాట్లాడారా?

మోదీ సర్కార్ వాస్తవాలను చూడడానికి నిరాకరిస్తున్న మరో దృష్టాంతం మణిపూర్ విషాదం. 13 నెలలుగా మణిపూర్‌లో జాతుల మధ్య హింసాకాండ చెలరేగుతోంది. తన రాజకీయ పలుకుబడితో ఆ ఈశాన్య రాష్ట్రంలో శాంతి సామరస్యాల పునరుద్ధరణకు ప్రధానమంత్రి పూనుకున్నారా? మణిపూర్ ప్రజలను ఆదుకోవడానికి అసలు ఆయన ప్రయత్నించనే లేదు. ఒక్కసారి అంటే ఒక్కసారి కూడా ఆ రాష్ట్రాన్ని సందర్శించనే లేదు. సుదీర్ఘ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి ఎన్నో ఇంటర్వ్యూలు ఇచ్చారు. అయితే ఏ ఒక్క ఇంటర్వ్యూలోను మణిపూర్ సంక్షోభాన్ని ప్రస్తావించనే లేదు. విధేయ పాత్రికేయులు ఆయన్ని మణిపూర్ విషయమై ప్రశ్నిస్తే కదా. ఆ ఈశాన్య రాష్ట్రంలో హింసాకాండను నిలిపివేసే బాధ్యతను హోం మంత్రికి వదిలివేశారు. సరే, అమిత్ షా ఉన్నతస్థాయి అధికారులతో సమావేశమై మణిపూర్‌లో పరిస్థితులను సమీక్షించారు. ఇది బాగానే ఉంది కానీ రాజకీయంగా మణిపురీలకు సన్నిహితమవ్వాల్సిన అవసరాన్ని ఎందుకు విస్మరిస్తున్నారు? ఇలా అయితే మణిపూర్‌కు ఎడతెగని సంక్షోభం నుంచి ఉపశమనం లభించేదెప్పుడు?

మోదీ ప్రభుత్వం సగర్వంగా చెప్పుకునే ఒక రంగం– రైల్వే మౌలిక సదుపాయాలు – గురించి చూద్దాం. ఇటీవల కాంచన జంగ ఎక్స్‌ప్రెస్, ఒక గూడ్స్ రైలు ఎదురెదురుగ ఢీకొన్న ఘటననే తీసుకోండి. రైల్వే భద్రతా వ్యవస్థలోని లోటుపాట్లను అది పూర్తిగా బహిర్గతం చేసింది. ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుతున్న 'కవచ్' రక్షణ వ్యవస్థ ఈ సువిశాల దేశంలోని చాలా కొద్ది ప్రాంతాలలోని రైల్వే వ్యవస్థలకు మాత్రమే అందుబాటులో ఉన్నది. విద్యామంత్రి వలే రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా పాలనలో నిరంతరాయతకు ప్రతీకగా ఉన్నారు. రైల్వే శాఖతో పాటు సమాచార ప్రసార మంత్రిత్వశాఖ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల బాధ్యతలు కూడా వైష్ణవే నిర్వహిస్తున్నారు. ప్రస్తావిత ప్రమాదం జరిగిన రోజున ఈ మంత్రిత్వ శాఖలకు అదనంగా ఆయనకు మరో బాధ్యతను కూడా అప్పగించారు. అది మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ బాధ్యతల నిర్వహణ. రైల్వే శాఖకు ఒక పూర్తిస్థాయి మంత్రి అవసరం లేదా?



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

నిజమేమిటంటే పాలనలో తీవ్ర లోటుపాట్లు ప్రభుత్వాన్ని ప్రజల్లో చులకన చేస్తున్నాయి. పాలన పూర్తిగా కొద్ది మంది నేతల నియంత్రణలో నడుస్తున్న ఫలితంగా ప్రభుత్వం, పార్టీ మధ్య విభజన రేఖలు చెరిగిపోయాయి. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ పారదర్శకంగా లేకపోవడంతో జవాబుదారీ తనానికి ఆస్కారం లేకుండా పోయింది. లోక్‌సభలో సంఖ్యాబలం భారీగా ఉండడంతో మోదీ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోసాగింది. విపక్షాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అంతేకాదు వాటిని ఏవగించుకుంది. ప్రభుత్వాన్ని విమర్శించిన వారినందరినీ 'జాతి –వ్యతిరేకులు'గా పరిగణించింది. అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇంకెంత మాత్రం దేశ రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేయలేరన్న వాస్తవాన్ని 2024 లోక్‌సభ ఎన్నికలు రుజువు చేశాయి. కొత్త శక్తిని సంతరించుకున్న ప్రతిపక్షం తన గొంతుకను ప్రభావదాయకంగా విన్పించగలదని, ప్రభుత్వానికి ఎజెండాను కూడా నిర్దేశించగలదని కూడా ఆ ఎన్నికలు స్పష్టం చేశాయి. నిరంకుశ పాలకుడుగా పేరు పొందిన ప్రభుత్వాధినేత తన పాలనకు వాటిల్లే కళంకాలను అంత త్వరగా తొలగించుకోలేడు. అధికార భ్రమల నుంచి బయటపడి వాస్తవ పరిస్థితులను ఎదుర్కోవలసి రావడం అనివార్యమవుతుంది. దశాబ్దం పాటు తిరుగులేని అధికారాలను చెలాయించిన ప్రభుత్వాధినేత ఇప్పుడు ఏర్పడ్డ సరికొత్త వాస్తవ పరిస్థితులు చాటుతున్న వాస్తవాలను నిర్లక్ష్యం చేయడమనేది వివేకవంతమైన నిర్ణయం, విజ్ఞతాపూర్వక ప్రవర్తన కావు, కాబోవు.

తాజా కలం: ఈ వారాంతంలో ప్రధానమంత్రి తన నెలవారీ రేడియో ప్రసంగ కార్యక్రమం 'మన్ కి బాత్'ను పునః ప్రారంభించనున్నారు. ప్రజలకు సందేశాలను ఇవ్వడంలోనూ తన శైలిలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేసేందుకే, బహుశా, ఆయన తన 'మనసులోని మాట'ను మళ్లీ విన్పించనున్నారు. మరి ఈ కాలమ్‌లో నేను లేవనెత్తిన ప్రశ్నలు ఎంత ఇబ్బందికరమైనవి అయినప్పటికీ, నరేంద్ర మోదీ తన రేడియో ప్రసంగంలో వాటికి సమాధానాలు ఇవ్వగలరని ఆశిస్తున్నాను.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)


ఆధునికం.. ఆలయం.. రాజకీయం!

భారత్ అంటే ఆత్మజ్ఞాన అవలోకన.. ఇహలోక విముఖత.. మోక్షమార్గ అన్వేషణ.. ధర్మాధర్మ వివేచన.. ఈ భావనలు ఒకప్పుడు బాగా వినిపించేవి. ధనార్జనకు, శారీరక కోరికలకు భారత సంస్కృతిలో సముచిత స్థానం లేదని, వీటిని అదుపులో ఉంచటమే మన గొప్పతనమని ప్రచారం జరిగేది. ప్రజలందరూ ఇవే భావాలతో ఉండేవారా? లేక కొద్దిమందికే అవి పరిమితమా? అని ప్రశ్నించుకుంటే జవాబులు స్పష్టంగానే కనపడతాయి. మన సమాజమంతా ఎప్పుడూ ఆధ్యాత్మిక చింతనలో మునిగిపోలేదు. సంపదలకు, సుఖాలకు, అధికార దాహాలకు దూరంగా లేదు. గతంలో జరిగిన యుద్ధాలే అందుకు నిదర్శనం. అద్వైత చింతనతో పాటూ కౌటిల్య నీతి పుష్కలంగా ఉండేది. కొద్దిమంది పాటించే విలువలను, నమ్మకాలను అందరివిగా పరిగణించటంతో మనలో విచిత్ర భావనలు ఏర్పడ్డాయి. వాటికి కారణాలను శోధిస్తే చాలా సంగతులు తెలుస్తాయి. బ్రిటిషు పాలనను సవాల్ చేయటానికి స్ఫూర్తినిచ్చే భావజాలం ఆనాడు కావాల్సి వచ్చింది. ఆత్మన్యూనతతో బలమైన శక్తులను ఎదుర్కోలేం. జాతీయోద్యమ కాలంలో గతానికి సంబంధించి ఘనమైన ఉదాత్త చిత్రాన్ని అందుకోసమే సృష్టించుకున్నాం. ఆధ్యాత్మిక ఔన్నత్యానికి భారత్ ప్రతీక అన్న భావన అలా ఏర్పడిందే! మన గతమంతా గొప్పదనే ఆలోచనకు మూలమూ అదే. ఆత్మజ్ఞానంలో మనమే మేటి అన్న అతిశయోక్తులు ఆ దారిలోనే వచ్చాయి. పాశ్చాత్య దేశాలకు భౌతిక సంపద దండిగా ఉండొచ్చు! బాహ్యలోక విజ్ఞానం మెండుగానూ ఉండొచ్చు! కానీ ఆత్మసంతృప్తిని అందించే తత్వం కోసం భారత్ వైపే చూడాలన్న వాదన ఆ ధోరణిలో భాగమే!

రాజకీయ అవసరాల కోసం ప్రచారమైన ఈ భావాలను వాస్తవాలుగా అంగీకరిస్తే నిజస్వభావాలు మరుగున పడిపోతాయి. కాలక్రమంలో వాటిని వెలికితీయటం కష్టంగా మారుతుంది. వెలికి తీసినా నమ్మటం తేలిక కాదు. ఇప్పటికీ ఈ సమస్య తీవ్రంగానే ఉంది. అయినాసరే వాస్తవాల లోతుల్లోకి వెళ్లే చరిత్రకారులు ఎప్పుడూ ఉంటారు. దక్షిణ భారతం అంటేనే ఆలయాలకు నిలయం. వాటి చుట్టూ తిరిగిన రాజకీయాలనూ, ఆధిపత్యాల పట్టువిడుపులనూ పరిశీలించిన వారిలో చరిత్రకారుడు క్రిస్టఫర్ బేకర్ ఒకరు. దక్షిణ భారత రాజకీయాలపై బేకర్ లోతైన విశ్లేషణలు చేశారు. అందులో భాగంగా ఆలయాలు రాజకీయాల పరస్పర ప్రభావాల గురించి ఎన్నో విశేషాలను వెల్లడించారు.

ఆలయాలు ఆధ్యాత్మిక, శిల్ప కళా కేంద్రాలే కాదు.. సామాజికార్థిక జీవనంలోనూ వాటిది కీలక పాత్రే. కిందటి శతాబ్దం ఆరంభం నాటికి మద్రాసు రాష్ట్రంలోనే 75,000 ఆలయాలు ఉండేవి. వీటిల్లో కొన్ని చాలా పెద్దవి. మదురై, రామనాథపురం, తిరుచిరాపల్లి, తంజావూరు, తిరునెల్వేలి జిల్లాలు ఆలయాలకు చాలా ప్రసిద్ధి. మదుర మీనాక్షి, బృహదీశ్వరాలయం, రామేశ్వరం, రంగనాథ స్వామి ఆలయాలు ఇక్కడే ఉన్నాయి. మన తిరుపతి గురించి ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. భక్తుల సందర్శనలో, ఆదాయంలో దానితో పోల్చదగిన ఆలయం మరొకటి లేదు. రాజులు, సామంతులు, సేనానాయకులు, వ్యాపారులతో పాటు సాధారణ భక్తులు కూడా భూములు, నగలు, నగదును దానాలుగా ఇవ్వటంతో పెద్ద దేవాలయాలు ఆర్థికంగా పరిపుష్టంగా ఉండేవి. వివిధ రూపాల్లో పోగుపడిన సంపదతో ఆర్థికంగా దేవాలయాల పాత్ర పెరిగిపోయింది. వందేళ్ల క్రితం ఏదైనా గుడికి ఏటా లక్ష రూపాయల ఆదాయం వస్తే చాలా ఎక్కువ. ఒక్క తిరునెల్వేలి జిల్లాలోని అయిదు శైవ మఠాల్లో ఒక్కోదానికి దాదాపు ఆనాడు లక్ష ఆదాయం ఉండేది. తిరుపతి ఆదాయం 19వ శతాబ్దం చివరిలోనే ఏటా 5 లక్షలు ఉండేది. 1950ల నాటికి రోజుకు లక్ష దాటేసింది. ఇక దానంగా వచ్చిన భూములు వేలవేల ఎకరాల్లో ఉండేవి.

చరిత్రను నిశితంగా చూస్తే తెలిసేది ఒకటే! ఆలయాలు రాజకీయాలకు ఎప్పుడూ దూరంగా లేవు. రాజులు తమ పాలనను సమర్థించుకోటానికి, పాలితులను విధేయులుగా మార్చుకోటానికి, తాము దైవాంశ సంభూతులం అన్న భావనను పెంచుకోటానికి ఆలయాలను ఉపయోగించుకున్నారు. వలసపాలన నాటి రాజకీయాలు ఆలయాలపై ఆధిపత్య పోరును పెంచాయే తప్ప తగ్గించలేదు. స్వతంత్ర పాలనలో బహిరంగపోరు తగ్గినా ఆశ్రితులకు, ఆనర్హులకు ఆలయ పదవులను కట్టబెట్టటం అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంది.



తమిళనాడులో తంజావూరు చాలా ధనిక జిల్లా. 1950ల్లో కూడా అక్కడ మూడోవంతు భూములు గుడులతో ముడివడి ఉండేవి. భూసంపద, నగదు నిల్వలు భారీగా ఉన్న దేవాలయాలు ఉద్యోగ, ఉపాధులనూ ఎక్కువే కల్పించేవి. పూజారులు, సహాయకులు, వాయిద్యకారులు, నాట్యకత్తెలు, ఆదాయ గణకులు, వృత్తి పనివారు, భూముల పర్యవేక్షకులు, పంటల పరిశీలకులు, శిల్పులు, మరమ్మతుదారులు, కాంట్రాక్టర్లు, సామగ్రి సరఫరాదారులు.. ఇలా ఎంతోమంది ఆలయాలపై ఆధారపడేవారు. పెద్ద విపణులు, దుకాణాల సముదాయాలు కూడా ఆలయాల నియంత్రణలో ఉండేవి. వడ్డీలకు ఆలయాలు అప్పులు ఇచ్చేవి.

ఒక కులం సామాజిక స్థాయిని నిర్దేశించటంలో కూడా ఆలయాల పాత్ర ఉండేది. ఆలయాల్లో ఏ కులం వారిని ఎంత మేరకు అనుమతించాలి.. ఎవరికి ఏ పూజలో పాల్గొనే అవకాశమివ్వాలి.. అన్నవి చాలా కీలకంగా ఉండేవి. వీటిని బట్టి కూడా కులాల హోదాలు నిర్ణయమయ్యేవి. ఏదైనా వ్యాపారంలో బాగా లాభాలు గడించిన వారు ఆలయాల గుర్తింపు పొందటానికి తహతహలాడేవారు. నట్టుకొట్టై చెట్టియార్లకు ఒకప్పుడు సామాజికంగా ప్రముఖస్థానం ఉండేది కాదు. ఆలయాలకు విరాళాలు ఇచ్చి మంచి గుర్తింపును సంపాదించుకున్నారు. సారాయి వ్యాపారంలో బలపడిన నాడార్లు అలాంటి స్థానాన్నే పొందారు.

ఆలయాలతో పాటు మఠాలు కూడా ప్రముఖపాత్రను పోషించేవి. కొత్త పార్లమెంటు భవనంలో ఉంచిన రాజదండంపై (సెంగోల్) పెద్ద వివాదం చెలరేగిన సంగతి గుర్తుండే ఉంటుంది. దాన్ని నెహ్రూకు అందించింది తిరువాదుతురై మఠం. ఈ మఠానికి తిరునెల్వేలి, మదురై, తంజావూరు జిల్లాల్లో 38,000 ఎకరాల భూములుండేవి. మరో 130 మఠాలపై కూడా తిరువాదుతురైకు నియంత్రణ ఉండేది. నాంగునేరి వైష్ణవ మఠానికి కూడా పెద్దఎత్తున ఆస్తులు ఉండేవి. 200 వైష్ణవ మఠాలు దాని ఆధీనంలో ఉండేవి. ఇలా పెద్ద ఆలయాలు, మఠాల సంపదలు, ఆస్తులు, నియంత్రణల గురించి ఎంతైనా చెప్పుకోవచ్చు. సంపదలు, ఆస్తులు ఉన్నచోట ఆధిపత్య పోరు ఉంటుంది. ఆలయాలు అందుకు అతీతం కాలేదు. గుడులపై ఆధిపత్యం రాజకీయ జీవితానికి సోపానంగా భావించటం 19వ శతాబ్దంలో మొదలైంది. బ్రిటిషు పాలకులు ఏర్పాటుచేసిన స్థానిక సంస్థల పదవుల కోసం పోటీచేయటానికి ఆలయ కమిటీల్లో సభ్యులుగా, ట్రస్టీలుగా ఉండటాన్ని మొదటిమెట్టుగా భావించేవారు.



■ రాహుల్ కుమార్

1923లో రెండు వర్గాలు మదుర మీనాక్షి ఆలయ ఆధిపత్యం కోసం పెద్దపోరాటాలే చేశాయి. గెలిచిన వర్గం నేతృత్వంలో కుంభాభిషేకం జరిపితే దాన్ని అడ్డుకోటానికి వైరివర్గం ప్రయత్నించింది. ఆలయ మేనేజరు పోస్టుపై వివాదం మొదలై సమ్మెచేసే వరకూ పరిస్థితి వెళ్లింది. ధర్నాలు, ఆందోళనలతో ఆలయం అట్టుడికిపోయింది. వివాదం కోర్టులకు ఎక్కింది. తిరువాదుతురై మఠాధిపతి 1920లో చనిపోతే వారసత్వ వివాదం మొదలై 15 ఏళ్లపాటు కేసులు కొనసాగాయి.

ఆలయాలపై నియంత్రణ ఒక్కోచోట ఒక్కోరీతిలో ఉండేది. కొన్నిచోట్ల ఆలయాన్ని స్థాపించిన జమిందారీ కుటుంబాలే వాటిపై అధికారాన్ని చలాయించాయి. ఉత్తర సర్కారు (కోస్తాంధ్ర) జిల్లాల్లో ఈ పరిస్థితి ఉండేది. కులాల అజమాయిషీలో కూడా కొన్ని ఆలయాలు ఉండేవి. కోమటి వర్గం చేతుల్లోని కన్యకాపరమేశ్వరి ఆలయాలను దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కొన్ని చోట్ల మఠాల నియంత్రణ ఉండేది. మరికొన్ని చోట్ల ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసే వ్యక్తులు సర్వం తమ చేతుల్లోకి తీసుకుని చక్రం తిప్పేవారు. స్థానికుల నుంచి ఎంపికైన కమిటీల చేతుల్లో కొన్నిచోట్ల ఆలయాల నిర్వహణ ఉండేది. బ్రిటిషు పాలనకు ముందు స్థానిక రాజులు ఆలయాల కార్యకలాపాలను నియంత్రించేవారు. ఆలయ నిధులపై పన్ను కూడా విధించేవారు. కొన్నిచోట్ల ఆలయ అధికారులకే శిస్తువసూలు బాధ్యతను అప్పగించేవారు. ఆలయాలపై పట్టు నిలుపుకోవటం తమ పాలనకు కీలకంగా భావించేవారు. బ్రిటిషు పాలకులు కొంతకాలం ఆ పాత్రను నిర్వహించి 1857 తర్వాత దాన్ని పూర్తిగా వదిలేశారు. కొన్నిచోట్ల మఠాధిపతులు, జమిందార్లనే నిర్వహణను చూసుకోమన్నారు. మరికొన్ని చోట్ల కొన్ని కుటుంబాలకు వాటిని కట్టబెట్టారు. అట్లా వీలుకాని చోట్ల కమిటీలను ఏర్పరచారు. 1920ల నాటికి ఆలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఆలయాల వ్యవహారాలపై ప్రభుత్వం జరిపిన పరిశీలనల్లో ఎన్నో అవకతవకలు బయటపడ్డాయి. 1863–1910 మధ్య తిరుమల వ్యవహారాలను అయిదుగురు మహంతులు నియంత్రించారు. వారు లక్షల్లో నిధులను దుర్వినియోగం చేశారు. రామనాథపురం జమిందారు రామేశ్వరం ఆలయానికి చెందిన ఆరు లక్షలను తన బ్యాంకు ఖాతాకు మళ్లించుకున్నారు. కావాల్సిన వారికి ఆలయ భూములను కట్టబెట్టటం విపరీతంగా నడిచేది. ఆధిపత్యం కోసం కొన్ని చోట్ల హత్యలూ జరిగాయి. 1905లో తిరుమల మహంతును అక్కడి పూజారే హత్యచేశాడు.

మున్సిపల్ కౌన్సిళ్లు, పట్టణపాలన బోర్డుల్లో పట్టుకోసం ఆలయాలపై అజమాయిషీకి ప్రయత్నించే వ్యక్తులు క్రమేపీ పెరిగిపోయారు. వైరివర్గాల మధ్య పోరు అధికమైంది. ఈ నేపథ్యంలో 1878–1915 మధ్య ఆలయాలను ప్రభుత్వ నియంత్రణలోకి తీసురావటానికి చట్టసభలో 12 బిల్లులను ప్రవేశపెట్టారు. వీటిని పెట్టిన వాళ్లందరూ స్వదేశీ ప్రతినిధులే. అందరూ హిందువులే! అవేమీ ఆమోదం పొందలేదు. 1920ల్లో అధికారంలోకి వచ్చిన జస్టిస్ పార్టీ ఆలయాల నియంత్రణకు చట్టం తీసుకువచ్చింది. అంతకుముందు 1908లో సివిల్ ప్రొసిజర్ కోడ్‌కు ఒక సవరణ తీసుకొచ్చి ఆలయాల పాలనలో కోర్టులు జోక్యం చేసుకునే వెసులుబాటు కల్పించారు. దీంతో వందల ఆలయాల వ్యవహారాలు కోర్టులకు ఎక్కాయి. జస్టిస్ పార్టీ ప్రభుత్వం తమకు కావాల్సిన వాళ్లతో ఆలయాల కమిటీలను నింపివేసింది. కొత్త చట్టం కింద ఆస్తుల వివరాలను తెలపమని 13,669 దేవాలయాలను అడిగితే 229కి సంబంధించి మాత్రమే సమాచారం వచ్చింది. కాంగ్రెస్ పార్టీ కూడా 1924 తర్వాత ఆలయాలపై పట్టుసాధించే పనిలో పడింది.

చరిత్రను నిశితంగా చూస్తే తెలిసేది ఒకటే! ఆలయాలు రాజకీయాలకు ఎప్పుడూ దూరంగా లేవు. రాజులు తమ పాలనను సమర్థించుకోటానికి, పాలితులను విధేయులుగా మార్చుకోటానికి, తాము దైవాంశ సంభూతులం అన్న భావనను పెంచుకోటానికి ఆలయాలను ఉపయోగించుకున్నారు. వలసపాలన నాటి రాజకీయాలు ఆలయాలపై ఆధిపత్య పోరును పెంచాయే తప్ప తగ్గించలేదు. స్వతంత్ర పాలనలో బహిరంగ పోరుతగ్గినా ఆశ్రితులకు, ఆనర్హులకు ఆలయ పదవులను కట్టబెట్టటం అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంది.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)



ఆంధ్రజ్యోతి

అంచెలంచెలుగా ఎదిగి..

రాష్ట్ర విభజన తర్వాత అప్పటి టీడీపీ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న ముప్పవరపు వెంకయ్యనాయుడు విజయవాడకు పాస్‌పోర్టు సేవా కేంద్రం రావటానికి విశేష కృషి చేశారు. ఈ కేంద్రం పరిధిలోకి విజయవాడ, తిరుపతి పాస్‌పోర్టు సేవా కేంద్రాలతో పాటు మరో 13 పోస్టాఫీసు పాస్‌పోర్టు కేంద్రాలు వస్తాయి. విజయవాడలో 2017, ఏప్రిల్‌లో దీనిని ఏర్పాటు చేశారు. 2018వ సంవత్సరంలోనే లక్ష పాస్‌పోర్టుల మార్కును దాటింది. 2020లో 1,22,988 పాస్‌పోర్టులు జారీ చేసింది. ఇలా.. ఏటా లక్షన్నర మంది తక్కువ కాకుండా ఇక్కడ పాస్‌పోర్టులు పొందుతున్నారు. ఈ కార్యాలయ పరిధి ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల వరకు ఉంది. కాగా, ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి భారీ సంఖ్యలో పాస్‌పోర్టులకు దరఖాస్తులు వస్తున్నాయి.

బెజవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం రికార్డు నమోదు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 3,70,123 పాస్‌పోర్టులను జారీచేసి అందరి దృష్టినీ ఆకర్షించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం కంటే 20 శాతం వృద్ధిని నమోదు చేయడంతో విదేశీ మంత్రిత్వ శాఖ ఉత్తమ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం అవార్డుకు ఎంపిక చేసింది.





ఆకాశమంత ఎత్తుకు..

● విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం రికార్డు ● రికార్డు స్థాయిలో పాస్‌పోర్టుల జారీ

- మొత్తం 3,70,123 పాస్‌పోర్టుల జారీ
- కిందటేడాదితో పోలిస్తే 20 శాతం వృద్ధి
- ఈ ఆర్థిక సంవత్సరంలో 5 లక్షలు దాటే అవకాశం
- ఉత్తమ ప్రాంతీయ కార్యాలయ అవార్డుకు ఎంపిక
- వీసా సేవల కోసం ఎంబసీ ఏర్పాటు అవశ్యం
- అందుబాటులోకి కొత్త కార్యాలయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ పరిధిలో ప్రస్తుతం రోజుకు 600 మంది దరఖాస్తుదారుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోంది. ఈ సంఖ్య పెరిగితే.. పాస్‌పోర్టులు జారీచేసే సంఖ్య కూడా పెరుగుతుంది. ఫలితంగా మరిన్ని రికార్డులు నమోదు చేసే వీలుంటుంది. 2024-25 ఆర్థిక సంవత్సరం రెండో అర్థ సంవత్సరంలో విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ పరిధిలో ఈ సంఖ్యను ఇంకా పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. కార్యాలయాన్ని విస్తరించే దిశగా పనులు చేపడుతున్నారు. మరో నెలలో ఈ పనులు పూర్తి కానున్నాయి. ఇది పూర్తయితే రోజుకు 1,200కు పైగా పాస్‌పోర్టు దరఖాస్తులను పరిశీలించవచ్చు. దీంతో రెట్టింపు సంఖ్యలో పాస్‌పోర్టులు జారీచేసే వీలుంటుంది. ఫలితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరాంతానికి ఆరు లక్షల పాస్‌పోర్టులను జారీచేసే స్థాయి వస్తుంది. ఇదే జరిగితే ఆల్‌టైమ్ రికార్డు నమోదవుతుంది.

ఎంబసీ ఏర్పాటు అవసరం

విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ పరిధిలో జారీ అవుతున్న పాస్‌పోర్టుల సంఖ్య సగటున 3 లక్షల మేర ఉంటోంది. రానున్న రోజుల్లో 5 లక్షల నుంచి 6 లక్షలకు పెరిగే అవకాశముంది. దీనిని దృష్టిలో ఉంచుకుని వీసా సేవలను అందించటానికి వీలుగా ప్రత్యేక ఎంబసీని కూడా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఏర్పడుతోంది. విజయవాడ కేంద్రంగా వందల సంఖ్యలో కన్సల్టెన్సీ సంస్థలు ఉన్నాయి. వేలాది మంది కన్సల్టెన్సీల ద్వారా, నేరుగా ఆయా యూనివర్సిటీల ద్వారా సంప్రదింపులు జరిపి విదేశీ విద్య కోసం వెళ్తున్నారు. కానీ, వీరంతా వీసాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి హైదరాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి. హైదరాబాద్‌లో అయితే దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలకు అవకాశం వస్తుందా అంటే అదీ లేదు. చెన్నై, బెంగళూరు, ఢిల్లీలో ఇంటర్వ్యూలకు అవకాశం కల్పిస్తున్నారు. దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు వేర్వేరు రోజుల్లో నిర్వహించటం వల్ల ఆయా ప్రాంతాలకు తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాజధాని అమరావతిలోని విజయవాడలోనే ఎంబసీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వస్తోంది.

కొత్త కార్యాలయంలోకి పరిపాలనా విభాగం

పాస్‌పోర్టు ప్రాంతీయ కార్యాలయ పరిపాలనా విభాగం కొత్త కార్యాలయంలోకి మారింది. ఇంతకు ముందు వరకు పాస్‌పోర్టు సేవా కేంద్రం, పాస్‌పోర్టు ప్రాంతీయ కార్యాలయాలు రెండూ ఒకేచోట మిడ్ సిటీ హోటల్‌లో ఉండేవి. ప్రస్తుతం పాస్‌పోర్టు సేవా కేంద్రం హోటల్‌లోనే ఉంది. పరిపాలనా కార్యాలయం మాత్రం మనోరమ హోటల్ పక్కనున్న కమర్షియల్ కాంప్లెక్సులోకి మారింది. అలాగే, కొత్త కార్యాలయం ఏర్పాటుతో పాస్‌పోర్టుల ముద్రణ కూడా విజయవాడ నుంచే ప్రారంభంకానుంది. ఇప్పటి వరకు పాస్‌పోర్టుల ముద్రణ విశాఖపట్నంలో జరిగేది. ప్రస్తుతం విజయవాడలోనే జరుగుతోంది.

పుష్పాంజలి





ఈనాడు గ్రూపుల అధిపతి రామోజీరావుకు రాష్ట్ర ప్రభుత్వం ఘన నివాళులర్పించింది. కానూరులో గురువారం జరిగిన రామోజీరావు సంస్మరణ సభకు సీఎం చంద్రబాబు సతీసమేతంగా హాజరై రామోజీరావుతో తన అనుబంధాన్ని పంచుకున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రామోజీరావు కుమారుడు కిరణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులు ఈ సభకు విచ్చేసి అక్షర యోధుడికి అంజలి ఘటించారు. అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన రామోజీరావు ఫొటో ఎగ్జిబిషన్‌ను చంద్రబాబు దంపతులు తిలకించారు.

ప్రాణాలుపోతే గానీ పట్టదా!

నాలుగు నెలల క్రితం పనులకు అత్యవసర సమావేశామా?

జగ్గయ్యపేటలో పారిశుధ్యంపై కౌన్సిల్‌లో గరంగరం 6లో..

కేడీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా 'కృష్ణా' జేసీ

6లో..

నడిరోడ్డుపై నరికివేత

బృందావన్ కాలనీలో వ్యాపారి దారుణ హత్య

- కుమార్తె ఎదురుగా నరికిన ప్రియుడు

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నడిరోడ్డుపై నరికి నరికి ఓ వ్యాపారిని దారుణంగా హత్య చేశాడు ఓ యువకుడు. కన్న కుమార్తె ఎదురుగానే కర్కశంగా హతమార్చాడు. బృందావన్ కాలనీలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. భవానీపురంలోని చెరువు సెంటర్‌కు చెందిన కె.శ్రీరామచంద్రప్రసాద్ (56) బృందావన్ కాలనీలో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. నిత్యం భవానీపురం నుంచి రాకపోకలు సాగిస్తున్నాడు. ఆయన కుమార్తె దార్శిని ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. విద్యాధరపురానికి చెందిన గడ్డం శివమణికంఠ విజ్ఞాన్ విహార్ స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మణికంఠకు ఇన్‌స్టాలో దార్శినితో పరిచయం ఏర్పడింది. నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం తెలిసిన శ్రీరామచంద్రప్రసాద్ కుమార్తెను హెచ్చరించాడు. బాగా చదువుకుని జీవితంలో స్థిరపడాలన్నాడు. తన కుమార్తె జోలికి రావద్దని మణికంఠను హెచ్చరించాడు. దీంతో కొద్దిరోజులుగా దార్శిని అతడిని పక్కనపెట్టింది. పెళ్లి చేసుకోవాలని మణికంఠ చేసిన ప్రతిపాదనను తిరస్కరించింది. దీనిపై శ్రీరామచంద్రప్రసాద్ కొంతమందిని తీసుకుని మణికంఠ ఇంట్లో పంచాయితీ పెట్టాడు. ఆ తర్వాత మణికంఠ ఇంట్లో రోజూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మణికంఠ తల్లి గురువారం ఇల్లు విడిచి వెళ్లిపోయింది. దీంతో మణికంఠ పగ పెంచుకున్నాడు. గురువారం శ్రీరామచంద్రప్రసాద్ కుమార్తెను తీసుకుని బృందావన్ కాలనీలోని కిరాణా షాపునకు వచ్చాడు. రాత్రి 9 గంటల సమయంలో షాపు మూసేసి ఇద్దరూ ఇంటికి బయల్దేరారు. పగతో రగిలిపోతున్న మణికంఠ కత్తి తీసుకుని బృందావన్ కాలనీకి వచ్చాడు. షాపునకు 100 మీటర్ల దూరంలో ఉన్న ఓ చెట్టు కింద నిలబడ్డాడు. తండ్రీకూతుళ్లు స్కూటర్‌పై వస్తుండగా, ఎదురుగా వెళ్లి బైకుతో ఢీ కొట్టాడు. కిందపడిపోయిన శ్రీరామచంద్రప్రసాద్‌పై కత్తితో వేటు వేశాడు. రోడ్డుపై పడిన తండ్రిని దార్శిని పక్కకు తీసుకెళ్లి కూర్చోబెట్టగానే మళ్లీ నరికాడు. దార్శిని ఎంత ఆపినా విచక్షణ లేకుండా నరికాడు. ఆ తర్వాత ఆమెను బెదిరించాడు. తనతో తిరిగిన వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని హెచ్చరించాడు. చుట్టుపక్కల వారు రాగానే పరారయ్యాడు. శ్రీరామచంద్రప్రసాద్‌ను వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. కేసును కృష్ణలంక ఇన్‌స్పెక్టర్ ఆకుల మురళీకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

..ఆ వంకర్లకు కారణం మేం కాదు

బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ డ్రెయిన్ల నిర్మాణంపై ఎన్‌హెచ్ నివేదిక

జిల్లా యంత్రాంగం, కార్పొరేషన్ సహకరించలేదని వెల్లడి



బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ వద్ద వంకరగా నిర్మించిన డ్రెయిన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్-1 సర్వీసు రోడ్డు విస్తరణ పనుల లోపాలపై జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఫ్లై ఓవర్ వెంబడి సర్వీసు రోడ్డును అభివృద్ధి చేసే విషయంలో కిందటి ప్రభుత్వ హయాంలో తలపెట్టిన డ్రెయిన్ల పనులకు సంబంధించి స్థానిక జిల్లా యంత్రాంగం, కార్పొరేషన్ అధికారులు సహకరించలేదని తెలిపింది. అవసరమైన స్థలాన్ని సేకరించే విషయంలో జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించిందని, భవన యజమానులకు టీడీఆర్ బాండ్లు జారీచేసే విషయంలో కార్పొరేషన్ స్పందించలేదని పేర్కొంది. పనులను రద్దు చేయటానికి సాహసించలేకపోయామని, అందుబాటులో ఉన్న స్థలం మేరకు డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. డ్రెయిన్లు వంకరగా రావటానికి ఇదే కారణమని స్పష్టం చేసింది. నోవాటెల్ నుంచి సరళరేఖలా డ్రెయిన్లను నిర్మించామని, రెండోవైపు అలా కుదరలేదని పేర్కొంది. కాగా, ఈ నివేదిక రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్నకు చేరింది.

సమస్యలు పరిష్కరించేనా..?

డ్రెయిన్లు వంకరగా కట్టాక తిరిగి వాటిని కూల్చటం, సరిచేయడం ఇబ్బందిగా ఉంటుందని అప్పటి వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో కాంట్రాక్టర్ ఒత్తిడి మేరకు హడావిడిగా ఎన్‌హెచ్ పనులు చేశారు. టెండర్ ఇచ్చాక కూడా పనులు చేసే విషయం కాలాతీతం కావడంతో కాంట్రాక్టర్ అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. తాను పనులు చేయనని కాంట్రాక్టర్ తెగేసి చెప్పటంతో మళ్లీ సర్వీసు రోడ్డు పనులను విస్తరించటం ఇబ్బందిగా మారుతుందని, ఉన్న స్థలంలోనే డ్రెయిన్లు నిర్మించినట్టుగా తెలుస్తోంది. పక్కా డ్రెయిన్లను నిర్మించటం వల్ల కదల్చటానికి వీల్లేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం సర్వీసు రోడ్డును విస్తరిస్తున్న నేపథ్యంలో వంకర్లు తిరిగిన డ్రెయిన్లతో ఇబ్బందే. ఈ నేపథ్యంలోనే ఎన్‌హెచ్ అధికారులు ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. కాగా, ప్రస్తుతం ఈ డ్రెయిన్‌ను రోడ్డుకు సమాంతరంగా, చూడచక్కగా లెవలింగ్ చేయాల్సిన అవసరం ఉంది. ఇదిలా ఉంటే, నోవాటెల్ వైపు కూడా సర్వీసు రోడ్డు విస్తరణ పనులు సవ్యంగా సాగట్లేదు. పనులకు నోవాటెల్ యాజమాన్యం ససేమిరా అంటోంది. దీనిపై కోర్టుకు కూడా వెళ్లింది. ఈ క్రమంలో నోవాటెల్‌ను తప్పించి, అక్కడి నుంచి సర్వీసు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పంచాయతీ రాష్ట్ర ప్రభుత్వం దగ్గరకు చేరటంతో అపరిష్కృత సమస్యల పరిష్కారంతో పాటు బెంజిసర్కిల్-2 ఫ్లై ఓవర్ వైపు కూడా సర్వీసు రోడ్డును విస్తరించే పనులు యుద్ధప్రాతిపదికన మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

డబుల్ భరోసా

- జూలై 1న జిల్లాలో రూ.160.53 కోట్ల పెన్షన్ల పంపిణీ
- పెంచిన రూ.4 వేలతో పాటు అరియర్స్ మరో రూ.3 వేలు
- జిల్లావ్యాప్తంగా 2,35,477 మందికి ప్రయోజనం
- సాధారణంగా ఇచ్చే పెన్షన్ మొత్తం కంటే రెట్టింపు లబ్ధి
- ఇంటి వద్దకే వచ్చి ఇచ్చేందుకు రంగంసిద్ధం
- ప్రతి 50 మంది పెన్షనర్లకు ఒక సచివాలయ ఉద్యోగి



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ భరోసా కింద పెన్షన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెనిఫిట్‌ను అందించనుంది. పెంచిన పెన్షన్ మొత్తాలతో పాటు అరియర్స్ కూడా కలిపి జూలైలో రూ.160.53 కోట్ల మేర ఎన్టీఆర్ జిల్లా పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు. జిల్లావ్యాప్తంగా 2,35,477 మంది పెన్షన్లను అందుకోనున్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా పెన్షనర్లు రూ.73 కోట్లు అందుకుంటుండగా, టీడీపీ ప్రభుత్వం పెంచిన పెన్షన్, అరియర్స్‌తో కలిపి జూలైలో రెట్టింపు సంఖ్యలో ఇవ్వనున్నారు. మొత్తం 11 సబ్ కేటగిరీలకు సంబంధించి రూ.4 వేలతో పాటు ఏప్రిల్, మే, జూన్ అరియర్స్ రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు అందిస్తారు. రూ.3 వేల పెన్షన్ అందుకునే మరో కేటగిరీ వారు ఇకపై రూ.6 వేలు తీసుకుంటారు. అలాగే, రూ.5 వేల పెన్షన్ అందుకునే వారు రూ.10 వేలు, రూ.5 వేల పెన్షన్ తీసుకునే మరో కేటగిరీవారు రూ.15 వేలు పొందుతారు. అర్హతల ప్రాతిపదికన వీటిని మంజూరు చేస్తారు. పింఛన్లను ఇంటింటికీ వెళ్లి పంచేందుకు వీలుగా ఈనెల 29న ప్రభుత్వం బ్యాంకుల్లో నగదు జమ చేయనుంది. జూలై 1 ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పెన్షన్లను పంపిణీ చేస్తారు. హెచ్ఐవీ రోగులకు మాత్రం నేరుగా బ్యాంకుల్లో వేస్తారు. ఇందుకోసం ప్రతి 50 మంది పెన్షనర్లకు ఒక సచివాలయ ఉద్యోగిని నియమించనున్నారు. పెన్షన్ల పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం రాత్రి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన జిల్లాలో తీసుకుంటున్న చర్యలను సీఎస్‌కు వివరించారు. ఆ తర్వాత డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావుతో కలెక్టర్ సృజన మాట్లాడారు. పింఛన్ల పంపిణీని విజయవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



సృజన్ శిఖర్ పురస్కారం అందుకుంటున్న డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావు

డాక్టర్ కేఎస్ రావుకు సృజన్ శిఖర్ పురస్కారం

విజయవాడ కల్చరల్, జూన్ 27 : కేంద్ర సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు సృజన్ శిఖర్ పురస్కారం లభించింది. వారణాసికి చెందిన ప్రముఖ సాహిత్య సంస్థ నాందీ సేవా న్యాస్ సమితి ప్రతియేటా ప్రముఖ సాహితీవేత్తలను ఈ పురస్కారంతో సన్మానిస్తుంది. భారతీయ భాషా సాహిత్యాల అభివృద్ధికి చేస్తున్న కృషికి, జాతీయస్థాయిలో నిరంతర సాహితీ సేవకూ గుర్తింపుగా డాక్టర్ కె.శ్రీనివాసరావుకు సృజన్ శిఖర్ పురస్కారం ప్రదానం చేస్తున్నట్టు నాందీ సేవా న్యాస్ సమితి సన్మాన పత్రంలో పేర్కొంది. వారణాసిలో బుధవారం జరిగిన సుప్రసిద్ధ హిందీ సాహితీవేత్త రాజేంద్రప్రసాద్ పాండే స్మారక సాహిత్య కార్యక్రమంలో డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు సృజన్ శిఖర్ సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. లక్ష రూపాయల నగదు బహుమతి అందచేశారు. ప్రముఖ సాహితీవేత్తలు ప్రొఫెసర్ రాధావల్లభ్ త్రిపాఠి, ప్రొఫెసర్ ప్రభాకర్ సింహ్ పాండే, డాక్టర్ శశికళా పాండే ప్రభృతులు పాల్గొన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావు అవనిగడ్డ ప్రాంతానికి చెందినవారు.



కుటుంబసభ్యులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

ఆదర్శ నియోజకవర్గం చేస్తా.. : వర్ల

పామర్రు, ఫిబ్రవరి 13 : పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా జన్మదిన వేడుకలను గురువారం స్థానిక పాలశీతల కేంద్ర ఫంక్షన్‌హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను అభిమానులు పార్టీశ్రేణులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ, అందరి సహాయ సహకారాలతో గ్రామాల్లో సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి పామర్రు నియోజకవర్గాన్ని జిల్లాలో ఆదర్శవంతగా తీర్చిదిద్దుతానన్నారు. తొలుత ఎమెల్యే మచిలీపట్నం-విజయవాడ రహదారి నుంచి ర్యాలీగా బయలుదేరి వేడుక ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి కేకు కట్‌చేసి పార్టీశ్రేణులు, అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన కూటమి నేతలు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ రోడ్డులో స్కూటర్ దగ్ధం

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : యూటర్న్ తీసుకునే క్రమంలో స్కిడ్ అయిన స్కూటర్ నుంచి ఒక్కసారిగా మంటలు రేగాయి. ఈ ఘటన విజయవాడ ఎంజీ రోడ్డులో జరిగింది. స్కూటీపై ఓ వ్యక్తి ఎంజీ రోడ్డులోని డీవీ మ్యానర్ ఎదురుగా ఉన్న యూటర్న్ నుంచి పీసీఆర్ వైపు వెళ్లాలనుకున్నారు. ఇక్కడ ఉన్న కటింగ్ వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో స్కూటర్ స్కిడ్ అయింది. ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో రహదారులు తడిసి ఉన్నాయి. ఈ కారణంగా వాహనం స్కిడ్ అయిందని భావిస్తున్నారు. ఈ వాహనంలో పెట్రోలు ట్యాంక్ నిండుగా ఉంది. వాహనం రోడ్డుపై పడగానే జారడంతో అగిరవ్వలు రేగాయి. ట్యాంక్ నుంచి పెట్రోల్ లీకవడంతో మంటలు పుట్టాయి. క్షణాల్లో మంటలు పెరిగి వాహనం పూర్తిగా దగ్ధమయింది. పక్కనే షాపుల్లో ఉన్న వారు బకెట్లతో నీళ్లు చల్లినా మంటలు ఆరలేదు. తర్వాత ఒక షాపు నుంచి ఫైర్ గన్ తెచ్చి ఫోమ్ కొట్టడంతో మంటలు అదుపులోకి వచ్చాయి.



మంటల్లో ద్విచక్ర వాహనం

22 కోడి పుంజుల అపహరణ

కృత్తివెన్ను, జూన్ 27 : అర్ధరాత్రి లక్షల విలువ చేసే పందెం పుంజులను దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన కృత్తివెన్ను స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అడ్డపర్ర గ్రామంలో నివాసముంటున్న సూదబత్తుల కృష్ణమూర్తి ఖరీదైన పందెం పుంజులను పెంచి, సంక్రాంతి సీజన్‌లో విక్రయిస్తుంటాడు. ఈ ఏడాది 22 పందెం పుంజులను సిద్ధం చేస్తున్నాడు. ఇందుకోసం 216 జాతీయ రహదారి పక్కన తన ఇంటి పక్క ఖాళీ స్థలంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసాడు. పుంజులను ఎప్పటి మాదిరిగా గాబులు కిందవేసి, పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో 2 గంటలకు లేచి చూడగా, మెస్ తలుపులు తాళ్లతో కట్టి ఉన్నాయి. అప్రమత్తమై, లైట్లు వేసి, కోడి పుంజుల వద్దకు వెళ్లగా, పుంజులన్నింటిని దొంగలు అపహరించినట్టు గుర్తించాడు. చుట్టు ఉన్న వలను కోసి, పుంజులను ఎత్తుకెళ్లిపోయారు. దుండగులు పక్కా ప్రణాళికతో ఇంటి తలుపుల వద్ద పెద్ద పెద్ద రాళ్లు దాడి చేసేందుకు సిద్ధం చేసుకుని, బైక్ ప్లగ్‌ను పీకి పక్కన పడేసారు. దొంగతనంలో సుమారు రూ. 2 లక్షల విలువ చేసే 22 కోడి పుంజులు పోయాయని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తు చేస్తున్నారు.



తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కృత్తివెన్ను, జూన్ 27 : ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి 168 గ్రాముల బంగారం, అరకేజీ వెండిని అపహరించిన సంఘటనపై గురువారం కత్తివెన్ను పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాశ్చాపురం గ్రామానికి చెందిన మాటూరి రవి కుమార్ ఈనెల 16న భార్యను విజయవాడ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించి అక్కడే ఉంటున్నారు. ఈ నెల 26న ఇంటి వెనుకవైపు తలుపులు తీసి ఉన్నాయని స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఇంటికి వచ్చి పరిశీలించగా, ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడిఉండి.. 21 కాసుల బంగారం, అరకేజీ వెండి చోరీ జరిగినట్టు గుర్తించి, రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఎస్సై నాగరాజు సిబ్బందితో ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు.



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

వీఆర్‌కు ఆర్‌పేట సీఐ..

మచిలీపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఎన్నికలకౌంటింగ్ అనంతరం జరిగిన అల్లర్లలో టీడీపీ కార్యకర్తలపై దాడిచేసిన వైసీపీ నాయకులు, కార్యకర్తలకు అనుకూలంగా వ్యవహరించిన ఆర్‌పేట సీఐ శ్రీనివాసయాదవ్‌పై వేటు పడింది. ఆయనను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఉత్తర్వులు జారీ చేశారు. కౌంటింగ్ అనంతరం మచిలీపట్నం బలరామునిపేటలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా జాప్యం చేశారు. ఈ అంశంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐపై టీడీపీ నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నేరుగా మంత్రి కొల్లు రవీంద్ర ఆర్‌పేట సీఐ పనితీరు మార్చుకోకుండా వైసీపీకి అనుకూలంగా ఇంకా పనిచేస్తున్నారని అన్నారు. గతంలో మచిలీపట్నం డీఎస్పీగా పనిచేసిన మాసుంబాషా అధికార పార్టీకి అనుకూలంగా పని చేయడంతోపాటు, ప్రతిపక్ష నాయకులపై కక్షపూరితంగా వ్యవహరించారు. ఆయనను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు వెలువడినట్టు సమాచారం.



రామోజీరావు ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న చంద్రబాబు, నారా భువనేశ్వరి... సంస్మరణ సభకు హాజరైన రాజకీయ, సినీ ప్రముఖులు

కలంతో ప్రజాస్వామ్యాన్ని కాపాడిన రామోజీ

» మంత్రి కొలుసు పార్థసారథి



పెనమలూరు, జూన్ 27 : రాష్ట్రంలో కానీ, దేశంలోకానీ ప్రజాస్వామ్యానికి ఆపద వచ్చినప్పుడు తన కలాన్ని ఆయుధంగా చేసుకొని కాపాడిన వ్యక్తి రామోజీరావు అని మంత్రి కొలుసు పార్థసారథి కొనియాడారు. గురువారం సాయంత్రం పెనమలూరు మండలం కానూరు వందడుగుల రోడ్డులోని అనుమోలు గార్డెన్స్‌లో స్వర్గీయ రామోజీరావు సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. అతి సామాన్య కుటుంబంలో పుట్టి చేపట్టిన రంగాల్లో ఎవరెస్టు శిఖరంలా ఎదిగిన రామోజీ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఎవరైనా ఎంచుకొన్న రంగాల్లో ఉన్నత స్థానాలకు వెళ్లగలరని రామోజీరావు నిరూపించారన్నారు. సభ ప్రారంభానికి ముందు నాయకులు కంభంపాటి రామ్మోహన్‌రావు, బూరగడ్డ వేదవ్యాస్ తదితరులతో కలిసి రామోజీరావు జీవితంలో సాధించిన విజయాలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. కంభంపాటి రామ్మోహన్ మాట్లాడుతూ.. జర్నలిజం, పత్రికారంగానికి దిశానిర్దేశం చేసి మార్గదర్శకుడిగా రామోజీరావు నిలిచారన్నారు. అన్ని విషయాలపై ప్రజలకు సమాచారం ఇవ్వడంలో రాజీ పడేవారు కాదన్నారు. టీడీపీ అఖండ మెజారిటీతో అధికారం చేపట్టినప్పుడు తమ పత్రిక ప్రతిపక్షంలో ఉండి ప్రజల తరఫున పోరాడుతుందని గట్టిగా చెప్పిన వ్యక్తి రామోజీరావు అని గుర్తు చేశారు. రామోజీరావు చిత్రపటానికి స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఘనంగా నివాళులర్పించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాట్లు

రామోజీరావు సంస్మరణ సభ సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు ఏర్పాట్లు చేశారు. వందల మంది సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు బందోబస్తు పర్యవేక్షించారు. మచిలీపట్నం నుంచి విజయవాడ వెళ్లే భారీ వాహనాలను మధ్యాహ్నం నుంచి కంకిపాడు వద్ద నిలిపివేశారు. విజయవాడ నుంచి వచ్చే వాహనాలను పెనమలూరు నుంచి కరకట్ట మీదుగా మళ్లించారు. కానూరు వందడుగుల రోడ్డును మధ్యాహ్నం నుంచి పూర్తిగా మూసివేసి అటువైపు వెళ్లే వాహనాలను పోరంకి నిడమానూరు రోడ్డు మీదుగా మళ్లించారు.

రామోజీ ఫొటో ఎగ్జిబిషన్ సందర్శనలో..

రామోజీరావు సంస్మరణ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన రామోజీరావు ఫొటో ఎగ్జిబిషన్‌ను చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు తిలకించారు. గురువారం జరిగిన స్వర్గీయ రామోజీరావు సంస్మరణ సభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులు, రామోజీ కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రామోజీరావు జీవిత విశేషాలను తెలియజేస్తూ ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రదర్శించారు. విశాఖపట్నంలో ఈనాడు ఆవిర్భావం, సినిమా నిర్మాణం, ఈటీవీ మీటీవీ ఆవిష్కరణ, సమాచారహక్కు చట్టం పరిరక్షణపై ఉద్యమ సమావేశాలు, సారాపై సమరం, తుఫాను బాధితులకు సేవా కార్యక్రమాలు, సినీ రాజకీయ ప్రముఖులతో కలిసి ఉన్న అరుదైన చిత్రాలను ఫోటో ఎగ్జిబిషన్‌లో ఉంచారు. ముఖ్యమంత్రి పలువురు రాష్ట్ర మంత్రులతో కలిసి ప్రదర్శనను తిలకించి అక్కడ ఏర్పాటు చేసిన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. మంత్రులు నారా లోకేశ్, కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, శాసనసభ్యులు ఫోటో ఎగిబిషన్‌ను తిలకించి రామోజీకి ఘనంగా నివాళులర్పించారు.

ప్రాణాలు పోతేగాని పట్టదా!

» నాలుగు నెలల క్రితం పనులకు అత్యవసర సమావేశామా?

» పేటలో పారిశుధ్యంపై కౌన్సిల్‌లో గరం గరం



పారిశుధ్యంపై కౌన్సిల్ సమావేశంలో నిలదీస్తున్న కౌన్సిలర్లు

జగ్గయ్యపేట, జూన్ 27 : 'నాలుగు నెలల క్రితం జరిగిన పనుల ఆమోదానికి అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తారా.. ప్రాణాలు పోతేగాని స్పందించరా.. పురపాలకసంఘంలో డయేరియాతో మరణాలు సంభవిస్తే కౌన్సిల్ మొత్తం తలదించుకునేలా చేశారు..' అంటు కౌన్సిలర్లు అధికారుల తీరుపై కౌన్సిల్ సమావేశంలో చైర్మన్, వైస్‌చైర్మన్, పాలకపక్ష, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో గవర్నర్ పర్యటన ఏర్పాట్ల సందర్భంగా చేసిన పనులకు నాలుగు నెలల తర్వాత ఆమోదానికి అత్యవసర సమావేశం ఎలా పెడతారని ప్రశ్నించారు. రూ.4.99 లక్షల చొప్పున ఒకే కాంట్రాక్టర్‌కు ఒకేపనికి సంబంధించి నాలుగు బిట్లుగా నామినేషన్ పద్ధతిపై పనులు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. వైసీపీ కౌన్సిలర్ వట్టెం మనోహర్ రూ.25లక్షలు పనులను టెండర్లు పిలవకుండా విభజించి ఒక్కరితో చేయించటం నిబంధనలకు విరుద్ధమన్నారు. వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రాణాలు పోతేగాని అధికారులకు పనులు చేయాలని అనిపించటం లేదా అని నిలదీశారు. రెండేళ్లుగా హెడ్ వాటర్ వర్క్స్ అప్రోచ్ రోడ్డు అడిగినా వేయలేదని, ఇప్పుడు డయేరియా సోకి ప్రాణాలు పోతే, మంత్రులు, అధికారులు వస్తున్నారని నామినేషన్‌పై పనులు చేయించారని అన్నారు. వైసీపీ కౌన్సిలర్ కొలగాని రాము మాట్లాడుతూ, పట్టణంలో హోటళ్ల తనిఖీలు చేసిన పాపాన పోలేదని, శానిటేషన్ అధ్వానంగా ఉందని శానిటరి ఇన్‌స్పెక్టర్‌ను నిలదీశారు. డయేరియా వల్ల కౌన్సిల్ మొత్తం తలదించుకోవాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ మల్లేశ్వరరావు, డీఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతురావులు మాట్లాడుతూ, ఎన్నికల పనుల వల్ల కౌన్సిల్ సమావేశం పెట్టకపోవటంతో ఇప్పుడు పెట్టాల్సి వచ్చిందన్నారు. చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ, 33 పనుల టెండర్లు దక్కించుకుని చేయని పనులు ఉన్నాయని చెప్పారు. నోటీసులు ఇచ్చి రద్దు చేస్తే డిపాజిట్‌లు వెనక్కి ఇవ్వాల్సిన అవసరం ఉందని, కౌన్సిల్ ద్వారా రద్దు చేస్తే అలా కుదరదని డీఈ వివరణ ఇచ్చారు.

చేసిన పాపాలు ఊరికే పోవు

» పిన్నెల్లి అరెస్టుపై దేవినేని ఉమా స్పందన

గొల్లపూడి, జూన్ 27 : మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టుతో మాచర్లతో వైసీపీ అరాచకాలకు తెరపడిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన పిన్నెల్లి అరెస్టుపై స్పందించారు. చేసిన పాపాలు ఊరికేపోవనేందుకు పిన్నెల్లి అరెస్టే నిదర్శమన్నారు. ఈవీఎంలను పగులకొట్టి పిన్నెల్లి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్నారు. చంబల్‌లోయ మాదిరిగా సొంత సామ్రాజ్యంలా మార్చుకొని లెక్కకు మించిన తప్పులు చేశారన్నారు. దాడులు, హత్యలతో అరాచకాలకు అడ్డాగా మార్చారని ధ్వజమెత్తారు. తప్పులు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదని ఉమా అన్నారు.

కేడీసీసీబీ పర్సన్‌ఇన్‌చార్జీగా జేసీ

మచిలీపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా కేంద్ర సహకారబ్యాంక్(కేడీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జీగా జేసీ గీతాంజలి శర్మను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక చీఫ్‌సెక్రటరీ బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వైసీపీ ప్రభుత్వహయాంలో ఇంతకాలంగా కేడీసీసీబీ పాలకవర్గాన్ని నామినేషన్ పద్ధతిన నియమిస్తూ వచ్చారు. జిల్లాలోని 424 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. వీటిలో త్రీమెన్ కమిటీలను నియమించి ఇంతకాలంగా నెట్టుకొచ్చారు. పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరగకపోవడంతో కేడీసీసీబీ పాలకవర్గం ఎన్నికలు జరగలేదు. ఇటీవలకాలం వరకు తాతినేని పద్మావతి కేడీసీసీబీ చైర్‌పర్సన్‌గా కొనసాగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆమె తనపదవికి రాజీనామా చేశారు. దీంతో ప్రభుత్వం కేడీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జీగా జేసీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మెగా జాబ్‌మేళా రేపు

మచిలీపట్నం టౌన్, జూన్ 27 : జిల్లా ఉపాధి కల్పన శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సంయుక్తంగా ఈనెల 29న పవిత్ర డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాశాఖాధికారి విక్టర్‌బాబు తెలిపారు. జాబ్‌మేళాలో హెటిరోల్యాబ్స్, పేటీఎం, అరబిందో, యలమంచిలి ఇంజనీర్స్ ప్రైవేట్, ఎన్‌సిఎల్ ఇండస్ట్రీస్, యాక్ట్ ఫైబర్‌నెట్, అపోలో, కాసా క్రియో మోటార్స్, ధృవంత్ సొల్యూషన్స్, మాత్రే హెచ్‌ఆర్ ఇండియా పలు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 10, ఐటీఐ, డిగ్రీ పూర్తిచేసి 30 సంవత్సరాలలోపు నిరుద్యోగులు బయోడేటా, జిరాక్స్, ఆధార్‌కార్డుతో హాజరుకావాలన్నారు. వివరాలకు 8142416211కు ఫోన్ చేయవచ్చన్నారు.

ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష రేపు

చల్లపల్లి, జూన్ 27 : ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఆదేశాల మేరకు చల్లపల్లి మండలం పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ మధుసూదనరావు తెలిపారు. ఈ ఏడాది 6, 7 తరగతుల్లో చేరగోరు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని కోరారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికచేయబడిన విద్యార్థులను డే స్కాలరుగా 6, 7 తరగతుల్లో ఉచిత విద్య అందిస్తామని తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో 46 శాతం ఉత్తీర్ణత

మచిలీపట్నం టౌన్, జూన్ 27 : టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో కృష్ణాజిల్లా విద్యార్థులు 46.42 శాతం ఉత్తీర్ణులయ్యారని డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. 3348 మంది హాజరు కాగా 1554 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం అభ్యర్థులు జులై 1లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆఫ్‌లైన్‌లో డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించుకోవచ్చన్నారు.

దారి చూపండి సారూ..!

» జగనన్న లే అవుట్లలో రహదారి, డ్రెయిన్లు ఆక్రమించుకున్న వైసీపీ శ్రేణులు

» స్పందనలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు

» రహదారి లేక అవస్థలు పడుతున్న నివాసితులు



జగనన్న కాలనీలో అక్రమంగా నిర్మించిన గోడౌన్‌లు, గృహాలు

మోపిదేవి, జూన్ 27 : జగనన్న కాలనీలు, లే అవుట్లు వైసీపీ నేతల అక్రమాలకు అడ్డాగా మారాయి. యథేచ్ఛగా ఆక్రమణలకు బరితెగిస్తున్నారు. మండల కేంద్రమైన మోపిదేవి పంచాయతీ పరిధిలోని ఎస్టీ (యానాదుల) సామాజిక వర్గం కోసం లే అవుట్ త్రీని రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు. దానిలో 12 బ్లాక్‌లు కేటాయించి ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఆరుగురికి మాత్రమే ప్లాట్లు కేటాయించి, మిగిలినది ఇతర సామాజిక వర్గాలకు పంపిణీ చేశారు. నిబంధనల ప్రకారం సెంటున్నర చొప్పున స్థలాలు కేటాయించాల్సి ఉండగా, అర సెంటు చొప్పున ఆరుగురు లబ్ధిదారులకు 8 గృహాలు నిర్మించారు. ఇతర సామాజికవర్గానికి చెందిన వైసీపీ కార్యకర్తలు అధికారుల అండదండలతో మూడు సెంట్ల చొప్పున ఆక్రమించి ఇల్లు నిర్మించారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన లబ్ధిదారులకు కనీసం రహదారి మార్గం కూడా లేకుండా ఇరువైపులా రహదారి, డ్రెయిన్లు ఆక్రమించి గృహాలు, వ్యాపార సముదాయం నిర్మించుకున్నారు. గతేడాదిలోనే పలువురు గ్రామస్థులు ఎస్టీ సామాజికవర్గానికి రహదారి కల్పించి ఆక్రమణలు నిలుపుదల చేయాలని స్పందనలో ఫిర్యాదులు చేయటం జరిగింది. నాటి వైసీపీ ప్రజాప్రతినిధుల అండదండలతో కార్యకర్తల కాసులకు కక్కుర్తి పడి ఎస్టీలకు రహదారి లేకుండా అన్యాయం చేశారంటూ వారు ఆరోపించారు. కనీసం నివాసితులు ఇంటి నుంచి రహదారిపైకి వచ్చేందుకు వీలు లేకుండా మురుగునీటి డ్రెయిన్‌లో దిగి నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



కలెక్టర్ ఆదేశాలూ బుట్టదాఖలు

కాలనీలో ఆక్రమణలపై గతేడాది స్పందనలో ఫిర్యాదులపై మచిలీపట్నం ఆర్డీవో, మోపిదేవి తహసీల్దార్‌లను విచారణ అధికారులుగా నియమించి తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలూ బుట్టదాఖలయ్యాయి. లే అవుట్‌లో ఐదుగురు వ్యక్తులు ఒకటిన్నర సెంట్ల కంటే అదనంగా ఆక్రమించుకోవటం జరిగిందని, తహసీల్దార్ నివేదికలు రూపొందించారు. ఆక్రమణలు తొలగించేందుకు నోటీసులు ఇచ్చి మార్కింగ్‌లు సైతం ఇవ్వటం జరిగింది. వైసీపీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి, స్థానిక అధికారుల ధనదాహంతో ఆక్రమణల ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పటికైనా వైసీపీ ఆక్రమణలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిందిగా గ్రామస్థులు కోరుతున్నారు.

సెంటున్నర చెప్పారు.. సెంటు కూడా ఇవ్వలేదు : కాకినేటి కృష్ణ



కాలువ గట్టుపై ఉంటున్నవారికి ప్రభుత్వం స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. సెంటున్నర చొప్పున అని చెప్పి సెంటు కూడా ఇవ్వలేదు. వర్షం వస్తే శ్లాబు నీరు కారుతోంది. ఎవరికైనా చెబితే ఇల్లు కూడా ఇవ్వమని బెదిరిస్తున్నారు. రహదారిని ఆక్రమించారు. మురుగు డ్రెయిన్ గుండా నడవాల్సి వస్తున్నది.

ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం - తహసీల్దార్ ఎం.శ్రీవిద్య

మోపిదేవి లే అవుట్-త్రీలో ఆక్రమణలపై ఫిర్యాదులు రావటం జరిగింది. లే అవుట్‌ను పరిశీలించి ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టేలా పరిశీలన చేస్తున్నాం.

గుడివాడను అభివృద్ధి చేసి చూపిస్తా : వెనిగండ్ల

గుడివాడ, జూన్ 27 : గుడివాడ ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పూర్తిస్థాయిలో గుడివాడను అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్లరాము అన్నారు. పాత కంకిపాడు రోడ్డులో రూ.7.88 లక్షల నిధులతో డ్రైనేజీ పూడికతీ పనులను ఆయన ప్రారంభించారు. డ్రైనేజీ సిల్ట్ తొలగింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో 23 గ్రామాల పరిధిలో ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు నూతన ఫిల్టర్ బెడ్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నెరుసు చింతయ్య, వసంతవాడ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న వెనిగండ్ల రాము

బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీరావు : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, జూన్ 27 : పత్రికారంగంతో పాటు సేవా రంగం, కళారంగం , వ్యాపార రంగం, సినీరంగంలో తనదైన ముద్రవేసుకున్న చెరుకూరి రామోజీరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని మాజీ ఎంపీ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో రామోజీరావు సంతాపసభ జరిగింది. రామోజీరావు చిత్రపటానికి కొనకళ్ల నారాయణరావు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు కొనకళ్ల బుల్లయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐపీసీ కరుణకుమార్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్, టీడీపీ నాయకులు తదితరులు నివాళులర్పించారు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.20

నేడు ఉచిత వైద్య శిబిరం

పాయకాపురం, జూన్ 27: రాజీవ్‌నగర్‌లోని మాస్టర్‌మైండ్స్ స్కూల్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్కూల్స్ చైర్మన్ పెంట్యాల అనిల్‌కుమార్ తెలిపారు. కంటి పరీక్షలు, 18 రకాల రక్త పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందిస్తామని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

244 మందికి ఉద్యోగాలు

భారతీనగర్, జూన్ 27: నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌డ్రైవ్ (ప్రాంగణ ఎంపికలు)ను కళాశాల ప్రధాన అధికారి, కన్వీనర్ ఎం.కనకారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. 21 ప్రైవేట్ కంపెనీలు పాల్గొన్నాయి. 445 మంది పాల్గొనగా వారిలో 244మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కనకారావు తెలిపారు.

అసాంఘికశక్తులను అణచివేస్తాం

● గంజాయి, డ్రగ్స్ కట్టడిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, జూన్ 27: ప్రజల ప్రశాంత జీవనానికి ఆటంకం కలిగించే అసాంఘికశక్తులను చట్ట ప్రకారం అణచివేస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గురువారం 7వ డివిజన్ ఆర్సీఎం చర్చి ప్రాంతంలో ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధిలైట్లు వెలగడం లేదని రాత్రివేళ ఇబ్బందిగా ఉందని, చీకటిగా ఉండడంతో గంజాయిమూకలు చేరి అల్లర్లకు పాల్పడుతున్నారని స్థానిక మహిళలు ఆయన దృష్టికి తెచ్చారు. ఆర్సీఎం చర్చి ప్రాంతంలో ఖాళీ స్థలంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే తామంతా కుట్టుపని నేర్చుకుంటామని ఎమ్మెల్యేను కోరారు. కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తానని, గంజాయి మూకల సమస్య లేకుండా చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గంజాయి, డ్రగ్స్‌కు కేంద్రంగా రాష్ట్రం మారిందని అన్నారు. గంజాయి, డ్రగ్స్ సరఫరా చేసే వారిపైన, వాడుతున్న వారిపైనా టీడీపీ ప్రభుత్వం దృష్టి పెట్టిందని, వారిపైన కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గత నెలలో గంజాయిమూకల దాడిలో గాయపడిన వర్లపర్ల సతీష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం తన సొంత నిధుల నుంచి రూ.10 వేలు అందించారు. టీడీపీ బూత్ కన్వీనర్ బట్టు మధు తండ్రి జార్జి మరణించడంతో వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పటమట సతీష్‌చంద్ర, సొంగా సంజయ్‌వర్మ, పెనుగొండ శ్రీను, దోమకొండ రవి, రత్నాకర్, పర్సా లక్ష్మణ్, పెరవలి శివకుమార్, ప్రభుప్రకాష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వివాహిత మృతి

వన్‌టౌన్, జూన్ 27: విజయవాడ బస్టాండ్ ప్రాంగణంలో ఈనెల 26వతేదీన బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వివాహిత దండిప్రోలు కల్యాణి(29) అదే రోజు అర్ధరాత్రి తర్వాత మృతి చెందింది. కృష్ణలంక పోలీసులకు మృతురాలి తల్లి కుమారి ఫిర్యాదు చేశారు. బుధవారం కల్యాణి, తన కుమార్తె తాన్వి(7)తో కలిసి పార్సిల్ ఆఫీసులో పార్సిల్ తీసుకునేందుకు ఇన్‌గేట్ నుంచి బస్టాండ్‌లోకి ప్రవేశిస్తుండగా అమరావతి నుంచి విజయవాడకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన కల్యాణిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. తాన్వి త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకుంది. కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



మంగళంపల్లి బాలమురళీకృష్ణ వీధిలో..



సర్కిల్‌టూ కార్యాలయం వెనుక..

అధ్వానపు రోడ్లు

● అవస్థలు పడుతున్న ప్రజలు

సత్యనారాయణపురం, జూన్ 27: అధ్వానపు రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సర్కిల్ టూ కార్యాలయం వెనుక రోడ్డు గోతులమయంగా మారింది. గోతుల్లో నిత్యం వాహనదారులు పడిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం వందలాది మంది వివిధ పనుల నిమిత్తం సర్కిల్‌టూ కార్యాలయనికి ఈ రోడ్డులో వెళుతుంటారు. పక్కనే ఉన్న ఏకేటీపీఎం పాఠశాలకు, ప్రశాంతి నగరపాలక సంస్థ పాఠశాలకు వేలాది మంది విద్యార్థులు సైకిళ్లపైన వెళుతుంటారు. నగరపాలక సంస్థ ఏఈ, డీఈలు కూడా ఇదే రోడ్డులో వెళుతుంటారు. ఆరునెలల క్రితం సత్యనారాయణపురం మంగళంపల్లి బాలమురళీకృష్ణ వీధి నుంచి ముదిగొండ వారి వీధి వరకూ వెళ్లే రోడ్డులో యూజీడీ పనులు చేశారు. అప్పట్లో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కానీ, ఇంతవరకూ రోడ్డు నిర్మాణపు పనులు ప్రారంభించలేదు. కనీసం యూజీడీ పనుల నిమిత్తం తవ్విన గోతులను కూడా పూడ్చలేదు. దీంతో ఈ రోడ్డు గోతులమయంగా మారింది. రాత్రి సమయంలో ఈ రోడ్డులో వెళ్లేవారు రోడ్డుపై గోతులు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు.

కనీసం గోతులైనా పూడ్చలేదు: కార్పొరేటర్ శర్వాణీ మూర్తి

మంగళంపల్లి బాలమురళీకృష్ణ వీధి నుంచి ముదిగొండ వారి వీధి వరకూ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, టెండర్లు పిలిచారని కార్పొరేటర్ శర్వాణీమూర్తి పేర్కొన్నారు. మధ్యలో ఎన్నికల కోడ్ రావడంతో రోడ్డు నిర్మాణపు పనులు జరగలేదని తెలిపారు. రోడ్డు నిర్మాణం చేపట్టమని డీఈకి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కనీసం రోడ్డుపైన గోతులైనా పూడ్చడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

నిలిచిన డ్రెయిన్ల నిర్మాణం

● స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు
● స్తంభాలు అడ్డుగా ఉండడంతో నిలిపేశామన్న కాంట్రాక్టర్
● అనుమతి రాగానే స్తంభాలు మారుస్తామన్న విద్యుత్ ఏఈ



యూనియన్ బ్యాంకు గేటు పక్కన అడ్డుగా ఉన్న కరెంటు స్తంభం, నిలిచిపోయిన డ్రెయిన్ నిర్మాణం

మధురానగర్, జూన్ 27: మధురా నగర్ మెయిన్ రోడ్డులో ఆర్‌యూబీకి అనుబంధంగా సర్వీస్ రోడ్లలో నిర్మిస్తున్న డ్రెయిన్ల నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో యూనియన్ బ్యాంకు, పాఠశాల ఉండటంతో బ్యాంకుకు వచ్చే ఖాతాదారులు, వృద్ధులు, మహిళలు, పాఠశాలకు వెళ్లే పిల్లలు, తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. పదిహేను రోజుల నుంచి ఇదే పరిస్థితి ఇక్కడ ఉంది. డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేసి కాంక్రీటు బిళ్లలు వేయకుండా కాంట్రాక్టర్ పనులు ఆపేశాడు. దీనిపైన కార్పొరేషన్ అధికారులకు టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేయగా గురువారం ఈఈ వచ్చి కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడారు. 33 కేవీ విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉండటంతో పనులు ఆపాల్సి వచ్చిందని సమాధానం ఇచ్చారు. విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు ఇదిగో అదిగో అని సమాధానం చెబుతున్నారని ఈఈకి కాంట్రాక్టర్ చెప్పారు. దీనిపై మధురానగర్ సబ్‌స్టేషన్ ఏఈ శివారెడ్డిని వివరణ కోరగా వీఎంసీ నుంచి నాలుగు రోజుల క్రితమే అప్లికేషన్ వచ్చిందని దానిని పై అధికారులకు పంపామని, అక్కడి నుంచి అనుమతి రాగానే స్తంభాలను మార్చేస్తామన్నారు. డ్రెయిన్ల నిర్మాణం ప్రారంభించక ముందే అప్లికేషన్ పెట్టకపోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమైందని అనుమతి రాగానే స్తంభాలను మారుస్తామన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ పఠాన్ సలీంకు వినతిపత్రం అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘాల నేతలు

రైతుల సమస్యలు పరిష్కరించాలి

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 27: ఖరీఫ్ పంట నిమిత్తం రైతులకు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు విజయవాడ రూరల్ మండలం డిప్యూటీ తహసీల్దార్ పఠాన్ సలీంకు గురువారం ఆయన కార్యాలయంలో వారు వినతిపత్రాన్ని అందజేశారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలను రూ.3 లక్షల వరకు వడ్డీ లేకుండా రైతులకు అందించాలన్నారు. అలాగే రూ.5 లక్షల వరకు రుణాలను పావలా వడ్డీతో రైతు, కౌలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కాలువలు, మైనర్ కాలువలతో పాటు డెల్టా ప్రాంతంలో మురుగు నీటి కాలువల మరమ్మతులు వెంటనే చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పాల్గొన్నారు.



52వ డివిజన్‌లో శుభోదయం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి)

కూటమిని అధికారంలోకి తెచ్చినందుకు కృతజ్ఞతలు

● శుభోదయం ప్రజాదర్బార్‌లో 52వ డివిజన్‌వాసులతో కార్పొరేటర్ ఉమ్మడి చంటి

వన్‌టౌన్, జూన్ 27: ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని భారీ మెజారిటీతో గెలిపించినందుకు 52వ డివిజన్‌లో స్థానికులకు కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి) కృతజ్ఞతలు తెలిపారు. 52వ డివిజన్‌లో గురువారం శుభోదయం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. కోమలా విలాస్ సెంటర్ గుర్రాల వారి వీధిలో నిర్వహించిన శుభోదయం ప్రజాదర్బార్‌లో స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని చంటి తెలిపారు. ఆయన వెంట కార్పొరేషన్‌లోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మరింత విస్తృతంగా జెమ్స్ లయన్స్ సేవలు

ఆటోనగర్, జూన్ 27: ఆటోనగర్ జెమ్స్ లయన్స్ క్లబ్ సేవలు భవిష్యత్తులో మరింత విస్తృతం చేస్తామని క్లబ్ ప్రెసిడెంట్ రవీంద్రనాథ్, పూర్వ ప్రెసిడెంట్ మహ్మద్ ఇస్మాయిల్, క్లబ్ ఫౌండర్లు బెవర నాగేశ్వరరావు, ఎంవీఎల్ కాంతారావు పేర్కొన్నారు. గురువారం ఆటోనగర్ సమీపంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో క్లబ్ సభ్యుడు బాహుబలేంద్ర కోటేశ్వరరావు జన్మదినం సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. క్లబ్ సభ్యులు, ఐలా ప్రతినిధుల సమక్షంలో కోటేశ్వరరావు దంపతులు కేక్ కట్ చేశారు. క్లబ్ సభ్యులు, ఐలా ప్రతినిధులు కోటేశ్వరరావు దంపతులను సన్మానించారు. జెమ్స్ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు కోటేశ్వరరావు దంపతులు రూ.పదివేల విరాళం అందించారు. ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, కార్యదర్శి అన్నే శివనాగేశ్వరరావు, కత్తిక నాగేశ్వరరావు, కె.రంగారావు, కొట్టే కృష్ణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఆటోనగర్ జెమ్స్ లయన్స్ క్లబ్ సభ్యుడు కోటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

డిజిటల్ మార్కెటింగ్‌లో విస్తృత అవకాశాలు

వన్‌టౌన్, జూన్ 27: నేటి ప్రపంచం డిజిటల్ మార్కెటింగ్ దిశగా పరుగులు తీస్తోందని, డిజి టల్ మార్కెటింగ్‌లో విస్తృత అవ కాశాలున్నాయని, సృజనాత్మకత, విశ్లేషణ, సామర్థ్యం గల విద్యార్థులు అద్భుతమైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని రైజన్‌సాఫ్ట్ టెక్నాలజీ లిమిటెడ్ ఎండీ విష్ణుభట్ల కృష్ణకాంత్ అన్నారు. కేబీఎన్ కళాశాలలో కంప్యూటర్స్ విభాగంలో ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్ ఆవశ్యకత- అవకాశాలు అనే అంశంపై గురువారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య వక్తగా కృష్ణకాంత్ విచ్చేశారు. సాంకేతికతలో విద్యార్థులకు పట్టు ఉన్నప్పుడే ఏ రంగంలోనైనా రాణి స్తారని ఆయన అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించారు. నూతన సాంకేతిక విప్లవం అనేక అవకాశాలు కల్పిస్తుందని అన్నారు. విభాగాధిపతి పి.రవీంద్ర పాల్గొన్నారు.

కొల్లు రవీంద్రకు టీడీపీ నేతల అభినందన



కొల్లు రవీంద్రను సత్కరిస్తున్న బాలస్వామి తదితరులు

గవర్నర్‌పేట, జూన్ 27: 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నేతలు గురువారం మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. టీడీపీ జిల్లా సహాయ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు (కోటి), మాజీ కార్పొరేటర్ సొంగా రవీంద్ర పాల్గొన్నారు.

దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

వన్‌టౌన్, జూన్ 27: దుర్గామల్లేశ్వరస్వామి దేవ స్థానంలో గురువారం దక్షిణా మూర్తికి ప్రత్యేక అర్చనలు చేశారు. ప్రధాన అర్చకుడు మల్లేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో శాస్త్రోక్త విధానంలో అర్చకులు వివిధ షోడశోపచార పూజలు చేసి, మంత్రపుష్పం, హారతులు సమర్పించారు.



ప్రత్యేక అలంకరణలో దక్షిణామూర్తి

హిందీ అభివృద్ధికి కృషి

పాయకాపురం, జూన్ 27: హిందీ భాష అభివృద్ధికి రీజనల్ ఆయుర్వేద పరిశోధన సంస్థ కృషి చేస్తుందని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. రాజీవ్‌నగర్‌లోని ఆయుర్వేద ఆస్పత్రిలో రాజభాష హిందీ కార్యశాల కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. హిందీ భాషాభివృద్ధికి, ప్రజల్లో హిందీపై అవగాహన పెంచుటకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. రాజభాష అధికారి ఆశా మహేష్‌కుమార్, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి ఆర్థిక సాయం

భవానీపురం, జూన్ 27: 44వ డివిజన్ లేబర్‌కాలనీలో టీడీపీ నాయకుడు నిమ్మకాయల రాము అకాల మరణం చెందారు. కుటుంబాన్ని తెలుగు యువత పశ్చిమ ఉపాధ్యక్షుడు కుప్పిలి నాగబాబు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు చౌడ శ్రీనివాస్, గౌరీ సూరిబాబు, మల్లి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శుక్రవారం • 28 జూన్ 2024
cinema@andhrajyothy.com

పది రోజుల వర్కే బ్యాలెన్స్



ఒక సినిమా తర్వాతే మరో సినిమా చేయడం తమిళ దర్శకుడు శంకర్‌కు అలవాటు. అయితే అనుకోని పరిస్థితుల వల్ల ఆయన ఒకేసారి రెండు సినిమాలు.. 'భారతీయుడు 2', 'గేమ్‌ఛేంజర్' చేయాల్సి వస్తోంది. విశిష్ట నటుడు కమల్‌హాసన్ నటిస్తున్న 'భారతీయుడు 2' చిత్రం వచ్చే నెలలో విడుదలవుతుండడంతో కాస్త ఊపిరి తీసుకున్న శంకర్ ఒకపక్క 'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో పాల్గొంటూనే రామ్‌చరణ్ నటిస్తున్న గేమ్‌ఛేంజర్ మీద కూడా దృష్టి పెట్టారు. ఈ సినిమా గురించి అప్‌డేట్ వచ్చి చాలా కాలం అవుతోంది. 'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో భాగంగా దర్శకుడు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'గేమ్‌ఛేంజర్' గురించి అప్‌డేట్ ఇచ్చారు. 'సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తయింది. ఇంకో పది రోజుల వర్క్ మాత్రమే మిగిలి ఉంది. 'భారతీయుడు 2' విడుదల కాగానే ఆ వర్క్ మొదలుపెడతాను. ఆ తర్వాత ఫైనల్ ఫుటేజ్ చూసి పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభిస్తా. అవన్నీ పూర్తయ్యాక విడుదల ఎప్పుడనేది నిర్ణయిస్తా. సాధ్యమైనంత వరకూ తొందరగానే 'గేమ్‌ఛేంజర్' రిలీజ్ చేయడానికి ప్రయత్నిస్తా' అని శంకర్ వెల్లడించారు. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే ఓ పవర్‌ఫుల్ కథాంశంతో రూపుదిద్దుకుంటున్న 'గేమ్‌ఛేంజర్' లో కియారా అద్వాణీ కథానాయిక. శ్రీకాంత్, అంజలి, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్‌చంద్ర, అజయ్ ఘోష్ తదితరులు చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.


సంక్రాంతి బరిలో అజిత్ చిత్రం



తమిళ అగ్రకథానాయకుడు అజిత్ నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు, తమిళ భాషల్లో పూర్తి వినోదభరితంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అధిక్ రవిచంద్రన్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం సెకండ్ లుక్ పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. అజిత్ బ్లాక్ షేడ్స్ ధరించి , ఖైదీ డ్రస్‌లో కనిపించారు, ఆయన చేతి మీద ఉన్న టాటూ, బ్యాక్ గ్రౌండ్‌లో మ్యాసివ్ గన్ ఫైరింగ్ స్టన్నింగ్‌గా ఉన్నాయి. ఈ పోస్టర్‌లోనే వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. దీంతో సంక్రాంతి బరిలో మరో చిత్రం చేరనట్లయింది. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఫొటోగ్రఫీ: అభినందన్ రామానుజం, ఎడిటింగ్: విజయ్ వేలుకుట్టి. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దినేశ్ నరసింహన్, నిర్మాతలు: నవీన్ యర్నేని, రవిశంకర్.

హిట్ జోడీ... మరోసారి


చిత్ర సీమలో హిట్ జోడీకి ఉండే క్రేజే వేరు. ఒక సినిమాలో నటించిన హీరో, హీరోయిన్ జంట ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటే.. ఆ మ్యాజిక్ మరోసారి కచ్చితంగా రిపీట్ అవుతుందనేది దర్శకనిర్మాతల నమ్మకం. అందుకనే అలాంటి హిట్ కాంబోను మరోసారి తెరపై తీసుకురావడానికి మేకర్స్.. ఆదరించడానికి ప్రేక్షకులు ఎప్పుడూ రెడీగా ఉంటారు. అలా తెలుగుతెరపై క్లిక్ అయి.. ప్రేక్షకుల్ని మరోసారి పలకరించడానికి సిద్ధమవుతున్న జోడీలివే.











'ధమాకా' కాంబో

రవితేజ, శ్రీలీల కలసి నటించిన చిత్రం 'ధమాకా'. ఈ సినిమా వింటేజ్ రవితేజ స్టైల్ యాక్టింగ్‌ని ప్రేక్షకులకి మరోసారి గుర్తుచేయగా.. యంగ్‌బ్యూటీ శ్రీలీలను ఓవర్‌నైట్ స్టార్‌ని చేసి మరిన్ని చిత్రాల్లో అవకాశాలను తెచ్చిపెట్టింది. రవితేజ మార్క్ మాస్ కామెడీ టైమింగ్, శ్రీలీల క్యూట్ పెర్ఫార్మెన్స్ బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపించి.. దాదాపు రూ. 100 కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టింది. ఈ పెయిర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడటంతో మరోసారి వీరి కలయికలో ఓ చిత్రం రూపొందుతోంది. సితార ఎంటర్టైన్‌మెంట్స్ నిర్మాణంలో భాను బోగవరపు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'ఆర్టీ75' సినిమా వర్కింగ్ టైటిల్.





'ఎక్స్‌ట్రార్డినరీ' జంట

నితిన్, శ్రీలీల కలయికలో వచ్చిన చిత్రం 'ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్'. వక్కంతం వంశీ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్టైనర్ బాక్సాఫీస్ వద్ద అంచనాలను అందుకోకపోయినా.. నితిన్, శ్రీలీల కాంబోకు మంచి మార్కులే పడ్డాయి. ఇందులో వీరిద్దరి మధ్య ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ బాగా కుదరడంతో వీరి కలయికలో మరో సినిమా తెరకెక్కుతోంది. నితిన్‌తో 'భీష్మ' సినిమా తెరకెక్కించి హిట్ అందుకున్న వెంకీ కుడుముల ఈ సినిమాకు దర్శకుడు. 'రాబిన్‌హుడ్' పేరుతో వస్తోన్న ఈ సినిమాను నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'రాబిన్‌హుడ్' సినిమాతో నితిన్, శ్రీలీల జంట తెరపై ఈ సారి ఎలాంటి మ్యాజిక్ రిపీట్ చేస్తారో చూడాలంటే డిసెంబరు 20 వరకు వెయిట్ చేయక తప్పదు.

మూడోసారి ప్రేక్షకుల మది దోచడానికి

అర్జున్ రెడ్డి వంటి సంచలన విజయం తర్వాత విజయ్ దేవరకొండ నటించిన చిత్రం 'గీతా గోవిందం'. ఈ సినిమాలో విజయ్ సరసన రష్మిక మందన్న మొదటిసారి నటించారు. 2018లో పరశురామ్ దర్శకత్వంలో విడుదలైన ఈ రొమాంటిక్ ఎంటర్టైనర్ ఆ ఏటి మేటి చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. తెరమీద 'గీత' పాత్రలో రష్మిక, 'గోవిందం' పాత్రలో విజయ్ కాంబో ప్రేక్షకుల్ని అంతగా అలరించింది మరి. ఆ తరువాత వారిద్దరూ మరోసారి తెరపై ప్రేమికులుగా కనిపించిన చిత్రం 'డియర్ కామ్రేడ్'. 2019లో విడుదలైన ఈ సినిమా కమర్షియల్‌గా వర్కౌట్ కాకపోయినా.. కల్ట్ హిట్‌గా అభిమానుల మనసుల్లో నిలిచిపోయింది. ఇందులో 'బాబీ'గా విజయ్, 'లిల్లీ'గా రష్మిక ప్రేమికులంటే ఇలానే ఉండాలనేలా మెప్పించారు. ఈ సినిమా తర్వాత వారిద్దరూ రియల్ లైఫ్‌లోనూ ప్రేమలో పడ్డారని కొన్నాళ్లు జోరుగా ప్రచారం సాగింది. 'డియర్ కామ్రేడ్' తరువాత మరోసారి వీళ్లని ఎప్పుడెప్పుడు చూస్తామా అని ప్రేక్షకులు ఎదురుచూశారంటే ఈ కాంబోకున్న క్రేజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రేజీ కాంబో ముచ్చటగా మూడోసారి ప్రేక్షకులను పలకరించను సిద్ధమైంది. విజయ్ దేవరకొండ నటించిన 'టాక్సీవాలా' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన రాహుల్ సంకృత్యాన్ ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'వీడీ 14'. త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనున్న ఈ చిత్రంతో విజయ్, రష్మిక జోడీ తెరపై ఎలాంటి హంగామా సృష్టిస్తుందో చూడాలని ప్రతీ ఒక్కరూ ఎదురుచూస్తున్నారు.





సూపర్‌హిట్ కొట్టేందుకు మరోసారి...

ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య నటించిన 'బేబీ' చిత్రం సూపర్ సక్సెస్‌ను సాధించింది. ఈ ట్రయాంగులర్ లవ్‌స్టోరీని సాయిరాజేశ్ నీలమ్ తెరకెక్కించగా, ఎస్.కే.ఎన్ నిర్మించారు. 2023 జూలైలో విడుదలైన ఈ చిత్రం దాదాపు రూ. 100 కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టింది. ఈ న్యూ ఏజ్ లవ్ డ్రామాలో అమాయకుడిగా.. సిన్సియర్ లవర్‌గా ఆనంద్, మొదట బస్తీ అమ్మాయిగా ఉండి.. హఠాత్తుగా మోడరన్ అమ్మాయిగా మారిన వైష్ణవి చైతన్య నటన అందర్నీ మెప్పించింది. నిజం చెప్పాలంటే వీరి పాత్రల్ని మలిచిన తీరే సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లింది. ఈ సూపర్ హిట్ పెయిర్ ఇప్పుడు మరోసారి తెరపై కనువిందు చేయనుంది. రవి నంబూరి తెరకెక్కిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ స్టేజిలో ఉంది.





'సరిపోదా'తో మరోసారి

నాని నటించిన 'గ్యాంగ్‌లీడర్' చిత్రంతో వెండితెరపైకి ఎంట్రీ ఇచ్చారు ప్రియాంక అరుల్ మోహన్. 2018లో విడుదలైన ఈ సినిమాలో చలాకీ రైటర్‌గా నాని, పక్కింటి అమ్మాయి పాత్రలో ప్రియాంక చక్కగా నటించి ప్రేక్షకులని విశేషంగా ఆకట్టుకున్నారు. విక్రమ్.కె.కుమార్ దర్శకత్వం వహించిన ఈ రివెంజ్ కామెడీ డ్రామా యావరేజ్‌గా నిలిచినప్పటికీ ఈ చిత్రంలో నాని, ప్రియాంక మధ్య వచ్చే సన్నివేశాలు యువతరాన్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. 'హోయ్‌నా హోయ్‌నా', 'నిను చూసే ఆనందంలో' పాటల్లోని వీరి లవ్‌ట్రాక్ ఎంతో చూడముచ్చటగా ఉండి.. ఈ కాంబోని మరోసారి చూడాలని ఎదురుచూసేలా చేశాయి. దాదాపు ఆరేళ్ల తర్వాత నాని, ప్రియాంక మోహన్ వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో వస్తున్న 'సరిపోదా శనివారం'లో మరోసారి తెరపై తళుక్కుమంటున్నారు. ఆగస్టు 29న చిత్రం విడుదలవుతోంది.

ముచ్చటగొలిపేందుకు సిద్ధం

నాగచైతన్య, సాయిపల్లవి 2021లో విడుదలైన 'లవ్‌స్టోరీ' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలోని చైతన్య, సాయిపల్లవి జోడీ అందరినీ ముచ్చటగొలిపింది. సినిమాలో వీరి ప్రేమకథను చూసినవారందరూ ఈ జంటకు 'ఫిదా' అయిపోయారు. తెరపై లవర్స్‌గా సక్సెస్ కొట్టేసిన వీరిద్దరూ మూడేళ్ల తర్వాత మరోసారి నటించడానికి సిద్ధమయ్యారు. చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'తండేల్' మూవీలో నాగచైతన్య జాలరి పాత్రలో నటిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్ర టీజర్.. ముఖ్యంగా అందులోని బుజ్జి తల్లి వచ్చేస్తున్నా కదే.. కాస్త నవ్వే అనే డైలాగ్ సినిమాలో వీరిద్దరి మధ్య అద్భుతమైన లవ్‌స్టోరీ ఉండబోతోందంటూ ప్రేక్షకులకు హింటిచ్చింది.

ఇక్కడే నా జీవితం మొదలైంది

\- రష్మిక భావోద్వేగం



ఒక పక్క అల్లు అర్జున్, ఇంకో పక్క ధనుష్, ఆ పక్క సల్మాన్‌ఖాన్. ఇవీ కాకుండా జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ చిత్రంలోనూ, ప్రభాస్ 'స్పిరిట్' సినిమాలోనూ ఆమె హీరోయిన్ అంటున్నారు. అలాగే 'గర్ల్‌ఫ్రెండ్' పేరుతో చేస్తున్న లేడీ ఓరియంటెట్ సినిమా ఉండే ఉంది. ఇలా వరుసగా క్రేజీ ప్రాజెక్టులతో రష్మిక హవా మామూలుగా లేదు. ఇంత బిజీగా ఉన్న ఆమె తీరిక చేసుకుని చిన్ననాటి స్నేహితురాలు వివాహానికి తను పుట్టి పెరిగిన ఊరు 'కొడగు' వెళ్లింది. కర్నాటక రాష్ట్రంలోని ఆ ప్రాంతానికి వెళ్లగానే బాల్య స్మృతులు ఒక్కసారిగా చుట్టుముట్టడంతో భావోద్వేగానికి లోనయ్యారు. 'కొడగు.. నా హృదయం, నా చరిత్ర. జీవితం ఇక్కడే మొదలైంది' అంటూ ఈ సందర్భంగా దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. చిన్ననాటి స్నేహితురాళ్లను కలుసుకొని ఆ నాటి ముచ్చట్లను గుర్తు చేసుకుని మురిసిపోయింది.

చిత్ర పరిశ్రమకు మంచి రోజులు

\- ఎన్వీ ప్రసాద్



గడ్డుపరిస్థితుల్లో ఉన్న చిత్రపరిశ్రమకు మంచి రోజులు వచ్చాయని ప్రముఖ నిర్మాత, ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు ఎన్వీ ప్రసాద్ అన్నారు. గురువారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగు చిత్ర పరిశ్రమ ప్రపంచంలోనే ఉన్నతస్థితికి చేరిందన్నారు. గతంలో రాజకీయ హింసలకు గురై దినదినగండంగా ఉండేదని గుర్తుచేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్‌లతో చర్చలు సానుకూలంగా జరిగాయన్నారు. 'కల్కి' సినిమా సంచలన విజయం సాధించడం శుభపరిణామమన్నారు. కూటమి విజయంవలే సినీ పరిశ్రమ కూడా 'కల్కి'తో మంచి విజయాన్ని అందుకుందన్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలను కలిసి సినీ పరిశ్రమకు ఒకేరకమైన విధివిధానాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరనున్నట్టు చెప్పారు. ఏపీలో కూడా సినీ పరిశ్రమ వికసిస్తుందన్నారు. ప్రపంచ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుగు పరిశ్రమ అందిపుచ్చుకుందని, రాష్ట్రంలో కూడా తెలుగు సినిమాల షూటింగులు విరివిగా జరుపుకోనున్నాయన్నారు. ఇక్కడ స్టూడియోలు లేకపోయినా పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో తాత్కాలిక సెట్లు వేసుకుని షూటింగులు చేసుకోవచ్చని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

\- తిరుపతి (ఆంధ్రజ్యోతి)



రిలీజ్ డేట్ వచ్చేసింది



తమిళ హీరో సూర్య పోరాట యోధుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. అభిమానులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ సినిమా రిలీజ్ డేట్‌ను గురువారం మేకర్స్ ప్రకటించారు. దసరా కానుకగా అక్టోబర్ 10న చిత్రం దాదాపు పది భాషల్లో త్రీడీలో, 2డీలో విడుదలవుతోంది. ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌కు 'వేదాలమ్', 'వీరుడొక్కడే', 'వివేకం' వంటి చిత్రాలు తీసిన శివ దర్శకత్వం వహిస్తున్నారు. దిశాపటాని, యోగిబాబు, బాబీడియోల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'కంగువ' సినిమాను భారీ బడ్జెట్‌తో ప్రముఖ నిర్మాణ సంస్థలు స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్‌పై కేఈ జ్ఞానవేల్‌రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. అలాగే రజనీకాంత్ నటించిన 'వేట్టయాన్' చిత్రం కూడా అక్టోబర్ 10న విడుదల కానుంది. ఈ విషయాన్ని రజనీకాంత్ స్వయంగా ప్రకటించారు. ఇలా అగ్ర హీరోలు ఇద్దరు నటించిన రెండు భారీ చిత్రాలు ఒకే రోజు విడుదల కానుండటంతో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

'కల్కి' టీమ్‌కు థ్యాంక్స్




దర్శకుడిగా ఎన్నో సంచలన చిత్రాలను తెరకెక్కించి ఎంతో మంది నూతన దర్శకులకు ఆదర్శంగా నిలిచిన రామ్‌గోపాల్‌వర్మ.. 'కల్కి 2898 ఏ.డీ' సినిమాతో కొత్త అవతారం ఎత్తారు. గురువారం విడుదలై సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకున్న ఈ చిత్రంలో ఆయన ఓ అతిథి పాత్రలో మెరిశారు. ఇన్నేళ్లు సినీరంగంలో ఉన్న ఆయన.. ఓ సినిమాలో నటించడం మాత్రం ఇదే ప్రథమం. ఇందులో ఆయన పాత్ర చిన్నదైనా ఎంతో వినోదాత్మకంగా ఉందని సినిమా చూసిన వారంతా అనడం విశేషం. ఈ సందర్భంగా చిత్రబృందానికి, డైరెక్టర్‌కి థ్యాంక్స్ చెప్పి.. ఇందులో నటించిన వారందరినీ ప్రశంసించారు. ప్రభాస్ నటించిన ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించారు. వైజయంతీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అశ్వనీ దత్ నిర్మించిన ఈ చిత్ర కథ మహాభారతంతో మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యేలా, మొత్తం ఆరు వేల ఏళ్ల సంవత్సరాల వ్యవధిలో జరిగేలా తెరకెక్కింది.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 28 జూన్ 2024

కేన్సర్ చికిత్సలో ఆయనది అంతర్జాతీయ ఖ్యాతి. దేశ విదేశాలకు చెందిన ఎందరో ప్రముఖులకు ప్రాణదాత. ప్రపంచంలో ఆరోగ్య సంపదను పెంచడానికి నిరంతర కృషి చేస్తూనే... ఆధ్యాత్మిక సంపదను కూడా అపారంగా సంపాదించుకున్న డాక్టర్ నోరి దత్తాత్రేయుడు 'నివేదన'తో పంచుకున్న అనుభవాలివి.

చేయించేది ఆ సర్వాంతర్యామే



స్వానుభవం

దేవుడు, భక్తి... వీటిని ఎలా నిర్వచిస్తారు?

భక్తి మనలో వ్యక్తిగతంగా మొదలవుతుంది. "సూపర్ పవర్ ఒకటి ఉన్నది, అదే మనల్ని నడిపిస్తోంది. మనం నిమిత్తమాత్రులం" అని మనం నమ్మాలి. అప్పుడు మనం ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తాం. ఆ తరువాత అది సామాజికంగా మారుతుంది. ఇక దైవారాధన విషయానికి వస్తే... భారతదేశం, మన హిందూ సంస్కృతి... ఒక ఆధ్యాత్మిక సూపర్‌మార్కెట్. ఇక్కడ ఎందరో దేవుళ్ళు ఉన్నారు. ఎన్నో భక్తి మార్గాలు ఉన్నాయి. మనకు కావలసిన దైవాన్ని మనం పూజించుకొనే వెసులుబాటు ఉంది. ఇది మన హిందూమతానికి మాత్రమే ఉన్న ఒక ప్రత్యేకత. "మీకు ఇందరు దేవుళ్ళు ఎందుకున్నారు? ఇన్ని విగ్రహాలు ఏమిటి?" అని విదేశీ మిత్రులు నన్ను అడుగుతూ ఉంటారు. మాకు ఆధ్యాత్మికంగా, భక్తిపరంగా అంత వైవిధ్యం ఉందని నేను సమాధానం ఇస్తూ ఉంటాను. మనకు చదువులో అనేక స్థాయిలు ఉంటాయి. టెన్త్ తరువాత ఇంటర్ చదవాలి. ఆ తరువాత డిగ్రీ చేశాక పోస్ట్ గ్రాడ్యుయేషన్ చెయ్యాలి. ఆ తరువాత పిహెచ్‌డి చెయ్యాలి. అలాగే భక్తిలోనూ ఒక్కొక్క స్థాయినీ దాటుకుంటూ వెళ్ళాలి. పిహెచ్‌డి తరువాత మళ్ళీ వెనక్కి వెళ్ళక్కర్లేదు. అలాగే ఆధ్యాత్మికతలో... అత్యున్నత స్థాయికి చేరుకొని, 'దేవుళ్ళందరూ ఒక్కటే' అని అర్థమయిన తరువాత... విగ్రహాలన్నిటితో... మిగిలినవాటితో పని లేదు.

మీకు దైవ చింతన ఏ వయసులో బలపడింది?

మా తల్లితండ్రులకు దైవభక్తి ఎక్కువ. దైవ చింతన నాకు బాల్యం నుంచీ బలంగానే ఉంది. పిల్లలకు భక్తి, పూజా పునస్కారాలు నేర్పారు. నాకు అయిదారేళ్ళ వయసులో మా నాన్నగారు గతించారు. అప్పుడు నేను దేవుడి గదిలోకి వెళ్ళి, తలుపులు వేసుకొని... "మా నాన్నను నాకు తిరిగి ఇస్తావా? లేదా?" అని ఏడుస్తూ దేవుణ్ణి ప్రార్థించాను. దేవుణ్ణి ఇష్టపడే ధోరణి నాకు చిన్నప్పటినుంచీ ఉంది. ఏనాడూ ఆ విషయంలో నాకు రెండో ఆలోచన లేదు. ఆ పునాదులు కుటుంబంలోనే పడ్డాయి. క్రమేపీ భక్తి పెరిగింది.

'ఇది దైవసంకల్పం వల్ల జరిగింది' అనే సంఘటనలు ఏవైనా ఉన్నాయా?

మన జీవితంలో ప్రతిదీ దేవుడి ప్రమేయంతోనే జరుగుతుందనేది నా విశ్వాసం. అందులో మరో ఆలోచన లేదు. అయితే... 'ఆధ్యాత్మికత గొప్పదా? వైద్యం గొప్పదా?' అనే మీమాంస ఒకప్పుడు నాలో కలిగింది. ఎందుకంటే నాది సైన్స్ నేపథ్యం. సైన్స్ ప్రధానంగా వైద్యం... రుజువులను బట్టి ఫలితాన్ని నిర్ధారణ చేస్తాయి. 'ఒక అత్యున్నతమైన శక్తి అంటే సుప్రీమ్ పవర్ ఉంది, అన్నిటినీ అదే నడిపిస్తోంది' అనేది నా నమ్మకం. నేను వైద్యుణ్ణి అయ్యాక... దాన్ని మరింతగా నిర్ధారించుకున్నాను. వైద్యం, ఆధ్యాత్మికత అనేవి పరస్పర వ్యతిరేకమైనవి కావనీ, నిజానికి అవి పరస్పర దోహదకారులనీ అర్థమయింది. నేను ఎవరికైనా మంచి మందు ఇవ్వాలన్నా, ఆపరేషన్ చెయ్యాలన్నా... నా మనసు నిర్మలంగా ఉండడం, బుద్ధి పదునుగా ఉండడం ప్రధానం. దానికి ఆధ్యాత్మికత దోహదం చేస్తోంది. అది కాంప్లిమెంటరీ.

అమెరికాలో షిరిడీ బాబా ఆలయాలు కట్టించారు. ఆయన మీద గురి ఎలా కుదిరింది?

నేను కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్న రోజులవి. అప్పట్లో రాష్ట్రంలోనే అతి పెద్ద షిరిడీ సాయిబాబా ఆలయాన్ని... తుంగభద్ర తీరంలో నిర్మించారు. నేను సాయంత్రం ఆ ప్రాంతానికి వెళ్ళేవాణ్ణి. ఆ ఆలయంలో కూర్చున్నప్పుడు ప్రశాంతంగా అనిపించేది. ఆ తరువాత షిరిడీబాబా గురించి తెలుసుకోవాలని... 'సాయి సచ్చరిత్ర' లాంటి పుస్తకాలు చదివాను. ఆయన సిద్ధాంతాలు చాలా సరళంగా, ప్రభావం కలిగించేలా, సులువుగా అనుసరించేలా ఉన్నాయనిపించింది. ఆయన మీద భక్తి పెరిగింది. షిరిడీబాబాకు మనం సన్నిహితంగా వెళ్ళేకొద్దీ ఆయన అనేక అనుభవాలు కూడా కలిగిస్తూ ఉంటారు. అవి చమత్కారంగా ఉంటాయి.

మీ దృష్టిలో... ఇలాంటివి భక్తులందరికీ కలుగుతూ ఉంటాయా?

ఆయన మీద భక్తి పెరిగే కొద్దీ చమత్కారాలు ఎక్కువ చూపిస్తూ ఉంటారు. నిస్వార్థంగా, పరిపూర్ణమైన భక్తిభావం ఉన్నప్పుడు... మీ జీవితంలో ఇలాంటి అనుభవాలు కలుగుతూనే ఉంటాయి. మీరు చేయాల్సిందల్లా... వాటిని గమనించడం, అనుభూతి చెందడం మాత్రమే. అలాంటి మరో అద్భుతమైన సంఘటన ఏమిటంటే... అమెరికాలో వాణి అని షిరిడీబాబా భక్తురాలు ఒకామె ఉండేవారు. ఆమె భారతదేశం నుంచి అక్కడికి వచ్చారు. ఆసుపత్రిలో నా పని పూర్తి చేసుకున్నాక... ఆమెను కలుసుకొని... ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడుతూ ఉండేవాణ్ణి. బాబా గురించి ఎన్నో విషయాలు ఆమె చెబుతూ ఉండేవారు. ఒకసారి ఆమె ఏదో కథ చెబుతూ... "బాబాకు మాధవరావ్ దేశ్‌ముఖ్ అనే శిష్యుడు ఉండేవాడు..." అంటూ... "ఆ పేరు నాకెందుకో సరిగ్గా గుర్తుకు రావడం లేదు..." అని ఆపేశారు. అప్పటికే రాత్రి పదకొండయింది. "నాయనా! ఇప్పటికే ఆలస్యమైంది. నువ్వు ఇంటికి వెళ్ళు" అన్నారు. నేను ఇంటికి వచ్చాను. పదకొండున్నర అయింది. టిఫిన్ తింటూ... టీవీ ఆన్ చేశాను. అప్పుడొక ఇండియన్ ఛానెల్ వస్తోంది. మా వాళ్ళు ఇండియన్ ఛానెల్స్ కూడా పెట్టించారని నాకు తెలీదు. ఆ ఛానెల్‌లో షిరిడీ గురించిన కథ నడుస్తోంది... వాణిగారు తను చెబుతున్న కథ ఎక్కడైతే ఆపేశారో... నేను చూసేటప్పటికి అక్కడినుంచే టీవీలో కథ మళ్ళీ మొదలైంది. అందులో ఒక పాత్రధారి "మేరా నామ్ మాధవరావ్ దేశ్‌ముఖ్ నహీ హై... దేశ్‌పాండే" అని చెబుతున్నాడు. దీన్ని యాదృచ్ఛికం అందామా? దేవుడి ఉనికికి నిదర్శనం అందామా? బాబా మిమ్మల్ని ఎప్పుడూ గమనిస్తూనే ఉంటారు. ఇలాంటి సంఘటనల వల్ల భక్తి ఇంకా పెరుగుతుంది. భక్తి పెరిగినకొద్దీ దేవుడు మీకు స్నేహితుడవుతాడు. మీరతణ్ణి ఆజ్ఞాపించవచ్చు. డిమాండ్ చెయ్యవచ్చు. అయితే అది మీ సొంత ప్రయోజనాలకోసం మాత్రం కాకూడదు. నాలోనూ ఆ విధంగానే భక్తి పెరిగి... ఇంకేదైనా చేయాలనే ఆలోచనతో న్యూయార్క్‌లో గుడి కట్టాను. అమెరికాలో మొదటి షిరిడీ సాయి గుడి అదే. మిగిలిన రాష్ట్రాల వాళ్ళు కూడా అక్కడికి రావడం మొదలుపెట్టారు. వాళ్ళకు చాలా దూరం అవుతోందనే ఆలోచనతో... న్యూజెర్సీలో మరో గుడి కట్టాను.

మీకు అలాంటి అనుభవాలేవైనా కలిగాయా?

ఒకటీ రెండూ కాదు... ఎన్నో. నేను న్యూయార్క్‌లో బాబా ఆలయాన్ని కట్టాలనుకున్నాను. విగ్రహం సిద్ధమైంది. దాన్ని స్థాపించడానికి సరైన స్థలం దొరకలేదు. అక్కడ అనుమతులు చాలా కఠినంగా ఉంటాయి. భవనానికి స్థలం దొరికితే జోనింగ్ కావాలి. జోనింగ్ దొరికితే దానికి పార్కింగ్ కావాలి. అన్నీ ఉంటే తప్ప అనుమతులు ఇవ్వరు. అనువైన స్థలం కోసం దాదాపు ఆరేళ్ళపాటు వెతికాను. ఎక్కడా దొరకలేదు. షిరిడీబాబాకు గురువారం ప్రియమైన రోజు.



అలాంటి ఒక గురువారం నాడు... నేను పొద్దున్న పూజ చేసుకొనేటప్పుడు "బాబా! స్థలం వెతకడం ఇక నా వల్ల కాదు. ఆ ప్రయత్నం నేను వదిలేస్తున్నాను. మీ విగ్రహావిష్కరణ కోసం ఎవరో ఒకరిని మీరే వెతుక్కోండి" అని దాదాపు సవాల్ చేశాను. తరువాత క్లినిక్‌కు వచ్చాను. పేషెంట్స్‌ను పరీక్షిస్తున్నాను. ఉదయం బాబాకు చేసిన సవాలే నాకు మనసులో మెదులుతూ ఉంది. అప్పుడు ఒకామె వచ్చింది. అప్పటికి పదేళ్ళ ముందు ఆమెకు నేను కేన్సర్ నయం చేశాను. ఆమె ఫాలోఅప్ చెకప్ కోసం వచ్చింది. ఒకప్పుడు రోగులతో కుటుంబ సభ్యులతో ఉండేటంత చనువు ఉండేది. ఆ చనువుతోనే "అమ్మా! ఇప్పుడు మీరు ఏ ప్రొఫెషన్‌లో ఉన్నారు?" అని అడిగాను. "నేను రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో ఉన్నాను" అని ఆమె చెప్పింది. "నాకు నా అవసరానికి తగిన జోనింగ్, పార్కింగ్ ఉన్న స్థలం ఏదైనా చూపిస్తారా? ఎంత వెతికినా దొరకడం లేదు. వెతికి వెతికి విసుగుపుట్టింది" అని అడిగాను. "నేను ఆఫీసుకి వెళ్ళి, కంప్యూటర్లో చెక్ చేసి చెప్తాను" అంది. వెళ్ళిన కొంతసేపటికే ఆమె ఫోన్ చేసింది. "ఒకటి దొరికిందండీ! వాళ్ళ అపాయింట్‌మెంట్ తీసుకోనా?" అని అడిగింది. "అపాయింట్‌మెంట్ అక్కర్లేదమ్మా! నేను ఇప్పుడే వచ్చేస్తున్నాను" అని చెప్పాను. వెళ్ళాను, స్థలాన్ని చూశాను, సంతకాలు పెట్టి, ఆ స్థలాన్ని తీసుకున్నాను. అప్పుడు నాకు 'గజేంద్రమోక్షం'లో 'నీవేతప్ప నితఃపరంబెరుగ...' అనే పద్యం గుర్తుకువచ్చింది. 'నాపని అయిపోయింది. ఆ పని మీరే చేసుకోవాలి' అని నేను అన్న తరువాత... ఆయన వెంటనే మార్గాన్ని చూపించారు. 2001లో ఆలయ నిర్మాణం జరిగింది. ఇలాంటి చమత్కారాలు ఎన్నో జరిగాయి.

మీరే దేవుడని మీ పేషెంట్లు చాలామంది చెబుతూ ఉంటారు. వారికి మీరేం చెబుతారు?

"నాలో ఆధ్యాత్మిక దృక్పథం, నా వృత్తిని ప్రేమించే తత్త్వం ఉన్నాయి కాబట్టి నా ద్వారా భగవంతుడు మీకు సాయం చేశాడు. ఆయన నన్ను ఒక సాధనంగా ఎంచుకున్నాడు" అని చెబుతాను. అలా చెప్పడంవల్ల వాళ్ళలోనూ భక్తి భావన పెరుగుతుంది. అంతా నేనే చేస్తున్నాననే అహంకారం మీలో ఏర్పడితే... అక్కడితో మీ అధ్యాయం పూర్తయినట్టే. కాబట్టి ఇవన్నీ నా ద్వారా ఆ సర్వాంతర్యామి చేయిస్తున్నాడనే నేను అనుకుంటాను.

సంభాషణ: **కృష్ణశర్మ**

కాళింగ నర్తన పెరుమాళ్ ఆలయం

ఆలయదర్శనం




ఏ ఆలయమైనా... గర్భగుడిలో ఉన్న మూలవిరాట్ పేరిట ప్రాచుర్యం పొందడం సర్వసాధారణం. కానీ ఉత్సవమూర్తి పేరుతో ప్రసిద్ధి చెందిన ఆలయం ఒకటుంది. అదే శ్రీకాళింగ నర్తన పెరుమాళ్ ఆలయం. తమిళనాడులోని ఊతుక్కాడులోని ఈ ఆలయానికి వెయ్యేళ్ళకు పైగా చరిత్ర ఉంది. ఇక్కడి ప్రధాన దైవం... శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీ వేదనారాయణ పెరుమాళ్. ఈ కోవెలను శ్రీకాళింగ నర్తన పెరుమాళ్ సన్నిధిగా వ్యవహరించడానికి కారణాన్ని స్థలపురాణం వివరిస్తోంది.

పూర్వం ఊతుక్కాడ్‌లో అతి పురాతనమైన వేదనారాయణస్వామి ఆలయాన్ని దర్శించుకోవడానికి నారద మహర్షి వచ్చాడు. ఆలయంలోకి వెళ్ళే ముందు... కళింగమాడు అనే పేరుతో అక్కడ ఉన్న చిన్న కొలనులో స్నానం చేశాడు. అప్పుడు ఆయనకు... కాళీయ మర్దన భంగిమలో ఉన్న కృష్ణుడి విగ్రహం దొరికింది. దాన్ని ఆయన ఆలయంలోకి తీసుకువెళ్ళి... వేదనారాయణుడి సన్నిధిలో ఉంచాడు. తమిళంలో కాళీయుణ్ణి కాళింగుడిగా వ్యవహరిస్తారు. కాళీయుడి (కాళింగుడి) పడగల మీద నర్తిస్తున్నట్టున్న ఆ విగ్రహం... శ్రీకాళింగ నర్తన పెరుమాళ్‌గా... రుక్మిణీ, సత్యభామా సమేతంగా పూజలు అందుకుంటోంది. కాగా, కాళీయ మర్దన నృత్య దృశ్యాన్ని... కామధేనువు పిల్లలైన నందిని, పట్టి అనే దివ్యమైన గోవుల ముందు, నారదుడి ముందు శ్రీకృష్ణుడు ప్రదర్శించాడనే మరో కథ ఉంది. దానికి గుర్తుగా... తాండవ కృష్ణుడి సమీపంలో ఆ రెండు గోవులు కూడా కనిపిస్తాయి. పడగ మధ్యలో మానవరూపం కలిగిన అయిదు తలల సర్పం మీద ఎడమపాదాన్ని ఉంచి, కుడి పాదాన్ని పైకి లేపి నర్తించే కృష్ణుడు... ఒక చేత్తో పాము తోకను తాకుతూ, మరో చేత్తో భక్తులకు అభయం ఇస్తూ ఉంటాడు. సాక్షాత్తూ నారదుడి అవతారంగా పేరుపొందిన శ్రీ వెంకట సుబ్బ అయ్యర్ (వెంకటకవి) ... ఈ స్వామిని స్తుతిస్తూ అనేక గీతాలను రాశారు.

ఈ ఆలయ ప్రధాన గోపురం ఆదిశేషుణ్ణి పోలి ఉంటుంది. ఈ ప్రాంగణంలో మహాలక్ష్మి ఆలయం ఉంది. ప్రధానద్వారానికి ఎడమవైపు నర్తించే వినాయకుడి విగ్రహం కనిపిస్తుంది. ఆలయం లోపల పంచముఖ ఆంజనేయుడు, ఆండాళ్, వరదరాజస్వామి, ఊతుక్కాడు వెంకటకవి మందిరాలు ఉన్నాయి. రోహిణీ నక్షత్రం రోజున ఈ ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహిస్తారు. మే, జూన్ నెలల మధ్యలో వసంతోత్సవం, శ్రావణమాసంలో కృష్ణాష్టమి ఉత్సవం జరుగుతాయి.

ఎలా వెళ్ళాలి?: తమిళనాడులోని కుంభకోణానికి సుమారు పద్నాలుగు కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. కుంభకోణం నుంచి బస్సులు, ప్రైవేటు వాహనాల్లో చేరుకోవచ్చు.

అదే వసుధైక కుటుంబం



ప్రపంచం ఒక పువ్వు లాంటిది. ప్రతి దేశం ఆ పువ్వులో ఒక రెక్క. ఒక రెక్కకు చీడపీడలు సోకితే... మిగిలిన రెక్కలన్నిటికీ వ్యాపిస్తాయి. ఆ పువ్వు జీవితం, సౌందర్యం ఆ వ్యాధి వల్ల నాశనమైపోతాయి. కాబట్టి పుష్పంలాంటి ఈ ప్రపంచం తాలూకు అందం, పరిమళం నాశనం కాకుండా పరిరక్షించే బాధ్యత మనలో ప్రతి ఒక్కరిపైనా ఉంది. మనదైన ఈ ప్రపంచం చాలా పెద్దది. ఇది అనేక రేకులతో అలరాలే అద్భుతమైన పుష్పం. ఈ విషయాన్ని మనం సమగ్రంగా అర్థం చేసుకొని, మనసు లోతుల్లో స్థిరపరుచుకున్నప్పుడు... నిజమైన శాంతి, ఐక్యత నెలకొంటాయి. దేశాల మధ్య యుద్ధాలనేవి పూరేకుల మధ్య ఘర్షణల్లాంటివి. పూరేకుల మధ్య పోటీ... చివరికి అన్ని రేకులూ రాలిపోవడానికి దారి తీస్తుంది. మొత్తం పుష్పం నాశనమైపోతుంది. విడివిడిగా ఉండడం, వైషమ్యం మన శక్తినీ, సామర్థ్యాన్నీ తగ్గిస్తాయి. అసలైన శక్తి కలిసి ఉండడంలో ఉంది, విడిపోవడంలో కాదు.

'మనమంతా ఒకటే' అని గ్రహిస్తే మొత్తం లోకం మన కుటుంబంగా... వసుధైక కుటుంబంగా మారుతుంది. ఈ జ్ఞానం మనలో ఉదయించినప్పుడు... కేవలం కొందరు వ్యక్తులకో, ఒక సమాజానికో, ఒక దేశానికో మనం పరిమితం కాము. ఈ సత్యాన్ని తెలుసుకుంటే మొత్తం విశ్వం మన సొంత ఇల్లు అవుతుంది. మొత్తం సృష్టి మనదే అవుతుంది. అత్యున్నతమైన దివ్య శక్తితో పరమాత్మ చైతన్యం సర్వత్రా వ్యాపించి ఉందనీ, ఆ దివ్య శక్తే ప్రతి చోటా భిన్నమైన పేర్లతో, భిన్నమైన రూపాలతో ఉందనీ మనం తెలుసుకున్నప్పుడు... ఎలాంటి విభజనలకూ ఆస్కారం ఉండదు. మనం సమగ్రమైన వ్యక్తులుగా రూపాంతరం చెందుతాం. నిరాడంబరత, నిష్కల్మషమైన, నిరాపేక్షమైన ప్రేమ మనలో నెలకొంటాయి. మన మాటల్లో, చేతల్లో దివ్యమైన ప్రేమ వ్యక్తమవుతుంది. అది ఇతరులను ప్రభావితం చేస్తుంది. వారి జీవితాలను రూపాంతరీకరిస్తుంది.

అత్యున్నతమైన దివ్య శక్తితో పరమాత్మ చైతన్యం సర్వత్రా వ్యాపించి ఉందనీ, ఆ దివ్య శక్తే ప్రతి చోటా భిన్నమైన పేర్లతో, భిన్నమైన రూపాలతో ఉందనీ మనం తెలుసుకున్నప్పుడు... ఎలాంటి విభజనలకూ ఆస్కారం ఉండదు.

లోకంలో ఉన్న మనమందరం ఒక అజేయమైన శక్తి. మనమందరం పరస్పర ప్రేమాభిమానాలతో చేయీ చేయీ కలిపి పని చేసినప్పుడు... ఆ శక్తి అద్భుతాలు చేస్తుంది. నిరంతరమైన ఐక్యతతోనే నిజమైన ప్రగతి, శాంతి సాధ్యం అవుతాయి. ఒక చుక్క నీరు నదిగా మారదు... ఎన్నో చుక్కల నీరు కలిస్తేనే అది సాధ్యమవుతుంది. అసంఖ్యాకమైన నీటి చుక్కలు కలిసి చిన్న ప్రవాహం అవుతాయి. జీవితం అనే ప్రవాహం కదలాలంటే... ఎందరో వ్యక్తుల సహాయ సహకారాలు కావాలి. జీవితం సజావుగా సాగాలంటే ఐక్యత, ప్రేమ అవసరం.

కలిసి ప్రార్థన, ధ్యానం చేస్తే... మనలోని ప్రాణ శక్తి ఒకే ప్రవాహంలా... సామరస్యంగా ప్రవహిస్తుంది. ప్రేమ మాధుర్యంతో నిండిన దివ్య సుగంధాన్ని వ్యాప్తి చేస్తుంది. వాతావరణంలో శాంతి, ఐక్యతల ప్రకంపనలను సృష్టిస్తుంది. అత్యున్నత శక్తి ఒకటేనే భావనను మనలో కలిగించి, విభజన భావాలన్నిటినీ తొలగిస్తుంది. అప్పుడు మన హృదయాలు వికసిస్తాయి. 'లోకస్సమస్తా సుఖినో భవంతు' అని ప్రార్థించడానికే కాదు.... లోకుల సుఖ సంతోషాల కోసం పాటుపడడానికి ప్రేరణ కలిగిస్తాయి. విశ్వశాంతికి సోపానాలవుతాయి.

శ్రీ మాతా అమృతానందమయి

చింతన

తెలివైనవారు ఎవరు?

ప్రస్తుతం ప్రతి మనిషి ఏదో ఒకదానికోసం పాకులాడుతున్నాడు. అయితే మనం దేనికోసం పాకులాడాలి? మన హృదయంలో కొలువైన, మనలో ఉన్న భగవంతుడితో అనుబంధం పెంచుకోవడం కోసం పాకులాడాలి. అప్పుడు మనకు దుఃఖం, బాధ కలిగించేవి ఎన్ని ఎదురైనా... వాటి ప్రభావం మనమీద ఉండదు.

సాధారణంగా ఈ ప్రపంచం తీరు ఎలా ఉంటుందంటే... మిమ్మల్ని ఏవైతే దుఃఖానికీ, బాధకూ గురి చేస్తాయో... వాటిని అడ్డుకోవడానికి మీరు ప్రయత్నిస్తారు. మీ సమయాన్నంతా దానికోసం వృధా చేస్తూ ఉంటారు. దానికి బదులు మీలోని భగవంతుడితో అనుబంధం ఏర్పరచుకుంటే... అనవసరమైన విషయాల్లో మీ సమయం వృధా కాదు. సుఖాన్నీ, దుఃఖాన్నీ సమాన దృష్టితో చూసేవారే ఈ లోకంలో తెలివైనవారు. ఎందుకంటే... దుఃఖం శాశ్వతంగా ఉండదనీ, సుఖం కూడా శాశ్వతం కాదనీ వారికి తెలుసు. దుఃఖం ఎదురైనప్పుడు... కొంతకాలం ఓపికగా నిరీక్షిస్తే... సుఖం వస్తుంది. అలాగే సుఖంగా ఉన్నప్పుడు... కొంతకాలం గడిచాక దుఃఖం వస్తుంది. అవి అలా మారుతూనే ఉంటాయి.

నేను ఒకసారి నా ప్రసంగాన్ని వినిపించడం కోసం ఒక జైలుకు వెళ్ళాను. జైళ్ళలో పరిస్థితులన్నీ చాలా దారుణంగా ఉంటాయని ఎవరో చెప్పారు. అయితే, అందుకు కారణం ఏమిటి? జైల్లోని వాతావరణం పాడైపోవడానికి కారణం జైలు కాదు... అందులో ఉండే వ్యక్తులు. అక్కడ ఉన్నవారి దృష్టిని మంచి విషయాలమీదకు మళ్ళిస్తే... అక్కడ కూడా చక్కని వాతావరణం ఏర్పడుతుంది. జైలుకు వెళ్ళిన ప్రతిఒక్కరూ పోలీసులను, న్యాయవ్యవస్థను, ప్రభుత్వాన్నీ, కుటుంబ సభ్యులను, తమ ప్రత్యర్థులను దూషించడం ప్రారంభిస్తారు తప్ప తమలోని తప్పులను గమనించరు. కానీ క్రమక్రమంగా వారు దృష్టిని తమమీద కేంద్రీకృతం చేసుకున్నట్టయితే... రెండు విషయాలు అర్థమవుతాయి. ఒకటి... తాము ఆ తప్పు చేయకుండా ఉండాల్సిందని. ఈ ఆలోచన రావడం గొప్ప విషయమేం కాదు. రెండోదే చాలా ముఖ్యమైనది... తాము వ్యవస్థలను మార్చలేమనీ, కానీ తమను తాము మార్చుకోగలమనీ గ్రహించడం. అప్పుడు తమను తాము తెలుసుకుంటారు. అలా తెలుసుకున్నాక జీవితంలోని ప్రతి రోజునూ ఆస్వాదిస్తారు. అది అసాధ్యమేం కాదు. మనం ఏమిటో మనకు తెలియకపోవడం వల్లనే... దుఃఖాలు, బాధలతో సతమతమవుతున్నాం. మనం ఎవరో తెలుసుకుంటే... ఆనందంగా ఉంటాం. ఎన్నో ఏళ్ళ క్రితం సోక్రటీస్, కబీర్ దాస్ లాంటి ఎందరో మహాత్ములు ఇదే మాట చెప్పారు... "నిన్ను నువ్వు తెలుసుకో" అని.

మనిషిలో కోపం ఉంటుందని అందరూ అంటారు. కానీ ఆ మనిషిలోనే శాంతం కూడా నిక్షిప్తమై ఉందని అనుకోరు. కోపం ఉందని మీకు తెలుసు. ఎందుకంటే దాన్ని మీరు అనుభూతి చెందారు కాబట్టి. కానీ శాంతి ఉందని మీకు తెలియకపోవడానికి కారణం... ఆ అనుభూతిని మీరు పొందకపోవడం. అదేవిధంగా... మీలోనే భగవంతుడు కొలువై ఉన్నాడని చెబితే... అంగీకరించేవారు తక్కువ. ఇవన్నీ అనుభవపూర్వకంగా తెలుసుకోవలసిన విషయాలు. మీలో అపారమైన శక్తి సామర్థ్యాలు ఉన్నాయని కూడా మీరు అనుభూతి పొందనంతవరకూ తెలీదు. ఏది ఏమైనప్పటికీ ధైర్యాన్ని కోల్పోకపోవడం ప్రధానం. ఎన్ని సమస్యలు ఎదురైనా... ఆ సమస్యలకన్నా మీరు ఉన్నతమైనవారనేది గుర్తుంచుకోండి. ఈ విషయంలో చిన్న చీమను చూసి కూడా నేర్చుకోవచ్చు. కనుక... మిమ్మల్ని మీరు తెలుసుకోండి. మీ హృదయంలో ఉన్న శాంతిని స్వయంగా అనుభూతి చెందండి.





ప్రేమ్ రావత్
9246275220
www.premrawat.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/amiV3t4లో చదవండి.



గీతాసారం

సమగ్రమైన బుద్ధి

యోగం అంటే మన లోపలి, వెలుపలి భాగాల కలయిక. కర్మ, భక్తి, సాంఖ్య, బుద్ధి తదితర అనేక మార్గాల ద్వారా దీన్ని పొందవచ్చు. వ్యక్తులు తమతమ స్వభావాన్ని బట్టి... తమకు తగిన మార్గాల ద్వారా యోగాన్ని పొందుతారు. ఈ సమత్వ బుద్ధి యోగం కన్నా సకామకర్మ చాలా తక్కువ స్థాయికి చెందినది. కాబట్టి... "నీవు సమత్వ బుద్ధి యోగాన్ని ఆశ్రయించు. ఎందుకంటే ఫలాసక్తితో కర్మలు చేసేవారు అత్యంత దీనులు" అని అర్జునుడితో శ్రీకృష్ణుడు చెప్పాడు. అంతకుముందు కర్మయోగంలో ఉన్నవారి బుద్ధి పొందికగా ఉంటుందనీ, అస్థిరమైన వారి బుద్ధి నిలకడ లేకుండా ఉంటుందనీ కూడా అన్నాడు. ఒకసారి బుద్ధి సమగ్రత సాధిస్తే... భూతద్దం కాంతిని కేంద్రీకృతం చేసినట్టు... అది జ్ఞానోపాసనలో కేంద్రీకృతమై సమర్థతను పొందుతుంది. సరైన దిశ, గమనం కలిగి ఉంటుంది.

ఇక్కడ శ్రీకృష్ణుడు ప్రస్తావించింది... అంతరంగం వైపు ప్రయాణం గురించి. సాధారణంగా మనం బాహ్య (భౌతిక) ప్రపంచంలో కోరికలను నెరవేర్చుకోవడానికి తెలివిని ఉపయోగిస్తాం. అయితే మనం అంతరంగం వైపు ప్రయాణాన్ని కొనసాగించడానికి దాన్ని ఉపయోగించాలని భగవద్గీత బోధిస్తోంది.

మనలో పాతుకుపోయిన నమ్మకాలు, భావోద్వేగాలు, ఊహలు, ఆలోచనలు, చర్యలు, మనం మాట్లాడే పదాలు... ఇలా ప్రతిదాన్నీ ప్రశ్నించాలి. అంతర్గత ప్రయాణం కోసం పొందికైన మేధస్సును ఉపయోగించడంలో అదే మొదటి అడుగు. జ్ఞానం సరిహద్దులను దాటడానికి ప్రశ్నించడాన్ని విజ్ఞానశాస్త్రం ఉపయోగించినట్టు... మనం కూడా ఇటువంటి ప్రశ్నలను మనలోని పరమ సత్యాన్ని వెలికి తీయడానికి ఉపయోగించవచ్చు. చేసిన కర్మ తాలూకు ఫలాలను పొందాలనే ఆలోచనతో ఉన్నవారు దుఃఖితులని శ్రీకృష్ణుడు చెప్పాడు. కొన్నిసార్లు కర్మ ఫలాలు మనకు సుఖాన్ని ఇస్తాయి. కాబట్టి మనం ఈ ధోరణిని పెంపొందించుకుంటాం.

కానీ ధ్రువీకృత ప్రపంచంలో ప్రతి సుఖం కాలక్రమేణా బాధగా మారుతుంది. అది మన జీవితాలను నరకం చేస్తుంది అనే నిజాన్ని గుర్తుపెట్టుకోవాలి. శ్రీకృష్ణుడు మనలోని వైరుధ్యాల నుంచి మనల్ని రక్షిస్తానని వాగ్దానం చేయలేదు. కానీ ఆత్మతత్త్వాన్ని గ్రహించి వాటిని అధిగమించమని చెప్పాడు.



కె. శివప్రసాద్
ఐఏఎస్

సుభాషితం



మూర్ఖత్వానికి మందు లేదు

శక్యో వారయితుం జలేన హుతభుక్ఛత్రేణ సూర్యాతపో
నాగేంద్రో నిశితాంకుశేన సమదో దండేన గోగర్దభః
వ్యాధిర్భేషజ సంగ్రహైశ్చ వివిధైర్మంత్ర ప్రయోగైర్విషం
సర్వస్యౌషధమస్తి శాస్త్రవిహితం మూర్ఖస్య నాస్త్యౌషధమ్..

మూర్ఖుల ధోరణిని తన నీతిశతకంలోని ఈ శ్లోకంలో భర్తృహరి వివరించాడు. దాన్ని...

జలముల నగ్ని ఛత్రమున జండమయూఖుని దండతాడనం
బుల వృషగార్దభంబులను బొల్పగు మత్తకరీంద్రమున్ సృణిం
జెలగెడు రోగమౌషధముచే విషముందగు మంత్రయుక్తిని
మ్ముల దగజక్కజేయునగు మూర్ఖుని మూర్ఖత మాన్పవచ్చునే?... అంటూ పద్యరూపంలో తెలుగువారికి ఏనుగు లక్ష్మణకవి సమర్పించాడు.

భావం: నీటితో నిప్పును, మంటలను ఆర్పవచ్చు. ఎండ తీవ్రతను గొడుగుతో అడ్డుకోవచ్చు. పాము విషానికి విరుగుడుగా మంత్రం వెయ్యొచ్చు. మదించిన ఏనుగును అంకుశంతో అదుపు చెయ్యవచ్చు. ఎద్దులు, గాడిదలు లాంటి జంతువులను కర్రను ఉపయోగించి నిలువరించవచ్చు. ఔషధాలతో వ్యాధులను నివారించవచ్చు. కానీ మూర్ఖత్వాన్ని నిరోధించే, నివారించే మందు మాత్రం ఏ శాస్త్రంలోనూ చెప్పలేదు. అంటే మూర్ఖత్వాన్ని మాన్పే మందు ఎక్కడా లేదు.

అఫ్ఘాన్ కల చెదిరె..



కోచ్ ట్రాట్‌తో అఫ్ఘాన్ కెప్టెన్ రషీద్


సఫారీలు ఫైనల్ చేరె!

విజృంభించిన పేస్ త్రయం

9 వికెట్లతో దక్షిణాఫ్రికా జయభేరి



టరోబా (ట్రినిడాడ్): దక్షిణాఫ్రికా.. ఎట్టకేలకు ఐసీసీ టోర్నీలో సెమీస్ గండాన్ని దాటింది. చోకర్స్‌గా ముద్రపడిన సఫారీ బృందం తొలిసారి టీ20 వరల్డ్‌కప్ తుది పోరుకు దూసుకెళ్లింది. పేసర్లు నిప్పులు చెరగడంతో.. గురువారం జరిగిన సెమీఫైనల్-1లో దక్షిణాఫ్రికా 9 వికెట్లతో అఫ్ఘానిస్థాన్‌పై ఘనవిజయం సాధించింది. టోర్నీలో సంచలన ప్రదర్శనతో నాకౌట్‌కు చేరిన అఫ్ఘాన్ ఈ మ్యాచ్‌లో ఓడినా.. సగర్వంగా స్వదేశానికి తిరిగి వెళ్లనుంది. పేసర్లు మార్కో జెన్సన్ (3/16), రబాడ (2/14), నోకియా (2/7) టాప్ లేపడంతో.. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్ఘాన్ 11.5 ఓవర్లలో 56 పరుగులకే కుప్పకూలింది. టీ20ల్లో తమ అత్యల్ప స్కోరు నమోదు చేసింది. అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (10) టాప్ స్కోరర్ అంటే అఫ్ఘాన్ బ్యాటింగ్ ఎంత ఘోరంగా సాగిందో అర్థమవుతోంది. స్పిన్నర్ షంసీ 3 వికెట్లు తీశాడు. స్వల్ప లక్ష్యాన్ని సౌతాఫ్రికా 8.5 ఓవర్లలో 60/1 స్కోరు చేసి సునాయాసంగా నెగ్గింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ డికాక్ (5)ను ఫరూఖీ బౌల్డ్ చేసి షాకిచ్చాడు. కానీ, మరో ఓపెనర్ హెండ్రిక్స్ (29 నాటౌట్), కెప్టెన్ మార్‌క్రమ్ (23 నాటౌట్) అభేద్యంగా 43 బంతుల్లో 55 పరుగులు జోడించారు. దీంతో దక్షిణాఫ్రికా మరో 67 బంతులు మిగిలుండగానే అలవోకగా విజయాన్ని అందుకొంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా జెన్సన్ నిలిచాడు.



జెన్సన్

పెవిలియన్‌కు క్యూ..: సెమీస్ చేరేందుకు సర్వశక్తులూ ఒడ్డిన అఫ్ఘాన్.. కీలక మ్యాచ్‌లో కనీస పోరాటం కూడా చేయకుండా చేతులెత్తేసింది. నాకౌట్ మ్యాచ్‌ల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడంలో అఫ్ఘాన్ బ్యాటర్ల అనుభవలేమి బహిర్గతమైంది. సఫారీ బౌలర్ల దెబ్బకు టపటపా వికెట్లు రాలుతుంటే.. ఎలా అడ్డుకట్టవేయాలో కూడా వారికి బోధపడలేదు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న అఫ్ఘాన్ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ (0)ను ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే క్యాచవుట్ చేసిన జెన్సన్.. ప్రత్యర్థి పతనానికి నాంది పలికాడు. గుల్బదిన్ నైబ్ (9), జద్రాన్ (2), నబీ (0), ఖరోట్ (2) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో.. పవర్ ప్లేలో 28 పరుగులకు 5 కీలక వికెట్లను చేజార్చుకొన్న అఫ్ఘాన్ ఏదశలోనూ కోలుకోలేదు. ఒమర్‌జాయ్‌ను నోకియా క్యాచవుట్ చేయగా.. జనత్ (8)ను షంసీ ఎల్బీ చేశాడు. ఆదుకొంటాడనుకొన్న కెప్టెన్ రషీద్ (8)ను నోకియా పెవిలియన్ చేర్చడంతో అఫ్ఘాన్ పోరాటం ముగిసింది. నూర్ అహ్మద్ (0), నవీనుల్ (2)ను అవుట్ చేసిన షంసీ అఫ్ఘాన్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

స్కోరుబోర్డు

అఫ్ఘానిస్థాన్: గుర్బాజ్ (సి) హెండ్రిక్స్ (బి) జెన్సన్ 0, ఇబ్రహీం జద్రాన్ (బి) రబాడ 2, నైబ్ (బి) జెన్సన్ 9, ఒమర్‌జాయ్ (సి) స్టబ్స్ (బి) నోకియా 10, నబీ (బి) రబాడ 0, ఖరోట్ (సి) డికాక్ (బి) జెన్సన్ 2, జనత్ (ఎల్బీ) షంసీ 8, రషీద్ (బి) నోకియా 8, నూర్ అహ్మద్ (ఎల్బీ) షంసీ 0, నవీనుల్ (ఎల్బీ) షంసీ 2, ఫరూఖీ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 11.5 ఓవర్లలో 56 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-4, 2-16, 3-20, 4-20, 5-23, 6-28, 7-50, 8-50, 9-50; **బౌలింగ్:** జెన్సన్ 3-0-16-3, కేశవ్ మహరాజ్ 1-0-6-0, రబాడ 3-1-14-2, నోకియా 3-0-7-2, షంసీ 1.5-0-6-3.

సౌతాఫ్రికా: డికాక్ (బి) ఫరూఖీ 5, హెండ్రిక్స్ (నాటౌట్) 29, మార్‌క్రమ్ (నాటౌట్) 23; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 8.5 ఓవర్లలో 60/1; వికెట్ పతనం:** 1-5; **బౌలింగ్:** నవీనుల్ 3-0-15-0, ఫరూఖీ 2-0-11-1, రషీద్ ఖాన్ 1-0-8-0, ఒమర్‌జాయ్ 1.5-0-18-0, నైబ్ 1-0-8-0.

ఐసీసీ వరల్డ్‌కప్‌ల్లో ఆడిన 8 సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో సౌతాఫ్రికా నెగ్గడం ఇదే తొలిసారి. ఆరుసార్లు ఓడగా.. 1999లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్ టైగా ముగిసింది.

1 మిగిలి ఉన్న బంతుల పరంగా (67) టీ20ల్లో దక్షిణాఫ్రికాకు ఇదే అతిపెద్ద విజయం. 2007లో పాకిస్థాన్‌పై 51 బంతులు మిగిలుండగా గెలిచింది.

అఫ్ఘాన్ చేసిన 56 పరుగులు.. టీ20 వరల్డ్‌కప్ సెమీస్ మ్యాచ్‌ల్లో అత్యల్పం.

టీ20 వరల్డ్‌కప్‌లో అత్యల్ప స్కోర్లు
55- 2021 లో ఇంగ్లండ్‌పై వెస్టిండీస్
56- 2024 లో సౌతాఫ్రికాపై అఫ్ఘానిస్థాన్
60-2014 లో శ్రీలంకపై న్యూజిలాండ్
70- 2016 లో న్యూజిలాండ్‌పై బంగ్లాదేశ్

ఎప్పటికీ గుర్తుంచుకొంటాం: కెప్టెన్ రషీద్

ఈ వరల్డ్‌కప్‌ను ఎప్పటికీ గుర్తుంచుకొంటాం. జట్టులోని ప్రతి ఒక్కరూ ఎంతో శ్రమించారు. ఎంతటి జట్టునైనా ఓడించగలమన్న ఆత్మవిశ్వాసం కలిగింది. మా టీమ్‌ను చూసి ఎంతో గర్విస్తున్నా. తర్వాతి మెగా ఈవెంట్‌కు మరింత బలంగా బరిలోకి దిగుతాం.

ఇదేం పిచ్ అఫ్ఘాన్ కోచ్ ట్రాట్

పిచ్‌పై అఫ్ఘాన్ కోచ్ జొనాథన్ ట్రాట్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. సెమీస్ మ్యాచ్‌కు ఇలాంటి వికెట్‌ను ఎంపిక చేయడం సరికాదని అభిప్రాయపడ్డాడు. 'మాకు విజయం దక్కలేదన్న అక్కసుతో చెప్పడంలేదు. సెమీస్ స్థాయి మ్యాచ్‌కు ఇది తగిన పిచ్ కాదు. ఇరుజట్ల మధ్య న్యాయమైన పోరాటం జరగాలి. కానీ, బంతిని ఆడేందుకు బ్యాటర్లు ఎంతగా ఇబ్బందులు పడ్డారో మ్యాచ్‌ను చూసిన ప్రతి ఒక్కరికీ అర్థమవుతుంది. టీ20 క్రికెట్ అంటే బ్యాటర్లు ఎదురుదాడి చేయడం.. వికెట్లను కాపాడుకోవడం కాదు. అఫ్ఘాన్ తక్కువ స్కోరు చేయడం వల్ల సౌతాఫ్రికా నెగ్గింది. అంతేకానీ అసలు సిసలు పోరు జరగనేలేదు' అని ట్రాట్ అన్నాడు.

రెండేళ్ల క్రితం టీ20 వరల్డ్‌కప్ సెమీఫైనల్.. 169 పరుగుల ఛేదనను ఇంగ్లండ్ ఓపెనర్లే మెరుపు ఆటతీరుతో ముగించి భారత్‌కు ఘోర ఓటమిని అందించారు. ఇప్పుడు అదే టోర్నీ సెమీఫైనల్.. ఇంగ్లండ్ ముందు 172 పరుగుల లక్ష్యం. ఈసారి ఏమవుతుందో అని ఓవైపు ఫ్యాన్స్ ఆందోళనపడినా.. భారత స్పిన్ ద్వయం కుల్దీప్ యాదవ్ (3/19), అక్షర్ పటేల్ (3/23) తమ సుడులు తిరిగే బంతులతో బట్లర్ సేనకు ఉచ్చు బిగించారు. దీంతో విలవిల్లాడిన ప్రత్యర్థి ఛేదనకు ఎంతో దూరంలో నిలిచిపోగా.. అటు భారత్ దశాబ్దం తర్వాత తుది పోరుకు అర్హత సాధించింది.

స్పిన్‌తో చుట్టేసి..

టైటిల్ పోరుకు భారత్

సెమీస్‌లో ఇంగ్లండ్ చిత్తు



రోహిత్ శర్మ (57)

రోహిత్ హాఫ్ సెంచరీ

చెలరేగిన అక్షర్, కుల్దీప్



గయానా: టీ20 వరల్డ్‌కప్‌లో జైత్రయాత్ర సాగిస్తోన్న టీమిండియా ఆశించినట్టుగానే.. ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఏకపక్షంగా ముగిసిన రెండో సెమీస్‌లో ఇంగ్లండ్ జట్టును 68 రన్స్ తేడాతో భారత్ చిత్తుగా ఓడించింది. అలాగే 2007, 2014 తర్వాత తుదిపోరుకు అర్హత సాధించిన భారత జట్టు శనివారం దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరులో తలపడనుంది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 171 పరుగులు చేసింది. రోహిత్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 57), సూర్యకుమార్ (36 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 47), హార్దిక్ (13 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 23) రాణించారు. జోర్డాన్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఇంగ్లండ్ 16.4 ఓవర్లలో 103 పరుగులకు కుప్పకూలింది. హ్యారీ బ్రూక్ (25), బట్లర్ (23) మాత్రమే ఆకట్టుకున్నారు. బుమ్రాకు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అక్షర్ నిలిచాడు.

స్పిన్‌కు దాసోహం

ఛేదన కోసం బరిలోకి దిగిన ఇంగ్లండ్ బ్యాటర్లు స్లో బంతులతో పాటు తక్కువ ఎత్తులో వచ్చిన బౌన్స్‌తో ఉక్కిరిబిక్కిరయ్యారు. ముఖ్యంగా స్పిన్నర్ అక్షర్ పటేల్ తన మ్యాజిక్ బంతులతో టాపార్డర్ నడ్డివిరవగా, ఆ తర్వాత కుల్దీప్ చెలరేగాడు. వీరి బౌలింగ్‌లో స్వీప్ షాట్లకు వెళ్లిన బ్యాటర్లు మూల్యం చెల్లించుకున్నారు. మూడో ఓవర్‌లో బట్లర్ మూడు ఫోర్లతో కాస్త భయపెట్టినా.. ఆ తర్వాత వికెట్ల పతనం కొనసాగింది. అక్షర్ తన తొలి బంతికే కీలక బట్లర్ వికెట్ తీయగా.. ఫిలిప్ సాల్ట్ (5)ను పేసర్ బుమ్రా అవుట్ చేయడంతో భారత శిబిరంలో సంబరాలు నెలకొన్నాయి. ఇక బెయిర్‌స్టో (0), మొయిన్ అలీ (8)లను అక్షర్ తన వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చడంతో ఇంగ్లండ్ 46/4 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో పడింది. మరో ఎండ్‌లో చైనామన్ కుల్దీప్ తన హవా చూపాడు. సామ్ కర్రాన్ (2)తో పాటు ఫామ్‌లో ఉన్న హ్యారీ బ్రూక్‌ను సైతం కుల్దీప్ అవుట్ చేయడంతో ఇక బట్లర్ సేన ఓటమి ఖరారైంది.



కుల్దీప్ (3/19)

రోహిత్-సూర్య అండగా..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు శుభారంభం దక్కలేదు. అయితే కెప్టెన్ రోహిత్ శర్మ వరుసగా రెండో హాఫ్ సెంచరీతో ఫామ్‌ను చాటుకోగా.. విడిలార్డర్‌లో సూర్యకుమార్, హార్దిక్ మెరుపులతో జట్టు సవాల్ విసిరే స్కోరందుకుంది. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు రషీద్, లివింగ్‌స్టోన్ కట్టడి చేశారు. గతంలో మూడు టీ20 వరల్డ్‌కప్ సెమీస్‌ల్లో అర్ధసెంచరీలు సాధించిన విరాట్ (9) తన పేలవ ఫామ్‌ను మళ్లీ చాటుకున్నాడు. మూడో ఓవర్‌లో ఓ అద్భుత సిక్సర్‌తో అదుర్స్ అనిపించి అదే ఓవర్‌లో టోప్లే బంతికి బౌల్డ్ అయ్యాడు. రోహిత్ మాత్రం ఎప్పట్లాగే ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగాడు. ఐదో ఓవర్‌లో తను రెండు ఫోర్లతో ఆకట్టుకోగా, పంత్ (4)ను సామ్ కర్రాన్ అవుట్ చేశాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 46/2 స్కోరుతో నిలిచింది. అయితే కెప్టెన్‌కు సూర్యకుమార్ జత కలవడంతో పరుగుల్లో వేగం పెరిగింది. ఏడో ఓవర్‌లో సూర్య తన దైన శైలిలో ఫైన్ లెగ్ వైపు సిక్స్ బాదాడు. అయితే 8 ఓవర్లు ముగిసిన వెంటనే కాసేపు భారీ వర్షం కురిసింది. వర్షం తగ్గినా మైదానం తడిగా ఉండడంతో 75 నిమిషాల పాటు మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. అనంతరం రోహిత్-సూర్య జోడీ అడపాదడపా భారీ షాట్లతో చెలరేగింది. 13వ ఓవర్‌లో రోహిత్ 6, సూర్య 6,4తో 19 రన్స్ రాగా స్కోరు కూడా 100 దాటింది. 36 బంతుల్లో అర్ధసెంచరీ సాధించిన రోహిత్‌ను స్పిన్నర్ రషీద్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 73 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు మరో ఓవర్ వ్యవధిలోనే సూర్యకుమార్ వికెట్‌ను పేసర్ ఆర్చర్ పడగొట్టాడు. చాలా ఎత్తుగా గాల్లోకి లేచిన క్యాచ్‌ను లాంగాన్‌లో జోర్డాన్ అందుకున్నాడు. ఈ దశలో బౌలర్లు కట్టుదిట్టమైన బంతులు వేయడంతో 14-17 ఓవర్ల మధ్య పరుగులు నెమ్మదించాయి. 18వ ఓవర్‌లో హార్దిక్ చెలరేగి వరుసగా రెండు సిక్సర్లతో గేరు మార్చే ప్రయత్నం చేశాడు. కానీ పేసర్ జోర్డాన్ హార్దిక్‌తో పాటు దూబేను గోల్డెన్ డకౌట్‌గా పెవిలియన్‌కు చేర్చి భారత్‌కు షాకిచ్చాడు. అయితే 19వ ఓవర్‌లో జడేజా (17 నాటౌట్) రెండు ఫోర్లతో 12 రన్స్ రాబట్టగా.. ఆఖరి ఓవర్‌లో అక్షర్ (10) సిక్సర్ బాది అవుటైనా.. భారత్ స్కోరు 170 దాటగలిగింది.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (బి) రషీద్ 57, కోహ్లీ (బి) టోప్లే 9, పంత్ (సి) బెయిర్‌స్టో (బి) కర్రాన్ 4, సూర్యకుమార్ (సి) జోర్డాన్ (బి) ఆర్చర్ 47, హార్దిక్ (సి) కర్రాన్ (బి) జోర్డాన్ 23, జడేజా (నాటౌట్) 17, దూబే (సి) బట్లర్ (బి) జోర్డాన్ 0, అక్షర్ పటేల్ (సి) సాల్ట్ (బి) జోర్డాన్ 10, అర్షదీప్ సింగ్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 171/7; వికెట్ల పతనం:** 1-19, 2-40, 3-113, 4-124, 5-146, 6-146, 7-170; **బౌలింగ్:** టోప్లే 3-0-25-1, ఆర్చర్ 4-0-33-1, కర్రాన్ 2-0-25-1, రషీద్ 4-0-25-1, జోర్డాన్ 3-0-37-3, లివింగ్‌స్టోన్ 4-0-24-0.

ఇంగ్లండ్: సాల్ట్ (బి) బుమ్రా 5, బట్లర్ (సి) పంత్ (బి) అక్షర్ 23, మొయిన్ (స్టంప్డ్) పంత్ (బి) అక్షర్ 8, బెయిర్‌స్టో (బి) అక్షర్ 0, బ్రూక్ (బి) కుల్దీప్ 25, కర్రాన్ (ఎల్బీ) కుల్దీప్ 2, లివింగ్‌స్టోన్ (రనౌట్) 11, జోర్డాన్ (ఎల్బీ) కుల్దీప్ 1, ఆర్చర్ (ఎల్బీ) బుమ్రా 21, రషీద్ (రనౌట్) 2, టోప్లే (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 16.4 ఓవర్లలో 103 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-26, 2-34, 3-35, 4-46, 5-49, 6-68, 7-72, 8-86, 9-88, 10-103; **బౌలింగ్:** అర్షదీప్ 2-0-17-0, బుమ్రా 2.4-0-12-2, అక్షర్ 4-0-23-3, కుల్దీప్ 4-0-19-3, జడేజా 3-0-16-0, హార్దిక్ 1-0-14-0.

1 ఈ మెగా టోర్నీలో ఇంగ్లండ్ తరఫున ఎక్కువ వికెట్లు (31) తీసిన బౌలర్లుగా ఆదిల్ రషీద్, జోర్డాన్

టీ20 వరల్డ్‌కప్‌ల్లో అధిక సిక్సర్లు (50) బాదిన రెండో బ్యాటర్‌గా రోహిత్. గేల్ (63) ముందున్నాడు. **2**

జార్జియా పెను సంచలనం

యూరో చాంపియన్‌షిప్

పోర్చుగల్‌కు షాక్ నాకౌట్‌లో ప్రవేశం

గ్లెసెన్‌కిర్చెన్ (జర్మనీ): అరంగేట్ర జట్టు జార్జియా అదరగొట్టింది. సూపర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో కెప్టెన్సీలోని పోర్చుగల్‌కు షాకిచ్చి యూరోపియన్ చాంపియన్‌షిప్ చరిత్రలో పెను సంచలనం సృష్టించింది. గ్రూప్ 'ఎఫ్'లో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో జార్జియా 2-0తో పోర్చుగల్‌ను చిత్తు చేసింది.. తద్వారా జార్జియా రౌండ్-16లో అడుగు పెట్టింది. అయితే పోర్చుగల్ ఇప్పటికే నాకౌట్‌కు చేరినందున ఈ పరాజయం ప్రభావం ఆ జట్టుపై పడలేదు. కానీ కీలకమైన ప్రీక్వార్టర్ ఫైనల్‌కు ముందు ఈ ఓటమి పోర్చుగల్ ఆటతీరును ప్రభావితం చేసే అవకాశం లేకపోలేదు. ఈ గ్రూపు నుంచి పోర్చుగల్, తుర్కియే చెరో ఆరేసి పాయింట్లతో నాకౌట్‌కు చేరగా..మూడో అత్యుత్తమ జట్టుగా జార్జియా కూడా ముందంజ వేసింది. నాకౌట్‌కు చేరాలంటే తప్పక గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో జార్జియా కసిగా ఆడింది. యువ ఆటగాడు ఖ్విచా కర్ట్‌స్కేలియా రెండో నిమిషంలోనే గోల్ చేసి పోర్చుగల్ దిమ్మతిరిగేలా చేశాడు. ప్రత్యర్థి రక్షణశ్రేణిని గందరగోళంలో పడేసిన ఖ్విచా జార్జియా ఖాతా తెరిచాడు. అనంతరం జార్జెస్ మికాడ్జే 57వ నిమిషంలో పెనాల్టీ కిక్‌ను గోల్‌గా మలిచాడు. ఇదే గ్రూపులో జరిగిన మరో మ్యాచ్‌లో తుర్కియే 2-1తో చెక్ రిపబ్లిక్‌ను ఓడించింది. ఈ ఓటమితో చెక్ జట్టు ఇంటిదారి పట్టింది. మరోవైపు జార్జియా విజయం..గ్రూప్ 'ఎ'లో మూడో స్థానంలో నిలిచిన హంగేరి జట్టును టోర్నీ నుంచి తిరుగుముఖం పట్టించింది. కాగా..నాకౌట్ సమరం శనివారం ప్రారంభం కానుంది. తొలి రోజు మ్యాచ్‌ల్లో స్విట్జర్లాండ్-ఇటలీ, జర్మనీ-డెన్మార్క్ తలపడతాయి.



గోల్ కొట్టిన ఆనందంలో కర్ట్‌స్కేలియా

పదేళ్ల తర్వాత తొలిసారి..



లారా వోల్వార్ట్

భారత్ X దక్షిణాఫ్రికా ఢీ

నేటినుంచి చెన్నైలో ఏకైక టెస్ట్

ఉదయం 9.30 నుంచి స్పోర్ట్స్ 18లో

చెన్నై: మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి ఆత్మవిశ్వాసంతో ఉన్న భారత మహిళలు శుక్రవారం ఇక్కడ ప్రారంభమయ్యే ఏకైక టెస్ట్‌లో దక్షిణాఫ్రికాను ఢీకొనేందుకు సై అంటున్నారు. దశాబ్దం తర్వాత భారత్-సౌతాఫ్రికా జట్లు టెస్ట్ మ్యాచ్‌లో తలపడుతుండడం గమనార్హం. చివరిసారి 2014లో మైసూరులో ఆడిన టెస్ట్‌లో మన మహిళలు 34 పరుగులతో నెగ్గారు. ఇకపోతే.. మన మహిళల క్రికెట్ సిరీస్‌లలో క్రమం తప్పకుండా టెస్ట్‌లు లేని నేపథ్యంలో..సఫారీలతో ఈ మ్యాచ్‌లో ఐదుగురు క్రీడాకారిణులు అరంగేట్రం చేసేందుకు ఎదురు చూస్తున్నారు. ఉమా ఛెత్రి, ప్రియా పూనియా, సైకా ఇషాఖ్, తెలుగు క్రికెటర్లు అరుంధతి రెడ్డి, షబ్నమ్ షకీల్ వీరిలో ఉన్నారు. మరోవైపు భారత జట్టు చివరిసారి గత డిసెంబరులో టెస్ట్ మ్యాచ్‌లు ఆడింది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్లతో జరిగిన ఒక్కో టెస్ట్‌లో మనోళ్లు విజయం సాధించారు. దక్షిణాఫ్రికాపై వన్డే సిరీస్‌లో బ్యాటింగ్‌లో అదరగొట్టిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్, వైస్-కెప్టెన్ మంధాన అదే జోరు కొనసాగిస్తారని భారత్ భావిస్తోంది. ఇంగ్లండ్, ఆసీస్‌తో టెస్ట్ మ్యాచ్‌లలో అద్భుతంగా రాణించిన జెమీమా కూడా సత్తా చాటాలి. ఇక షఫాలీ వర్మ, దీప్తిశర్మ.. ప్రస్తుతం టెస్ట్‌ల్లో భారత్ తరఫున అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్లలో రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. వీరు కూడా బ్యాట్ ఝుళిపిస్తే భారత్‌కు తిరుగుండబోదు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్లను వణికించిన దీప్తిశర్మ, పూజా వస్త్రాకర్ ఆ ప్రదర్శను పునరావృతం చేస్తారని ఆశిస్తోంది. చెపాక్ పిచ్ స్పిన్‌కు అనుకూలించనుండడంతో.. స్నేహ్ రాణా ఆఫ్ స్పిన్‌ను ఎదుర్కోవడం సఫారీలకు సవాలే. రెండేళ్లలో కేవలం ఒక టెస్టే ఆడిన సౌతాఫ్రికా జట్టులో కూడా ఐదుగురు క్రికెటర్లు ఈ ఫార్మాట్‌లో అరంగేట్రానికి సిద్ధంగా ఉన్నారు. కెప్టెన్ వోల్వార్ట్, ఆల్‌రౌండర్లు సునె లుస్, డెల్మీ టకర్, బౌలర్లు క్లాస్, అనెకా బాష్, మ్లాబా కీలకం కానున్నారు. చెపాక్ పిచ్‌పై ఎప్పుడో 1976లో ఏకైక మహిళా టెస్ట్ మ్యాచ్ జరిగింది. భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన ఆ మ్యాచ్ డ్రాగా ముగిసింది.



జట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ కౌర్, (కెప్టెన్), స్మృతీ మంధాన, షఫాలీ వర్మ/ప్రియా పూనియా, సుభా సతీష్, జెమీమా రోడ్రిగ్స్ రిచా ఘోష్ (కీపర్), దీప్తి శర్మ, స్నేహ్ రాణా, అరుంధతి రెడ్డి, పూజా వస్త్రాకర్/రేణుకా ఠాకూర్, రాజేశ్వరీ గైక్వాడ్.

దక్షిణాఫ్రికా: లారా వోల్వార్ట్ (కెప్టెన్), అనేకె బాష్, సునే లుస్, తజ్మిన్ బ్రిట్స్, మరిజానే కాప్, డెల్మీ టకెర్, డి క్లెర్క్, సినాలో జఫ్టా, మ్లాబా, మసబాటా క్లాస్, టుమి సెఖుకునే/డెర్క్‌సెన్.

పాహల్‌కు ఒలింపిక్ బెర్త్



పంచకుల (హరియాణా): మహిళల 400 మీటర్ల రేసులో కిరణ్ పాహల్ పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకుంది. గురువారం ఇక్కడ జరిగిన జాతీయ అంతరాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాహల్ 400 మీటర్ల సెమీఫైనల్లో 50.92 సెకన్లలో గమ్యాన్ని చేరుకొని ఫైనల్ చేరింది. దీంతో పారిస్ క్రీడల క్వాలిఫయింగ్ మార్క్ అయిన 50.95 సెకన్ల టైమింగ్‌ను అధిగమించడంతో పాహల్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. హరియాణాకు చెందిన పాహల్‌కు ఈ సీజన్‌లో ఇదే అత్యుత్తమ టైమింగ్.

శ్రీలంక క్రికెట్ చీఫ్ కోచ్ రాజీనామా

కొలంబో: టీ20 వరల్డ్‌కప్‌లో శ్రీలంక జట్టు పేలవ ప్రదర్శన నేపథ్యంలో హెడ్ కోచ్ క్రిస్ సిల్వర్‌వుడ్ తప్పుకొన్నాడు. కన్సల్టింగ్ కోచ్‌గా జయవర్దనె వైదొలిగినప్పుడే సిల్వర్‌వుడ్ కూడా రాజీనామా చేస్తాడని భావించారు.ప్రస్తుతం జరుగుతున్న పొట్టికప్‌లో లంక సూపర్-8కు కూడా చేరలేదు. 2022లో లంక కోచ్‌గా సిల్వర్‌వుడ్ బాధ్యతలు చేపట్టాడు. అతడి హయాంలో శ్రీలంక 2023 ఆసియాకప్ ఫైనల్ చేరింది. అయితే, వన్డే వరల్డ్‌కప్‌లో చెత్తగా ఆడింది.

నాకంటే వెయ్యి రెట్లు ఉత్తమం

బుమ్రాకు కపిల్ ప్రశంస





న్యూఢిల్లీ: స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాపై భారత క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్ ప్రశంసల వర్షం కురిపించాడు. తాజా ప్రపంచకప్‌లో అతడు వైవిధ్యమైన బంతులతో ఆకట్టుకుంటున్నాడని తెలిపాడు. అందుకే బుమ్రా తన కంటే వెయ్యి రెట్లు అద్భుతమైన బౌలర్‌గా కితాబిచ్చాడు. ఇప్పటి ఆటగాళ్లలో చక్కటి నైపుణ్యం ఉందని, అనుభవం గడించేకొద్దీ మరింత రాటుదేలుతారని తేల్చాడు. ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడంలోనూ తీవ్రంగా శ్రమిస్తుండడం శుభ పరిణామమని, అంతర్జాతీయ క్రికెట్‌లో గొప్ప ఆటగాళ్లుగా రాణించేందుకు ఇదెంతో దోహదపడుతుందని కపిల్ చెప్పుకొచ్చాడు.

1న ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ



- 65,18,496 మంది పింఛనుదారులకు రూ.4,399.89 కోట్లు
- ఒక్కరోజులోనే పంపిణీకి ఏర్పాట్లు: సీఎస్ నీరబ్ కుమార్

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సామాజిక భద్రతా పింఛన్లను జూలై 1న పింఛనుదారుల ఇంటి వద్దే పంపిణీ చేయడానికి పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి అయన అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పింఛన్ల పంపిణీ విషయంలో అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 65,18,496 మంది పింఛనుదారులకు రూ.4,399.89 కోట్లను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పింఛన్లు ఒక్కరోజులోనే పంపిణీ చేయించాలని సూచించారు. అనివార్య కారణాల వల్ల ఇంకా ఎవరన్నా మిగిలిపోయి ఉంటే రెండోరోజు కూడా పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. వృద్ధులు, వితంతువులు తదితర 11 ఉప విభాగాలకు చెందినవారి పింఛను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచిన నేపథ్యంలో 1వ తేదీన రూ.4 వేలతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన ఎరియర్స్ కలుపుకుని మొత్తం రూ.7వేలు పంపిణీ చేయాలని ఆదేశించారు. రెండో కేటగిరీలో పాక్షిక దివ్యాంగులకు రూ.3వేల నుంచి రూ.6వేలకు, మూడో కేటగిరీలోని పూర్తిస్థాయి దివ్యాంగులకు రూ.5 వేల నుంచి రూ.15 వేలకు, నాలుగో కేటగిరీలోని కిడ్నీ, తలసేమియా తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి రూ.5వేల నుంచి రూ.10వేలకు పింఛను సొమ్ము పెంచిన విధంగా పంపిణీ చేయాలని సూచించారు. ఐదో కేటగిరీలోని వారికి ఏ మార్పు లేకుండా యథావిధిగా పింఛను సొమ్మును పంపిణీ చేయాల్సి ఉందని తెలిపారు. 64.75 లక్షల మంది పింఛనుదార్ల ఇళ్ల వద్ద రూ.4,369.82 కోట్లు, మిగిలిన మొత్తాన్ని రాష్ట్రం బయట ఉండే 43వేల మంది పింఛనుదారులు, బయట చదువుకునే దివ్యాంగ విద్యార్థులకు డీబీటీ పద్ధతిలో పంపిణీ చేయాలని ఆదేశించారు. ఇళ్ల వద్ద నగదు రూపేణా పంపిణీ చేయాల్సిన పింఛను సొమ్మును 29వ తేదీ శనివారం సంబంధిత బ్యాంక్ బ్రాంచ్‌ల నుంచి డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. జూలై 1న ఉదయం 6 గంటల నుంచి పింఛనుదారుల ఇంటి వద్దే సొమ్మును పంపిణీ చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పాటు అవసరం మేరకు ఇతర శాఖల ఉద్యోగుల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఒక్కో ఉద్యోగి 50 గృహాల చొప్పున పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అప్పగించే విధంగా క్లస్టర్ల వారీగా మ్యాపింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం నాటికి పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.

సీఎస్ నీరబ్ సర్వీస్ పొడిగింపు

- ఆరు నెలలు సర్వీస్ పొడిగించిన ప్రభుత్వం
- కేంద్రం అనుమతివ్వడంతో ఉత్తర్వులు జారీ

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీ కాలాన్నీ ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెలాఖరున నీరబ్ పదవీ విరమణ చేయాల్సి ఉంది. కానీ మరో ఆరు నెలల పాటు ఆయన సేవలు తమ రాష్ట్రానికి కావాలని కేంద్రానికి కూటమి ప్రభుత్వం లేఖ రాసింది. కేంద్రం అనుమతి ఇవ్వడంతో ఈ ఏడాది డిసెంబర్ వరకూ ఆయన సీఎస్‌గా కొనసాగుతారు. కాగా, సీనియారిటీ లేకపోయినా గత ప్రభుత్వం జవహర్ రెడ్డిని సీఎస్‌గా నియమించింది. ఎన్నికల సమయంలో వైసీపీకి కొమ్ముకాస్తూ ఆయన అడ్డగోలు నిర్ణయాలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయన సెలవుపై వెళ్లిపోయారు. వాస్తవానికి సీనియార్టీలో నీరబ్‌కుమార్ ప్రసాద్ మొదటిస్థానంలో ఉన్నారు. కానీ గత ప్రభుత్వం ఆయన్ను కాదని సీనియార్టీలో ఐదో స్థానంలో ఉన్న జవహర్ రెడ్డిని సీఎస్‌గా నియమిచింది. దీనిపై అప్పట్లో సీనియర్ ఐఏఎస్‌లంతా అభ్యంతరం వ్యక్తం చేసినా వారి గోడు ఎవ్వరూ వినిపించుకోలేదు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం సీనియార్టీని పరిగణలోకి తీసుకుని మొదటిస్థానంలో ఉన్న నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను సీఎస్‌గా నియమించింది. ఆయన సర్వీస్‌ను కూడా మరో ఆరు నెలలు పొడిగించింది.

తిరుమల నుంచే ఆలయాల ప్రక్షాళన : ఆనం



నెల్లూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శ్రీవారి ఆలయం నుంచే ఆలయాల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. పీఠాధిపతులు, అర్చకులు, పెద్దల సహకారం, ఆలోచనలతో ఆలయాల అభివృద్ధికి, పునర్నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. దేవాలయాల్లో ధూప దీప నైవేద్యాల ఖర్చుల నిమిత్తం గతంలో ఇస్తున్న రూ.5,000ను రూ.10 వేలకు పెంచేలా ప్రతిపాదన సీఎం దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. .

జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా కుదరదు : దాడి



అనకాపల్లి టౌన్, జూన్ 27: జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా రాదని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు స్పష్టం చేశారు. 'చట్టసభల్లో ఆనవాయితీలకు, సభాపతి ఇచ్చే రూలింగ్‌లకు సభ నియమాలతో సమానంగా ప్రాధాన్యం ఉంటుంది. మొట్ట మొదటి లోక్‌సభ స్పీకర్ దాదాసాహెబ్ జీవీ మవలంకర్ 1952లో ప్రతిపక్ష నాయకుని గుర్తింపునకు నిబంధనలను ప్రకటించారు. అధికార పార్టీ తరువాత అత్యధిక సంఖ్య ఉన్న ప్రతిపక్ష పార్టీ నేతకి అధికారిక హోదా ఇవ్వాలని, కానీ అది కూడా మొత్తం సభ్యుల సంఖ్యలో 10%కి తక్కువ కాకుండా సభ్యులుండాలనే విధాన నిర్ణయాన్ని అమలు చేశారు. అప్పటి నుంచి 72 ఏళ్లుగా పార్లమెంట్ ఉభయ సభల్లోనూ, దేశంలోని అన్ని రాష్ట్ర శాసనసభలు, మండళ్లలోనూ ఇదే విధానం కొనసాగుతున్న విషయం జగన్‌కు తెలియనట్టు నటించడం విచారకరం' అని దాడి పేర్కొన్నారు.

పోలవరంపై నేడే శ్వేతపత్రం

- ఈఎన్‌సీ, అధికారులతో మంత్రి నిమ్మల కసరత్తు

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో విధ్వంసానికి గురైన పోలవరం జాతీయ ప్రాజెక్టు స్థితిగతులపై రాష్ట్రప్రభుత్వం శుక్రవారం శ్వేతపత్రం విడుదల చేయనుంది. ఇందుకు సంబంధించి జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం రాత్రి పొద్దుపోయేదాకా ఈఎన్‌సీ, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. సీఎం చంద్రబాబుతోనూ సమావేశమయ్యారు. శుక్రవారం ఉదయం మరోసారి కలిసి శ్వేతపత్రంపై చర్చిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు అమరావతి సచివాలయంలో దీనిని విడుదల చేస్తారని అంటున్నారు. కేంద్రం నియమించిన అంతర్జాతీయ నిపుణులు శనివారం (29న) ప్రాజెక్టు ప్రాంతానికి రానున్నారు. డయాఫ్రం వాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు, ఇతర నిర్మాణాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలా ముందుకెళ్లాలో నివేదిక ఇస్తారు. దాని ఆధారంగా పనులు చేపట్టడంపై కేంద్రంతో సంప్రదించి రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అంటున్నారు. నిర్మాణంలోని వాస్తవాలన్నిటినీ శ్వేతపత్రం ద్వారా ప్రజల ముందుంచుతుందని చెబుతున్నారు.

సెప్టెంబరు 21 నాటికి 203 అన్న క్యాంటీన్లు

- ఇబ్బంది లేకుండా భవనాలకు అనుమతులు : మంత్రి నారాయణ

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్లను వంద రోజుల్లోగా తిరిగి ప్రారంభించేలా ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి నారాయణ అన్నారు. గురువారం సీఆర్‌డీఏ కార్యాలయంలో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ సింఘాల్‌తో కలిసి పలు కీలక అంశాలపై అధికారులతో చర్చించారు. సెప్టెంబరు 21 నాటికి అన్న క్యాంటీన్లు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. "ఆహారం సరఫరా చేసేందుకు అవసరమైన సర్వీస్ ప్రొవైడర్‌ను టెండర్ల ద్వారా ఎంపిక చేయాలి. టెండర్ల ప్రక్రియ కోసం కమిటీ నియమించాలి' అని అధికారులను ఆదేశించారు. పట్టణాభివృద్ధి సంస్థల ఆర్థిక పరిస్థితుల గురించి వివరాలు తెలుసుకున్న నారాయణ రెవెన్యూ పెంపుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని పట్టణ ప్రణాళికా శాఖ డైరక్టర్‌కు నారాయణ సూచనలు చేశారు. నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని లేఅవుట్ల అనుమతుల విషయంలో వస్తున్న ఫిర్యాదులపై కమిటీ నియమించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా పట్టణాల్లోని మహిళలకు ఆర్థిక స్వావలంబన తీసుకొచ్చే కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని మెప్మా అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. రోజువారీ కాలువల డీసిల్టింగ్ పర్యవేక్షించడానికి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఉపయోగించాలని మంత్రి నారాయణ ఆదేశించారు.

చిరుద్యోగులకు ఏడాదిన్నరగా జీతాలివ్వలేదు!

- వైసీపీ పాలకుల ఆర్థిక అరాచకాలు బయటపడుతున్నాయి
- నిధుల మళ్లింపుపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయండి
- కాంట్రాక్టర్ల బ్లాక్‌లిస్ట్ వివరాలూ అందజేయండి
- అధికారులకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశం



ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): డేటా ఎంట్రీ ఆపరేటర్ల లాంటి చిరుద్యోగులకు ఏడాదిన్నరగా జీతాలు చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం మూలంగా చిన్నపాటి ఉద్యోగుల కుటుంబాలు వేదనతో ఉన్నాయని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఒక్కో విభాగం లెక్కలు చూస్తుంటే వైసీపీ పాలకుల ఆర్థిక అరాచకం ఏ స్థాయిలో ఉందో తెలుస్తోందన్నారు. గత ప్రభుత్వం ప్రతి శాఖలో చేసిన ఆర్థిక అవకతవకలు, నిధుల మళ్లింపుపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగం ప్రారంభించిన రోడ్లు, వంతెనల పనులు, వాటికి కేంద్రం నుంచి వచ్చిన నిధులు, ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ) నుంచి సమీకరించిన రుణం, వాటి వినియోగంపై కూలంకషంగా చర్చించారు. ప్రధానంగా కేంద్రం అమలు చేసే పీఎంజీఎస్‌వై, ఆర్‌సీపీడబ్ల్యూఈ, ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకాల ద్వారా వచ్చిన నిధులు ఏ మేరకు వినియోగించారో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులు, అందుకు కారణాలతో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో రహదారులు ఏ మేరకు దెబ్బతిన్నాయో? ఎంత కాలం నుంచి మరమ్మతులు చేయడం లేదో, కేటాయించిన నిధులను ఏం చేశారో నివేదిక ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారులను నిర్మిస్తే ఆ మొత్తాన్ని రీయింబర్స్ చేస్తామని ఏఐఐబీ చెప్పిందని తెలిసి ఉపముఖ్యమంత్రి ఆశ్చర్యపోయారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో చేపట్టే పనులను సకాలంలో పూర్తి చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా, నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెడుతున్నారా? లేదా? అని ప్రశ్నించారు. వివరాలివ్వాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ నిధులతో ఏ ప్రాంతంలో ఏ పని చేస్తున్నామో, అందుకు సంబంధించి అనుసరించాల్సిన నాణ్యతా ప్రమాణాలు, బడ్జెట్ వివరాలు ప్రజలకు తెలియజేసేలా కచ్చితంగా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జగన్‌కు జనం గుణపాఠం!

- ప్రత్యర్థులపై కక్షగట్టి.. పాలనను విస్మరించారు: రేవంత్‌రెడ్డి
- టీడీపీని ఖతం చేయాలని పగబట్టారు
- చివరకు తన పార్టీనే ఖతం చేసుకున్నారు
- మనం చేసిన పాపాలు ఏదోనాడు మనల్నే మింగుతాయ్
- జగన్ తుడిచిపెట్టుకుపోవడమే దీనికి నిదర్శనం
- ఆయన అక్రమాలతో ఆంధ్రలో పరిశ్రమలు కుప్పకూలాయి
- బాబు ఫోన్ చేస్తే జగన్ ఇంటి వద్ద నిర్మాణాలు కూల్చామనడం అబద్ధం
- ఆయన అలాంటి చిల్లర పనులు చేయరు
- ఢిల్లీలో తెలంగాణ సీఎం వెల్లడి



న్యూఢిల్లీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అధికారం అనేది ప్రజలు మన పగ తీర్చుకోవడానికి ఇవ్వరని, మన కోపం తీర్చుకోవడానికి అధికారాన్ని ఉపయోగించుకోకూడదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైసీపీ అధినేత జగన్‌పై విమర్శల బాణాలు సంధించారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబుతో పాటు ఇతర రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలతో వ్యవహరించి, పాలనను విస్మరించినందువల్ల ప్రజల జగన్‌కు గుణపాఠం చెప్పారని అన్నారు. టీడీపీని ఖతం చేయాలని పగబట్టి చివరకు ఏమీ చేయకుండా తన పార్టీనే ఖతం చేసుకున్నాడని తెలిపారు. మనం చేసిన పాపాలు మనల్ని ఏదో ఒకనాడు మింగుతాయని చెప్పడానికి జగన్ తుడిచిపెట్టుకపోయిన ఉదంతమే ఉదహరణగా పేర్కొన్నారు. అంతకు మించిన శిక్ష ఆయనకు మరేమీ లేదన్నారు. రేవంత్ గురువారమిక్కడ తన నివాసంలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. జగన్‌కు ప్రజలు 150కి పైగా సీట్లు ఇచ్చినప్పుడు నమ్మకంతో ఇచ్చారని, కానీ ఆయన తప్పు చేయడంతో గద్దెదించారని అన్నారు. జగన్ వ్యవహార శైలే ఆయన్ను దెబ్బతీసిందని, తన వద్దకు వచ్చిన వైసీపీ ఎంపీలను తిట్టి పంపించారని.. వారు ఇతర పార్టీల్లో చేరి గెలిచివచ్చారని గుర్తు చేశారు. జగన్ చేసిన అక్రమాలతో ఏపీలో పరిశ్రమలు కుప్పకూలాయని, ఆ రాష్ట్రం దెబ్బతిన్నదని చెప్పారు. చంద్రబాబు తనకు ఫోన్ చేస్తేనే హైదరాబాద్‌లో జగన్ ఇంటివద్ద కూల్చివేతలు జరిపించానన్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. 'చంద్రబాబు నాకు ఫోన్ చేసే స్థాయి కాదు. ఆయన తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో అలాంటి చిల్లర పనులు చేయలేదు.. అలా దిగజారడం ఆయన వ్యక్తిత్వం కాదు..' అని స్పష్టం చేశారు. చంద్రబాబుతో తనకు వ్యక్తిగత సంబంధాలున్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలు, తన రాజకీయ భవిష్యత్ తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఒక మంత్రి పట్టుబట్టి, అధికారులను చీవాట్లు పెట్టి జగన్ ఇంటి వద్ద కట్టడాలను కూల్చివేయించారని.. ఆ మంత్రికి వైవీ సుబ్బారెడ్డి 50 సార్లు ఫోన్ చేసి ఆపించే ప్రయత్నం చేశారని.. ఖమ్మానికి చెందిన ఒక మంత్రి ద్వారా కూడా రాయబారం నడిపారని అన్నారు. జగన్ ఇంటివద్ద కూల్చివేతల విషయం తనకు తెలిసిన వెంటనే సదరు అధికారిని జీఏడీకి అటాచ్ చేశానని తెలిపారు.

పక్క రాష్ట్రాల్లోలా రాజకీయ కేసులుండవు

తెలంగాణలో ఇప్పటి వరకూ ఎలాంటి రాజకీయ ప్రేరేపిత కేసులు నమోదు కాలేదని రేవంత్ అన్నారు. గతంలో పక్క రాష్ట్రాల్లో జరిగినట్లు తమ పాలనలో ఉండవని తెలిపారు. చిన్న కేసు కూడా నమోదు కాలేదంటే మా పాలన బాగున్నట్లా, బాగా లేనట్లా అని ప్రశ్నించారు. విభజన చట్టంలోని పెండింగ్ అంశాలపై త్వరలోనే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసుకుని కేంద్రం నుంచి నిధులు, అనుమతులు తెచ్చుకుంటామని, ఏపీతో ఉన్న సమస్యలను పరిష్కరించుకుంటామని చెప్పారు. ఆంధ్ర సర్కారుతో చర్చలకు తమకు ఎటువంటి భేషజాలు లేవని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబుతో వీలైన మేరకు సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకుంటామని తెలిపారు. 'కేంద్రం వల్ల కూడా కాకపోతే సమస్యల పరిష్కారానికి కోర్టులున్నాయి. ఇరు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి వివిధ వేదికలను ఉపయోగించుకుంటాం. పక్క రాష్ట్రం అభివృద్ధి చెందితే అసూయపడం. మా రాష్ట్ర అభివృద్ధిపై అలసత్వం ప్రదర్శించం' అని రేవంత్ వ్యాఖ్యానించారు. తాను తెలంగాణ ముఖ్యమంత్రి కావడం, బీఆర్ఎస్ ఓటమి, కేసీఆర్‌ను గద్దెదించడం అనే తన మూడు రాజకీయ లక్ష్యాలు నెరవేరాయన్నారు. కేసీఆర్ తన అహంకారం, అతి తెలివితేటల వల్లే దెబ్బతిన్నారని తెలిపారు. గత రెండు ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్ పనిచేస్తే.. ఈసారి కేసీఆర్ వ్యతిరేక గాలి పని చేసిందని, ఆయన నియంతృత్వ పాలనపై తాను చేసిన పోరులో ప్రజలు భాగమయ్యారని చెప్పారు.

పరిశ్రమలు నెలకొల్పేవారికి ప్రోత్సాహకాలు

- ఎన్‌ఆర్‌ఐలు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- ఎంఎస్ఎంఈ దినోత్సవంలో మంత్రి కొండపల్లి పిలుపు
- 38 కొత్తపరిశ్రమలకు అనుమతి పత్రాలు అందజేత
- పారిశ్రామికవేత్తలకు రూ.9.39 కోట్ల రుణాల పంపిణీ



అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రవాసాంధ్రులు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ఎంఎస్ఎంఈ డే సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (ఫాప్సియా), ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి కొండపల్లి ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఏపీ నుంచి వెళ్లి వివిధ దేశాల్లో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐలు తిరిగి వచ్చి తమ తమ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టి చిన్న చిన్న పరిశ్రమలు స్థాపించాలని కోరారు. ప్రపంచ దేశాల అవసరాలపై అధ్యయనం చేసి.. ఆ తరహా ఉత్పత్తులను తయారు చేసే యూనిట్లను నెలకొల్పాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. అలాగే, ఉన్నత చదువులు పూర్తి చేసుకునే యువత కూడా ప్రభుత్వ ఉద్యోగాలు, విదేశాల్లో స్థిరపడాలనే ఆలోచనను మార్చుకుని రాష్ట్రంలోనే చిన్న చిన్న పరిశ్రమలు స్థాపించి తమతోపాటు మరికొంత మందికి ఉపాధి కల్పించే యువ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ యూనిట్లు నెలకొల్పే పారిశ్రామికవేత్తలను తమ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో అందుబాటులో ఉన్న వనరులను బట్టి 'వన్ డిస్ట్రిక్ట్ - వన్ ప్రొడక్ట్' అనే కార్యక్రమాన్ని చేపట్టి అందుకనుగుణమైన ఎంఎస్ఎంఈ యూనిట్లు నెలకొల్పేందుకు త్వరలోనే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈ నిర్వాహకుల సమస్యల పరిష్కారం కోసం ప్రతినెలా జిల్లాస్థాయిల్లో, ప్రతి మూడు నెలలకొకసారి రాష్ట్రస్థాయిలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. పీఎంఈజీపీ, ఎంఎస్ఎంఈ పథకాల కింద రూ.7.29 కోట్ల పెట్టుబడులతో కొత్తగా పరిశ్రమలు ప్రారంభించనున్న 38 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అనుమతి పత్రాలను అందజేశారు. కొత్తగా ఎంఎస్ఎంఈ యూనిట్లు ప్రారంభిస్తున్న మరో 12 మంది పారిశ్రామికవేత్తలకు వివిధ బ్యాంకులు మంజూరు చేసిన రూ.9.39 కోట్ల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తమ సంస్థల ద్వారా అందించే సేవలకు ప్రత్యేక డిస్కౌంట్ ఇవ్వడానికి ముందుకు వచ్చిన విజయవాడలోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, కేఎల్ యూనివర్సిటీ, టాలీ అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ సంస్థలతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలోనే ఫాప్సియా ప్రతినిధులు అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు.

ఏడీసీఎల్ సీఎండీగా లక్ష్మీ పార్థసారధి

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అమరావతి అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (ఏడీసీఎల్) చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీ పార్థసారథిని నియమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయంలో కూడా ఆమె ఇదే బాధ్యతలు నిర్వర్తించారు.

టీటీడీలో విజిలెన్స్ ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి)

సహా పలు ప్రాంతాలకు చెందిన శ్రీవారి భక్తులు ఇటీవల డీజీపీ, సీఐడీ విభాగం అధిపతి, హోంమంత్రిని కలసి టీటీడీలో అక్రమాలు జరిగాయంటూ ఫిర్యాదులు చేశారు. కొద్దిరోజుల కిందట సీఎం చంద్రబాబు తిరుమలకు వచ్చిన సమయంలోనూ కొందరు పలు అవకతవకలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. దేవస్థానం విభాగాల్లో రాష్ట్ర ప్రభుత్వం నేరుగా విజిలెన్స్ విచారణకు ఆదేశించడం టీటీడీ చరిత్రలోనే అరుదు. త్వరలో సీఐడీ అధికారులు కూడా రంగంలోకి దిగుతారని జరుగుతున్న ప్రచారంతో గత ఐదేళ్లలో అనుచిత నిర్ణయాలు తీసుకున్న అధికారులు ఇప్పుడు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఇంజనీరింగ్ పనుల్లో గోల్‌మాల్

2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాజీ సీఎం జగన్‌కు స్వయానా చిన్నాన్న అయిన వైవీ సుబ్బారెడ్డి నాలుగేళ్లకు పైగా టీటీడీ బోర్డు చైర్మన్‌గా కొనసాగారు. టీటీడీ చరిత్రలో ఏ బోర్డు చైర్మన్ కూడా చేయని స్థాయిలో ఆయన అధికారం చెలాయించారు. సుబ్బారెడ్డి అనంతరం ఎన్నికల వరకూ భూమన కరుణాకర్‌రెడ్డి చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన కూడా జగన్ కుటుంబానికి సన్నిహితుడుగా పేరుపడ్డారు. భూమన సైతం ఇంచుమించు వైవీ సుబ్బారెడ్డి తరహాలోనే అధికారం చెలాయించారు. మరోవైపు తిరుమల జేఈవో పోస్టులో డిప్యుటేషన్‌పై నియమితులైన ఏవీ ధర్మారెడ్డి తర్వాత అదనపు ఈవోగా పదోన్నతి పొంది ఐదేళ్ల పాటు కొనసాగారు. చివరి దశలో ఈవో జవహర్‌రెడ్డి బదిలీతో ధర్మారెడ్డే ఇన్‌చార్జి ఈవోగా పనిచేశారు. ఆయన కూడా జగన్‌కు అత్యంత సన్నిహితుడని పేరుంది. ఈ ముగ్గురూ గత ఐదేళ్లుగా టీటీడీ వ్యవహారాలను శాసించారు. వీరి పాలనలోనే టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇంజనీరింగ్ పనులకు భారీ ఎత్తున నిధుల కేటాయింపు జరిగింది. అంతకుముందు ఏడాదికి సగటున రూ.150 కోట్లు ఇంజనీరింగ్ పనులకు కేటాయించేవారు. అయితే గత ఐదేళ్లలో ఏకంగా రూ.3వేల కోట్లకు పైగా కేటాయించడం సంచలనం రేపింది. వైవీ సుబ్బారెడ్డి పదవీ కాలంలో రూ.వెయ్యి కోట్ల వరకూ కేటాయించగా, భూమన చైర్మన్‌గా పనిచేసిన ఏడాదిలోపే రూ.2వేల కోట్ల కేటాయింపులు జరిగాయి. పాలకమండలిలో కీలక వ్యక్తులు కమీషన్లకు కక్కుర్తి పడి, పర్సంటేజీల కోసమే అవసరం లేని నిర్మాణాలు కూడా ప్రతిపాదించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు అంతకుముందే పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టి బాగుచేసిన గోవిందరాజస్వామి సత్రాలను పూర్తిగా కూల్చివేసి కొత్తవి నిర్మించేందుకు రూ.600 కోట్లు కేటాయించారు. అలాగే నిక్షేపంగా ఉన్న స్విమ్స్ భవనాలను తొలగించి కొత్తవాటి నిర్మాణానికి రూ.300 కోట్లు కేటాయించారు. రోడ్ల నిర్మాణానికి సైతం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. ఈ వ్యవహారంపై అప్పట్లోనే ప్రభుత్వానికి ఫిర్యాదులు అందినా పట్టించుకోలేదు. ఇపుడు కొత్త ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది.

సలహాదారులకు రూ.లక్షలు సమర్పయామి


వైసీపీ హయాంలో టీటీడీలో అడ్డగోలు నియామకాలు పెద్ద ఎత్తున జరిగాయన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. ఆ పార్టీ కీలక నేతలకు కావాల్సిన వారిని అధికారులుగా, సలహాదారులుగా, ఉద్యోగులుగా నియమించారు. కొందరిని కాంట్రాక్టు ప్రాతిపదికన, మరికొందరిని రెగ్యులర్ పోస్టుల్లో నియమించారన్న ఆరోపణలు వచ్చాయి. సలహాదారులకు భారీగా జీతభత్యాలు చెల్లించారు. గతంలో టీటీడీలో ఏ విభాగానికీ ఇలా సలహాదారులను నియమించింది లేదు. అకౌంట్స్ విభాగానికి నరసింహమూర్తిని, ఇంజనీరింగ్ విభాగానికి కొండలరావు, రామచంద్రారెడ్డి, బర్డ్ ఆస్పత్రికి డాక్టర్ గురవారెడ్డి, విజిలెన్స్ విభాగంలో ప్రభాకర్‌ను సలహాదారులుగా నియమించగా సైబర్ సెక్యూరిటీ విభాగానికి సందీప్ అనే వ్యక్తిని సైబర్ ఎక్స్‌పర్ట్‌గా నియమించారు. ఆయన తర్వాత ఏకంగా ఐటీ విభాగానికి జనరల్ మేనేజర్ అయ్యారు. కీలకమైన ఎస్టేట్స్ విభాగంలో కూడా రిటైరైన అధికారి మల్లికార్జునను కొనసాగిస్తున్నారు. ఎస్వీబీసీకి సంబంధించి గాయని మంగ్లీ, విజయ్‌కుమార్ వంటి వారిని సలహాదారులుగా నియమించారు. విద్యాశాఖలో, ధర్మ ప్రచార పరిషత్‌లో కూడా పలువురిని అడ్డగోలుగా నియమించారు. ఈ సలహాదారులకు రూ.లక్షకు పైగా వేతనం, వాహనం, వారికి గదులు కేటాయించి టీటీడీ ఖజానాను గుల్ల చేశారన్న ఆరోపణలున్నాయి. ప్రజాసంబంధాల విభాగంలో కూడా జగన్ మీడియాలో పనిచేసిన నాగేశ్వరరావు ఆలియాస్ నగేష్‌ను ఓఎస్డీ హోదాలో నియమించారు. ఇలాంటి అడ్డగోలు నియామకాలకు అంతూపొంతూ లేకుండాపోయింది. టీటీడీలో అడ్డగోలు వ్యవహారాలు శృతిమించి జరిగాయని కొత్త ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీంతో స్పందించిన ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రెండు రోజులుగా తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోనూ, కొండ మీద విజిలెన్స్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఇంజనీరింగ్ విభాగాల్లో పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. కీలక అధికారులను ప్రశ్నించి వివరాలు సేకరించారు. మరోవైపు దర్శనాలు, సేవలకు సంబంధించిన టికెట్ల జారీతో పాటు శ్రీవాణి ట్రస్టుకు సంబంధించిన విరాళాల సేకరణ, వాటి వినియోగంపైనా దృష్టి పెట్టినట్టు సమాచారం. కాగా, సీఎం చంద్రబాబు ప్రకటించిన రీతిలోనే టీటీడీ ప్రక్షాళనకు చర్యలు మొదలవడంతో శ్రీవారి భక్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఇష్టారాజ్యంగా టికెట్ల కోటాల పెంపు

వైసీపీ ప్రభుత్వ హయాంలో దర్శనాల కోటాలను ఇష్టారాజ్యంగా పెంచేశారు. గతంలో ఎమ్మెల్యేలకు రోజుకు ఒక లేఖను అనుమతించి దానిపై ఆరు టికెట్లు మాత్రమే జారీ చేసేవారు. వారు స్వయంగా వస్తే 10టికెట్ల వరకూ ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వంలో లేఖపై పది టికెట్లు ఇచ్చారు. గతంలో మంత్రులకు 10-15 టికెట్లు ఇచ్చేవారు. వైసీపీ హయాంలో అడిగినన్ని ఇచ్చారు. బోర్డు సభ్యులకు మునుపు రోజుకు 35 టికెట్లు ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వంలో పలుకుబడి కలిగిన సభ్యులకు పరిమితి లేకుండా అడిగినన్ని జారీ అయ్యాయి. చైర్మన్‌కు ఇంతకుముందు రోజుకు గరిష్ఠంగా 150 టికెట్లు ఇచ్చేవారు. వైసీపీ పాలనలో ఎన్ని అడిగితే అన్నీ ఇచ్చారు. ఇక గతంలో సుపథం టికెట్లను చైర్మన్ కార్యాలయం నుంచి జారీ చేసేవారు కాదు. వైసీపీ హయాంలో రోజుకు 500 నుంచీ వెయ్యి టికెట్లు ఇచ్చారు. మునుపు రోజుకు బ్రేక్ దర్శనం టికెట్లు 2వేల వరకూ జారీ అయ్యేవి. వైసీపీ ప్రభుత్వంలో ఆ సంఖ్య కాస్తా 6వేలకు చేరింది. జగన్‌కు, ధర్మారెడ్డికి సన్నిహితులైన వారికి కోటాతో నిమిత్తం లేకుండా అడిగినన్ని టికెట్లు జారీ అయ్యేవన్న ఆరోపణలున్నాయి. పలుకుబడి కలిగిన కొందరు మంత్రులు, పాలక మండలి సభ్యులు దర్శనాల పేరిట వ్యాపారం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఓ మహిళా మంత్రితో సహా నలుగురైదుగురు మంత్రులు దర్శన టికెట్లకు భారీగా వసూళ్లు చేసి స్వయంగా వారిని వెంటబెట్టుకుని వచ్చేవారు. మహిళా మంత్రి దర్శనాల అనంతరం వెళ్లిపోయేవారని, మిగిలిన మంత్రులు మాత్రం కొండపైనే మకాం వేసి వరుసగా రెండు మూడు రోజుల పాటు దర్శనాలకు వెళ్లేవారన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపైనా ప్రస్తుత ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది.

తిరుమలలో మఠాల పేరుతో భారీ స్కాం

- జనసేన నేత కిరణ్ రాయల్ ఆరోపణలు



మాట్లాడుతున్న కిరణ్ రాయల్

తిరుపతి అర్బన్, జూన్ 27: తిరుమలలో మఠాల పేరుతో భారీ స్కాం జరిగిందని జనసేన తిరుపతి నియోజకవర్గ ఇంచార్జ్ కిరణ్ రాయల్ ఆరోపించారు. టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి, మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి సహకారంతో మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడైన స్వరూపానందేంద్ర తిరుమలలో అక్రమంగా ఆరు అంతస్తుల భవనాన్ని నిర్మించారని చెప్పారు. రద్దీ, పర్వదినాల్లో మఠాలన్నీ సిండికేట్ అవుతాయని, ఈ మఠాలన్నీ వైసీపీ కీలక నేతల సన్నిహితులైన రవీంద్రబాబు, రామారావు అనే ఇద్దరి చేతుల్లో నడుస్తున్నాయని వివరించారు. వీరి ద్వారా గతంలో అధికార పార్టీకి నెలకు రూ.70 నుంచి రూ. 80లక్షలు ముడుపులు అందేవని ఆరోపించారు. గత ఐదేళ్లలో దాదాపు రూ.30కోట్ల స్కాం జరిగిందని తెలిపారు.



హోం శాఖ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిత, పక్కన డీజీపీ తిరుమలరావు, ఉన్నతాధికారులు

నేనూ బాధితురాలినే

- జగన్ పాలనలో పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం
- పోలీసు వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తాం
- ప్రతి ఒక్కరూ భద్రంగా ఉండేలా భరోసా ఇస్తాం: మంత్రి అనిత

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): 'పోలీసులతో ప్రజలకు కష్టం రాకూడదు. గత ఐదేళ్లలో చాలా ఇబ్బంది పడ్డారు. నేనూ బాధితురాలినే. ఈ పరిస్థితి మారుస్తాం. పోలీసు వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తాం' అని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. జగన్ పాలనలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైందని, ప్రతిపక్షాలను హింసించేందుకే పని చేసిందన్నారు. ఇకపై సామాన్యుల ధన, మాన, ప్రాణాలకు రక్షణగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. హోం శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమె మొదటిసారి మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయానికి వచ్చారు. డీజీపీ ద్వారకా తిరుమలరావుతో కలసి పోలీసు శాఖపై సమీక్ష నిర్వహించారు. గంజాయి నిర్మూలన, మహిళలకు రక్షణ, పోలీసు నియామకాలు, సిబ్బంది సమస్యలు, పోలీసు శాఖలో సమస్యలపై చర్చించారు. తక్షణమే పరిష్కరించాల్సినవి, ప్రజల్లో పోలీసు ఇమేజ్ పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ భద్రతతో బతికేందుకు ఇవ్వాల్సిన భరోసాపై చర్చించారు. శాంతిభద్రతలు, సీఐడీ, ఏపీఎస్‌పీ, టెక్నికల్ సర్వీసెస్, ఇంటెలిజెన్స్, వెల్ఫేర్ తదితర విభాగాల్లో చక్కదిద్దాల్సినవాటిపై నివేదిక కోరారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి మహిళ, ప్రతి వ్యక్తి ప్రశాంతంగా జీవించేలా చంద్రబాబు ప్రభుత్వంలోని పోలీసుల తరఫున భరోసా ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో తానూ బాధితురాలినని, ఇప్పటికీ సోషల్ మీడియాలో తనను వదలట్లేదన్నారు. తమ ప్రభుత్వంలో ప్రతీకార చర్యలు ఉండబోవని, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఒక్కొక్కటి పరిష్కరిస్తాం

'పోలీసులకు జీపులు లేవు. ఐదేళ్ల క్రితం కొన్నవి నడవలేక పోతున్నాయి. కొత్త జిల్లాల్లో ఎస్పీలకు భవనాల్లేవు. విశాఖపట్నంలో అరిలోవ పోలీస్ స్టేషన్ రేకుల షెడ్డులో ఉంది. సీసీటీఎన్ఎస్ పనిచేయట్లేదు. నిఘా కెమెరాలు చెక్ పోస్టుల్లో లేవు. ఫింగర్ ప్రింట్ స్కానర్లు పని చేయట్లేదు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నవ్యాంధ్రలో ఈ భవనాన్ని నిర్మించారు. ఆ తర్వాత జగన్ విశాఖపట్నం పోలీసు కమిషనరేట్‌ను తాకట్టు పెట్టారు. ప్రాధాన్యం బట్టి ఒక్కొక్కటి పరిష్కరించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.' అని అనిత వివరించారు.

మా వద్ద ఉన్న నిధులే ఖర్చు చేశాం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి ఏపీవీవీపీ కమిషనర్ వివరణ

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఏపీవీవీపీ కార్యాలయం తరలింపు, ఫర్నిచర్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నుంచి అదనపు నిధులు తీసుకోలేదని, తమ వద్ద ఉన్న నిధులనే ఖర్చు చేశామని సెకండరీ హెల్త్ డైరెక్టర్ (ఏపీవీవీపీ) ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. 'ఆఫీసు తరలింపులో లక్షలు నొక్కేశారు' పేరుతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. ఏపీవీవీపీలో వైద్య నియామకాల ద్వారా వచ్చిన రుసుములకు సంబంధించిన నిధులనే ఫర్నిచర్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పనకు ఉపయోగించినట్లు తెలిపారు. మరోవైపు బయో మెడికల్ ఇంజనీర్ నెల రోజుల పాటు సెలవుపై వెళ్లారని అంగీకరించారు. అయితే, ఆయన ఇచ్చిన వివరణలో ఎక్కడా నిధుల ప్రస్తావన మాత్రం తేలేదు.



హవ్వ... ఇదేమి చిత్రం!

స్టీల్‌ప్లాంటును ఎత్తేసి రాజధాని పెడతారట!
విశాఖ ఉక్కుతో కాలుష్యమట
నాటి ప్రతిపాదన బయటపెట్టిన ఎల్వీ



(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

వెనకటికెవరో ఇల్లు పీకి పందిరేస్తా అన్నాడంట! ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచనా సరళి ఇలాగే వింతగా ఉండేదని మరోసారి స్పష్టమైంది. అమరావతిలో 33వేల ఎకరాల భూమి, అప్పటికే జరిగిన నిర్మాణాలను కాదని.. జగన్ విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్కడ... విశాఖ ఉక్కును ఎత్తేసి, ఆ కర్మాగారానికి చెందిన 30వేల ఎకరాల్లో రాజధాని పెట్టేద్దామని జగన్ ఒక చిత్ర విచిత్రమైన ఆలోచన చేశారట. జగన్ దగ్గర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, కొన్నాళ్లకే ఆయన ఆగ్రహానికి గురైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రమణ్యం ఈ విషయం బయటపెట్టారు. "అది సాధ్యం కాదని, మంచి పద్ధతి కాదని నేను చెప్పాను. కానీ... స్టీల్‌ప్లాంటు వల్ల విశాఖపట్నం కాలుష్యమయం అవుతోందని, దానిని ఎలా కొనసాగిస్తామని జగన్ వాదించారు. మంచి ఆలోచన చేసినప్పుడు అడ్డం పడవద్దని కూడా హెచ్చరించారు" అని ఎల్వీ సుబ్రహ్మణ్యం ఓ టీవీ చానల్‌లో జరిగిన చర్చలో వెల్లడించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కును మూసేద్దామనడమే ఒక వింత! ఆ భూముల్లో రాజధాని పెడతామనడం వింతల్లోకే వింత! విశాఖలో భూములు, ఆస్తులపై తప్ప... విశాఖ నగరం బాగుపై ఎప్పుడూ జగన్ దృష్టి సారించలేదు. విశాఖ ఉక్కును కాపాడేందుకు వీసమెత్తు ప్రయత్నమూ చేయలేదు. ఉక్కు స్థలంలో రాజధాని పెట్టాలనే ప్రతిపాదన చేయడం నిజమే అయితే... దాని వెనుక కూడా భూములను స్వాహా చేసే భారీ కుట్ర దాగి ఉంటుందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. విశాఖ ఉక్కుకు అనుసంధానంగా ఉండే గంగవరం పోర్టును అదానీకి కట్టబెట్టేసిన విషయాన్నీ జనం గుర్తు చేసుకుంటున్నారు.


దొంగ రాతల ద్వివేది!

(మొదటి పేజీ తరువాయి)

తనిఖీలు జరిపి ఇసుక అక్రమ తవ్వకాలపై నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించగా... 'తనిఖీలు జరపండి. నివేదిక మాత్రం నేను చెప్పినట్లుగా ఇవ్వండి' అంటూ ద్వివేది ఈ ఏడాది మార్చి 22వ తేదీన కలెక్టర్లకు రాసిన లేఖ.. దానితో పాటు జత చేసిన ప్రొఫార్మా ఇప్పుడు బయటపడ్డాయి. తాము ఐఏఎస్‌లమనే విషయం మరిచిపోయిన కలెక్టర్లు, 'ఎస్ బాస్' అంటూ అదే ప్రొఫార్మాలో తమ జిల్లా పేరు నింపేసి, కింద సంతకం చేసేసి, సీలు కొట్టి పంపించారు. జగన్ హయాంలో ప్రభుత్వ యంత్రాంగం ఏ స్థాయిలో నిర్వీర్యమైందో... ఇసుక అక్రమాలపై ముసుగు వేసేందుకు ఎంతగా ప్రయత్నించారో చెప్పేందుకు ఇదొక నిదర్శనం. కథ, స్ర్కీన్‌ప్లే... నాటి సర్కారు పెద్దలది కాగా, డైరెక్షన్ మాత్రం గోపాలకృష్ణ ద్వివేది చేశారు. నిబంధనలు, స్వీయ విచక్షణ, ఆత్మసాక్షిని మరిచిపోయిన కలెక్టర్లు నిమిత్తమాత్రులైన పాత్రధారులుగా మిగిలారు. సాధారణంగా కోర్టులు, ట్రిబ్యునళ్లకు నివేదికలు ఇచ్చేటప్పుడు జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో స్వీయ పరిశీలన చేసి వాస్తవాలను నివేదికల రూపంలో ఇవ్వాలి. అయితే.. 'జగన్ హయాంలో ఎక్కడా అక్రమ ఇసుక తవ్వకాలు జరగనే లేదని నివేదికలు ఇవ్వండి' అని ద్వివేది కలెక్టర్లను ఆదేశించారు. "హైకోర్టు ఆదేశాల మేరకు దిగువ సంతకం చేసిన అధికారి జిల్లాలోని రీచ్‌లను పరిశీలించి, ఆ పరిధిలో ఎలాంటి అక్రమ ఇసుక తవ్వకాలు జరగడం లేదని ధ్రువీకరించడమైనది" అంటూ ద్వివేదియే ఒక ప్రొఫార్మాను కలెక్టర్లకు పంపించారు. ఇసుక రీచ్‌లు లేని 3 జిల్లాలను మినహాయిస్తే... మిగిలిన 23 జిల్లాల కలెక్టర్లు ఈ ప్రొఫార్మా ప్రకారం తమ జిల్లా పేరు రాసి, కింద సంతకం చేసి పంపించారు. గత జగన్ ప్రభుత్వంలో వైసీపీ నేతలు నదులు, వాగులు, వంకలు.. వేటినీ వదలకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' అనేక కథనాలను ప్రచురించింది. గుంటూరుకు చెందిన డి.నాగేంద్రకుమార్ తొలుత ఎన్జీటీ, తర్వాత హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో కేసులు వేశారు. జిల్లా 'లెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయో లేదో నిర్ధారించాలని ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్జీటీ ఆదేశించింది. రాష్ట్రంలో సహజ వనరులైన ఖనిజాలకు కాపలాదారు గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి. ఆ పోస్టులో ద్వివేది ఉన్నారు. ఆ తర్వాత గనుల శాఖ డైరెక్టర్, ఏపీఎండీసీ ఎండీ వెంకటరెడ్డిదే బాధ్యత. రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలే జరగడం లేదని ఫిబ్రవరిలో కలెక్టర్లు ఎన్జీటీకి నివేదిక ఇచ్చారు. కానీ ఎన్జీటీకి అనుమానాలు వచ్చి కేంద్ర అటవీ పర్యావరణ శాఖ (ఎంఓఈఎఫ్) శాస్త్రవేత్తలతో పరిశీలన చేయించి నివేదికలు తెప్పించుకుంది. జేపీ వెంచర్స్ అక్రమ తవ్వకాలు చేసిందని ఎంఓఈఎఫ్ బృందం ఎన్జీటీకి నివేదిక ఇచ్చింది. తర్వాత కలెక్టర్ల నివేదికపై ఎన్జీటీ స్పందిస్తూ... 'నివేదికలన్నీ ఒకేలా ఉన్నాయి. కలెక్టర్లు అంతా ఒకే ఫార్మాట్‌లో ఇచ్చారు? ముందుగా మాట్లాడుకొని ఒకేలా నివేదికలు ఇచ్చారా?' అని ప్రశ్నించింది. అక్రమ ఇసుక తవ్వకాలపై నాగేంద్రకుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ ఏడాది మార్చిలో హైకోర్టులో విచారణ జరిగింది. అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆయన ఫొటోలతో సహా ఆధారాలు కోర్టుకు సమర్పించారు. గనుల శాఖ మాత్రం అసలు అక్రమ తవ్వకాలే జరగడం లేదని నివేదిక ఇచ్చింది. ఇదే అంశంపై జిల్లా కలెక్టర్లను స్వీయ పరిశీలన చేసి నివేదికలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ద్వివేది గత మార్చి 22న జిల్లా కలెక్టర్లు, గనుల శాఖకు మెమో జారీ చేశారు. "మీ జిల్లాల పరిధిలోని ఇసుక రీచ్‌లను తనిఖీలు చేసి అక్రమ తవ్వకాలు లేకుండా చూడాలి. మేం పంపిస్తున్న ప్రొఫార్మా ప్రకారం 3రోజుల్లో నివేదిక ఇవ్వాలి. ఆ నివేదికలను క్రోడీకరించి మేం హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తాం" అని ఆదేశించారు.



ఇసుక తవ్వకాల విషయంలో కలెక్టర్ల మూకుమ్మడి అబద్ధాలపై ఫిబ్రవరి 22న 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం



GOVERNMENT OF ANDHRA PRADESH
INDUSTRIES AND COMMERCE (M.III) DEPARTMENT

[illegible]

GOPAL KRISHNA DWIVEDI
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT(MINES)

//FORWARDED:: BY ORDER//

గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో కలెక్టర్లకు గోపాలకృష్ణ ద్వివేది రాసిన లేఖ

జగన్ శాసించారు.. ద్వివేది పాటించారు

గత ప్రభుత్వంలో ఇసుక అక్రమ తవ్వకాలన్నీ జగన్ కనుసన్నల్లోనే జరిగాయని బోలెడు ఫిర్యాదులు, ఆరోపణలు ఉన్నాయి. జేపీ వెంచర్స్‌కు కాంట్రాక్టు ఇచ్చినా అనధికారికంగా వైసీపీ నేతలే ఇసుక వ్యాపారం చేశారు. ఈ వ్యవహారంపై జేపీ వెంచర్స్‌పై ఎన్జీటీలో కేసులు దాఖలయ్యాయి. విచారణను తప్పుదోవ పట్టించేందుకు అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు ఎన్జీటీకి కలెక్టర్లతో తప్పుడు నివేదికలు ఇప్పించారనే విమర్శలున్నాయి. హైకోర్టుకు అలాగే నివేదికలు వెళ్లేలా జగన్ శాసించినట్లు ఆరోపణలున్నాయి. గనుల శాఖ ప్రత్యేక సీఎస్ హోదాలో అక్రమాలే జరగడం లేదని ద్వివేది అనుకూల నివేదిక ఇప్పించడం తీవ్రమైన అంశం. గతంలో జగన్‌తో అంటకాగిన పలువురు అధికారులు అడ్డగోలు తప్పులుచేసి జైలుకెళ్లారు. ఈ పరిణామాలు ఇంకా వెంటాడుతున్నా.. ఇసుక అక్రమ తవ్వకాలు బయటకు రాకుండా ద్వివేది వ్యవహరించిన తీరు అధికారుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ప్రొఫార్మాలో ఏముందంటే..

"హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా (పేరు) పరిధిలోని ఇసుక రీచ్‌లను నిశిత పరిశీలన చేయగా ఎలాంటి అక్రమ ఇసుక తవ్వకాలు జిల్లాలో జరగడం లేదని ధ్రువీకరిస్తున్నాం" అని ప్రొఫార్మాలో ఉంది. మెమో ప్రకారం కలెక్టర్లు ఇసుక రీచ్‌లను తనిఖీ చేసి, ఒకవేళ అక్రమ తవ్వకాలు ఉంటే అడ్డుకోవాలి. కానీ ద్వివేది పంపించిన ప్రొఫార్మాలో... అక్రమ తవ్వకాలే జరగడం లేదని జిల్లా కలెక్టర్లు ధ్రువీకరించాలని ఆదేశించారు. ద్వివేది చెప్పినట్లుగానే జిల్లా కలెక్టర్లు అక్రమ తవ్వకాలు జరగలేదని నివేదికలు పంపించారు. వాటి ఆధారంగా రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ అక్రమ ఇసుక తవ్వకాలే జరగడం లేదని ద్వివేది రాష్ట్ర ప్రభుత్వం తరపున హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. దీన్నిబట్టి ఇసుక అక్రమ తవ్వకాలు బయటకు రాకుండా ఆయన హైకోర్టు కళ్లకు గంతలు కట్టినట్లు స్పష్టమవుతోంది.

నెల్లూరు జైలుకు పిన్నెల్లి

14 రోజులు రిమాండ్ విధించిన మాచర్ల కోర్టు

- కోర్టు వద్ద టీడీపీ యువ నేతపై మాజీ ఎమ్మెల్యే దాడి
- సెక్షన్ 323 కింద కేసు నమోదు



టీడీపీ యూత్ నేత శివపై దాడి చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీఆర్కే

మాచర్ల టౌన్, జూన్ 27: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు(మే 13న), మరుసటి రోజు జరిగిన దాడులకు సంబంధించిన కేసుల్లో అరెస్టయిన మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కోర్టు రిమాండ్ విధించడంతో ఆయన్ను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఈవీఎం ధ్వంసం, టీడీపీ వర్గీయులు, సీఐపై దాడి కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన దాఖలుచేసిన పిటిషన్లను బుధవారం హైకోర్టు కొట్టివేయడంతో పోలీసులు ఆయన్ను అరెస్టుచేసిన సంగతి తెలిసిందే. వైద్య పరీక్షల అనంతరం ఆయన్ను అర్ధరాత్రి 12 గంటల సమయంలో మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కల్యాణ్ ఎదుట హాజరుపరిచారు. 12:30 నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు బెయిల్‌పై వాదోపవాదాలు జరిగాయి. పిన్నెల్లి తరఫున న్యాయవాది బాలసత్యనారాయణరెడ్డి వాదనలు వినిపించారు. కారంపూడి సీఐ అలహరి శ్రీనివాసరావు స్వయంగా హాజరయ్యారు. పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం, బయటకు వచ్చాక చెరుకూరి నాగశిరోమణిపై దూషణలు, బెదిరింపు కేసుల్లో మాజీ ఎమ్మెల్యేకు బెయిల్ మంజూరైంది. టీడీపీ ఏజెంటు నంబూరి శేషగిరిరావుపైన, కారంపూడిలో సీఐ నారాయణస్వామిపైన దాడికి సంబంధించి నమోదైన హత్యాయత్నం (సెక్షన్ 370) కేసుల్లో మాత్రం న్యాయాధికారి ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించారు. గురువారం వేకువజామున 4:30 గంటలకు భారీ భద్రత నడుమ పిన్నెల్లిని పోలీసులు నెల్లూరు బయల్దేరారు. ఉదయం 9.10 గంటలకు అక్కడి జైలుకు చేరుకున్నారు. జైలు అధికారులు కోర్టు ఉత్తర్వులను పరిశీలించి లోపలకు తీసుకెళ్లారు.

కోర్టు వద్ద ఉద్రిక్తత

పిన్నెల్లిని మాచర్ల కోర్టులో హాజరుపరుస్తున్నారనే సమాచారం తెలుసుకున్న వైసీపీ శ్రేణులు బుధవారం అర్ధరాత్రి కోర్టు వద్దకు చేరుకున్నారు. 12 గంటల ప్రాంతంలో ఆయన్ను పోలీసు వాహనంలో తీసుకురాగానే పెద్దఎత్తున నినాదాలు చేశారు. తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు ఒక దశలో వారిని అదుపు చేయలేకపోయారు. ఆందోళనల నడుమే ఆయన్ను కోర్టు మెయిన్ గేటు ద్వారా లోపలకు తీసుకెళ్లారు. అంతకుముందు పిన్నెల్లి వాహనం దిగి వైసీపీ కార్యకర్తలతో కరచాలనం చేస్తుండగా అదే సమయంలో అక్కడ తెలుగు యువత జిల్లా కార్యదర్శి కొమెర శివ ఎదురుపడ్డారు. మాజీ ఎమ్మెల్యే ఆగ్రహంతో తన కుడి చేతి పిడికిలి బిగించి శివ కడుపుపై పిడిగుద్దు గుద్దారు. పోలీసులు అప్రమత్తమై హుటాహుటిన పిన్నెల్లిని బలవంతంగా లోపలకు తీసుకెళ్లారు. దాడిపై శివ ఫిర్యాదు చేయడంతో పట్టణ సీఐ బొప్పన బ్రహ్మయ్య ఐపీసీ 323 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

రూ. 30 కోట్ల స్థలం కోసం..

అంబటి బెదిరించాడు!

- గుంటూరు జడ్పీ చైర్‌పర్సన్ సంచలన ఆరోపణ
- సత్తెనపల్లిలో 2.74 ఎకరాలకు పట్టాలు రాసిమ్మని నాపై ఒత్తిడి
- నీ సంగతి తేలుస్తానన్నాడు
- జగన్‌కు ఫిర్యాదు చేస్తానన్నాడు
- మంగళగిరి జడ్పీ స్థలంలో ఆళ్ల అక్రమ నిర్మాణం
- 2 వేల ఎకరాలు కాపాడేందుకు వైసీపీ ముఖ్యులతో యుద్ధం చేశా: క్రిస్టీనా



జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా

గుంటూరు సిటీ, జూన్ 27: 'పల్నాడు జిల్లా సత్తెనపల్లి మెయిన్ రోడ్డు పక్కన జిల్లా పరిషత్‌కు రూ.30 కోట్లు విలువ చేసే 2.74 ఎకరాల భూమి ఉంది. దానిని కాజేసేందుకు అప్పటి మంత్రి అంబటి రాంబాబు చాలా ప్రయత్నం చేశాడు. దానికి పట్టాలు రాసిమ్మని నాపై ఒత్తిడి తెచ్చాడు. నేను ఒప్పుకోలేదు. నన్ను చాలా బెదిరించాడు. నీ సంగతి తేలుస్తానన్నాడు. సీఎంకి ఫిర్యాదు చేస్తానన్నాడు. ఏమైనా చేసుకో ఆ భూమి నీకు ఇచ్చేది లేదని చెప్పా.' అని గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా తెలిపారు. గురువారమిక్కడ తన నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా పరిషత్‌కు చెందిన 2 వేల ఎకరాల భూమిని కాపాడేందుకు కొందరు వైసీపీ ముఖ్య నేతలతో యుద్ధం చేశానని చెప్పారు. సత్తెనపల్లి మున్సిపాలిటీ సమీపంలో ఉన్న జడ్పీ స్థలాన్ని తన అనుచరులకు కట్టబెట్టేందుకు కూడా అంబటి రాంబాబు నానా ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. ఆ స్థలానికి సంబంధించిన తీర్మానం జిల్లా పరిషత్ సమావేశంలో ప్రవేశపెట్టగా అందరూ వ్యతిరేకించారని.. చివరకు పంచాయతీరాజ్ కమిషనర్ కూడా జడ్పీ స్థలానికి పట్టాలివ్వడం కుదరదని చెప్పారని తెలిపారు. మంగళగిరి హైవే పక్కన జిల్లా పరిషత్‌కు చెందిన 40 సెంట్ల భూమిలో అప్పటి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అక్రమంగా ప్రవేశించి అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించారని ఆరోపించారు. ఆ స్థలం జిల్లా పరిషత్‌దని బోర్డు పెట్టినప్పటికీ దానిని తీసివేయించి మరీ అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టారన్నారు. మంగళగిరి ఊరి నడిబొడ్డున ఉన్న 40 సెంట్ల జిల్లా పరిషత్ స్థలంలోనూ ఇదే రీతిలో భవనాలు నిర్మించారన్నారు. వైసీపీ నేతల బారి నుంచి జడ్పీ ఆస్తులను కాపాడేందుకు మొట్టమొదటి సారిగా జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేశానన్నారు. జడ్పీ చైర్‌పర్సన్‌గా మూడేళ్లుగా ఉన్నప్పటికీ కేవలం ఉత్సవ విగ్రహం మాదిరిగానే మిగిలానని.. నిధులు, విధులు లేకుండా చేసి దళితులకు పదవులిచ్చానని జగన్ ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. వైసీపీలో ఉండి అడుగడుగునా అవమానాలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. చంద్రబాబు మాత్రమే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారన్న ఆలోచనతో పదవిని సైతం లెక్కచేయకుండా ఎన్నికల ముందు టీడీపీలో చేరానని చెప్పారు.

చిత్తూరు జడ్పీ మాజీ ఇన్‌చార్జి సీఈవో సస్పెన్షన్

- అవినీతి ఆరోపణలు, బిల్లుల నిలిపివేత
- జడ్పీ నిధులు పెద్దిరెడ్డి కోసం ఖర్చు
- ఐదేళ్లు రెచ్చిపోయిన ప్రభాకర్‌రెడ్డి
- పదవీ విరమణకు మూడ్రోజుల ముందు చర్యలు

చిత్తూరు రూరల్, జూన్ 27: చిత్తూరు జడ్పీ మాజీ ఇన్‌చార్జి సీఈవో టి.ప్రభాకర్‌రెడ్డిపై వేటు పడింది. ఈ నెలాఖరులో రిటైర్ కానున్న ఆయన్ను సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ కన్నబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అర్హత లేకున్నా సుదీర్ఘ కాలంపాటు జడ్పీ సీఈవో పోస్టులో ఎఫ్ఏసీ (పూర్తి అదనపు బాధ్యతలు)గా బాధ్యతలు నిర్వర్తించిన ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. టీడీపీ నాయకుల బిల్లులను ఉద్దేశపూర్వకంగా నిలిపివేయడం, జడ్పీ ఉద్యోగులను వేధించడం, వైసీపీ పాలనలో మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జడ్పీ నిధులు ఖర్చు పెట్టడం వంటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. జడ్పీలోని ప్రస్తుత, మాజీ అధికారులతో పాటు జిల్లా టీడీపీ నాయకులు కూడా ఆయన అవినీతిపై సాక్ష్యాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. పెద్దిరెడ్డి ఈయన్ను కాపాడుతూ వచ్చారు. కనీసం విచారణ కూడా జరగనివ్వలేదు. ఇటీవల కుప్పంలో పర్యటించిన సీఎం చంద్రబాబును, ఆయన కార్యదర్శి ప్రద్యుమ్నను ఉమ్మడి జిల్లా టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు కలిసి ప్రభాకర్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసి, విచారణకు ఆదేశించింది. విచారణ పూర్తయ్యేవరకు హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లకూడదని స్పష్టం చేసింది.



'ఎవరు గెలిచినా మీదే గెలుపు'

- విజేతకు బహుమతి ప్రదానం

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పేరుతో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన పోటీలో రాష్ట్రస్థాయి విజేత వీరపనేని ముసలయ్య బహుమతి మొత్తాన్ని అందుకున్నారు. ఈ ఎన్నికల్లో కూటమికి 164 స్థానాలు వస్తాయని, వైసీపీ 11 స్థానాలతో సరిపెట్టుకుంటుందని మొత్తం 13 మంది 'ఆంధ్రజ్యోతి' పాఠకులు వందశాతం కచ్చితత్వంతో అంచనా వేశారు. రాష్ట్రస్థాయిలో తొలి బహుమతి లక్ష రూపాయలుకాగా... 'డ్రా'లో విజయవాడకు చెందిన ముసలయ్యకు ఆ అదృష్టం వరించింది. గురువారం విజయవాడలోని 'ఆంధ్రజ్యోతి' కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ మురళి ముసలయ్యకు బహుమతికి సంబంధించిన చెక్కును అందించారు. విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన ఆయన ఆర్టీసీ బస్టాండ్ పార్కింగ్‌లో ఉద్యోగిగా పని చేస్తున్నారు. "ఇరవై ఏళ్లుగా ఆంధ్రజ్యోతి పాఠకుడిని. రాజకీయాలంటే బాగా ఆసక్తి. వైసీపీకి ఘోర పరాజయం తప్పదని, కూటమి ఘన విజయం సాధిస్తుందని అంచనా వేశాను. డ్రాలో మొదటి బహుమతి రావడం ఎంతో ఆనందంగా ఉంది" అని ముసలయ్య పేర్కొన్నారు.

పుంగనూరులో

పెద్దిరెడ్డికి షాక్!

- వైసీపీకి మున్సిపల్ చైర్మన్ రాజీనామా
- ఇంకో పది మంది కౌన్సిలర్లు కూడా..
- మరికొందరితో కలిసి త్వరలో టీడీపీలోకి

పుంగనూరు, జూన్ 27: చిత్తూరు జిల్లా పుంగనూరులో మాజీ మంత్రి, వైసీపీ ముఖ్య నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పెద్ద షాక్ తగిలింది. మున్సిపల్ చైర్మన్ ఎస్.అలీం బాషా, మరో 10 మంది కౌన్సిలర్లు గురువారం వైసీపీకి రాజీనామా చేశారు. తమ రాజీనామాలను పార్టీ అధినేత జగన్‌కు పంపారు. వీరిలో రహంతుల్లా అలియాస్ అమ్ము, ఎం.రామకృష్ణమరాజు, మమత, యువకుమారి, కాళీదాస్ మొదలియార్, ఖాన్ నూర్జహాన్, మనోహర్, జేఎంసీ నరసింహులు, కసురున్నీషా, రేష్మ ఉన్నారు. ఈ మున్సిపాలిటీలో చైర్మన్ సహా మొత్తం 31 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరంతా వైసీపీ వాళ్లే. నాటి ఎన్నికల్లో పెద్దిరెడ్డి పోలీసుల సహకారం, వైసీపీ రౌడీయిజంతో ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారు. 31 మందినీ బలవంతంగా ఏకగ్రీవం చేసుకున్నారు. వీరిలో చైర్మన్ సహా 11 మంది ఇప్పుడు రాజీనామా చేశారు. వీరు టీడీపీలో చేరేందుకు సంసిద్ధత తెలుపగా.. స్థానిక నేతలు వీరిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఇంటికి ఈ సందర్భంగా చైర్మన్ అలీంబాషా, కౌన్సిలర్ అమ్ము మాట్లాడుతూ.. పెద్దిరెడ్డి, ఆయన కుటుంబం తమకు పదవులు ఇచ్చినా అభివృద్ధి చేయడానికి అధికారం ఇవ్వకుండా రబ్బరు స్టాంపులుగా వాడుకున్నారని ఆరోపించారు. చల్లా ఆధ్వర్యంలో పట్టణాభివృద్ధికి..ప్రజలకు సేవ చేయడానికి త్వరలో తాము మరికొందమంది కౌన్సిలర్లతో కలిసి టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించారు. చల్లా మాట్లాడుతూ.. పెద్దిరెడ్డి, ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి ముస్లింలను రెచ్చగొట్టి బీజేపీకి ఓట్లు వేయొద్దని ప్రచారం చేశారని ఆరోపించారు. పెద్దిరెడ్డి వైఖరి నచ్చక చాలా మంది టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

చరిత్రలో రామోజీకి చిరస్థాయి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి రంగంలోనూ అగ్రస్థానాన్ని అధిరోహించారని, ఏ పని చేసినా అందులో ప్రజా హితం కోరుకున్నారని కొనియాడారు. "ఎందరో నటులు, కళాకారులకు రామోజీరావు జీవితం ఇచ్చారు. ఆయన గౌరవార్థం విశాఖపట్నంలోని చిత్రనగరికి రామోజీ పేరు పెడతాం. రాజధానిగా అమరావతి పేరు ఆయనే సూచించారు. అమరావతిలో రామోజీ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తాం. రాజధానిలో ఒక రోడ్డుకు ఆయన పేరు పెడతాం" అని చంద్రబాబు ప్రకటించారు. తెలుగు జాతి ఎన్టీఆర్‌ను, రామోజీని మరవబోదని వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లాలో జన్మించిన వారిద్దరికీ భారత రత్న సాధించడం మనందరి కర్తవ్యమని స్పష్టం చేశారు. విజయవాడలోని కానూరులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన రామోజీరావు సంస్మరణ సభకు సతీసమేతంగా చంద్రబాబు హాజరయ్యారు. రామోజీరావు విలువలు, ఆయన సేవ భావి తరాలకు స్ఫూర్తి అని అన్నారు. నీతి నిజాయితీగా వ్యాపారం చేసిన ఆయన ఆర్థిక మూలాలను దెబ్బ తీసేందుకు 'మార్గదర్శి'పై గత ప్రభుత్వం కుట్ర చేసిందని గుర్తుచేశారు.



రాజధానికి రూ.10 కోట్ల విరాళం చెక్కులను చంద్రబాబు, పవన్‌లకు అందజేస్తున్న రామోజీ కుటుంబ సభ్యులు

ప్రజల పక్షపాతి: పవన్ కల్యాణ్

ప్రజాస్వామ్యానికి పత్రికాస్వేచ్ఛ ఎంత అవసరమో ఈ దేశానికి రామోజీరావు చాటి చెప్పారని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొనియాడారు. ఆయన ప్రజల పక్షపాతి అని తెలిపారు. జర్నలిస్టు విలువల్ని కాపాడిన ఆయన పత్రికాధిపతిగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. ఆరోగ్యం క్షీణిస్తున్న సమయంలోనూ... కూటమి విజయంపై ఆరా తీసినట్టు కుటుంబసభ్యులు చెబుతున్నారన్నారు. "మొదటిసారి 2008లో ఆయన్ను కలిశాను. 'నువ్వు ఏమి చేయాలనుకున్నావో, ఏం నమ్ముతున్నావో అది త్రికరణ శుద్ధిగా చేయి' అని సూచించారు. ప్రజలకు ఏమి చేయాలో ఆయనకు స్పష్టత ఉంది.ఐదేళ్ల క్రితం లంచ్‌కు ఆహ్వానించినప్పుడు ఆయనలో వేదన కనిపించింది. ఆయనను గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులకు గురి చేశారు. అయినా తట్టుకుని నిలబడ్డారు. ఆయన విగ్రహం అమరావతిలో ఏర్పాటు చేయాలి. ఆర్టీఐ ఉద్యమకారుడిగానూ పోరాడిన రామోజీ ఒక పాత్రికేయ నదీ ప్రవాహం. అందులోంచి వీలైనన్ని నీళ్లు (పాత్రికేయ విలువలు) మనం తీసుకుని ఆయన వారసత్వాన్ని కొనసాగిద్దాం" అని వ్యాఖ్యానించారు.

పరిశోధనాత్మక జర్నలిజం ఇష్టం: ఎన్.రామ్

పరిశోధనాత్మక జర్నలిజాన్ని ఇష్టపడే రామోజీ రావు నమ్మిన విలువల కోసం కట్టుబడ్డారని హిందూ పత్రిక మాజీ ఎడిటర్ ఎన్. రామ్ కొనియాడారు. "ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పాత్రికేయ హక్కుల కోసం బలంగా పోరాటం చేశారు. పాత్రికేయులే లక్ష్యంగా రాజీవ్ గాంధీ ప్రభుత్వం అప్పట్లో తెచ్చిన పరువు నష్టం బిల్లుకు వ్యతిరేకంగా పోరాడారు. ఆ బిల్లులోని కఠిన నిబంధనలు ఉపసంహరించుకునేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, సాధించారు" అని గుర్తుచేశారు.

ప్రజాస్వామ్యం కోసం తపించారు: కిరణ్

ప్రజాస్వామ్య విలువల కోసం రామోజీ రావు ఎప్పుడూ పరితపించే వారని కుమారుడు కిరణ్ తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా అండగా నిలిచే వారంటూ తండ్రి సేవల్ని గుర్తు చేసుకున్నారు. ఎక్కడ విపత్తులు వచ్చినా సహాయం చేయడానికి ముందుండే ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి పేరు రామోజీ రావు సూచించారని, దేశంలోనే గొప్ప నగరంగా అది ఎదగాలని ఆకాంక్షించారంటూ కిరణ్ గుర్తు చేసుకున్నారు. తమ కుటుంబం తరపున రాజధాని నిర్మాణానికి పది కోట్ల రూపాయలు విరాళంగా చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో రామోజీరావు కుటుంబ సభ్యులు, మంత్రులు లోకేశ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, పార్థసారథి, కొల్లు రవీంద్ర, రాజస్థాన్ పత్రిక ఎడిటర్ గులాబ్ కొఠారి, సినీ ప్రముఖులు రాఘవేంద్రరావు, రాజమౌళి, బోయపాటి శీను, అశ్వనీదత్, శ్యాంప్రసాద్ రెడ్డి, ఎం.ఎం. కీరవాణి, ప్రసాద్ రెడ్డి, జయసుధ, మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మారని ఏయూ వీసీ తీరు!

- చాంబర్‌లో ఇంకా సీఎం ఫొటో పెట్టని ప్రసాద రెడ్డి
- విద్యార్థి సంఘాల ఆందోళన.. రాజీనామాకు డిమాండ్



ఏయూ వీసీ ప్రసాదరెడ్డి చాంబర్‌లో మొన్నటి వరకూ ఉన్న మాజీ సీఎం జగన్ ఫొటో... దానిని తొలగించినా కొత్త సీఎం చంద్రబాబు ఫొటో పెట్టని వైనం

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద రెడ్డి తీరు మారడం లేదు. గడిచిన ఐదేళ్లు వర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చేసిన ఆయన ఇప్పటికీ అదే పంథాలో వెళుతున్నారు. ప్రభుత్వం మారి దాదాపు మూడు వారాలు కావస్తున్నా తన కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాన్ని ఏర్పాటుచేయలేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో ఏర్పాటు చేయాల్సిందిగా కొద్దిరోజుల కిందట ఉత్తర్వులు వెలువడ్డాయి. అయినా ఏయూ వీసీ కార్యాలయంలో ఇప్పటివరకూ సీఎం ఫొటోను ఏర్పాటు చేయలేదు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు గురువారం పెద్దఎత్తున ఆందోళన చేపట్టాయి.

ఏయూ వీసీ చాంబర్ ఎదుట టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోలతో ఆందోళన నిర్వహించారు. వీసీ చాంబర్‌లో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు ఏర్పాటు చేయడంతోపాటు వీసీ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడారు. చాంబర్‌లో వీసీ లేరని, ఆయన వచ్చిన వెంటనే ఏర్పాటుచేయిస్తానని చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఖాన్ హామీ ఇవ్వడంతో ఆయనకు సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు ఇచ్చి విద్యార్థి సంఘాల నాయకులు వెనుదిరిగారు. ఆందోళనలో టీఎన్ఎస్ఎఫ్, జనసేన విద్యార్థి సంఘ నాయకులు మద్దివేముల శ్రీనివాస్, రతన్‌కాంత్, బోండా రవికుమార్, పీలా అవినాష్, డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



యువకులను అభినందిస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

పర్యాటకులకు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ అభినందన

చిట్టినగర్, జూన్ 27: దేశంలోని పురాతన ప్రపంచ వారసత్వ కట్టడాలను అతితక్కువ సమయంలో సందర్శించి రికార్డు సృష్టించిన నగరానికి చెందిన ఇద్దరు యువకులను గురువారం పాలఫ్యాక్టరీలో యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అభినందించారు. తమ యూనియన్‌లో 12ఏళ్లుగా డిస్పాచ్ విభాగంలో రోజువారీ పనివారలుగా పని చేస్తున్న ఎం.ఉదయ్ నాగభూషణం, షేక్ నాయుమ్ పాషా ఇద్దరు విత్రులు. వీరు ప్రపంచ వారసత్వం సంపదగా ప్రకటించిన పురాతన కట్టడాలను, భారతదేశ కరెన్సీ నోట్లపై ముద్రించిన ప్రదేశాలను తక్కువ సమయంలో సందర్శించడం అభినందనీయమన్నారు.

నేడు ఇంద్రకీలాద్రికి తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్

వన్‌టౌన్, జూన్ 27: తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి గవర్నర్ రాధాకృష్ణన్ శుక్రవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకోనున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి ఉదయం 10.15 గంటలకు గన్నవరంలో దిగుతారు. రోడ్డుమార్గంలో ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసానికి వెళతారు. 11.45 గంటల సమయంలో దుర్గమ్మను దర్శించుకోనున్నారు. తరువాత తాడేపల్లిలోని కార్యక్రమానికి హాజరవుతారు.



బోడె ప్రసాద్, వెనిగండ్ల రాములను సన్మానిస్తున్న సుజనాచౌదరి

ఎమ్మెల్యేలు బోడె, వెనిగండ్లకు సుజనా సన్మానం

పెనమలూరు, జూన్ 27: వందడుగుల రోడ్డులో రామోజీరావు సంస్మరణ సభ పూర్తయిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి కానూరులోని ఎమ్మెల్యే సుజనాచౌదరి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా భారీ మెజారిటీలతో గెలిచిన ఎమ్మెల్యేలనిద్దరినీ సుజనాచౌదరి సన్మానించి అభినందించారు.

ఆదివాసీ విద్యా వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గవర్నర్‌పేట, జూన్ 27: ఉత్తరాంధ్ర, ఇతర గిరిజన షెడ్యూల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆదివాసీ మాతృభాషా వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ నేతలు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావులు గురువారం సమగ్ర శిశు ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. గిరిజన ప్రాంతాల్లోని 1454 గిరిజన పాఠశాలల్లో 1327 మాతృభాషా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, వారు స్థానిక గిరిజన భాషలో బోధిస్తున్నారన్నారు. వారందరినీ 2024-25 విద్యా సంవత్సరానికి రెన్యువల్ చేసి ఉపాధ్యాయులుగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. విద్యా సంవత్సరంలో 12 నెలలకు సరిపడా బడ్జెట్ కేటాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం చెల్లించాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, మాతృభాషా ఉపాధ్యాయ సంఘ నేతలు సవర ఆనందరావు, మర్రి చిట్టిబాబు, వెంకటేష్, పి.కుమారి, పి. శ్రీను, సవర దొరబాబు పాల్గొన్నారు.



మంత్రి కొలుసు పార్థసారథిని కలిసిన నేతలు

మంత్రులకు వినతిపత్రాలు

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 27: గ్రామీణ, అర్బన్ వైద్యుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ది గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర, అర్బన్ నేతలు శుక్రవారం ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్‌ను కలిశారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన్ను కలిసిన నేతలు తమ సమస్యల ను మంత్రి వద్ద చెప్పుకున్నారు. మంత్రి వై.సత్యకుమార్‌తో పాటు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధికి కూడా తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎం. రాజు, కొండారెడ్డి, విద్యాసాగర్, బర్కతుల్లా, సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజన ప్రాంత పాఠశాలల అభివృద్ధిలో రోటరీ

గవర్నర్‌పేట, జూన్ 27: గిరిజన ప్రాంతాల పాఠశాలల అభివృద్ధి కోసం రోటరీ ఫౌండేషన్ ట్రస్టీస్ 90వేల డాలర్ల నిధులను రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్, రోటరీ క్లబ్ ఆఫ్ బర్లింగేమ్‌లకు విడుదల చేసినట్టు రోటరీ జిల్లా 3020 గవర్నర్ రావూరి సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విస్సన్నపేటలోని గిరిజన సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, కాలేజి ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు, ఉపాధ్యాయుల శిక్షణ, డిజిటల్ అక్షరాస్యత పరికరాలు సమకూర్చేందుకు ఈ నిధులు వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. నిధులు విడుదల చేసినందుకు రోటరీ ఫౌండేషన్ (ఇండియా), రోటరీ ఫౌండేషన్ ట్రస్టీస్‌కు ధన్యవాదాలు తెలిపారు.



దుర్గమ్మ దర్శనానికి వచ్చిన సినీ నిర్మాత కల్యాణ్, నటులు అశోక్, శ్రీధర్

దుర్గమ్మ సన్నిధిలో సినీ ప్రముఖులు

వన్‌టౌన్, జూన్ 27: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను సినీ నిర్మాత సి.కల్యాణ్, నటులు అశోక్, శ్రీధర్ దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం వారికి పండితులు ఆశీస్సులందజేశారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

సీసీఆర్‌సీ కార్డుల జారీలో వీఆర్వోలపై ఒత్తిడి వద్దు

● ఏపీ వీఆర్వో అసోసియేషన్ డిమాండ్

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీలో ఉన్నతాధికారులు విధిస్తున్న టార్గెట్ల కారణంగా పని నైపుణ్యం దెబ్బతింటోందని ఏపీ గ్రామ రెవెన్యూ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుపమ గురువారం ఒక ప్రకటనలో తెలిపా రు. రాష్ట్ర ప్రభుత్వం పని నైపుణ్యానికి (క్వాలిటీ ఆఫ్ వర్క్) ప్రాధాన్యతనిస్తుంటే, ఐఏఎస్ అధికారులు పని పరిమాణాన్ని (క్వాంటిటీ ఆఫ్ వ ర్క్) నిర్దేశిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలురైతులకు సీసీఆర్‌సీ కార్డులను జారీ చేయటానికి 2 నెలల సమయం ఉంటే, రోజూ 50 కా ర్డులు చేయాలని జాయింట్ కలెక్టర్లు, వీఆర్వోలకు టార్గెట్లు నిర్దేశిస్తూ ఒ త్తిడి తెస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండా రోజుకు 50 కార్డులు ఇచ్చేసుకుంటూ పోతే, కార్డులు అందుకున్న వారిలో కౌలు చే యని వారుంటే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. దీనివల్ల అంతిమంగా వీ ఆర్వోలే ఇబ్బందులు పడతారన్నారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకు ని ఐఏఎస్ అధికారులు టార్గెట్లు నిర్దేశించే సంస్కృతిని కాకుండా ఉత్తమ సేవలు, నైపుణ్యవంతమైన పనిచేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

పాఠశాల, ఆసుపత్రుల్లో తనిఖీలు

● హాజరుపట్టీ పరిశీలించి ఉపాధ్యాయులపై ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆగ్రహం

వన్‌టౌన్, జూన్ 27: స్థానిక గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు క్రమశిక్షణ లేదంటూ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు పట్టీని చూసి విస్తుపోయారు. హాజరు పట్టీలో ఉపాధ్యాయులు సంతకం చేయకపోవడం గుర్తించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులే క్రమశిక్షణ పాటించకపోతే విద్యార్థులకు ఎలా క్రమశిక్షణ నేర్పుతారంటూ నిలదీశారు.ఎమ్మెల్యే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సిబ్బంది, ఉపాధ్యాయులు నీళ్లు నమిలారు. హెడ్ మాస్టర్ నీరజ మాట్లాడుతూ హైస్కూల్‌లో మొత్తం 19మంది ఉపాధ్యాయులున్నారని, సంస్కృత ఉపాధ్యాయుడు నరసింహాచారీ అటిండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేయలేదన్నారు. ఆయన మరో 2నెలల్లో పదవీవిరమణ చేస్తున్నట్టు తెలిపారు.నేతలు అడ్డూరి శ్రీరామ్, పట్నాయక్, పోతిన బేసికంతేశ్వరుడు, శ్రీధర్, ఎంఎస్ బేగ్, కార్పొరేటర్లు ఉమ్మడి చంటి, బుల్లా విజయకుమార్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, టీడీపీ నేతలు సారిపల్లి రాధాకృష్ణ, కొణిజేటి రమేష్, ఎన్‌డీఏ నేత పోతిన అవినాష్, కనిశెట్టి లక్ష్మణరావు, నాని, దాడి జగన్, పేర్ల సాయిరాం, వాజీద్‌ఖాన్ ఎమ్మెల్యేతో ఉన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

హైస్కూల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులకు ఎమ్మెల్యే సుజనా చౌదరి కిట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ చదువుతోనే పేదరికం పోతుందన్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడు క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. విద్యార్థులకు వచ్చే సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేసి విద్యా ప్రగతికి తోడ్పడాలన్నారు. దాడి అప్పారావు, దుర్వేసుల హంస్సేన్, తిరుపతి అనూష, సురేష్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల హాజరు పట్టీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

షేక్ రాజా సాహెబ్ ఆసుపత్రిలో తనిఖీలు

షేక్ రాజా సాహెబ్ ఆసుపత్రిలో ఎమ్మెల్యే సుజనా చౌదరి గురువారం తనిఖీలు నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను సూచించారు. ఈ సందర్భంగా వైద్యులు ఎంతమంది ఉన్నారు? వైద్యసేవలెలా అందుతున్నాయంటూ అనేక విషయాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని తగురీతిలో మందులు ఇవ్వాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ శాంతి కిరణ్‌కు తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన ఇందిర

నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని కాలరాశారని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. గురువారం గాంధీజీ మునిసిపల్ హైస్కూల్ ప్రాంగణంలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత ఎమర్జెన్సీ రోజులను తలపిస్తూ ఐదేళ్లలో జగన్మోహనరెడ్డి సాగించిన ఒక అరాచక పాలనను కేస్ స్టడీగా చెప్పుకోవచ్చునన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలంలో పరిస్థితులను, ఎంతోమందిని జైలులో పెట్టి శిక్షించిన వైనాన్ని తెలియజేశారు. అడ్డూరి శ్రీరామ్, కొత్తమాసు పిచ్చయ్య, భోగవల్లి శ్రీధర్, శివకుమార్ పట్నాయక్, పోతిన బేసికంతేశ్వరుడు, ఎంఎస్ బేగ్, అబ్దుల్ ఖాదర్, వాజీద్‌ఖాన్, కొణిజేటి రమేష్, తిరుపతి అనూష, సురేష్, కార్పొరేటర్లు బుల్లా విజయకుమార్, ఉమ్మడి చంటి, దుర్వేసుల హంస్సేన్, పోతిన అవినాష్ పాల్గొన్నారు.

రమ్యకృష్ణ కుటుంబ సభ్యులకు పార్టీ శ్రేణుల సంతాపం

ఉంగుటూరు, జూన్ 27: షిర్డీ నుంచి తిరిగి వస్తూ మహారాష్ట్రలోని కేజ్‌టౌన్ వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదంలో టీడీపీ ఉంగుటూరు మండల మహిళా అధ్యక్షురాలు మండవ రమ్యకృష్ణ (33) మృతి చెందారన్న వార్త కుటుంబసభ్యులు, పార్టీశ్రేణుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై ఆమె సోదరుడు నరేష్ కుమార్ ఆంధ్రజ్యోతి విలేఖరికి చెప్పిన వివరాలిలా ఉన్నాయి. రమ్యకృష్ణ ప్రయాణిస్తున్న కారును డ్రైవ్ చేస్తున్న నూజివీడుకు చెందిన వంశీసాయి నిద్ర మత్తులో కళ్లుమూతపడటం వల్లనే కారు అదుపుతప్పి ఎదురుగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టిందన్నారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న తాను బుధవారం మహారాష్ట్రలోని కేజ్‌టౌన్ ప్రభుత్వాసుపత్రికి వెళ్లానన్నారు. గురువారం సాయంత్రం రమ్యకృష్ణ మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించిన అనంతరం ఆమె పార్థివదేహాన్ని అంబులెన్స్‌లో పెద అవుటపల్లికి తీసుకువస్తున్నామన్నారు. కారులో ఇంకా గుడివాడకు చెందిన శృతి అనే మహిళ, నూజివీడుకు చెందిన వంశీసాయి, అతడి సోదరుడు (మచిలీపట్నం)తో కలిసి మొత్తం నలుగురు ఉన్నారన్నారు. రమ్యకృష్ణ మంగళవారం సాయంత్రం భర్త శ్రీకాంత్‌కు ఫోన్‌లో మాట్లాడిందన్నారు. ఈదుర్ఘటనలో సోదరి రమ్యకృష్ణతోపాటు కారును నడుపుతున్న వంశీసాయి సంఘటనాస్థలంలోనే మృతిచెందగా, మరో ఇద్దరికి కాళ్లు, చేతులకు తీవ్రగాయాలైనట్టు చెప్పారు. క్షతగాత్రులకు కేజ్‌టౌన్ మెడికల్ కాలేజీలో చికిత్స అందించారన్నారు. ఆమె హఠాన్మరణం పట్ల పార్టీ ప్రముఖులు, ముఖ్య నేతలు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, వివిధ సామాజిక మాధ్యమాల్లో రమ్యకృష్ణ కుటుంబ సభ్యులకు తమ సంతాపాన్ని తెలియజేయగా, పలువురు నేతలు ఇంటికివెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి, సానుభూతిని తెలిపారు.



పెద అవుటపల్లిలో రమ్యకృష్ణ ఇంటివద్ద ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులు

ఉంగుటూరు మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు మండవ రమ్యకృష్ణ మృతికి సీఎం చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. రమ్యకృష్ణ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమె కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

మహారాష్ట్రలో జరిగిన రోడ్డుప్రమాదంలో రమ్యకృష్ణ మృతి చెందడం పట్ల రాష్ట్ర విద్య, ఐటీ శాఖామంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టీడీపీకి తీరనిలోటని ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రమ్యకృష్ణ మృతిపట్ల ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఆమె అకాలమరణం పార్టీకి తీరనిలోటని తెలుపుతూ, ఆమె ధైర్యసాహసాలను గుర్తుచేసుకున్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమె కుటుంబాన్ని పార్టీపరంగా, వ్యక్తిగతంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కష్టసమయంలో ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం అందించాలని పార్టీశ్రేణులకు యార్లగడ్డ పిలుపునిచ్చారు. రమ్యకృష్ణ కుటుంబసభ్యులను గురువారం పలువురు టీడీపీ ముఖ్యనేతలు పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే సోదరుడు సతీష్, నేతలు ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయికల్యాణి, జాస్తి వెంకటేశ్వరరావు, ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి, ఆళ్ల హనోక్, మేడేపల్లి రమాదేవి, చిగురుపాటి సుమంత్, కొండేటి వెంకటేశ్వరరావు, పోతినేని రామకృష్ణ, స్థానిక నేతలు ఉన్నారు.

పెద అవుటపల్లిలో అంత్యక్రియలు

మండవ రమ్యకృష్ణ పార్థివదేహం మహారాష్ట్ర నుంచి అంబులెన్స్‌లో శుక్రవారం ఉదయం 5గంటలకు తన సొంతగ్రామమైన పెద అవుటపల్లికి చేరుకుంటుందని, ఉదయం 10గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

రాష్ట్రానికి రూ.2వేల కోట్లు..!

● సీపీఎస్ ఉద్యోగులకు సెంట్రల్ మెమో 57 అమలు చేయండి

● ప్రభుత్వానికి ఏపీసీపీఎస్ఈఏ పూర్వ ప్రధాన కార్యదర్శి విజ్ఞప్తి

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులకు మెమో 57ను అమలు చేయటం ద్వారా ఎన్ఎస్‌డీఎల్ నుంచి రూ.2వేల కోట్లు జమవుతాయని, ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో రాష్ట్రానికి ఇది ఎంతో వెసులుబాటును ఇస్తుందని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర పూర్వ ప్రధానకార్యదర్శి కె.పార్థసారథి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగులకు ఏదైనా మేలు జరిగిందంటే అది నాటి సీఎం చంద్రబాబు చలవేనన్నారు. నూతన పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్)లో వచ్చిన మార్పులైన గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్లను మంజూరు చేశారన్నారు. అదేరీతిన ఎన్‌పీఎస్‌లో వచ్చిన మార్పుల్లో భాగంగా సెంట్రల్ మెమో 57ను అమలు చేస్తే డీఎస్‌సీ-2003, పోలీసు కానిస్టేబుల్స్ గ్రూపు-2 వారికి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. కిందటి వైసీపీ ప్రభుత్వం మెమో 57 ద్వారా ముగ్గురు ఐఏఎస్ అధికారులకు మాత్రమే ఓపీఎస్‌ను ఇచ్చిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో నోటిఫికేషన్లు ఇచ్చారన్న ఒకే ఒక్క కారణంతో చిన్న ఉద్యోగులకు కూడా ఓపీఎస్‌ను పునరుద్ధరించకుండా వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేసిందన్నారు. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో సెంట్రల్ మెమో 57ను అమలు చేయటం ద్వారా అర్హత కలిగిన వేలాది మంది ఉద్యోగులకు పాత పెన్షన్ పునరుద్ధరణ జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే టీచర్లు, పోలీసు ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లతో పాటు, గ్రూప్-2 నోటిఫికేషన్ కూడా వెలువరించటం జరిగిందన్నారు. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని సెంట్రల్ మెమో 57ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీన్ని అమలు చేయటం ద్వారా ఎన్‌పీఎస్ నుంచి రూ.2వేల కోట్లు రాష్ట్రానికి తిరిగి వస్తాయని, ఈ ప్రభుత్వంలో అయినా సీపీఎస్ ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని.. వ్యక్తి మృతి

జి.కొండూరు, జూన్ 27: రెండు మోటారు బైక్‌లు ఒకదానికి మరొకటి ఢీ కొట్టుకున్న ఘటనలో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం కొత్తూరు తాడేపల్లికి చెందిన వేటగిరి రాంబాబు (40) అల్లుడు చందుతో కలిసి విజయవాడ వెళుతుండగా గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లికి చెందిన నాగ ఉదయ్‌కుమార్ తన బైక్‌పై వెలగలేరు వైపు వస్తున్నాడు. ఈ రెండు బైక్‌లు వెలగలేరు వద్ద ఎదురెదురుగా ఢీ కొట్టుకోవడంతో రాంబాబు తీవ్రంగా, మిగిలిన ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. వారిని 108లో విజయవాడ తరలిస్తుండగా మార్గమధ్యలోనే రాంబాబు మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై షబ్బీర్ అహ్మద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


కంచికచర్ల రూరల్: ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనంతో ఢీ కొట్టిన ఘటనలో బత్తినపాడు గ్రామానికి చెందిన జంగా మోహన్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బత్తినపాడు నుంచి పరిటాల వైపు తన బైక్ వస్తూ పరిటాల బస్టాండ్ వద్ద విజయవాడ వైపు వెళుతూ ఆగిన ఆర్టీసీను ఢీ కొట్టాడు. గాయపడిన మోహనరావును 108లో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

మైలవరం రూరల్: వెల్వడం - చిన్ననందిగామ క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు తెలంగాణ నుంచి అక్రమంగా తరలిస్తున్న 390 మద్యం సీసాలను గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లికి చెందిన బండారు శేషకుమార్ అనే వ్యక్తి మద్యం సీసాలను తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విత్తనాల షాపుల్లో తనిఖీలు

తిరువూరు, జూన్ 27: మండలంలోని విత్తనాల దుకాణాల్లో వ్యవసాయ శాఖాధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. అంతర్గత స్క్వాడ్ సభ్యులు, మైలవరం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు, తిరువూరు ఏవో పి.పద్మ దుకాణాల్లోని స్టాక్ రిజిస్టార్లు, ఇన్వాయిస్, స్టోర్స్ సర్టిఫికెట్లు, బిల్లు పుస్తకాలు పరిశీలించారు. ఎంఆర్పీకి మించి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ బోర్డు, ధరలపట్టిక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు.



ఆస్ట్రేలియా హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్‌తో మాట్లాడుతున్న ఎంపీలు శివనాథ్, భరత్, హరీష్ బాలయోగి

ఎంపీలకు విందు ఇచ్చిన ఆస్ట్రేలియా హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్

● హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, జూన్ 27: ఆస్ట్రేలియా హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఢిల్లీలోని తన నివాసంలో ఎంపీలందరికీ గురువారం ఏర్పాటు చేసిన విందుకు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), అమలాపురం ఎంపీ జీఎం హరీష్ బాలయోగి, వైజాగ్ ఎంపీ శ్రీ భరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫిలిప్ గ్రీన్‌తో కరచాలనం చేసిన శివనాథ్ ఆయనతో దేశంలో నెలకొన్న రాజకీయాల గురించి కొద్దిసేపు మాట్లాడుకున్నారు.

5 రోజుల పని విధానాన్ని పొడిగించాలి

● ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

బస్‌స్టేషన్, జూన్ 27: వారంలో ఐదు రోజుల పని విధానాన్ని పొడిగించాలని సీఎంకు తెలియాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి విజ్ఞప్తి చేశామని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్యలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆర్టీసీ ఎండీకి కూడా ఒక లేఖ రాశామని త్వరలో సానుకూల నిర్ణయం వస్తుందని మంత్రి చెప్పారని నేతలు పేర్కొన్నారు. ఐదు రోజుల పని విధానం ఈ నెల 27తో ముగుస్తున్నందున మళ్లీ కొనసాగించాలని, అలాగే అదనపు హెచ్‌ఆర్‌ఏ 24 శాతాన్ని కొనసాగించాలని కోరామన్నారు.

దివ్యాంగుల పింఛన్లు పెంచినందుకు

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

» జాతీయ అంధుల సమాఖ్య ఏపీ రాష్ట్ర శాఖ

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ప్రతినిధి బృందం కొత్తగా కొలువుదీరిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపింది. దివ్యాంగుల పింఛన్లను గణనీయంగా పెంచినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. గురువారం ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగార్జున, డి.శ్రీనివాసరావు, ఎం.రామసుబ్బయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల కోసం రిజర్వ్ చేసిన బ్యాక్‌లాగ్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా, రాష్ట్రస్థాయి దివ్యాంగ కమిటీలను క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని కోరారు. అదేవిధంగా అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగాల్లో 4 శాతం, ఉన్నత విద్యా సంస్థల్లో 5 శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించాలని అధికారులను దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి ఆదేశించారని తెలిపారు. దివ్యాంగులకు కేటాయించిన ఉద్యోగాల భర్తీకి సంబంధించిన జీవో నంబర్ 77ను రద్దు చేసి వర్టికల్ రిజర్వేషన్లు అమలు చేయయాలని, అంధుల శరణాలయాల్లో చాలా కాలంగా ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసి పేదలు, అనాథలు, నిరుద్యోగులైన అంధులకు వాటిలో ప్రవేశం కల్పించాలని కోరారు. పెళ్లి కానుక లబ్ధిదారులకు గత ప్రభుత్వం విధించిన విద్యార్హత నిబంధన ఎత్తి వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల్లో దివ్యాంగులకు 5 శాతం కేటాయింపులు ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు.

కూటమి సర్కారు రాకతో తప్పిన టోల్ తిప్పలు

» అగనంపూడిలో టోల్‌గేట్ ధ్వంసం, తొలగింపు

» మళ్లీ ఏర్పాటు చేస్తే ఊరుకోమంటున్న స్థానికులు



అగనంపూడి వద్ద టోల్‌గేట్ బూత్‌లను తొలగించిన దృశ్యం

విశాఖపట్నం/అగనంపూడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నగర శివారులో అగనంపూడి వద్ద దాదాపు మూడు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న టోల్‌గేట్‌ను స్థానిక ప్రజలు బుధవారం రాత్రి తొలగించారు. మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో టోల్‌గేట్లు నిర్వహించకూడదనే నిబంధన ఉందని, దానివల్ల రోజువారీ కార్యక్రమాలకు అటు వైపు వెళ్లే ప్రజలు సైతం టోల్ ఫీజు కట్టాల్సి వస్తోందని చాలా కాలంగా ఆందోళన జరుగుతోంది. దీనిపై 2019లో గాజువాక టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గాజువాక బార్ అసోసియేషన్‌తో హైకోర్టులో కేసు వేయించారు. టోల్‌గేట్ తీసేయాలని కోర్టు తీర్పు ఇచ్చింది. దాంతో ఎత్తేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మళ్లీ ఏర్పాటైంది. తాజాగా వైసీపీ ఓడిపోవడంతో కూటమి నాయకులు, స్థానిక ప్రజలు కలిసి గత మూడు రోజులుగా టోల్‌గేటు నడవకుండా చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి మొత్తం అక్కడ బూత్‌లను ధ్వంసం చేశారు. వేగ నియంత్రణకు ఏర్పాటుచేసిన సిమెంట్ దిమ్మలను అక్కడినుంచి తొలగించారు. ఇకపై అక్కడ టోల్‌గేట్ నిర్వహిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

నా భార్యా బిడ్డలను కాపాడండి

» గుప్త నిధుల కోసం వారిని బలి ఇచ్చే ప్రమాదం

» పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు

» ఏపీ హోం మంత్రికి తెలంగాణకు చెందిన వ్యక్తి ఫిర్యాదు

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గత జన్మల బంధం అంటూ ఓ కుటుంబం మాయలో పడి.. ఇద్దరు ఆడబిడ్డలతో గత 9 నెలలుగా ప్రకాశం జిల్లాలో ఉంటున్న తన భార్యను కాపాడాలని తెలంగాణకు చెందిన ఓ వ్యక్తి పోలీసులకు మొరపెట్టుకున్నారు. తన బిడ్డలను బలిస్తే గుప్త నిధులు దొరుకుతాయన్న ఆశతోనే ఆ కుటుంబం తన భార్యాబిడ్డలను వదలడంలేదని బాధితుడు వాపోయాడు. తన సమస్యను ఏపీ హోం మంత్రి అనితకు వివరించేందుకు గురువారం అమరావతి సచివాలయానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ జిల్లా సూరారం గ్రామానికి చెందిన జాడి మల్లయ్య, భాగ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం ముత్యాలంపాడుకు చెందిన దేవరకొండ అంకమ్మ బాతులు పెంచేందుకు గతంలో సూరారం గ్రామానికి వెళ్లింది. ఆ సమయంలో అంకమ్మతో భాగ్యకు స్నేహం మొదలై విచిత్రమైన బంధానికి దారితీసింది. అంకమ్మ శివుడని, తను పార్వతి అని భ్రమలోకి భాగ్య వెళ్లింది. ఈ క్రమంలో భర్త, కుమారుడిని వదిలి, ఇద్దరు కూతుళ్లను తీసుకుని ముత్యాలంపాడుకు చేరుకుంది. దాదాపు గత 9 నెలలుగా అంకమ్మ ఇంట్లోనే ఉంటోంది. ఈ నేపథ్యంలో మల్లయ్య ముత్యాలంపాడు వచ్చి ఇద్దరు కూతుళ్లను తీసుకుని ఇంటికి వచ్చేయాలని కోరుతున్నా.. తమది శివపార్వతుల బంధమని, తాను రానని నిరాకరిస్తోంది. తన భార్యా, బిడ్డలను కాపాడి, తమతో పంపాలని కోరినా.. పోలీసులు పట్టించుకోవడం లేదని మల్లయ్య తెలిపారు. దీనిపై హోం మంత్రి పేషీలో లేఖ అందజేసినట్టు చెప్పారు. అంకమ్మ, ఆమె తండ్రి వెంకటేశ్వర్లు మాయ చేసి తన భార్యా, బిడ్డలను తీసుకొచ్చారని, వారి నుంచి కాపాడాలని లేఖలో కోరారు. ఆ ఫిర్యాదును హోంమంత్రి పేషీ అధికారులు కందుకూరు డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.

అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులు

» ఏడాది సమయంలోనే తల్లిదండ్రులు, నాన్నమ్మ మృతి

» సంరక్షణకు చర్యలు చేపట్టిన అధికారులు

ఉరవకొండ, జూన్ 27: ఒకే సంవత్సరంలో తల్లిదండ్రులు చనిపోయారు. ఆలనా పాలన చూసుకుంటున్న నాన్నమ్మ కూడా నాలుగు రోజుల క్రితం మృతి చెందింది. దీంతో ముగ్గురు చిన్నారుల జీవితం ప్రశ్నార్థకమైంది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు వారి సంరక్షణకు చర్యలు చేపట్టారు. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామానికి చెందిన సులోచనమ్మ, ఆంజనేయులు దంపతులకు ఇద్దరు కుమార్తెలు వైష్ణవి (10), సంజన(7), ఒక కుమారుడు రాంచరణ్(4) ఉన్నారు. గత ఏడాది జూలైలో అనారోగ్యం కారణంగా సులోచనమ్మ మరణించగా, ఆ తరువాత ఆర్నెల్లకే ఆంజనేయులు కూడా మృతి చెందారు. అప్పటి నుంచి చిన్నారులను వారి నాన్నమ్మ రామాంజినమ్మ చూసుకునేవారు. వయోభారంతో ఆమె ఈ నెల 23న మృతిచెందారు. తాత సుంకన్న ఉన్నా.. వృద్ధాప్యం కారణంగా వారిని పోషించలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు మంజునాథ్, చంద్రకళ కౌకుంట్లకు గురువారం వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. ఐదో తరగతి చదువుతున్న వైష్ణవిని కేజీబీవీలో చేర్పించాలని, రెండో తరగతి చదువుతున్న సంజనను పాఠశాలలో చేర్పించాలని నిర్ణయించారు. రాంచరణ్‌ను బాల విహార్‌కు తరలిస్తామని, వారి సంరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వైష్ణవి, సంజన, రాంచరణ్

విద్యుదాఘాతంతో నలుగురి మృతి

» 'పశ్చిమ'లో భార్యాభర్తలు.. ఏలూరు జిల్లాలో తల్లీకొడుకు

ఆగిరిపల్లి, జూన్ 27 : పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో జరిగిన రెండు వేర్వేరు విద్యుత్ ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. తాడేపల్లిగూడెంలో గృహ నిర్మాణ పనులు చేసుకునే గట్టిం వెంకన్న(60), భార్య అన్నపూర్ణ(55) ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. పనులు చేసి ఇంటికి వెళ్లిన అన్నపూర్ణ మంచినీటి కోసం మోటార్ ఆన్ చేయగా వైర్ల ద్వారా విద్యుత్ షాక్ తగిలి కేకలు వేసింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో భర్త వెంకన్న కూడా షాక్‌కు గురయాయడు. ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. కాగా, ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామంలో బట్టలు ఆరేసుకునే తీగకు విద్యుత్ ప్రవహించడంతో దానిని తాకిన దొండపాటి నాగరత్నం(60), ఆమెను కాపాడబోయి కుమారుడు రామదాసు(40) మృతి చెందారు.

వర్షాల కోసం రామలింగేశ్వరస్వామికి జలాభిషేకం

వీరులపాడు: వర్షాలు సమృద్ధికి కురవాలని, పాడి పంటలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని జుజ్జూరు కొండపై వేంచేసియున్న రామలింగేశ్వరస్వామికి గురు వారం భక్తులు జలాభిషేకంతో ప్రత్యేక పూజలు చేశారు.

విశాలమైన కార్యాలయం ఇవ్వండి

» స్పీకర్‌కు టీడీపీ ఎంపీల వినతి



స్పీకర్ ఓం బిర్లాతో టీడీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): 'పార్లమెంట్ భవన్‌లో మొదటి అంతస్థులో తెలుగుదేశం పార్టీకి కేటాయించిన కార్యాలయం చిన్నదిగా ఉంది. కొంచెం విశాలమైన స్థలం ఉన్న కార్యాలయం కేటాయించండి' అని ఆ పార్టీ ఎంపీలు కోరారు. పార్లమెంట్‌లో గురువారం టీడీపీపీ పక్ష నేత లావు కృష్ణదేవరాయ ఆధ్వర్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలసిన ఆ పార్టీ ఎంపీలు ఆమేరకు వినతి పత్రం అందించారు. గతంలో టీడీపీకి కేటాయించిన కార్యాలయాన్నే కొనసాగించాలని అభ్యర్థించారు. స్పీకర్ ఓం బిర్లాను కలిసిన వారిలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు కేశినేని శివనాథ్, పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, బైరెడ్డి శబరి, కలిశెట్టి అప్పలనాయుడు, జీఎం హరీశ్ బాలయోగి ఉన్నారు. కాగా, కేంద్ర మంత్రిగా గతంలో సేవలు అందించి ప్రస్తుతం హరియాణా గవర్నర్‌గా ఉన్న బండారు దత్తాత్రేయతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దత్తాత్రేయకు ఉన్న పాలన అనుభవంతో పలు సలహాలు, సూచనలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు.

విశాఖకు కొత్త విమాన సర్వీసులు ప్రవేశపెట్టండి

» కేంద్ర మంత్రికి ఎంపీ కలిశెట్టి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నం నుంచి దేశంలోని పలు పట్టణాలకు కొత్తగా విమాన సర్వీసులను ప్రవేశపెట్టాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత విమాన సర్వీసులు ప్రజల అవసరాలను తీర్చట్లేదని వివరించారు. గురువారం ఢిల్లీలో మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసి ఈ మేరకు ఎంపీ విజ్ఞప్తి చేశారు. దుబాయి, కొలంబోకు 2020 వరకూ విమాన సర్వీసులుండగా ఆ తర్వాత రద్దయ్యాయి. పాత సర్వీసుల పునరుద్ధరణతో పాటు కొత్తగా విశాఖపట్నం నుంచి వారాణసీ, సూరత్‌కు, ముంబాయికి విమాన సర్వీసులు ప్రవేశపెట్టాలి' అని ఎంపీ కలిశెట్టి విజ్ఞప్తి చేశారు.

టీడీపీపీ నేతగా లావు శ్రీకృష్ణదేవరాయులు

» లోక్‌సభ స్పీకర్‌కు చంద్రబాబు లేఖ

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నరసారావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ బృందాన్ని ప్రకటిస్తూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, లోక్‌సభ స్పీకర్‌కు గురువారం లేఖ రాశారు. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా లావు శ్రీకృష్ణదేవరాయులు, ఉప నేతలుగా దగ్గుమళ్ల ప్రసాదరావు, బైరెడ్డి శబరి, కార్యదర్శిగా టీకే పార్థసారథి, కోశాధికారిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్యాలయ కార్యదర్శిగా డాక్టర్ సత్యనారాయణ నౌపాడను నియమిస్తున్నట్లు చంద్రబాబు ఆ లేఖలో పేర్కొన్నారు.

పరిమితికి మించి గోధుమ నిల్వలుంటే చర్యలు

» జిల్లాల అధికారులకు ప్రభుత్వ ఆదేశాలు

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గోధుమ వ్యాపారులు (హోల్‌సేల్, రిటైల్), మిల్లర్లు, ప్రాసెసర్ల దగ్గర నిర్దేశిత పరిమితుల కంటే ఎక్కువ నిల్వలు ఉంచడానికి వీల్లేదని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. వారి వద్దనున్న గోధుమ నిల్వల వివరాలను కేంద్ర ప్రభుత్వ వెబ్ పోర్టల్‌లో ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాలని స్పష్టం చేసింది. ఈ వివరాలను ఎప్పటికప్పుడు వెల్లడించకపోయినా, నిర్దేశిత పరిమితుల కంటే ఎక్కువ గోధుమ నిల్వలు కలిగి ఉన్న వ్యాపారులపై నిత్యావసరాల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ హెచ్ అరుణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైద్య కళాశాలల్లో సీట్లు అమ్ముకుంటున్నారు

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని ఎంబీబీఎస్ సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల ముసుగులో అమ్ముకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఆరోపించారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణతోసహా కేంద్ర ప్రయోజిత (స్పాన్సర్డ్) వైద్య కళాశాలల్లోని అన్ని సీట్లను మెరిట్ ఆధారంగానే విద్యార్థులకు కేటాయిస్తుంటే... మన రాష్ట్రంలోనే 2023-24 నుంచి ఎంబీబీఎస్ సీట్లను అమ్ముకుంటున్నారని ఆయన వివరించారు. దీంతో ప్రతిభావంతులైన విద్యార్థులు అడ్మిషన్లు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతూ గురువారం ఆయన సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు.

డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేయండి

» ఒక్కలిగ మహాసంస్థాన పీఠాధిపతి వ్యాఖ్యలు

» సిద్దరామయ్య సమక్షంలోనే చంద్రశేఖరనాథ స్వామీజీ విజ్ఞప్తి

బెంగళూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కీలకమైన ఒక్కలిగ వర్గానికి ముఖ్యమంత్రి పదవి కేటాయించాలని, అందుకోసం సిద్దరామయ్య సీఎం పీఠం వదులుకోవాలని విశ్వ ఒక్కలిగ మహాసంస్థాన పీఠాధిపతి చంద్రశేఖరనాథ స్వామీజీ విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి, ఒక్కలిగ వర్గానికి చెందిన డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వీరశైవ లింగాయత్, ఎస్సీ/ఎస్టీ, మైనార్టీల వర్గాల నుంచి ముగ్గురు ఉప ముఖ్యమంత్రులను చేయాలని డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో స్వామీజీ ఈ వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు నగరంలోని కంఠీరవ స్టేడియంలో గురువారం జరిగిన కెంపేగౌడ జయంతి వేడుక ఇందుకు వేదిక అయింది. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్ సమక్షంలోనే చంద్రశేఖరనాథ స్వామీజీ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. "ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి కావాలని అనుకుంటారు. ఆ పదవి చేపట్టి అధికారాన్ని అనుభవిస్తారు. కానీ మా వర్గానికి చెందిన డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కాలేక పోయారు. ఇప్పటికే ఆ పదవిని అనుభవిస్తున్న వారు భవిష్యత్‌లో ఆ స్థానాన్ని శివకుమార్‌కు అప్పగించి, ఆశీర్వదించాలని కోరుతున్నాను. ఇది కేవలం సిద్దరామయ్యకు మాత్రమే సాధ్యం" అని స్వామీజీ విజ్ఞప్తి చేశారు. కాగా.. చంద్రశేఖరనాథ స్వామీజీ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పందించారు. వేడుకల అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. ముఖ్యమంత్రి పదవిని నిర్ణయించేది పార్టీ అధిష్ఠానం అని స్వామీజీ కాదని తెలిపారు. స్వామీజీ సూచించినంత మాత్రాన సీఎం మార్పు సాధ్యం కాదన్నారు. కాగా, ఉప ముఖ్యమంత్రి పదవులపై రెండోరోజు వివాదాస్పద వ్యాఖ్యలు కొనసాగాయి. మరోవైపు.. డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేసి.. డజను మందిని డిప్యూటీ సీఎంలను చేసుకున్నా అభ్యంతరం లేదని దావణగెరె ఎమ్మెల్యే శివగంగ బసవరాజు అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పాల్గొన్న కార్యక్రమంలో స్వామీజీ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

'నాకు సలహాలు ఇవ్వకండి'

» ఎంపీ దీపేందర్ హుడాకు స్పీకర్ ఓం బిర్లా మందలింపు

న్యూఢిల్లీ, జూన్ 27: లోక్‌సభలో గురువారం 'జై సంవిధాన్' నినాదం తీవ్ర దుమారం రేపింది. శశిథరూర్ ఎంపీగా ప్రమాణం చేసిన అనంతరం 'జై హింద్, జై సంవిధాన్' అంటూ నినాదాలు చేశారు. ఆయనతో కలిసి లోక్‌సభలోని ప్రతిపక్ష సభ్యులు కూడా నినాదాలు చేశారు. దాంతో స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం తెలిపారు. వెంటనే కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా తన కుర్చీ నుంచి లేచి స్పీకర్‌ను తప్పుపట్టారు. స్పీకర్ ఇలాంటివి చేయకూడదని హితవు పలికారు. దాంతో స్పీకర్ ఓం బిర్లా తనకు సలహాలు ఇవ్వవద్దంటూ దీపేందర్ హుడాకు కాస్త గట్టిగా చెప్పారు. సాయంత్రం ఎక్స్ వేదికగా హుడా స్పందిస్తూ, పార్లమెంటు 'జై సంవిధాన్' నినాదాలు చేయడం తప్పు ఎందుకౌతుందని ప్రశ్నించారు. లోక్‌సభలో జై సంవిధాన్ అనడం తప్పా లేదా దాన్ని ఆపడం తప్పా దేశ ప్రజలు నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ దీపేందర్ హుడాకు మద్దతు పలికారు. అధికార పక్ష నేతలు పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధమైన నినాదాలు చేసినా ఆపేవారెవరూ లేరని, కాని ప్రతిపక్ష నేతలు జై సంవిధాన్ అన్నా అభ్యంతరం తెలుపుతారని మండిపడ్డారు.



1.25 కోట్ల విలువైన మద్యం ధ్వంసం

సర్పవరం జంక్షన్(కాకినాడ), జూన్ 26: కాకినాడ జిల్లాలో వివిధ కేసుల్లో ఎస్ఈబీ, పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన రూ.1.25 కోట్ల విలువైన అక్రమ మద్యం, నాటుసారాను ధ్వంసం చేశారు. ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో మద్యం బాటిళ్లను రోడ్డు రోలర్‌తో తొక్కించేశారు. రెండేళ్ల కాలంలో స్వాధీనం చేసుకున్న 94,737 మద్యం బాటిళ్లు, 12,532.45 లీటర్ల సారాను ధ్వంసం చేశామని ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ సెబ్ శ్రీలక్ష్మి, పలువురు పోలీసు, సెబ్ అధికారులు పాల్గొన్నారు.



వైసీపీ దాడిలో గాయపడిన టీడీపీ నాయకుడు కమ్మా శివప్రసాద్

టీడీపీ నాయకుడిపై వేటకొడవళ్లతో దాడి

» గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో వైసీపీ నేతల దారుణం

» దాడి చేసిన వారిలో ఒకరు వలంటీర్

ప్రత్తిపాడు, జూన్ 27:పట్టపగలు వైసీపీ కార్యకర్తలు వేటకొడవళ్లతో చెలరేగిపోయారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో టీడీపీ నాయకుడు, నిమ్మగడ్డవారిపాలెం సొసైటీ మాజీ అధ్యక్షుడు కమ్మా శివప్రసాద్‌పై దాడికి పాల్పడ్డారు. కోర్టు ఆదేశాలతో గురువారం ప్రత్తిపాడు మంచినీటి చెరువు కరకట్టపై అక్రమ కట్టడాల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆక్రమణదారులంతా వైసీపీ కార్యకర్తలు. వారిలో ఒకరు వలంటీర్ కూడా ఉన్నారు. ఆక్రమణదారులు అడ్డుపడినా పోలీసుల సహకారంతో ఓ ఇంటి ప్రహరీ, మెట్లను అధికారులు కూల్చేశారు. దీంతో పెట్రోలు పోసుకుంటానంటూ ఓ వ్యక్తి, పురుగు మందు తాగి మరణిస్తానంటూ మరొకరు ఆత్మహత్యాయత్నం చేశారు. 'మా ఇళ్లు పడగొట్టడానికి కారణం నువ్వే' అంటూ కమ్మా శివప్రసాద్ ఇంటిపైకి వలంటీర్ పరమేశ్వరరావు, అతడి సోదరుడు పృథ్వి దాడి చేశారు. శివప్రసాద్‌ను వేటకొడవళ్లతో తీవ్రంగా గాయపరిచి పరారయ్యారు. శివప్రసాద్‌ను స్థానికులు ప్రత్తిపాడు వైద్యశాలకు, అక్కడి నుంచి గుంటూరుకు తరలించారు. శివప్రసాద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలన్న కోర్టు

చెరువు ఆక్రమణలో ఉన్నదని గొట్టిపాడుకు చెందిన పచ్చల కోటేశ్వరరావు గతంలో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఆదేశాల మేరకు అప్పటి ఇన్‌చార్జి సర్పంచ్ నుదురుపాటి సుశీల పంచాయతీ తీర్మానం ప్రకారం ఆక్రమణలో ఉన్న సుమారు 7 ఎకరాల భూమిని స్వాధీనపరుచుకున్నారు. పూర్వం నుంచి చెరువు కట్ట వెంట ఉన్న ఇళ్లను కూడా ఖాళీ చేయాలంటూ పంచాయతీ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. కమ్మా శివప్రసాద్ పూర్తి వివరాలతో కోర్టుకు విన్నవించగా గృహాలను తీసి వేయాలని కోర్టు 2023లోనే ఆదేశాలు జారీ చేసింది. అయితే, వైసీపీ పెద్దల ఒత్తిడితో అప్పుడు ఆ గృహాలను కూల్చి వేయలేదు. కోర్టు ఆదేశాలను అమలు చేయడానికి డీపీవో నుంచి వచ్చిన ఉత్తర్వులతో గురువారం పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరా ఆక్రమణల తొలగింపు చేపట్టగా, ఆక్రమణదారులు అడ్డుపడ్డారు. శివప్రసాద్‌పై హత్యాయత్నం జరగడంతో ఆక్రమణల తొలగింపును అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు.

రాజ్యసభ సభాపక్ష నేతగా నడ్డా

న్యూఢిల్లీ, జూన్ 27: కేంద్ర ఆరోగ్య మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా రాజ్యసభ సభానాయకుడిగా నియమితులయ్యారు. గురువారం ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో నడ్డాను రాజ్యసభ సభానేతగా చైర్మన్ జగదీప్ ధనఖడ్ ప్రకటించారు. ఆ తర్వాత మోదీ తన మంత్రి వర్గాన్ని రాజ్యసభలో పరిచయం చేశారు. అలాగే బిహార్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన ఆరుగురు సభ్యులు గురువారం సభలో ప్రమాణస్వీకారం చేశారు.

'నేను తెలుగు బాష లెక్క.. అడా ఉంటా... ఈడా ఉంటా'.... ఆ మధ్య ఫేమస్ అయిన డైలాగ్ ఇది. ఈ కోవలోనే జగన్ సర్కారైనా... చంద్రబాబు ప్రభుత్వమైనా నాకు ఢోకా లేదంటున్నారు ఓ ప్రభుత్వ (ప్రైవేట్) అధికారి. రాష్ట్రంలో అత్యున్నత అధికారి సీఎస్‌కు మించి జీతాన్ని అందుకుంటున్న ఈయన జగన్ జమానాలో ఆడింది ఆట... పాడింది పాటగా హవా సాగించారు. ప్రభుత్వ రంగంలోని ఓ సంస్థలో ఉద్యోగిగా చేరిన ఈ 'ప్రైవేట్' వ్యక్తి అప్పట్లో నేతలు, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకున్నారు. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన చంద్రబాబు సర్కారులోనూ తన కొలువును పదిలం చేసుకునే పని మొదలెట్టారు. పురపాలక శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారాయణ వద్ద తన పరపతిని చూపించుకుని మరో రెండేళ్లు కొలువును పొడిగించుకునే ప్రక్రియను శరవేగంగా ముందుకు తీసుకుపోతున్నారని సమాచారం. ఇందుకోసం రాయలసీమకు చెందిన మరో ఇద్దరు మంత్రుల నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకున్నారని చెబుతున్నారు. జగన్ సర్కారులో అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడిన... వైసీపీ నేతలకు బంధువైన... ఈ వ్యక్తి ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలోని మంత్రులను ఎలా బురిడీ కొట్టిస్తున్నారో?

ప్రభుత్వమేదైనా.. ఆయనది ఇష్టారాజ్యం!

» అవినీతి అధికారికి మళ్లీ అందలం

» వైసీపీ చలువతో 10 లక్షల జీతం అందుకున్న వైనం

» ఆగస్టులో రిటైర్... రెండేళ్లు కొనసాగింపు యత్నాలు ముమ్మరం

» మంత్రి నారాయణతో సిఫారసు చేయించుకున్నారని ప్రచారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రైవేటు ఉద్యోగిగా ఉన్న ఒక వ్యక్తి ప్రభుత్వ రంగంలోని ఓ సంస్థలో ఉద్యోగిగా చేరి అలవెన్సులతో కలిపి ప్రతి నెలా రూ.10 లక్షల జీతం తీసుకుంటున్నారు. ఈ ఏడాది ఆగస్టులో రిటైర్ కాబోతున్న ఈ ప్రైవేట్ అధికారి మరో రెండేళ్లు కొనసాగేందుకు తన లాబీయింగ్‌ను ముమ్మరం చేశారు. వైసీపీ నేతలకు బంధువైన ఈ అధికారి జగన్ సర్కారులో అందినకాడికి దోచుకున్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయన్ను పక్కకు తప్పిస్తారని భావించినా, అందుకు విరుద్ధంగా మరో రెండేళ్లు కొనసాగించేందుకు ఫైల్ నడుస్తుండటంతో అవాక్కవడం ఆ శాఖలోని సిబ్బంది వంతైంది. జగన్ హయాంలో ప్రభుత్వ రంగంలోని ప్రాజెక్టులను ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టడంలో సదరు అధికారి చాతుర్యానికి ఉన్నతాధికారులు ఫిదా అయ్యారు. ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోవడం, వారికి వాటాలివ్వడం, ఇష్టారాజ్యంగా దోపిడీకి తెరలేపడం ఆ ప్రైవేట్ అధికారికి నిత్యకృత్యం. అర్హతా, అనుభవం లేకపోయినా ఉన్నతాధికారుల చలువతో ఉన్నపళంగా ఓ విభాగానికి హెడ్‌గా ఉన్న ఆ అధికారి ఏకంగా ఆ సంస్థకు సీఈఓ అయ్యారు. పైస్థాయి అధికారులను ప్రసన్నం చేసుకోవడంతో ఆయన తన జీతాన్ని 400 శాతం పెంచుకున్నారు. సీఎస్, డీజీపీకి కూడా లేని స్థాయిలో గెస్ట్ హౌస్‌లో ప్రభుత్వ వ్యయంతో నివాసం ఉంటున్నారంటే ఆ అధికారి జబర్దస్త్ అర్థం చేసుకోవచ్చు. ఆ అధికారి అవినీతిపై తీవ్ర ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఓ విచారణ అధికారిని నియమించి విచారించినా.. ఆ నివేదిక వెలుగులోకి రాకుండా ఆయన తన పరపతిని ఉపయోగించుకున్నారు. ప్రభుత్వ విభాగాలకు డిజైన్లు, ప్రాజెక్టు వర్క్ తదితర సేవలందించే ఏపీ పట్టణ మౌలిక వసతుల, ఆస్తుల నిర్వహణ సంస్థ(ఏపీయూఐఏఎంఎల్)ను సూట్‌కేస్ కంపెనీగా మార్చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ శాఖలకు సేవలందిస్తున్న ఈ సంస్థ పలు శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులకు కమీషన్లు ఇచ్చే సంస్థగా మారిపోయిందన్నది నిర్వివాదాంశం.

అడ్డగోలు నియామకం

హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న ఈయన ఏపీయూఐఏఎంఎల్‌లో ఓ విభాగానికి హెడ్‌గా విధుల్లో చేరారు. ఆ తర్వాత ఆయన ఆ సంస్థకే సీఈఓగా ఎదిగారు. ఏపీయూఐఏఎంఎల్ పే రోల్‌లో కూడా లేని, ఓ కన్సల్టెంట్‌గా ఉన్న ఈయన ఉన్నపళంగా ఆ స్థాయికి ఎదగడంపై సర్వత్రా ఆరోపణలొచ్చాయి. తన జీతాన్ని తానే పెంచుకుని ఉన్నతాధికారుల చేత ఆమోద ముద్ర వేయించుకున్న ఘనత ఈయన సొంతం. గతంలో ఉన్న సీఈఓ కేంద్ర సంస్థ సీఈఓగా వెళ్లడంతో ఆ స్థానంలో ఎలాంటి అర్హతా, అనుభవం లేని ఈయన్ని నియమించారు.

పారదర్శకత లేని నియామకాలు

సీఈఓగా ఉన్నతస్థానం పొందిన ఈ అధికారి చేపట్టిన నియామకాలూ అడ్డగోలుగా ఉన్నాయన్న ఆరోపణలున్నాయి. వాస్తవానికి ఏపీ పట్టణ మౌలిక వసతుల, ఆస్తుల నిర్వహణ సంసకు ప్రైవేట్ ఉద్యోగుల నియామకం చేసుకునే అధికారం లేదు. అయితే పై నుంచి కింది దాకా తన హవా నడుస్తుండటంతో పలు శాఖలకు సంబంధించిన ఉద్యోగులను ఈ సంస్థే నియమిస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల ఎన్నికల కమిషన్‌కు కూడా ఈ సంస్థ కొంత మంది ఉద్యోగులను నియమించింది. ఎన్నికల కమిషన్, ఏపీ ఫుడ్ ప్రాసెస్ సొసైటీ, జైళ్ల శాఖ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, జీవీఎంసీలో స్మార్ట్‌సిటీ తదితర ప్రాజెక్టులకు ఈ సంస్థ డీపీఆర్‌తో పాటు కన్సల్టెంట్ సేవలను అందిస్తోంది. వాస్తవానికి ప్రభుత్వంలో ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఉంటారు. దాంతో సంబంధం లేకుండానే ఆయా శాఖలు ఈ సంస్థ ద్వారా నియామకాలు చేపడుతున్నాయంటే దాని వెనుక మతలబు ఇట్టే అర్థమవుతోంది.

ట్రైబల్ స్పోర్ట్సు మీట్ టెండర్ గోల్‌మాల్

ప్రభుత్వంలోని పలు శాఖలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఈ సంస్థ ద్వారా నిర్వహిస్తారు. ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్రీడలను నిర్వహించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.25 కోట్లు కేటాయించింది. క్రీడల నిర్వహణకు ఈ సంస్థ టెండర్లు నిర్వహించింది. అర్హత కలిగిన సంస్థలను టెండర్లలో పాల్గొనకుండా నిబంధనలు మార్చేసి తనకు కావాల్సిన సంస్థకు టెండర్లు కట్టబెట్టారు. దీంతో ఈ క్రీడల్లో సౌకర్యాలు కల్పించలేక రాష్ట్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో అభాసుపాలైంది.

'108' పేరిట కొల్లగొట్టేశారు!

» 'అరబిందో'కు అడ్డగోలుగా టెండర్

» మూడేళ్లకు బదులు ఏడేళ్లకు అగ్రిమెంట్

» దారుణంగా 108 వాహనాల నిర్వహణ

» అరబిందో సంస్థ కోసమే వాహనాలను భారీగా పెంచిన వైసీపీ సర్కారు

» నేడు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సమీక్ష

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రాష్ట్రంలో 108 వాహన సేవలను అరబిందో సంస్థ 2020 జూలై నుంచి నిర్వహిస్తోంది. 2014 నుంచి 2019 మధ్యలో ప్రభుత్వం జనాభాకు సరిపడగా 440 వాహనాలను ప్రవేశపెట్టగా.. వైసీపీ ప్రభుత్వం అవసరానికి మించి వాహనాలను కొనుగోలు చేసింది. అరబిందోకు మేలు చేసేలా ఏకంగా 336 వాహనాలను ఒకేసారి కొని, మొత్తం వాహనాలను 768కు పెంచింది. అప్పటి వరకూ ఆరోగ్యశాఖ 108 వాహనాల నిర్వహణకు నెలకు రూ.6.31 కోట్లు ఖర్చు చేస్తే, వైసీపీ ప్రభుత్వం 108 నిర్వహణకు నెలకు దాదాపు రూ.16 కోట్లు ఖర్చు చేసింది. ఏడాదికి దాదాపు రూ.189 కోట్లు అరబిందో సంస్థకు ప్రభుత్వం నుంచి చెల్లింపులు చేసింది. ఇప్పటికి నాలుగేళ్లల్లో దాదాపు రూ.750 కోట్లు పైగా ప్రభుత్వం అరబిందోకు చెల్లింపులు చేసింది. ఇంత భారీ మొత్తం బిల్లులు చెల్లించినా సేవలు ఏమైనా పెరిగాయా అంటే అదీ లేదు. ఈ నాలుగేళ్లలో అరబిందో సంస్థ కేవలం 50 లక్షల మందిని మాత్రమే తమ అంబులెన్స్‌ల్లో ఆస్పత్రులకు తరలించింది. అసలు అరబిందో సంస్థకు చెల్లిస్తున్న బిల్లులకు, వారు చేస్తున్న సేవలకు అసలు పొంతనే ఉండదు. అయినా అధికారులకు మాత్రమ అరబిందో సంస్థ అంతా సక్రమంగా చేస్తున్నట్లు కనిపిస్తుంది. ఇక, ప్రభుత్వం ప్రయివేటు సంస్థకు టెండర్ ఇచ్చే క్రమంలో గరిష్ఠంగా మూడేళ్లే గడువు ఇస్తుంది. ఆ తర్వాత సదరు సంస్థ విధుల ఆధారంగా ప్రభుత్వానికి నచ్చితే ఏటా గడువు పొడిగిస్తారు. ఇలా అత్యధికంగా ఐదేళ్లకు మించి టెం డర్ ఇవ్వడానికి లేదు. కానీ ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు గత ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో ఒకేసారి ఏడేళ్లకు అరబిందోకు టెండర్ కట్టబెట్టడం విశేషం.

డయాలసిస్ రోగులే టార్గెట్

అరబిందో సంస్థ 108 అంబులెన్సుల నిర్వహణ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి అత్యంత తెలివిగా ప్రవర్తించింది. టెండర్ నిబంధనల ప్రకారం ప్రతి అంబులెన్సులో రోజుకు నలుగురు రోగులను ఆస్పత్రులకు తరలించాలి. అంటే 768 వాహనాల్లో దాదాపు 3 వేల మంది రోగులను ఆస్పత్రులకు తరలించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఈ స్థాయిలో అంబులెన్స్ సేవలు అవసరముండదు. గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో మినహా, గిరిజన ప్రాంతాల్లో అంబులెన్సుల సేవలు ఎక్కువగా ఉపయోగించుకునే పరిస్థితి ఉండదు. ఒకవైపు లెక్కకు మించి వాహనాలు పెరిగినా, ఆ స్థాయిలో కేసులు లేకపోవడంతో అరబిందో సంస్థ తెలివిగా ఆలోచించింది. 108 అంబులెన్సులను కేవలం రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు, గర్భిణీల అత్యవసర సమయంలో మాత్రమే ఉపయోగించాలి. కానీ, డయాలసిస్ రోగులు, గర్భిణీలను కూడా 108 వాహనాల్లో ప్రభుత్వాసుపత్రులకు తరలించి అక్కడ వారికి చికిత్స అందించి, తిరిగి వారిని ఇంటిలో దించే వరకూ అంబులెన్సులను ఉపయోగించుకునేవారు. మరో దారుణం ఏమిటంటే ఒక 108 అంబులెన్స్ డయాలసిస్ రోగిని ఆస్పత్రికి తీసుకువెళ్లే క్రమం.. ఆ అంబులెన్స్ పరిధిలో రోడ్డు ప్రమాదం ఏదైనా జరిగినా ఇక పట్టించుకునే వారు కాదు.

నిబంధనలు మీరినా.. పెనాల్టీలు ఉండవు!

అరబిందో సంస్థ పెనాల్టీలకు అతీతం. సదరు సంస్థ అంబులెన్స్ నిర్వహణతో పాటు కాల్ సెంటర్‌కు కాల్ వచ్చిన తర్వాత అర్బన్ ప్రాంతాల్లో 15 నిమిషాల్లోపు, రూరల్ ప్రాంతాల్లో 20 నిమిషాల లోపు, గిరిజన ప్రాంతాల్లో 30 నిమిషాల లోపు ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకోవాలి. ఇలా చేరుకోలేని పక్షంలో భారీగా పెనాల్టీలు విధించాలి. అంబులెన్స్‌కు నెలవారీగా చెల్లించిన బిల్లుల్లో 0.1% పెనాల్టీ విధించాలి. కానీ ఏ రోజూ ఆరోగ్యశాఖ అధికారులు పెనాల్టీలు విధించిన పరిస్థితి లేదు. ప్రతి క్వార్టర్‌కు అరబిందోకు రూ.40 కోట్ల వరకూ బిల్లులు చెల్లిస్తారు. అధికారులకు అరబిందోపై ఉన్న ప్రేమతో క్వార్టర్‌కు 1.5% లేదా 1 శాతానికి విధించిన పెనాల్టీలు విధించలేదు. ఇందుకు అధికారులకు నెలవారీ మామూళ్లందేవని చెబుతారు. ఇలా చెప్పుకుంటూ పోతే అరబిందో సంస్థ తప్పులు అన్నీ ఇన్నీ కావు.. ప్రభుత్వ అండదండలు, ప్రశ్నించాల్సిన అధికారుల సపోర్టుతో సంస్థ ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. కాగా, 108ల నిర్వహణ, అరబిందో సంస్థ కాంట్రాక్టు వ్యవహారంపై శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సమీక్షించనున్న నేపథ్యంలో గత ప్రభుత్వంలో జరిగిన ఉల్లంఘనలన్నీ చర్చకొచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

మాజీ మంత్రి రజినీకి ఝలక్

» ఇచ్చిన కమీషన్ వెనక్కి గుంజుకున్న రైతులు

» గతంలో మాజీ మంత్రి రూ.1.16 కోట్లు నొక్కుడు

» ప్రభుత్వం మారడంతో పోలీసులకు రైతుల ఫిర్యాదు

» 90 లక్షలు తిరిగిచ్చిన రజని.. నేడు మరో 26 లక్షలు



చిలకలూరిపేట, జూన్ 27: ప్రభుత్వం మారడంతో జగన్ హయాంలో జరిగిన అరాచకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. జగనన్న కాలనీకి భూములు ఇచ్చిన రైతుల నుంచి మాజీ మంత్రి విడదల రజిని రూ.1.16 కోట్ల కమిషన్ నొక్కేశారు. తాజాగా రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసి ఆ డబ్బు వసూలు చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలో విడదల రజిని రైతుల వద్ద కమీషన్‌గా తీసుకున్న డబ్బును గురువారం వెనక్కి ఇచ్చేశారు. గ్రామానికి చెందిన చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, రైతు నాయకుడు గడిపూడి దశరథ రామయ్యలు తెలిపిన వివరాలు ప్రకారం.. పసుమర్రుకు సమీపంలో ఉన్న గుదేవారిపాలెంలో సుమారు 200 ఎకరాల్లో జగనన్న కాలనీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మంత్రిగా రజిని హయాంలో 150 ఎకరాల భూసేకరణకు ఏర్పాటు చేశారు. ఇందులో 32 మంది రైతుల నుంచి 50 ఎకరాల భూసేకరణ చేశారు. అప్పట్లో ఎకరాకు రెండున్నర లక్షలు చొప్పున చిన్న చిన్న మినహాయింపులు పోను మొత్తం రూ.1.16 కోట్ల మొత్తాన్ని మంత్రి రజిని తన అనుచరుల ద్వారా ముక్కు పిండి వసూలు చేశారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం మారిన పరిణామాల నేపథ్యంలో ఈ విషయంపై రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి కూడా ఈ విషయాన్ని తెచ్చారు. ఈ నేపథ్యంలో రజిని మనుషులు రైతులకు రూ.90 లక్షలు వెనక్కి ఇచ్చారు. మిగిలిన రూ.26 లక్షలు శుక్రవారం రైతులకు ఇచ్చే ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సహకారంతో తమకు న్యాయం జరిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

గోడ తొలగింపు

పసుమర్రు నుంచి జాతీయ రహదారి గుండా గొర్రెల మండి పక్కగా చిలకలూరిపేటకు వచ్చే మార్గంలో విడదల రజిని కుటుంబ సభ్యులు అడ్డంగా గోడ కట్టారు. ఆ మార్గంలో రాకపోకలకు వీలు లేకుండా చేశారు. దీంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దీనిపై ఆ గ్రామవాసులు నిరసన తెలిపినప్పటికీ లెక్క చేయలేదు. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఆ గోడను రజిని కుటుంబ సభ్యులు తొలగించారు. ఆ మార్గంలో ఉన్న భూమిని తాము దానం చేస్తున్నట్లు పంచాయతీకి లిఖిత పూర్వకంగా తెలిపారు.

అమెరికాలో తెలుగోళ్ల హవా

» అగ్రరాజ్యంలో పెరుగుతున్న మనోళ్ల సంఖ్య

» ఎనిమిది సంవత్సరాల్లో నాలుగు రెట్ల పెరుగుదల

» 2016లో 3.2 లక్షలు.. 2024లో 12.3 లక్షలు

» ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో.. పదకొండో స్థానంలో నిలిచిన తెలుగు

» అమెరికాకు ఏటా వెళ్లే భారతీయ విద్యార్థుల్లో 12.5% మనోళ్లే

మాతృ భాష	2010	2021	వృద్ధి (%)
తెలుగు	2,17,641	4,59,836	111.00%
తమిళం	1,81,698	3,41,396	88.00%
బెంగాలీ	2,21,872	4,03,024	82.00%
నేపాలీ, మరాఠీ, ఇండో-ఆర్యన్‌భాషలు	2,75,694	4,47,811	63.00%
హిందీ	6,09,395	8,64,830	42.00%
మళయాళం, కన్నడ, ఇతర ద్రావిడ భాషలు	1,97,550	2,80,188	42.00%
ఉర్దూ	3,88,909	5,07,972	31.00%
పంజాబీ	2,43,773	3,18,588	31.00%
గుజరాతీ	3,56,394	4,36,909	23.00%

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో తెలుగు.. వీధిలో తెలుగు.. యునివర్సిటీలో తెలుగు.. కార్యాలయంలోనూ తెలుగే.. ఇదేదో ఆంధ్రానో, తెలంగాణో అనుకుంటే పొరబడినట్టే! అగ్రరాజ్యం అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవలికాలంలో కనిపిస్తున్న పరిస్థితి ఇది. ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగు 11వ స్థానంలో నిలిచింది. అమెరికాలో ఎక్కువగా మాట్లాడే భారతీయ భాషల జాబితాలో మనకన్నా ముందు హిందీ, గుజరాతీ ఉన్నాయి. కొన్నాళ్లుగా.. ఉన్నత విద్య, ఉపాధి కోసం ఇతర దేశాల నుంచి అమెరికాకు చేరుకుంటున్నవారిలో తెలుగువారి జనాభా గణనీయంగా పెరుగుతోంది. అమెరికా ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని అధికారికంగా స్పష్టం చేస్తున్నాయి. 2016తో పోలిస్తే 2024లో అమెరికాలో ఉంటున్న తెలుగువారి జనాభా నాలుగింతలు పెరిగిందని ఇటీవలే విడుదలైన యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా చెబుతోంది. ఆ నివేదిక ప్రకారం..

- 2016లో అమెరికాలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య 3.2 లక్షలుగా ఉండగా.. ఇప్పుడది 12.3 లక్షలకు చేరినట్లు తేలింది.
- తెలుగు జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో క్యాలిఫోర్నియా ప్రథమస్థానంలో ఉంది. అక్కడ 2 లక్షల మంది తెలుగువారు ఉంటున్నారు. తర్వాతి స్థానాల్లో టెక్సస్(1.5 లక్షలు), న్యూజెర్సీ(1.1 లక్షలు), ఇల్లినాయ్(83 వేలు), వర్జీనియా(78 వేలు), జార్జియా(52 వేలు) ఉన్నాయి.
- అమెరికాకు ఏటా వచ్చే మొత్తం విదేశీ విద్యార్థుల్లో తెలుగు విద్యార్థుల వాటా దాదాపు 13 శాతంగా ఉంటోంది.
- ఉపాధి కోసం వెళ్లేవారి సంఖ్యలోనూ ఏటా వృద్ధి నమోదవుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ నుంచి అత్యధికులు అమెరికాకు వెళ్తుండగా.. వీరిలో సింహభాగం తెలుగు రాష్ట్రాల నుంచే ఉంటున్నారు.
- అమెరికాలోని అనేక ప్రముఖ యూనివర్సిటీల్లోని విదేశీ విద్యార్థుల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల వాటా పెరుగుతోంది. కెంట్ స్టేట్ యూనివర్సిటీలో మనోళ్ల ప్రవేశాలు చాలా ఎక్కువగా ఉండడంతో 'విద్యార్థులకు స్వాగతం' అంటూ తెలుగులో ఆహ్వానం పలకడం పట్ల తెలుగు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

.. ఏటా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు, 10 వేల మందికి పైగా హెచ్1బీ వీసాపై అమెరికాకు చేరుకోవడమే అక్కడ మన హవా ఇంతగా పెరడగానికి ప్రధాన కారణం. ఇండియన్ మొబిలిటీ రిపోర్ట్-2024 ప్రకారం.. చదువుకోవడానికి అమెరికా వెళ్తున్న భారతీయ విద్యార్థుల్లో మన తెలుగువారి వాటా ఏకంగా 12.5 శాతం!!

వృద్ధిరేటులో మనమే..

అమెరికాలో ఉండే అన్ని దేశాలవారు, జాతులవారు బయట మాట్లాడేది ఆంగ్లమైనా.. ఇంట్లో మాట్లాడేది మాత్రం మాతృభాషే. అలా ఆ దేశంలో ఉంటున్న భారతీయుల్లో.. ఇంట్లో మాతృభాష మాట్లాడే వారి సంఖ్య పెరుగుదలలో తెలుగు వారిదే అగ్రస్థానం. 2010లో అక్కడ 2.17 లక్షల మంది ఇంట్లో తెలుగు మాట్లాడుతుండగా.. 2021 నాటికి వారి సంఖ్య 111 శాతం వృద్ధి రేటుతో 4.59 లక్షలకు చేరింది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శుక్రవారం 28 జూన్ 2024
diksuchi@andhrajyothy.com

జేఎన్‌టీయూ హెచ్‌లో
ఇంటిగ్రేటెడ్‌డబుల్ డిగ్రీ మాస్టర్స్ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్), స్వీడన్‌లోని బ్లేకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ మాస్టర్స్ ప్రోగ్రామ్(ఐడీడీఎంపీ)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. మొదటి మూడున్నరేళ్లు జేఎన్‌టీయూహెచ్‌లో, చివరి ఏడాదిన్నర బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. ఏడాదికి రెండు చొప్పున మొత్తం పది సెమిస్టర్లు ఉంటాయి. బీటెక్, ఎంటెక్ డిగ్రీలను జేఎన్‌టీయూహెచ్; ఎంఎస్ డిగ్రీని బీటీహెచ్ ప్రదానం చేస్తాయి. టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ద్వారా 70 శాతం సీట్లను, ఐఐటీ జేఈఈ(మెయిన్) 2024 ర్యాంక్ ద్వారా 30 శాతం సీట్లను భర్తీ చేస్తారు. ఈ కోర్సుకు సంబంధించిన అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను జూలై 13న సాయంత్రం నాలుగు గంటలకు ఆన్‌లైన్ ద్వారా జేఎన్‌టీయూహెచ్ నిర్వహిస్తుంది. స్వీడన్‌లో ఐడీడీఎంపీ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు అక్కడే మరో ఏడాది రెసిడెన్స్ పర్మిట్ పొందవచ్చు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.



స్పెషలైజేషన్‌లు-సీట్లు: ఈసీఈలో 20 సీట్లు ఉన్నాయి. బీటెక్‌లో ఈసీఈ; ఎంటెక్, ఎంఎస్‌లలో మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ & సిస్టమ్స్ చదవాల్సి ఉంటుంది.
- సీఎస్ఈలో 60 సీట్లు ఉన్నాయి. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్ ఉంటుంది. ఎంటెక్, ఎంఎస్‌లలో సీఎస్ఈ, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. ఒక్కోదానిలో 20 సీట్లు ప్రత్యేకించారు.

అర్హత: బీఐఈ(టీఎస్/ఏపీ)/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 లేదా జేఈఈ(మెయిన్) 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. ఆంగ్ల మాధ్యమంలో చదవని అభ్యర్థులకు ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్ ఉండాలి. అడ్మిషన్స్ నాటికి అభ్యర్థుల వయసు పదహారేళ్లు నిండి ఉండాలి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.2000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 8
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 15
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

విశాఖ ఐఎంయూలో లేటరల్ ఎంట్రీ



విశాఖపట్నంలోని ఇండియన్ మారిటైం యూనివర్సిటీ(ఐఎంయూ-సెంట్రల్ యూనివర్సిటీ)-బీటెక్ (నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషన్ ఇంజనీరింగ్/నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్ బిల్డింగ్) ప్రోగ్రామ్‌లో లేటరల్ ఎంట్రీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సీఈటీ), సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌ల ద్వారా రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 13 సీట్లు ఉన్నాయి. ఎన్ఏఓఈ స్పెషలైజేషన్‌లో 7 సీట్లు, ఎన్ఏఎస్‌బీ స్పెషలైజేషన్‌లో 6 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి నిర్దేశిత ధ్రువపత్రాలు జతచేసి ఆర్డినరీ/స్పీడ్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కింది చిరునామాకు పంపాలి. వెబ్‌సైట్‌లో ఇచ్చిన గూగుల్ లింక్ ద్వారా దరఖాస్తు ఫారాన్ని అప్‌లోడ్ చేయాలి.

అర్హత: ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల డిప్లొమా(సివిల్/మెకానికల్/నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ ఆఫ్‌షోర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు; నాలుగేళ్ల డిప్లొమా ఇన్ షిప్ బిల్డింగ్ ఇంజనీరింగ్ కోర్సు పూర్తిచేసినవారు; మూడేళ్ల బీఎస్సీ(షిప్ బిల్డింగ్ అండ్ రిపైర్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. బీఎస్సీ/డిప్లొమా స్థాయిలో ప్రథమ శ్రేణి మార్కులు; పదోతరగతి/ఇంటర్ స్థాయిలో ఇంగ్లీష్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

వయసు: ప్రోగ్రామ్ ప్రారంభం నాటికి పురుషులకు జనరల్ కేటగిరీ 25 ఏళ్లు; ఓబీసీ కేటగిరీ 28 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు 30 ఏళ్లు మించకూడదు. మహిళలకు జనరల్ కేటగిరీ 27 ఏళ్లు; ఓబీసీ కేటగిరీ 30 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు 32 ఏళ్లు మించకూడదు.

కామన్ ఎంట్రెన్స్ టెస్ట్: ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. దీనిని పెన్ అండ్ పేపర్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్, మేథమెటిక్స్, జనరల్ ఆప్టిట్యూడ్, టెక్నికల్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.700
- **ఆర్డినరీ/స్పీడ్/రిజిస్టర్డ్ పోస్ట్ దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 5
- **కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూలై 13
- **చిరునామా:** డైరెక్టర్, ఇండియన్ మారిటైం యూనివర్సిటీ, విశాఖపట్నం క్యాంపస్, వంగలి గ్రామం, సబ్బవరం మండలం, విశాఖపట్నం-531035.
- **వెబ్‌సైట్:** www.imuv.edu.in

తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీలో
పాలిటెక్నిక్ డిప్లొమా

హైదరాబాద్- రాజేంద్రనగర్‌లోని పీ.వీ.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ(పీవీఎన్ఆర్ టీవీయూ)- యానిమల్ హస్బెండరీ(పశుసంవర్థక)పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కోర్సు వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు సెమిస్టర్లు ఉంటాయి. తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. హాస్టల్ సౌకర్యం ఉంది. మొత్తం 110 సీట్లు ఉన్నాయి. మహబూబ్ నగర్, కరీంనగర్, సిద్దిపేట ఏహెచ్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 30 సీట్లు; మామునూరు ఏహెచ్ పాలిటెక్నిక్‌లో 20 సీట్లు ఉన్నాయి. బీసీ అభ్యర్థులకు 29 శాతం; ఎస్సీ అభ్యర్థులకు 15 శాతం; ఎస్టీ అభ్యర్థులకు 10 శాతం; బలహీన వర్గాల అభ్యర్థులకు 10 శాతం; దివ్యాంగులకు 3 శాతం; మహిళలకు 33 1/3 శాతం; డిఫెన్స్ అభ్యర్థుల పిల్లలకు 2 శాతం; ఎన్‌సీసీ అభ్యర్థులకు 1 శాతం; క్రీడాకారులకు 0.5 శాతం సీట్లు ప్రత్యేకించారు. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకోసం ప్రతి కళాశాలలో అదనంగా 10 శాతం సీట్లు నిర్దేశించారు. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. తెలంగాణ పాలిసెట్(ఎంబైపీసీ) 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఏహెచ్ డిప్లొమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ కోర్సులో చేరేందుకు వీలు లేదు. వీరు దోస్త్ ద్వారా బీఏ/బీకాం/బీబీఏ అడ్మిషన్స్ పొందవచ్చు.



అర్హత: రాష్ట్రంలోని గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి. గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. కంపార్ట్‌మెంట్ అభ్యర్థులు కూడా అర్హులే. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. తెలంగాణ పాలిసెట్(ఎంబైపీసీ)2024 ర్యాంక్ పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.830; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.415
- **స్పీడ్ పోస్ట్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 20
- **జతచేయాల్సిన పత్రాలు:** తెలంగాణ పాలిసెట్ 2024 హాల్ టికెట్, ర్యాంక్ కార్డ్; పదోతరగతి సర్టిఫికెట్, కులం, ఆదాయం, వైకల్యం, గ్రామీణ ప్రాంతాల్లో చదివిన ఆధార ధృవీకరణ పత్రాలు; బోనఫైడ్ స్టడీ సర్టిఫికెట్; టీసీ, ఎన్‌సీసీ సర్టిఫికెట్, అంతర్జాతీయ/జాతీయ/రాష్ట్రీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న పత్రాలు; అభ్యర్థి ఫొటో, సంతకం
- **చిరునామా:** రిజిస్ట్రార్, పీవీ.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500030
- **వెబ్‌సైట్:** www.tsvu.edu.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంసీఏ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్-సెంట్రల్ యూనివర్సిటీ)- 'మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. నిమ్‌సెట్(నిట్ సంస్థలు దేశవ్యాప్తంగా నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్) 2024 స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్లు: మొత్తం 42 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 16, ఎస్సీలకు 6, ఎస్టీలకు 3, ఓబీసీ అభ్యర్థులకు 11, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 4, దివ్యాంగులకు 2 సీట్లు కేటాయించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. నిమ్‌సెట్ 2024 అర్హత తప్పనిసరి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు 600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 550; ఓబీసీ అభ్యర్థులకు 400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- **వెబ్‌సైట్:** https://uohyd.ac.in, acad.uohyd.ac.in

ఇండియన్ నేవీలో
అగ్నివీర్(ఎంఆర్ మ్యుజీషియన్) పోస్టులు

భారత నౌకాదళంలో అగ్నివీర్(ఎంఆర్ మ్యుజీషియన్) ఖాళీల నియామకానికి ప్రకటన వెలువడింది. అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఐఎన్ఎస్ చిల్కాలో ప్రారంభమయ్యే 02/2024(నవంబరు 24) బ్యాచ్ పేరున శిక్షణ ఉంటుంది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: పదో తరగతి లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతో పాటు మ్యూజికల్ ఎబిలిటీ, మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ ఉండాలి.

వయసు: 2003 నవంబరు 1 నుంచి 2007 ఏప్రిల్ 30 మధ్యలో జన్మించి ఉండాలి. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేయాలి.

కనిష్ఠ ఎత్తు ప్రమాణాలు: పురుషులు, మహిళల ఎత్తు 157 సెం.మీ. ఉండాలి

ఎంపిక ప్రక్రియ: మెట్రిక్యులేషన్ మార్కులు, స్టేజ్-1(ప్రిలిమినరీ స్క్రీనింగ్), స్టేజ్-2(ఫైనల్ స్క్రీనింగ్), మ్యూజిక్ స్క్రీనింగ్ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, రిక్రూట్‌మెంట్ మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

శిక్షణ: అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్ఎస్ చిల్కాలో వచ్చే ఏడాది నవంబరులో కోర్సు శిక్షణ ప్రారంభం అవుతుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తరవాత ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

జీతభత్యాలు: ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది రూ.30 వేలు, రెండో ఏడాది రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40 వేల వేతనం లభిస్తుంది.

దరఖాస్తు: అభ్యర్థులు నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి

దరఖాస్తు ప్రారంభం: జూలై 1

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 11

వెబ్‌సైట్: www.joinindian-navy.gov.in/

ఎస్ఎస్‌సీ- సీజీఎల్ ఎగ్జామ్ 2024

జాబ్ కార్నర్

కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్(సీజీఎల్) ఎగ్జామ్- 2024 నోటిఫికేషన్‌ను స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల్లో గ్రూప్-బి, గ్రూప్-సి విభాగాల్లోని ఖాళీలను భర్తీ చేస్తారు.

ఖాళీల సంఖ్య: 17,727

పోస్టుల వివరాలు
1. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్
2. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్
3. ఇన్‌స్పెక్టర్
4. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్
5. సబ్ ఇన్‌స్పెక్టర్
6. ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్
7. రీసెర్చ్ అసిస్టెంట్
8. జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్
9. సబ్ ఇన్‌స్పెక్టర్/జూనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్
10. ఆడిటర్
11. అకౌంటెంట్
12. అకౌంటెంట్/జూనియర్ అకౌంటెంట్
13. పోస్టల్ అసిస్టెంట్/సార్టింగ్ అసిస్టెంట్
14. సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్/అప్పర్ డివిజన్ క్లర్క్
15. సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్
16. టాక్స్ అసిస్టెంట్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక విధానం: టైర్-1, టైర్-2 తదితర పరీక్షల ద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.100. ఎస్సీ/ఎస్టీ/మహిళలు/దివ్యాంగులు/ఎక్స్‌సర్వీస్‌మన్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 24

వెబ్‌సైట్: https://ssc.gov.in/

ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో సూపర్‌వైజర్లు

మాల్పే(కర్ణాటక)లోని ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 16

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, పెయింటింగ్, స్కాఫ్ ఫోల్డింగ్, హెచ్ఆర్.

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్), డిగ్రీ(ఆర్ట్స్/కెమిస్ట్రీ), ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 12 నాటికి 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం: రాత పరీక్ష, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, ప్రాక్టికల్ టెస్ట్, పని అనుభవం తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.300. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 12

వెబ్‌సైట్: udupicsl.com/index.php/careers/

ఏసీటీఆర్ఈసీలో సైంటిఫిక్ ఆఫీసర్లు

నవీ ముంబయిలోని టాటా మెమోరియల్ సెంటర్ పరిధిలోని అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ట్రీట్‌మెంట్, రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఇన్ క్యాన్సర్(ఏసీటీఆర్ఈసీ)...కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 19
1. సైంటిఫిక్ ఆఫీసర్: 4 పోస్టులు
2. ఇంజనీర్: 1 పోస్టు
3. అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్: 4
4. సైంటిఫిక్ అసిస్టెంట్: 8
5. టెక్నీషియన్: 1
6. లోయర్ డివిజన్ క్లర్క్: 1

విభాగాలు: ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ, న్యూక్లియర్ మెడిసిన్, డేటా అనలిస్ట్, సెంటర్ ఫర్ క్యాన్సర్ ఎపిడెమియాలజీ, సివిల్, పర్చేజ్, బయోమెడికల్, రేడియేషన్ అంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, యానిమల్ సైన్సెస్, పాథాలజీ.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, డీఎంఆర్ఐటీ/పీజీడీఎఫ్ఐటీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: సైంటిఫిక్ ఆఫీసర్ పోస్టుకు 35-45 ఏళ్లు, ఇంజనీర్‌కు 35 ఏళ్లు, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు 40 ఏళ్లు, సైంటిఫిక్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు, టెక్నీషియన్, లోయర్ డివిజన్ క్లర్క్‌కు 27 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.300. ఎస్సీ/ఎస్టీ/మహిళలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 18

వెబ్‌సైట్: actrec.gov.in/index.php/


లిటిల్స్


కష్టార్జితం



సిరిపురంలో ఉండే రాజారాం అనే యువకుడికి చదువు మీద కానీ మరే ఇతర పని మీద కానీ పెద్దగా ఆసక్తిలేదు. అతని స్నేహితులంతా ఏదో ఒక వృత్తిలో స్థిరపడి వివాహాలు చేసుకుని, కుటుంబాలతో జీవనం గడపసాగారు. రాజారాం తన తండ్రి వత్తకు వెళ్లి, తనకు కూడా పెళ్లి చేయమని అడిగాడు.దానికి వాళ్ల నాన్న అలాగే చేస్తాను కానీ ముందుగా నాకో పదివేలరూపాయలు తెచ్చివ్వు. అపుడు నీకు మంచి వధువును చూసి వివాహం జరిపిస్తాను అన్నాడు. ఆ మర్నాడు రాజారాం ధనవంతుడైన తనస్నేహితుని దగ్గర పదివేలు అప్పుగా తీసుకుని తెచ్చి వాళ్ల నాన్న చేతికి ఇచ్చాడు. వాళ్ల నాన్నఆ డబ్బు తీసుకుని, పారవేశాడు అతను ఎందుకలా చేశాడో రాజారాంకి అంతు పట్టలేదు. మరొక వారం ఆతర్వాత రాజారాం వాళ్ల అమ్మను అడిగి మరో పదివేలు తీసుకుని తెచ్చి వాళ్ల నాన్న చేతికి ఇచ్చాడు. వాళ్ల నాన్న ఈ డబ్బును కూడా అంతకు ముందు లాగే పారవేశాడు. మరి కొన్ని రోజుల తర్వాత, రాజారాం ఇంకో పదివేలు తెచ్చి వాళ్ల నాన్న చేతికి ఇచ్చాడు. వాళ్ల నాన్న ఆ డబ్బు పారవేయబోతూ ఉంటే, రాజారాం వాళ్ల నాన్నచేతిని పట్టుకుని ఆపి, 'ఆగండినాన్నా, ఇది నేను నెల రోజులు కష్టపడి పనిచేసి, సంపాదించిన డబ్బు, దయచేసి దీన్ని పారవేయకండిఅని అన్నాడు. దానికి వాళ్ల నాన్న 'చూసావా? గతంలో రెండు సార్లు నేను డబ్బు పారవేసినపుడు నీకు కలగని బాధ ఇపుడుకలిగింది. నువ్వు కష్టపడి పనిచేసి సంపాదించిన డబ్బు కాబట్టి, నీకు దీని విలువ తెలియాలనే నేను నువ్వు అడిగి తెచ్చిన డబ్బు పారవేశాను. ఇపుడు నీకు వివాహం చేసే సమయం వచ్చింది' అన్నాడు ఆ తర్వాత కొన్ని రోజులకు రాజారాంచేత మంచి వ్యాపారం పెట్టించి, అతనికి ఘనంగా వివాహం జరిపించాడు వాళ్ల నాన్న.

ఎన్ని ఆవులు ఉన్నాయి?





7 తేడాలు గుర్తించండి!



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?

డైలీ సుడోకు - 344

3		5		2	1			
9			8					
	1		7			8		
				7	5		8	6
7	5		9	4				
		4			6		7	
					7			5
			5	3		2		1

సుడోకు - 343 సమాధానం

3	8	5	4	2	1	6	9	7
9	4	7	8	6	3	5	1	2
6	1	2	7	5	9	8	3	4
2	9	1	3	7	5	4	8	6
4	3	8	6	1	2	7	5	9
7	5	6	9	4	8	1	2	3
5	2	4	1	9	6	3	7	8
1	6	3	2	8	7	9	4	5
8	7	9	5	3	4	2	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.